# వాసిష్ఠ రామాయణ కథామృతం



డా॥ కె. కుసుమాబాయి

# సంస్కృత సారస్వత
# సమాలోచనము

ఈ గ్రంథము తిరుమల తిరుపతి దేవస్థానమువారి సహాయముచే ధార్మిక గ్రంథ ప్రచురణ సహాయ ప్రణాళిక ద్వారా ముద్రించబడినది.


## డా. ఎ. రాములు
ఎంఏపి హెచ్‌డి(సంస్కృతం)ఎంఏ(చరిత్ర)ఎంఏ(తెలుగు)
సంస్కృత లెక్చరర్
ఉస్మానియా విశ్వవిద్యా, [illegible]
హైదరాబాద్



SRI VENKATESWA
CENTR
RESE
Acc No. 53843
Date
TIRUPATI



## శ్రీరామ నామ క్షేత్రము
జగదేవపూర్, మెదక్ జిల్లా-502281.

1996 మూల్యం : 60-00

# సంస్కృత సారస్వత సమాలోచనము

## వేదములు

ప్రాచీన భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు వేదాలు మొత్తం ప్రపంచ వాఙ్మయ చరిత్రలోనే మొట్టమొదటి రచనలుగా అపూర్వమైన స్థానాన్ని ఆక్రమించాయి ప్రాచీన మహర్షులు ద్రష్టలుగా అవతరింపజేసిన అపౌరుషేయ మహాసంపదలివి. ప్రాచీన కాలంలో ఋక్కులు, సామలు, యజుస్సులు ఒకే వేదరాశిగా ఉండేవి. ఆరోజుల్లో అలాంటి మంత్ర సమూహాన్నంతటిని ఋషులు అధ్యయనం చేసేవారు కాలక్రమేణ ఆ అధ్యయనం కష్టతరం కాగా వేదవ్యాస మహర్షి వేదరాశిని నాల్గు వేదాలుగా విభజించాడని ప్రసిద్ధి చతుర్వేదములుగా విభజితమైనప్పటికిని చతుర్వేదాలు సైతం బృహత్తరములై, అధ్యయన అధ్యాపనలకు క్లిష్టములైనవి. అప్పుడు మహర్షులే ఋగ్వేదమునకు 21 శాఖలు యజుర్వేదమునకు 101 శాఖలు, సామవేదమునకు 1000 శాఖలు అథర్వమునకు 9 శాఖలు విభజించి వివిధ శిష్య బృందములకు ఒక్కొక్క శాఖపంతున బోధించి విభిన్న శాఖలను వ్యాప్తి చెందించి ప్రచారమొనరించిరి అనేక శాఖలుగా అవతరించిన వేదాల్లో యెంత శ్రద్ధవహించుకుంటూపోయినా నూటికి తొంభై తొమ్మిది పాళ్ళు వేదశాఖలు విలుప్తమైపోయాయి ఇప్పుడు లభించుచున్న శాఖలు, వాటిని అధ్యయనం చేస్తున్న వైదికులు నివసిస్తూన్న ప్రదేశములు క్రింద వివరించబడుతున్నాయి.

| వేదము | శాఖ | ప్రదేశములు |
|---|---|---|
| ఋక్ | శాకల | మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, కర్నాటక కొన్ని ప్రాంతములు |
| కృష్ణయజుస్ | తైత్తిరీయ | ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ కర్నాటక కొన్ని ప్రాంతములు |
| ,, | మైత్రాయణీయ | తూర్పుఖాందేష్, నాసిక్, బదాగావ్, జల్‌గావ్ (మహారాష్ట్ర) |

| | | |
|---|---|---|
| శుక్లయజుస్ | కాణ్వ | మహారాష్ట్ర, ఒరిస్సా, తమిళనాడు కొన్ని ప్రాంతములు |
| ,, | మాధ్యందిన | ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతములు |
| సామ | కౌథుమ | తమిళనాడు, గుజరాత్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా లోని తూర్పు ప్రాంతములు |
| ,, | జైమినీయ | కేరళ, తమిళనాడు |
| ,, | రాణాయనీయ | ఉత్తర కర్నాటక (హన్నేవార్ ప్రాంతములు) |
| అథర్వ | పిప్పలాద | గుజరాత్, నర్మద తూర్పుప్రాంతము, ఒరిస్సా, జమ్ముకాశ్మీర్ |
| ,, | శౌనక | గుజరాత్, నర్మద దక్షిణప్రాంతము |

ఒక్కొక్క వేదము సంహిత, బ్రాహ్మణము అని రెండు భాగములు. సంహితాబ్రాహ్మణయోః వేదనామధేయం స్తుతిపరములగు దేవతా సూక్తములతో కూడుకొన్నది సంహిత బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తులు ఈ మూడు బ్రాహ్మణ పదగ్రహీతములు బ్రాహ్మణములు వేదములోని కర్మకాండకు భాష్య రూపములు కాగా, జ్ఞానకాండను వివరించునవి ఉపనిషత్తులు. మంత్రసంపుటినే సంహిత అంటారు సంహిత కాలాన్ని మ్యాక్స్‌ముల్లర్ ఛందో యుగం, మంత్రయుగం అని విభజించాడు ఆయన అభిప్రాయం ప్రకారం మొదటియుగంలో మంత్రాలు రచింపబడ్డాయి. ఈ గీతాలను రచించింది సృజనాత్మకమైన కవితా ప్రతిభతో కూడిన శకం అప్పట్లో కర్మల ప్రసక్తిలేదు. దేవతలకు ప్రార్థనలే సమర్పించబడ్డాయి. ఇక రెండోది గీతాలను సంపుటిచేసిన యుగం అనంతరం యజ్ఞ యాగాదులు క్రమేపి ఆవిర్భవించాయి.

ఋగ్వేదం భారతీయ సంస్కృతికి పెన్నిధానం ఋగ్వేద సంహితంలో ఋషుల ఆశ్రమాలు, యజ్ఞవాటికలు, వృక్షాలు, లతలు నదులు, పర్వతాలు, యుద్ధాలు, జయాపజయాలు, కృషిగోరక్షణలు, వాణిజ్య వ్యాపారాలు, తపోహిమలు, ప్రకృతి విజ్ఞానం, ధైర్యసాహసాలు, భూగోళ ఖగోళ విజ్ఞానాలు, ఔషధవర్గాలు మొదలైనవి రమ్యముగా వర్ణింపబడ్డాయి.

# ఋగ్వేదము

"ఋచ్యతే స్తూయతే ఇతి ఋక్"దేవతా స్తుతిపరమగు మంత్రము ఋక్కు. ఇది ఛందో నియమబద్ధమై పాద వ్యవస్థకలిగి పద్యమువలె ఉంటుంది. కావుననే "యత్రార్థేన పాద వ్యవస్థా సాఋక్" అని సాయణాచార్యులు నిర్వచించినారు. మొత్తము వేదము నభ్యసించలేక ఆయా వంశీయులు కొంత భాగమును పంచుకొని, అధ్యయనము చేయసాగారు. తత్ఫలితముగా ఆ మూల పురుషుని పేరుతో శాఖలు ఆవిర్భవించినవి ఋగ్వేదశాఖలు. "ఏక వింశతి బహ్వృచ్యం" అని పతంజలి ఇరువది యొక్కటి అని పేర్కొన్నాడు. కాని నేడు ఐదు మాత్రమే కనబడుచున్నవి శాకల, బాష్కల, ఆశ్వలాయన, శాంఖాయన, మాండూకాయన శాఖలివి ఆశ్వలాయన శాఖ గృహ్య సూత్రములు, శ్రౌత సూత్రములు మాత్రమే లభింపగా, శాంఖాయన శాఖ సంహిత భాగము లోపించి, బ్రాహ్మణారణ్యకములు మాత్రమే లభింపగా, మాండుకాయనశాఖ నామమాత్రావశిష్టమైనది

ఈ ఋగ్వేదమును అష్టక క్రమమున, మండల క్రమమునను విభజించుట కలదు. అష్టకమనగా ఎనిమిది అధ్యాయముల సముదాయము. అరువదినాలుగధ్యాయములు కలిగిన ఈ వేదమును ఎనిమిదేసి వంతున, ఎనిమిది అష్టకములలో విభజించుట అష్టక క్రమము మండల క్రమమునననుసరించి ఋగ్వేదము పది మండలములుగా విభజించబడనది దాశతయీ నామము ఇందువలననే సిద్ధించినది ఒక్కొక్క దేవతను స్తుతించు మంత్ర సముదాయమునకు ఒక్కొక్క సూక్తమని పేరు ఉదా - పురుషోత్తముని స్తుతించు మంత్ర సముదాయనకు పురుష సూక్తము. లక్ష్మీమాతను స్తుతించు మంత్ర సముదాయమునకు లక్ష్మీ సూక్తమని పేరు. కొన్ని సూక్తముల సముదాయమునకు అనువాకమని పేరు అనువాకమనగా అధ్యాయము. ఋషులు కొందరు కొన్ని అనువాకముల ద్వారా దేవతల స్తుతి గావించినారు. అందువలననే ఆయా ఋషుల పేర్లతో ఆ అనువాకములు మండలములుగా ప్రసిద్ధి బడసినవి

ఈ పది మండలములలో శైలీభేదము ననుసరించి రెండునుండి ఏడు వరకు గల మండలములు ప్రాచీనములని, ఎనిమిది, తొమ్మిది మండలములు

మధ్యమ కాలీనములని, ఒకటి, పది మండలములు అర్వాచీనములని విమర్శకుల అభిప్రాయము. ఒక్కొక్క మండలమున కొక్కొక్క ఋషి మంత్రద్రష్ట కలరు ఆయాఋషి ఆ అనువాక సముదాయమును పఠించి యుండవచ్చును. లేదా వారలు తపమాచరించుచుండగా ఆ అనువాక సముదాయములు విని పించగా, లోకోపకారమై వినిన మంత్రములను శిష్యుల కుపదేశించి ఉండ వచ్చును కావుననే వారు మంత్రద్రష్టలు.

మండల క్రమమున మంత్రద్రష్టలు-2 మం.-గృత్సమద మహర్షి 3 విశ్వా మిత్రుడు 4 వామదేవుడు 5 అత్రి 6 భరద్వాజుడు 7 వశిష్ఠుడు. ఈ ఆర్గురు ఋషులు ఒకే వంశమునకు చెందినవారు. వీరు కనుగొన్న ఈ ఆరు మండ లములు ప్రాచీనములు. 8 అంగిరస వంశీయుడైన కణ్వమహర్షి 9 సోమ లతకు సంబంధించిన పవమాన మండలము. ఈ రెండును మధ్యమ కాలీనములు· 1 మరియు 10వ మండలమున 161 సూక్తములుండుట, భాషా ఛందోసామ్యత (మిగతావాటికంటె వైరుధ్యం) నవీన దేవతా బోధకములగుట, దార్శనిక విచారము కలిగి ఉండుటచే ఇవి అర్వాచీనములని వారి అభిప్రాయము.

ఋగ్వేదమున అగ్ని ప్రముఖ స్థానమొంది అధిక మంత్రములచే స్తుతింప బడినాడు. రెండవ స్థానమింద్రునది. విజయ ప్రదాతగా, ఓజస్విగా, వీరరస స్ఫోరక మంత్రములచే కొనియాడబడినాడు. జీవుల మనోభావనలు తెలుసు కొని, వారు చేయు కర్మలకు ఫలము నిచ్చువాడుగా వరుణుడు చిత్రింపబడి నాడు నైతిక బోధనలన్ని వరుణ నామముననే కనిపించును.

పదవ మండలముయొక్క శైలీభేదములను పరిశీలింతము

1. భాషా భిన్నత్వము - ఋగ్వేదమున లకారమునకు బదులుగా రకారము జలవాచక 'సలిల' శబ్దము 'సరర'గా గాంచవచ్చును. కాని 10వ మండలమున లేపయే కనిపించును. మరియు "ద్వా సువర్ణా సయుజా సఖాయా" అని ద్వి వచనాంతము అకారాంతముగా కనిపింప, దశమ మండలమున "సూర్యా చంద్రమసౌ ధాతా యథా పూర్వ మకల్పయత్" అని ఔకారాంతమే కనిపించును. క్రియార్థక క్రియను తెలుపు "తవే, సై, అసే, అధ్యై" అను

ప్రత్యయములతో కర్తవే, జీవసే, అవసే అని తుమున్నంతములు కనిపింప, దశమమున కర్తుం అని లౌకిక సంస్కృత రూపములే కనిపించును.

2 ఛందో వైవిధ్యము - దశమమున ప్రాచీనములగు గాయత్రి, జగతి, ఉష్ణిగాదులు కనిపించక అనుష్టుప్ మాత్రమే అదికూడా లౌకిక రూపమున కనిపించును

3 దేవతా వైశిష్ట్యము - వరుణుడు జగన్నియంతగా, పరమేశ్వరుడిగా కనిపింప దశమమున అతని క్షేత్రము జలమునకే పరిమితమై, జగన్నియంతగా కాక, జలనియంతగా కనిపించును మరియు దైవమునకు ప్రాధాన్యము తగ్గి మానసిక వృత్తులకే ప్రాధాన్యము "శ్రద్ధయాఽగ్నిః సమిధ్యతే, శ్రద్ధయా హూయతే హవిః" అని మానవోద్యోగమునకే ప్రాధాన్యము కనిపించుచున్నది.

4 దార్శనిక తత్త్వ విచారము - ఈ విచారమును దశవమున మాత్రమే గాంచవచ్చును బహు దేవతావాదము, ఏకదేవతావాదము, సర్వేశ్వర వాదము, నాసదీయ సూక్తమిందులకు నిదర్శనములు.

5 నూత్న విషయములు - దశమమున లౌకిక విషయ బోధకములగు సూక్తములెన్నో కలవు ఉదా॥ "అక్షైర్మాదీవ్యః" అని ఆరంభింపబడిన అక్షసూక్తమున ద్యూదగాడి దురవస్థ కన్నులకు కట్టినట్లుగా వర్ణించబడినది.

6 దాన ప్రశంసలు - మోఘమన్నం విందతే అప్రచేతాః
సత్యం బ్రవీమి వధ ఇత్ సతస్య
నార్యమణం పుష్యతి నో సఖాయం
కేవ లాఘో భవతి కేవలాదీ

స్నేహితునకు, పరిచితునకు దానము చేయనివాడు మిత్రుడుకాడు. సమాజము నుండి బహిష్కరించ యోగ్యుడు పరులకు పెట్టక కేవలము తన పొట్టనింపుకొనువాడు అన్నము తినుటలేదు పాపమును తినుచున్నాడు.

7 సంవాద సూక్తములు-ఊర్వశీ పురూరవసంవాదము, యమీయమీ సరామా పణిసంవాదాదులు. ఇవి పురాణేతిహాస సాహిత్యములకు మాతృకలైనవి.

## యజుర్వేదము

'యజత ఇతియజుః' యజ్ఞ యాగాదులననుష్ఠింప నుపకరించు మంత్ర రాశియే యజుర్వేదము. ఈ యజుర్మంత్రములు అక్షర సంఖ్యా, ఛందోపాద వ్యవస్థ నియమములు లేనివి కావుననే "అనియతాక్షరావసానో యజుః" 'గద్యాత్మకో యజుః' "శేషే యజుశ్శబ్దః" అని నిర్వచింపబడినవి ఈ వేదము శుక్ల, కృష్ణ భేదమున ద్వివిధము ఈ భేదమును బోధించు ఆఖ్యానమిచట తెలుసుకోదగినది వైశంపాయన మహర్షి యాజ్ఞవల్క్యునకు యజుర్వేదము నుపదేశించినాడు ఒకసారి ఏదో కారణముచే శిష్యునిపై కోపించి, తానుపదేశించిన వేదమును తిరిగి ఇచ్చేయమని ఆగ్రహించినాడు అంత యాజ్ఞవల్క్యుడువమన రూపమున వేదమునంతా తిరిగి ఇచ్చినాడు గురువు అనుమతిచె మిగతా శిష్యులు తిత్తిరి పక్షిరూపముల ధరించి ఆ వమనరూపమైన వేదమును స్వీకరించినారు. కావుననే అది తైత్తిరీయమైనది ఇక యాజ్ఞవల్క్యుడు వేదమునకై సూర్యుని గూర్చి తపమాచరించగా, సూర్యభగవానుడు (వాజి) అశ్వరూపమున విచ్చేసి వేదమును బోధించినాడు అదియే వాజసనేయమను శుక్ల యజుర్వేదమైనది

శుక్ల యజుర్వేదమున దర్శ పూర్ణమాసాది యాగాద్యనుష్ఠానములకు సరిపడు మంత్రములు మాత్రమే ఉండగా, కృష్ణ యజుర్వేదమున మంత్రములతోపాటు తన్నియోజక బ్రాహ్మణ వాక్యములు కూడా కలవు. కొన్ని పద్యాత్మకములుగను, కొన్ని గద్యాత్మకములుగ నుండుటచేతను మిశ్రితమగుటచే కృష్ణ యజుర్వేదమని పేరును పొందినది.

శుక్ల యజుర్వేదముయొక్క వాజసనేయ, మాధ్యందిన, కాణ్వశాఖలు ఉపలబ్ధములగుచున్నవి కృష్ణ యజుర్వేదముయొక్క తైత్తిరీయ, మైత్రాయణీయ, కఠ, కాపిష్ఠల శాఖలు ఉపలబ్ధములగుచున్నవి దక్షిణ భారతమున, విశేషముగా తెలుగుదేశమున, తైత్తిరీయ శాఖీయులే ఎక్కువగా కలరు ఈ శాఖయొక్క సంహిత, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్, శ్రౌతసూత్ర, గృహ్యసూత్రములన్ని సమగ్రముగా లభించుచున్నవి

శుక్ల యజుర్వేద సంహితయందు 55 అధ్యాయములు కలవు. మాధ్యందిన శాఖ కాణ్వశాఖలు ఉత్తర భారతమున కలవు. కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహిత 75 కాండలలో విభక్తమైనది. 44 ప్రపాఠకములు, 651 అను

పాఠములు కలవు మైత్రాయణీయ సంహిత నాలుగు ఖండములుగా విభక్త మైనది. మొదటి ఖండమున 11, రెండవ ఖండమున 13, మూడవ ఖండమున 13, నాల్గవ ఖండమున ఖిల ఖండమను పేర 14 ప్రపాఠకములు కలవు. 2144 మంత్రములున్నవి ఇందు 1701 మంత్రములు ఋగ్వేద మంత్రములు.

మానవశాఖ కఠశాఖ. "గ్రామే గ్రామే కాఠకం కాలాపకం చోచ్యతే" అని పతంజలి కాలమున అత్యంత వైభవము నొందిన ఈ శాఖ అధ్యేతలు లేక నిరాధారమై కృశించుచున్నది ఇందు ఇఠమికా, మాధ్యమికా, ఓరమికా· యాజ్యానువాక్యా, అశ్వమేధానువాక్యా అను పేర్లతో ఐదు కాండలున్నవి నాల్గవది కపిష్ఠలశాఖ ఇది ఆరు అష్టకములలో విభజింపబడినది. కాలగర్భ మున కొంత అంతరించిపోగా, కొన్ని అధ్యాయములు మాత్రమే లభించుచున్నవి

శుక్ల యజుర్వేదమందలి విషయములు (1.2 అధ్యాయములు) దర్శపూర్ణ మాసేష్టి సంబంధ మంత్రములు. 3 అగ్నిహోత్ర యాగము, చాతుర్మాస్యేష్టి మంత్రములు 4.8 జ్యోతిష్టోమ హోమము ఇందలి అగ్నిష్టోమము అన్ని హోమ ములకు ప్రకృతి, కావున విపులముగా వర్ణింపబడినది సోమలతనుండి సోమ రసమును తీసి, ప్రాతః, మధ్యాహ్న, సాయం వేళలయందు అగ్నికి సమర్పింప వలయును ఈ హవనమునకే సవనమని పేరు 9.10 ఒక దినమున అను ష్ఠించు సోమయాగములలో వాజపేయ మొకటి స్వారాజ్య కాముడైన రాజను ష్ఠించు రాజసూయము 11.15 యాగమనుష్ఠింప అత్యావశ్యకమైన ఆహవ నీయాగ్ని సంపాదనము. అందుకే 108.0 ఇటుకలతో రెక్కలు విప్పిన పక్షి ఆకారమున వేదినిర్మాణము 16 శత రుద్రీయ హోమము 18 వసోర్ధారా. అవభృథము 19.21 సౌత్రామణి యాగము. ఇంద్రుడు అధికముగా సోమ పానముచేసి, రోగగ్రస్తుడు కాగా, అశ్వినీ దేవతలు ఈ యాగము ద్వారా చికిత్స చేసినారట

22.25 అశ్వమేధ యాగము - సార్వభౌమత్వమును ప్రకటింపగోరు సామ్రాట్టు దీనినను ష్ఠింపవలెను. 26.28 ఖిలమంత్రముల సంకలనము పూర్వము చెప్పిన యాగాదుల అనుష్ఠాన విషయమున మంత్ర వివరణము 30 నరమేధము 31 పురుష సూక్తము 32 హిరణ్య గర్భసూక్తము 33 సర్వమేధము 34

"తన్మేమన శ్శివ సంకల్పమస్తు" అను శివసంకల్పో పనిషత్తు 35 పితృమేధము 36-39 ప్రవర్గ్య యాగము (40) ఈశావాస్యో పనిషత్తు.

కృష్ణ యజుర్వేదమున ఐదు కాండలు కలవు. ప్రజాపతి సంబంధించిన సూక్తములతో ఉన్న ప్రాజాపత్య కాండమున పౌరోడాశికము, యాజమానము, హౌత్రము, పితృమేధము వర్ణింపబడినవి. సోమ సంబంధిత సూక్తములతో ఉన్న సౌమ్యకాండమున అధ్వర్యవము, గ్రహము, దాక్షిణము, సమిష్టయజుస్సు, అవభృతయజుస్సు, వాజపేయము, శుక్రియము, సవము నిరూపింపబడినవి. అగ్నిని స్తుతించు సూక్తములతో ఉన్న ఆగ్నేయ కాండమున అగ్న్యాధేయము, అగ్నిహోత్రము, అగ్న్యుపస్థానము, అగ్నిచయనము, సావిత్రము, నాచికేతము, చాతుర్హోత్రీయము, వైశ్వసృజము, అరుణము వివరింపబడినవి. విశ్వేదేవ సంబంధిత సూక్తములు కలిగిన వైశ్వదేవ కాండమునందు రాజసూయము, పశుబంధము, ఇష్టి, నక్షత్రేష్టి, దివశ్శ్యేనీ, అపాహు. సాత్రాయణము, ఉపహోమము, కౌలికీ, ఉపానువాక్యా, యాజ్యా, అశ్వమేధము, పురుషమేధము, సౌత్రామణి అచ్ఛిద్రము పశుహోత్రము, చర్చింపబడినవి స్వయంభు సూక్తి సంగ్రహమైన స్వాయంభువ కాండమున కాఠకవిధి, స్వాధ్యాయ బ్రాహ్మణము వర్ణింపబడినవి కృష్ణయజుర్వేదమున మంత్రములు బ్రాహ్మణములు కలసి ఉన్నవి. మొత్తము 1234 అనువాకములు 80 ప్రపాఠకములలో విభజింపబడినవి

## సామవేదము

'సామాని యోవేత్తి సవేద తత్త్వం' 'వేదానాం సామవేదోస్మి' అని ప్రశంసింపబడినది సామవేదము ఋగ్వేద మంత్రముల నాధారముగా గొని చేయబడు గానమునకే "గీతిషు సామాఖ్యా" అని సామమని పేరు నేడు గానము చేయబడు మంత్రములకే సామములను రూఢి ఏర్పడినది. "ఋచి అధ్యూఢం సామ" ఋక్కుల నాధారముగా గొని ఉన్నది సామము సా అనగా ఋక్కు. అమ అనగా గాంధర్వాది స్వరము. స్వర విశిష్ట ఋక్కు సామమని అర్థము. ఈ గాన ఋక్కుల సంబంధము "సామాహమస్మి ఋక్త్వం" అని భార్యాభర్తృ సంబంధముతో పోల్చబడినది.

సామవేదము ఆర్చికము, గానభాగమని రెండు భాగములు. ఆర్చికమనగా ఋక్కుల సముదాయము. ఇది పూర్వార్చికము, ఉత్తరార్చికమని

రెండు భాగములు పూర్వార్చికము. ఆరు ప్రపాఠకములున్నవి 1 అగ్ని విషయక మంత్రములు కలిగి ఉన్నందున దీనికి ఆగ్నేయమని పేరు 2, 3, 4 ఇంద్ర స్తుతిపరములైన మంత్ర సమవేశములు కావున ఐంద్ర పర్వములు 5 సోమ విషయక మంత్ర సంయుక్తము కావున పవమాన పర్వము 6 అరణ్య పర్వము మొదటి ఐదు ప్రపాఠకములు గ్రామమున పఠించదగినవి ఆరవది అరణ్యముననే గానము చేయదగినది. ఇందు దేవతైక్యము, ఛందోఐక్యము లేకున్నను, గాన విషయ ఐకమత్యమున్నది ఉత్తరార్చికమున తొమ్మిది ప్రపాఠకములున్నవి ఈ సామవేదమున డెబ్బై అయిదు మంత్రములు తక్క, మిగతా మంత్రములన్నియు ఋగ్వేదములోనివే

"సహస్ర వర్త్మా సామవేదః" అని పతంజలి సామవేదమును వేయి శాఖలు కలదిగా వర్ణించినారు వర్త్మపదము శాఖాపరము కాదని, సామ గాన పద్ధతి పరమని కొందరు వ్యాఖ్యానించినారు ప్రపంచ హృదయ, చరణ వ్యూహ గ్రంథములు సామవేదము పదమూడు శాఖలు కలదని బోధించినవి అలాగునే సామ తర్పణమునందును "రాణాయన సత్యముగ్ర - వ్యాస - భాగురి - ఔలుండి - గౌల్ములవి - భానుమాన్ - ఔపమన్యవ - కారాట - మశక - గార్గ్య - వార్షగణ్యః కౌథుమ - శాలిహోత్ర - జైమిని - త్రయోదశైతే సామగాచార్యాః స్వస్తి కుర్వంతు తర్పితాః" అని పదముగ్గురు శాఖా ప్రవర్తకులుగా చెప్పబడినారు

నేడు కౌథమీయ, రాణాయనీయ, జైమినీయ మూడు శాఖలే కనిపించుచున్నవి. కౌథుమశాఖ గుజరాత్‌నందు నిలచియున్నది. ఇరువది ఐదు కాండలు గల తాండ్య బ్రాహ్మణము, ఛాందోగ్యోపనిషత్తును ఈ శాఖకు చెందినవే. శంకర భగవత్పాదులు వేదాంత భాష్యమున ఈ శాఖను నిర్దేశించినారు రాణాయనీయ శాఖా మంత్రములందు ఎట్టిభేదములేదు కౌథుమీయులు 'హాఉ' అని ఉచ్చరించు రాణాయనీయులు 'హా.వు' అని, 'రా.ఇ' అనుచోట 'రా.యి' అని ఉచ్చరిస్తారు ఈ శాఖ మహారాష్ట్రమున నిలచియున్నది జైమినీయ శాఖ - ఈ శాఖ యొక్క సంహిత, బ్రాహ్మణములు, శ్రౌత, గృహ్య సూత్రములు. సమగ్రముగా లభించుచున్నవి. తవలాకార శాఖయగు కేనోపనిషత్తు ఈ శాఖకు చెందినదే. ఈ శాఖ దక్షిణ భారతమున నిలచియున్నది.

సంగీతమునకు మూలము సామవేదమే. స, షడ్జ, - రి, ఋషభ - గ, గాంధార-మ, మధ్యమ - ప, పంచమ-ధ, దైవత ని, నిషాద అను సప్త స్వరములు ఈ సామగానమునుండే ఉదయించినవి. వికార, విశ్లేషణ, వికర్షణ - అభ్యాస - విరామ - స్తోత్రములని సామము ఆరు విధములుగా మారుతూంది.

1 వికారము - శబ్దముల మార్పు - అగ్నే అనుచోట 'ఓగ్నాయ' అను పలుకుట. విశ్లేషణము - ఒక్కొక్క పదమును వేరువేరుగా చదువుట 'వీతయే' అనుచోట "వో, యి, తో, యా, యి' అని. వికర్షణము - ఒక్క స్వరమును దీర్ఘముగా, విభిన్న స్వరములందు చర్చించుట. 'యే' అనుచోట "యా-య" అని అభ్యాసము - ఒక్క పదముకే పలుమార్లు ఉచ్చరించుట "తోయాయ, తోయాయ" అని విరామము - శ్వాసను పీల్చుకోవడానికి పదముయొక్క మధ్యమునసే విశ్రాంతి - "గృణానో హ . వ్యదాతయే"అని హకార స్థానమున ఆపుట. స్తోత్రము - 'ఔ, హో, వా, హ, ఉ, వా' ఇత్యాద్యక్షరములను గాన కాల పతి సమాప్తికై కలుపుకొనుట. ఈ సామగానము వేయగానము అరణ్యగానము, ఊహగానము, ఊహ్యగానమని నాల్గు విధములు. ఒక్కొక్క సామ మంత్రము ఐదు భాగములందు పఠింపబడుతూంది ఉదా : అగ్న.

1 హుం ఓగ్నాయి (ప్రస్తావనా), 2. ఓం అయా హి వీతయే గృణానో హవ్యదాతయే (ఉద్గీతము), 3 నిహోతా సత్సి బర్హిషి (ప్రతిహారము), ఈ ప్రతిహార ద్వివిధమును తిలకింతము 4 నిహోతా సత్సిబ (ఉపద్రవము) 5 ర్హిషి ఓం (నిధనము) ఈ ప్రకారంగా సామగానము చేస్తే దేవతలు భువికి దిగి వస్తారట

**అధర్వ వేదము** : ఋగ్యజుస్సామ వేదములు ఆముష్మిక విషయములను బోధింప, ఐహిక విషయములను బోధించి, సంతతి, ధన, ధాన్యాది సంపత్తిని ప్రసాదించునది అధర్వవేదము. యజ్ఞమున బ్రహ్మ, ఉద్గాత, అధ్వర్యువు, హోత అని నల్గురు ఋత్విక్కులుంటారు. వీరిలో బ్రహ్మ యజ్ఞమున కధ్యక్షుడు. అన్ని కలాపముల నిరీక్షిస్తూ, పొరపాట్లను సరిజేస్తూ యజ్ఞమును సంపాదించువాడు. ఇతడు మూడు వేదములను తెలుసుకొన్నను, ప్రధానముగ అధర్వవేదమును వరించినవాడు కావుననే, అధర్వ వేదమునకు బ్రహ్మవేదమనియు పేరు. ఈ వేదము అధర్వ ఋషిచే కనుగొనబడుటచే అధర్వ వేదమని. అంగీరస మహర్షిచే కనుగొనబడుటచే అంగీరస వేదమనియు, అధర్వాంగిరస వేదమనియు నామముల నొందినది.

"నవకాండరర్వాణ వేదః" అని పతంజలి వాక్యము ననుసరించి, ప్రపంచ హృదయ, చరణవ్యూహ, సాయణ భాష్యోపద్ఘాతముల ననుసరించియు తొమ్మిది శాఖలు కలదని తెలియుచున్నది. పిప్పలాద, స్తౌద, మౌద. శౌనకీయ, జాజల జలద, బ్రహ్మవద, దేవదర్శ, చారణవేద శాఖలివి. నేడు వీటిలో పిప్పలాద, శౌనక శాఖలు రెండు మాత్రమే కనపడుచున్నవి.

అథర్వవేదమున ఇరువది కాండలు, 731 సూక్తములు, 5986 మంత్రములు కలవు. మొదటి ఏడు కాండలందు చిన్న చిన్న సూక్తములు కలవు. ఈ సూక్తములందు మంత్ర నియమము విశిష్టోద్దేశ్యము ననుసరించి సూక్త భేదములు చేయబడినవి. మొదటి కాండమున ఒక్కొక్క సూక్తమున నాల్గేసి మంత్రములుండగా, రెండవ కాండమున ఒక్కొక్క సూక్తమున ఐదేసి మంత్రములు, మూడవ కాండమునందలి సూక్తములందు ఆరేసి మంత్రములు . నాల్గవ కాండ సూక్తములందు ఏడేసి మంత్రములు.ఐదవ కాండ సూక్తములందు ఎనిమిదేసి మంత్రములు . ఆరవకాండ 142 సూక్తములందు మూడేసి మంత్రములు ఏడవకాండ 118 సూక్తములందు ఏక, ద్వి మంత్రకములు కలవు. 8.12 కాండలందు పెద్ద పెద్ద సూక్తములు కలవు. విషయైకత్వము లేక భిన్నత్వము గోచరించును. 12.18 విషయైక్యము కలదు. 13వ ఆరంభమున పృథ్వీసూక్తము కలదు. ఇందు రాజనీతి, భౌగోళిక సిద్ధాంతములు తద్వ్యాఖ్యానాలోచకుల దృష్టి నాకర్షిస్తాయి. 14 వివాహ మంత్రముల నిలయము 15 వ్రాత్యకాండము వ్రాత్యులకు యజ్ఞసంపాదన మిందు వర్ణింపబడినది. 16 దుఃస్వప్న నాశక మంత్రనిలయము 12 అభ్యుదయమునకై ప్రార్థించు మంత్రముల సముదాయము 18 శ్రాద్ధకాండ పితృమేధ సంబంధిత మంత్రముల సంకలనము 19. ఇందు 72 సూక్తములు, 483 మంత్రములు కలవు. ఇందు వైద్యము, రాష్ట్రవృద్ధి, అధ్యాత్మ విషయక తత్త్వవిచారము, 20 ఇందు 958 మంత్రములు . సోమ యాగ సంబంధితములు . చాలావరకు ఋగ్వేద సంగృహీతమిదే కలవు.

ఈ వేదమునందు శత్రువినాశము . దీర్ఘరోగ నివారణము . భూతప్రేత నివారణము . అభిచారిక ప్రయోగములు . ఆయుర్వేదము . పుష్పక విమానాది యాన నిర్మాణము . నౌకా నిర్మాణము . వివిధాస్త్ర పరిచయము . రాజయక్ష్మ, చిత్రత జాలీకరాది నానారోగ నివారణము . శల్యచికిత్సా . మూత్రపిండములు తెల్పు తినగా శర, శలాకాది ద్వారా చికిత్సా . సుఖప్రసవమునకై యోని భేద

నము-నానావిధ క్రిమిజన్య నానావిధ రోగ చికిత్సా - నేత్ర - నాసికా, దంత చికిత్సలు - సూర్య కిరణములద్వారా చికిత్స మొదలగునవెన్నో విషయములు నిరూపింపబడినవి

**బ్రాహ్మణములు :** 'బ్రహ్మ వై మన్త్రః' అన్నటుల మంత్ర రూపమగు బ్రహ్మను వ్యాఖ్యానించునవి బ్రాహ్మణములు అథవా యజ్ఞ రూపమగు బ్రహ్మను వ్యాఖ్యానించునవనియు అర్థము కావుననే "బ్రాహ్మణం నామ కర్మణః, తన్మంత్రాణాం చ వ్యాఖ్యాన గ్రంథః" అని నిర్వచించినారు మంత్రద్రష్టలను ఋషులన్నట్లుగా బ్రాహ్మణకర్తలు వేదభాగమును కనుగొన్నవారని ఆచార్యులుగా పేర్కొంటూ అశ్వలాయన గృహ్యసూత్రము వారికి నిత్య తర్పణమును విధించినది. "ఇతి విజ్ఞాయతే" అని పేర్కొంటూ నిరుక్తకారులు బ్రాహ్మణములను ప్రమాణములుగా అంగీకరించినారు మంత్రభాగము పద్యరూపమున నున్నందున, గద్యాత్మకములగు బ్రాహ్మణములకంటే స్వరూప భేదము కడు స్పష్టము. ఋక్కులు ఇంద్రాది దేవతల స్తుతింప యజుస్సులు యాగముల వివరింప, సామములు గానాన్ని బోధింప, అథర్వములు ఐహిక సుఖ సాధనముల వెల్లడింప, బ్రాహ్మణములు యజ్ఞవిధి వాక్యములను, తాత్పర్యములను తెలుపుచున్నందున విషయ భేదమును కడు స్పష్టము

బ్రాహ్మణములు అధికముగా అర్థవాదమయములు ఈ అర్థవాదములు విధిపరములని, నిషేధపరములని రెండు విధములు. మొదట విధిపరము - "వాయు దేవతాకయాగము ననుష్ఠించి సంపద పొందవచ్చును" అని విధి వాక్యము వాయు యాగమును విధించగా "వాయువు శీఘ్రముగా సంచరించెడి వాడు. పిలచినంతనే చేతిలో బంగారాన్ని ధరించి యాగమంటపాన్ని చేరుకొని, యజమానికి సంపదలనిస్తాడు". అని బోధించున అర్థవాదము ఇది యాగము నందు శీఘ్ర ప్రవృత్తిని కలిగింపజేస్తుంది కావున విధిపరకము. "రుద్రుడు ఏడుస్తుంటే, అతని కన్నులనుండి కన్నీరు బిందువులు పడి, వెండిగా మారినవి" అను అర్థవాదము "యాగములో వెండి దానము చేయరాదు" చేసినట్లయితే యజమాని కన్నీరు పెట్టవలసివుంటుందని, నిషేధ విధికి సహకరిస్తుంది కాన నిషేధపరకము. "యదాశ్వు మాయన్ తదాశ్వానా మాశ్వత్వం", తద్ధర్మ్మే దధిత్వం. ఉదానిమర్మహీరితి, తస్మాదుదక ముచ్యతే" ఇత్యాది వ్యుత్పత్తి బోధక బ్రాహ్మణ వాక్యములు నితాంత పఠనీయములు.

ఈ బ్రాహ్మణములు బోధించు విధి వాక్యముల విచారించుటకే మీమాంసా శాస్త్రము (దర్శనము) అవతరించినది "యజ్ఞో వై విష్ణుః" "యజ్ఞో యత్ ప్రజాపతిః" "యజ్ఞోఽపహా పాప్మా" అని సర్వ దేవతామయములుగా యజ్ఞములను బోధిస్తూన్నవి వీటిని అనుష్ఠించినవాడు పశు, పుత్ర, గో, ధన, ధాన్యసంపదల నొంది, చివరకు స్వర్గలోకప్రాప్తితో ముక్తిని పొందగలడు అని బ్రాహ్మణములు కర్మకాండను బోధిస్తూ, అందుకై నైతిక నియమ పాలన, పవిత్రతను "న గచ్ఛేత్ పరదారాన్", 'న రజస్వలయా (ఋతుమతియా) సంవదేత' 'స్తేయం న కుర్వీత'" "యః సత్యం త్రాతరం కుర్యాదేన స్తతః పరం" "శ్రద్ధయాసతే, స్వర్గాం ల్లోకాం జయతి" అని బోధించినవి

ఈ బ్రాహ్మణములలో కొన్ని కాలగర్భమున విలీనము కాగా పదు నాలుగు బ్రాహ్మణములు నేడు లభించుచున్నవి

ఐతరేయ బ్రాహ్మణము : ఋగ్వేదమునకు సంబంధించినది ఇందు 40 అధ్యాయములు కలవు ఐదేసి అధ్యాయములను ఒక్కొక్క భాగముగా విభజింపగా, ఎనిమిది పంచికలుగా ఏర్పడినది 1, 2 పంచికలలో అగ్నిష్టోమ యాగము 3,4 జ్యోతిష్టోమ ప్రాతః, మాధ్యందిన, తృతీయ సవనములు జ్యోతిష్టోమ సంస్థలగు ఉక్థ్య, అతిరాత్ర షోడశాదులు 5 ద్వాదశాహయాగము 6 సత్త్రాత్రముల నుష్ఠించు సోమయాగములు 7 రాజసూయము. ఈ సందర్భముననే శునః శేపోపాఖ్యానము 8. ఐంద్ర మహాభిషేకము రాజనీతిధర్మములు నిరూపింపబడినవి. శునశ్శేపోపాఖ్యానము నందలి ఆంధ్ర పదమే ఆంధ్రుల చరిత్రకు మూలము.

శాంఖాయన బ్రాహ్మణము: ఋగ్వేద బాష్కల శాఖకు సంబంధించినది ఇందు 30 అధ్యాయములు కలవు యజ్ఞయాగాది కర్మకాండను బోధించుచున్నది. రుద్రో వై జ్యేష్ఠశ్చ దేవానాం అని శివుని కొనియాడినది 7 వ అధ్యాయమున "అగ్నిరవరార్ధ్యః విష్ణుః పరార్ధ్యః" అని అగ్ని నిమ్నకోటికి చెందినవాడని విష్ణువు ఉచ్చకోటికి చెందినవాడని బోధిస్తూ "యజ్ఞో వై విష్ణుః" అని విష్ణు ప్రతీకముగా యజ్ఞమును చిత్రించినది భూలోకమున యజ్ఞము నందాహుతివ్వబడిన పశువులు పైలోకమున యాగకర్తను హతమార్చ సిద్ధముగా ఉన్నవని 'అముష్మింల్లోకే పశవో మనుష్యాన్నశ్నంతి' అని బోధించినది శతపథ బ్రాహ్మణము . స్వరూపమున విషయమునను అన్నిటికంటే గొప్ప

నైనది. ఇది శుక్లయజుర్వేద మాధ్యందిన, కాణ్వ శాఖలలో లభ్యమగుచున్నది. ఈ రెండిటియందు శాఖాభేదమే తప్ప విషయభేదము లేదు. మాధ్యందిన శత పథము 14 కాండలు, 100 అధ్యాయములు, 6' ప్రపాఠకములు, కాణ్వశత పథము 17 కాండలు 104 అధ్యాయములు కలిగి ఉన్నవి. మాధ్యందిన శత పథమున 1 నుండి 9 వరకు పిండ పితృయజ్ఞము వివేచింపబడినది. ఈ వివే చనము తక్క మిగతా భాగమంతా మాధ్యందిన సంహితననుసరించి ఉన్నది. సంహితలో దర్శపూర్ణమాస యాగానంతరము పిండ పితృయజ్ఞము చెప్పబడగా, ఇందు అగ్న్యాధానానంతరము చెప్పబడినది మాధ్యందిన శతపథ మొదటి కాండ మందలి దర్శపూర్ణమాసము కాణ్వ ద్వితీయమున, మాధ్యందిన ద్వితీయ కాండ మందలి అగ్న్యాధానము కాణ్వప్రథమమున కలవు. కాండ విషయముల వీక్షింతము.1 దర్శ పూర్ణమాసేష్టి 2 అగ్న్యాధానము, అగ్నిహోత్ర యాగము, పిండ పితృ యాగము, ఆగ్రయణేష్టి, చాతుర్మాస్యేష్టి. (3. 4.) సోమయాగము. 5. వాజపేయము, రాజసూయము 6 ఉఖా సంభరణము, విష్ణుక్రమము, అగ్నిచయనము. 7 8 శతరుద్రీయ హోమము. 9. చితిసంపత్తి 10. ఉపని షద్రూపమున అగ్న్యుపాసన. 11. ఉపనయనము 12. స్వాధ్యాయము. 13. ఔర్ధ్వదేహిక సూక్తము, అశ్వమేధము, నరమేధము, సర్వమేధము. 14. ప్రవర్గ్యయాగము, ముండకోపనిషత్తు. తాండ్య (పడ్వింశ) బ్రాహ్మణము - సామవేదీయ కౌథుమశాఖీయమిది ఇందు ఐదు ప్రపాఠకములు కలవు. ఏడవ ప్రపాఠకమున అకాల పుష్పఫలోత్పత్తి, అశ్వతరాగర్భోత్పత్తి, మొదలగు ఉత్పాతములు. వాటికై అనుష్ఠించదగు శాంతులు - "తస్మాద్ బ్రాహ్మణో - హోరాత్రస్య సంయోగే సంధ్యాముపాసీత్" అని సంధ్యావందనమును విధింప బడినవి యజ్ఞ ప్రక్రియ సామాన్యముగా వివేచింపబడినది

సామవిధ్య బ్రాహ్మణము : సామవేద కౌథుమశాఖకు సంబంధించినది. కృచ్ఛ్ర, అతికృచ్ఛ్రాది వ్రతములు, దీర్ఘాయుష్మంతుడైన పుత్రునికై సామ విధానము, ఐశ్వర్యమునూత్న గృహము మొదలగు సంపత్తికై అనుష్ఠించు సామ విధానములు నిర్దేశించబడినవి

ఆర్షేయ బ్రాహ్మణము: ఇదికూడా సామవేద కౌథుమశాఖకు సంబంధించి నదే. ఇందు మూడు ప్రపాఠకములు, ఎనిమిది ఖండికలు కలవు. సామగాన మును వివేచించినది.

దేవతాధ్యాయ బ్రాహ్మణము : ఇది కూడా సామవేద కౌథుమ శాఖకు సంబంధించినదియే. ఇందు మూడు ఖండికలు కలవు అగ్న్యాది దేవతాసంబద్ధ సామగానము వివేచింపబడినది

ఉపనిషద్బ్రాహ్మణము : సామవేద కౌథుమ శాఖీయము. ఇందు పది ప్రపాఠకములు కలవు.

వంశ బ్రాహ్మణము సామవేద కౌథుమ శాఖీయము ఇందు మూడు ఖండికలు కలవు

జైమినీయ బ్రాహ్మణము · సామవేద జైమినీయ శాఖకు సంబంధించినది. సామగానమును వివేచించినది

గోపథ బ్రాహ్మణము . అథర్వవేద శౌనక శాఖకు సంబంధించినది. ఇది పూర్వగోపథము, ఉత్తర గోపథము అని రెండు భాగములు - పూర్వమున ఐదు అధ్యాయములు, ఉత్తరమున ఆరు అధ్యాయములు కలవు అథర్వవేదము నుండియే మూడు వేదములు ఉదయించినవని, అథర్వ వేదమును పొగడు చున్నది. అథర్వవేదమునుండియే ప్రణవ ముద్భవిల్లగా, ప్రణవమునుండి ప్రపంచముద్భవించినది అని పేర్కొన్నది. ప్రణవము, గాయత్రీ, బ్రహ్మచారి నియమములు, యజ్ఞమున ఋత్విక్కుల కార్యకలాపము, ఋత్విగ్దక్షిణ, సంవత్సరానుష్ఠేయ వ్రతములు, అగ్నిష్టోమాది యాగములు ఇందు వివేచించబడినవి. "పరోక్ష ప్రియా హి దేవాః, ప్రత్యక్ష ద్విషః" అని దేవతలను పరోక్ష ప్రియులుగా తెలిపినది.

12. తైత్తిరీయ బ్రాహ్మణము . ఇందు మూడు కాండములు కలవు. ఋగ్వేదమువలె అష్టక క్రమమున విభజించబడినది ఇందలి 28 అధ్యాయములు నాల్గు అష్టకములలో విభజించబడినవి నాల్గవ అష్టకము కాఠకమని ప్రసిద్ధి నొందినది. మొదటి అష్టకమున అగ్న్యాధానము - గవామయన సత్రము, వాజపేయము, సోమయాగము, రాజసూయము. రెండవ అష్టకమున అగ్నిహోత్ర యాగము, ఉపహోమములు సౌత్రామణి యాగము, బృహస్పతి సవము. మూడవ అష్టకమున నక్షత్రేష్టి, పురుషమేధము కాఠకమునందు భరద్వాజుని బ్రహ్మచర్యము, వేదసారమును మూడు పిడికిళ్ళచే గ్రహించినందున త్రయీ నామము, నాచికేతుని అగ్నివిద్యోపాసనలు వర్ణింపబడినవి.

చివరి అనువాకమున దాశరాత్ర - వైశ్వ సృజయాగ వర్ణనము ఈ వైశ్వ సృజయాగము ప్రపంచ పదార్థములకు ప్రతీకమైనది. సమస్త పదార్థములచే అనుష్ఠింపదగినది దేవతలు ఒకవేయి సంవత్సరము లీయాగమునను ష్ఠించి సాయుజ్య, సాలోక్య, సారూప్య సార్ష్టితా రూపములగు ముక్తినొందినారు ఆ వైదిక కాలమున యజ్ఞ యాగాదుల నాచరిస్తూ, తాత్త్విక విచారాన్ని కొనసాగిస్తూ, శాస్త్రార్థ చింతనచే కాలయాపనచేసే వైదికుల వర్ణనము కడు రమ్యము పురాణములందుల్లేఖింపబడిన అవతార కథలకు మూలమైన బీజము ఇందు గోచరించును. వరాహావతార కథ సంకేతముగా ఇందు గోచరించును

**ఆరణ్యకములు :** యజ్ఞ యాగాది కర్మకాండార్థతమగు ఆధ్యాత్మిక తత్త్వములను, దార్శనిక విచారములను నిరూపించు వేదభాగమునకు ఆరణ్యకమని పేరు "అరణ్యాధ్యయనా దేతత్ ఆరణ్యకం" అని వానప్రస్థాశ్రమమున అరణ్యమున అధ్యయనము చేయదగినది సంసారిక జీవితమున ఉంటూ, పిల్లలను కంటూ సాంసారమనిత్యమని చదువుట, చెప్పుట ధర్మముకాదు, కాన వీటిని చదువుటకు ప్రశాంత వాతావరణముగైన ఆరణ్యముల నాశ్రయించాలి. ఆరణ్యకముల చదువాలి

ప్రాణ విద్య వీటియందు స్పష్టముగా నిరూపించబడినది. సోఽయమాకాశః ప్రాణేన బృహత్యా విష్టబ్ధః, తద్యథా—యమాకాశః ప్రాణేన బృహత్యా విష్టబ్ధః, ఏవం సర్వాణి భూతాని ఆ పిపీలి కాభ్యః ప్రాణేన బృహత్యా విష్టబ్ధః"ప్రాణమే ఈ విశ్వమునకు ఆధారము ప్రాణ శక్తిచేతనే ఆకాశము నిలచియున్నది. చీమ మొదలు బ్రహ్మాండము వరకు అన్నికూడా ఈ ప్రాణము ద్వారానే నిలచియున్నవి "సర్వం హీదం ప్రాణే నా వృతం' ఈ జగత్తంతా ప్రాణముచేతనే ఆవరించబడి ఉంది ప్రాణమే విశ్వాధారము - విశ్వరక్షకము.

"యావత్యస్మిన్ శరీరే ప్రాణోవసతి, తావదాయుః"ప్రాణమున్నంతవరకే శరీరమున ఆయువు. ప్రాణమే అంతరిక్ష లోకమును వాయువును సృష్టిస్తూంది. ప్రాణమే తండ్రి, అంతరిక్షము, వాయువులు దీని సంతానము. కృతజ్ఞుడైన పుత్రుడు తండ్రికి సేవ చేసినట్లు, అంతరిక్ష వాయువులను పుత్రులు తమ తండ్రియగు ప్రాణమునకు పరిచర్యలు గావించుచున్నవి. "ఏవ పైతా ప్రాణ పితరం పరిచరంతో' తరిక్షం చ వాయుశ్చ" - కాలమే అహోరాత్ర రూప

మైనది దినము ప్రాణరూపము కాగా, రాత్రి అపానరూపము ప్రాణము సర్వ దేవతాత్మకము అన్ని పాపములనుండి రక్షించునది ప్రాణమే, కాన 'అత్రి' అని చెప్పబడినది. "సర్వా ఋచః సర్వేవేదాః సర్వే ఘోషాః ఏకైవ వ్యాహృతిః ప్రాణ ఏవ ఇత్యేవం విద్యాత్" ఋకులు, వేదములన్నియు ప్రాణరూపములే కావున ప్రాణముపాసనీయము

ఐతరేయ అరణ్యకము ఋగ్వేద సంబద్ధమిది ఐతరేయ బ్రాహ్మణ పరిశిష్ట భాగమిది ఇందు ఐదు భాగములు కలవు. 1 మహావ్రతము. 2. ఉక్థ్య, నిష్కేవల్య శస్త్రములు, ప్రాణ విద్య.పురుష వివేచనము 3 దీనికి సంహితో పనిషత్తని పేరు ఇందు సంహిత - పదము - క్రమము, ఘనాది పాఠముల వర్ణనము, స్వర వ్యంజనాది స్వరూప విచారము - అందు శాకల్య మాండుకేయ మతములు నిరూపించబడినవి 4 మహావ్రత పంచమ దినమున పఠించు మహా నామ్నీ ఋక్కులు 5 నిష్కేవల్య శస్త్ర విచారము

శాంఖాయన ఆరణ్యకము ఋగ్వేద సంబద్ధ మిది ఇందు పది హేను అధ్యాయములు కలవు 1.5 కౌషీతకి ఉపనిషత్తు, ఆరవ అధ్యాయమున ఉశీనర, మత్స్య - కాశీ - విదేహ కురు - పాంచాలాది దేశ నామములుపల భ్యములగుచున్నవి 13 నందు బృహదారణ్యకోపనిషత్తు దాలాభాగము లభించు చున్నది

తైత్తిరీయారణ్యకము ఇందు పది పరిచ్ఛేదములు కలవు ఇవి భద్ర, సహవై, చిత్తి, యుంజతే, దేవావై, పరే, శిక్షా, బ్రహ్మవిద్యా, భృగు, నారాయ ణీయములని ప్రసిద్ధములు 7, 8, 9 కలసి తైత్తిరీయోపనిషత్తని చెప్పబడు చున్నది

**ఉపనిషత్తులు :** ఉపనిషచ్ఛబ్దము ఉప, ని అను ఉపసర్గలు పూర్వమందు కలిగిన సద్లృ ధాతువునుండి నిష్పన్నమైనది ఈ ధాతువునకు విశరణ, గతి, అవసాదనములను మూడు అర్థములు కలవు. ఉపనిషత్తులను చదవుటచేత సంసార బంధమునకు కారణభూతమైన అజ్ఞానము నశిస్తూంది కావున విశర ణార్థము. బ్రహ్మత్వ ప్రాప్తి సిద్ధిస్తూంది కావున గత్యర్థము, పునరపిజనన, పున రపి మరణ, పునరపి జననీ జఠరే శయనాది రూపాలైన దుఃఖాలు సర్వథా శిథిలమౌతాయి కావున అవసాదనార్థము. వేదముయొక్క చివరి భాగమున సిద్ధాంత రూపాలుగా నున్నందున వీటికి వేదాంతాలని పేరు సనాతన ధర్మము

యొక్క తత్వమును ప్రబోధించు ప్రస్థాన త్రయమునందు ఉపనిషత్తులే ముఖ్యములు ఉపనిషదర్థమునే వివరించినందున భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు ప్రస్థాన త్రయమున స్థానము లభించినది సాంఖ్య వేదాంతాది వైదిక దర్శనాలకే కాక జైన బౌద్ధాది దర్శనాలకు కూడా ఈ ఉపనిషత్తులే ఆధారాలు. విదేశీయులు సైతము వీటినధ్యయనంచేసి, ఇందలి సమున్నతమైన విచారములను, ఉదాత్త చింతనాన్ని, ధార్మికానుభూతుల్ని శతధా స్తుతించినారు

క్రీ॥ శ॥ 1640 నందు దారాశికోహ 50 ఉపనిషత్తులను సిర్-ఏ-అక్బర్ (గొప్పరహస్యాలు) అను పేరుతో పార్సీ భాషయందనువదించినాడు. బెర్నియర్ అను ఫ్రెంచి యాత్రికుడు ఈ పార్సీ అనువాదాల్ని ఫ్రాంసు దేశమునకు తీసుకొనిపోగా, క్రీ॥ శ॥ 1801 న అక్వెటిల్ దూపేరా ఫ్రెంచి భాషయందు, లాటిన్ భాషయందును అనువదించినాడు ఉపనిషత్తుల సంఖ్య వివాదగ్రస్తము నేడు (అల్లోపనిషత్తు మొదలగు అర్వాచీనములతో) 200 ఉపనిషత్తులు లభించుచున్నవి. ముక్తికోపనిషత్తు 108 ఉపనిషత్తులను పేర్కొనుచున్నది, ఇందు 10 ఋగ్వేదమునకు, 19 శుక్ల యజుర్వేదమునకు, 32 కృష్ణ యజుర్వేదమునకు 16 సామవేదమునకు, 31 అధర్వ వేదమునకు సంబంధించినవి. శంకరాచార్యులు 'ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా' అను 10 ఉపనిషత్తులపై భాష్యాన్ని వ్రాసినాడు. మరియు కౌషీతకే, శ్వేతాశ్వతర, మైత్రయణీయోపనిషత్తులు ప్రాచీనములుగా పరిగణింపబడుచున్నవి. కావున ఈ 13 ప్రధానోపనిషత్తులుగా సర్వాంగీకృతములు. డాయిసన్ అను పాశ్చాత్య విద్వాంసుడు ఉపనిషత్తులను నాల్గు విధములుగా విభజించినాడు 1) ప్రాచీన గద్యోపనిషత్తులు - ఇందలి గద్యములు ప్రాచీనములు - సరళములు - వైదిక బ్రాహ్మణ గద్య తుల్యములు ఉదా : బృహదారణ్యక, ఛాందోగ్య, తైత్తిరీయ, ఐతరేయ, కౌషీతకి, కేనాద్యుపనిషత్తులు 2) ప్రాచీన పద్యోపనిషత్తులు - ఇందలి పద్యములు ప్రాచీనములు - సరళములు - వేదమంత్ర తుల్యములు ఉదా : కఠ, ఈశ, శ్వేతాశ్వతర, మహానారాయణాద్యుపనిషత్తులు, 3) అర్వాచీన గద్యోపనిషత్తులు - ఇందలి గద్యములు నవీనములు - క్లిష్టములు - సమాస భూయిష్టములు. ఉదా : ప్రశ్న, మైత్రేయ, మాండూక్యాద్యుపనిషత్తులు, 4) అధర్వణోపనిషత్తులు - తాంత్రికోపాసనా ప్రధానములు : శైవ, వైష్ణవ, శాక్తోపనిషత్తులు ఈకోవకే చెందినవి

చింతామణి వినాయక వైద్యగారు ఉపనిషత్తులను (1) విష్ణు, శివ, పరదేవతా బోధకములు (2) ప్రకృతి - పురుష - గుణ సాంఖ్య సిద్ధాంత బోధకములని రెండు విధములుగా విభజించినారు

ఈశావాస్యోపనిషత్తు శుక్ల యజుర్వేద మాధ్యందిన శాఖకు చెందినది ఈశావాస్యమిదంసర్వం అను మొదటి పదాన్ననుసరించి దీనికి పేరు. ఇందు 18 మంత్రములు శ్లోక రూపములుగా నున్నవి కర్మ సన్న్యాసానికంటే నిష్కామ కర్మాచరణమే శ్రేష్ఠమని "జిజీవిషేచ్ఛతగం సమాః" అని బోధిస్తుంది ఈ నిష్కామ కర్మయోగమే భగవద్గీతయందు విస్తారముగా వర్ణింపబడినది. అద్వైత భావన ఇందు స్పష్టముగా నిరూపింపబడినది బ్రహ్మస్వరూపాన్ని వర్ణిస్తూ విద్య, అవిద్యలు, సంభూతి, అసంభూతులు స్పష్టముగా వివేచింపబడినవి.

కేనోపనిషత్తు : "కేనేషితం పతతి" అని ఆరంభమున కేన పదముచే ప్రారంభమగుటచే దీనికిపేరు తవలకార శాఖీయమగుటచే తవలాకారోపనిషత్తనియు దీనికి పేరు. ఇందు నాల్గు ఖండములు కలవు (1) ఉపాస్య బ్రహ్మము, నిర్గుణ బ్రహ్మము - వీటి యందలి భేదము (2) బ్రహ్మము యొక్క రహస్యమయమైన స్వరూప వర్ణనము. (3) (4) హైమవత్యుపాఖ్యానము ద్వారా బ్రహ్మము యొక్క సర్వశక్తిమత్తా నిరూపణము, మరియు దేవతల పరిమిత శక్తిమత్తా నిరూపణము.

కఠోపనిషత్తు : కృష్ణ యజుర్వేద కఠశాఖకు చెందినది. అద్వైత తత్త్వాన్ని బోధించునది. ఇందు 2 అధ్యాయములు కలవు ఒక్కొక్క అధ్యాయమున మూడేసి వల్లులు కలవు ఇందు నచికేతూపాఖ్యానము ద్వారా వేదాంతము చక్కగా బోధింపబడినది, "నేహనానాస్తికించన" అన్నది ఈ ఉపనిషదుద్ఘోషము, నిత్యములందు నిత్యముగా, చేతనములందు చేతనముగా బ్రహ్మమొక్కడే. అన్ని ప్రాణుల ఆత్మలందు నివసిస్తూన్నాడు. అతనిని దర్శించుటే సర్వమానవ కర్తవ్యమని బోధిస్తూంది

ప్రశ్నోపనిషత్తు : ఈ ఉపనిషత్తున ఆరుగురు ఋషులు పిప్పలాద మహర్షిని సమీపించి బ్రహ్మ విద్యకు సంబంధించిన ఆరు ప్రశ్నలనడుగుతారు - (1) ఈ జీవులంతా ఎక్కడనుండి పుడతారు ? (2) ఏయే దేవతలు ఈ

ప్రజల్ని పరిపాలిస్తారు ? ఈ దేవతలలో శ్రేష్ఠుడెవరు ? (3) ప్రాణముల ఉత్పత్తి, శరీరమున వాటి ప్రవేశము, నిర్గమము ఎలా జరుగుతాయి ? (4) జాగ్రత్, స్వప్న, సుషుప్తులెలా సంభవిస్తాయి ? (5) ప్రణవోపాసనచే సంసారబంధము నుండి ముక్తి ఎలా సంభవిస్తుంది ? (6) షోడశకలా సంపన్నుడైన భగవంతుడి స్వరూపమేది ? ఈ ప్రశ్నలకు పిప్పలాదమహర్షి సుందరములైన, ఉన్నతములైన, గంభీరములైన జవాబులనిస్తారు. కూటస్థ బ్రహ్మమే జగత్తునకు మూలకారణమని చక్కగా నిరూపించబడినది. ఇందు ప్రశ్నల రూపమున వేదాంతము ప్రబోధింపబడుటచే ప్రశ్నోపనిషత్తని దీనికి పేరు కల్గినది

ముండకోపనిషత్తు : అథర్వవేదమునకు సంబంధించినది. ముండనము చేయించుకొన్న సన్న్యాసులు దీనిని పఠింప అర్హులు కావున ఈ ఉపనిషత్తునకు ముండకమని పేరు ఇందు బ్రహ్మ తన పుత్రుడగు అథర్వమునికి బ్రహ్మ విద్య నుపదేశిస్తారు కర్మానుష్ఠానము ఛిద్రముంతో కూడుకొన్న నావ ప్రయాణములాంటిది. సంసార సముద్రాన్ని దాటింప సమర్థమైనదికాదు. యజ్ఞాద్యాచరణచే స్వర్గలోకము లభిస్తుంది. పుణ్యము నశించగా "క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి" అన్నటుల మళ్ళీ సంసార బంధము తప్పదు. కావున కర్మ మార్గమునకంటే జ్ఞానమార్గమే గొప్పదని బోధిస్తుంది. ద్వాసుపర్ణాసయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే, తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి" అను జీవపరమాత్మలను ప్రబోధించు మంత్రము ఇందులోనిదే నదులన్ని సముద్రంలో కలిసినట్లుగా, బ్రహ్మజ్ఞానులైన జీవాత్మలందరు పరమాత్మలో కలసిపోతారని చక్కగా వివరించినది

మాండూక్యోపనిషత్తు · 12 వాక్యములు కలిగి స్వరూపమున చిన్నదైనను, రహస్యములనెన్నింటినో బోధిస్తుంది ప్రణవాన్ని వ్యాఖ్యానిస్తూ అ+ఉ+మ అని కనిపించు మూడు మాత్రలు, కనిపించని నాల్గవ అంశ ఓంకారానికున్నటుల, చైతన్యానికి కూడా జాగ్రత్, స్వప్న, సుషుప్తులను కనిపించు మూడు అవస్థలేకాకుండ, కనిపించని 'శివమద్వైతం చతుర్థం' అను తురీయావస్థ శాశ్వతానందదాయకమైన బ్రహ్మలయమున కలుగుతుందని బోధిస్తూ - ఈ అవస్థల ననుసరించియే ఈ చైతన్యము వైశ్వానర, తైజస, ప్రాజ్ఞ మరియు శివ అను పేర్లను పొందుతుందని బోధిస్తుంది. శంకరాచార్యుల గురువులు

గౌడపాదాచార్యులు మాండూక్య కారికలను ఈ ఉపనిషత్తునకు వ్యాఖ్యానముగా వ్రాసినారు ఈ కారికలే అద్వైత వేదాంతానికి మూలములు.

తైత్తిరీయోపనిషత్తు : తైత్తిరీయారణ్యకముయొక్క సప్తమ, అష్టమ, నవమ శీక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లి ప్రపాఠకములే తైత్తిరీయోపనిషత్తు శిక్షా ప్రాధాన్యాన్ని, గురుశిష్య సంబంధాన్ని శిక్షావల్లి బోధింపగా, భృగు, ఆనంద వల్లులు బ్రహ్మవిద్యను బోధిస్తూన్నవి శిష్టాచారము, గురుశిష్య సంబంధము, గురూపాసన, శిష్యవర్తనము శిక్షావల్లియందు బాగుగా నిరూపింపబడినవి. 11వ అనువాకమునందలి 'సత్యంవద, ధర్మంచర, మాతృదేవోభవ, పితృదేవోభవ ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ' అను స్నాతకోపన్యాసము సర్వజన శ్రోతవ్యము, అనుష్ఠేయము కూడా శిక్షయొక్క ఉన్నతాదర్శము ఇందు కడు స్పష్టము ఆనందవల్లి బ్రహ్మమును నిరూపిస్తూ, అన్నమయాది పంచకోశాతిరిక్తమైన, సచ్చిదానంద స్వరూపమైన, ఆత్మస్వరూపమే బ్రహ్మపద వాచ్యమని పేర్కొన్నది బ్రహ్మప్రాప్తికై పంచకోశ వివేకమెంతేని అవసరమని భృగువల్లి నిరూపించినది మహానారాయణోపనిషత్తు కూడా తైత్తిరీయ భాగముగా కొందరు అంగీకరిస్తారు.

ఐతరేయోపనిషత్తు : ఐతరేయారణ్యక చతుర్థ, పంచమ, షష్ఠాధ్యాయములే ఐతరేయోపనిషత్తు. ఇందు సృష్టితత్త్వము మార్మికముగా వివేచింపబడినది మనుష్య శరీరమున మనుష్యున కుపకరించు అవయవములన్ని సప్రకూర్చబడినవి. ఈ శరీరముయొక్క భిన్న, భిన్న అవయవములందు భిన్న, భిన్న దేవతలు ప్రవేశించగా, పరమాత్మ మూర్ధమును విదీర్ణముచేసి, అందులో ప్రవేశించి తాను పరమాత్మనని మరచిపోయి, శరీరముతో ఐక్యతనొంది, అహంకార మమకార సహితుడై, అజ్ఞానముచే సంసారమున బంధింపబడుచున్నాడు. గురుకృపచే. యథార్థమును తెలుసుకొన్న జ్ఞానియే సంసారాన్ని దాటకలుగుతున్నాడు, అని మాయాస్వరూపాన్ని చక్కగా వివరించినది.

ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి సంబంధించిన ఈ ఉపనిషత్తు అతి ప్రాచీనమైనది ఇందు 8 అధ్యాయములు కలవు 1) విద్యల యొక్క, ప్రణవము యొక్క, సామము యొక్క గూఢస్వరూపము 2) శైవ ఉద్గీథము. భౌతిక సంపత్తులకై కర్మలననుష్ఠించువారిని, సామగానము చేయువారని వ్యంగ్య

ముగా నిండించినది. 3) మధువిద్య - సూర్యుని దేవమధురూపముగా ఉపా సించుట - గాయత్రీవర్ణనము . ఘోర అంగిరసుని ద్వారా శ్రీకృష్ణునకు అధ్యాత్మ శిక్ష - అండమునుండి సూర్య జననము - 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్న అద్వైత ప్రతిపాదక మహావాక్యము, (4) సత్యకామజాబాల కథ (5) ప్రవ హణ జైవలి దార్శనిక సిద్ధాంతములు - కేకయ అశ్వపతి సృష్టివిషయక విచా రము (6) అరుణి మహర్షి చరితము 'తత్త్వమసి' అను మహావాక్యము - ఉంగ రము, కుండలము, కంకణము అను భిన్న నామములున్నను బంగారమొకటే యనట్లుగా గజ, అశ్వ, నరాది నామములచే భిన్నముగా భాసించినను బ్రహ్మ మొక్కటే అను బ్రహ్మ నిరూపణము (7) సనత్కుమార నారద సంవాదము నారదమహర్షి బ్రహ్మ మానసపుత్రుడగు సనత్కుమారుని ఆత్మవిద్యకై ఆశ్ర యించగా 'యోవై భూమా తదమృతం, అథ యదల్పం తన్మర్త్యం' బ్రహ్మ మొకటే భూమము (నిత్యం), మిగతా ప్రపంచమంత అనిత్యమని ఉపదేశిస్తాడు (8) ఇంద్ర విరోచనోపాఖ్యానము ద్వారా ఆత్మజ్ఞాన ప్రాప్తికై వ్యావహారికోపా యములు సుందరముగా వర్ణించబడినవి.

బృహదారణ్యకోపనిషత్ : ఇందు 6 అధ్యాయములు కలవు. యాజ్ఞ వల్క్య మహర్షి ఉపదేశములచే కూడుకొనియున్నది (1) మరణం తరువాత సమస్త జీవులు నశించుచున్నందున ప్రాణశ్రేష్ఠత్వము 2) అభిమానవంతుడగు గార్గ్యునితో శాంత స్వభావుడైన కాశీరాజుయొక్క సంవాదము (3) యాజ్ఞ వల్క్యుడు తన సంపదనంతా భార్యలగు కాత్యాయని, మైత్రేయిలకు పంచి, వనమునకు వెళ్లుతాడు, మైత్రేయికి తత్వజ్ఞానాన్నుపదేశిస్తూ 'ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిధిధ్యాసితవ్యః' అని బోధిస్తాడు. జనకుని కొలువుకూటమున బ్రహ్మజ్ఞానుల సదస్సు. వివిధ మత ఖండన మండనములు (4) జనకునకు యాజ్ఞవల్క్యోపదేశము (5) సృష్టి పరలోక విచారము (6) ప్రవ హణ జైవలి శ్వేతకేతు అరుణియుల దార్శనిక సంవాదము మరియు పంచాగ్ని విద్య

శ్వేతాశ్వతరోపనిషత్ : శైవ తత్త్వమును ప్రతిపాదించునదీ ఉపనిషత్తు. 2వ అధ్యాయమున యోగము విశదముగా వర్ణితము 3.5 శైవ మరియు సాంఖ్య సిద్ధాంతములు. అంతిమాధ్యాయమున గురుభక్తియే దైవభక్తిగా 'యస్య దేవే పరాభక్తిర్యథా దేవే తథాగురౌ' అని నిరూపించబడినది. భక్తితత్వమును

ప్రవలోధించు ప్రథమోపనిషత్తు ఇది ఇందలి సాంఖ్యము వేదాంత మిశ్రితము. ఈ సాంఖ్యమునందలి ఈశ్వరుడు ప్రకృతిపై అధికారము కలవాడు. 'అజా మేకాం లోహిత శుక్లకృష్ణాం' సత్త్వరజస్తమో గుణముల సామ్యావస్థయగు ప్రకృతి ద్వారా ఆ పరమాత్మ సృజిస్తున్నాడని, నిజానికి జీవులంతా ఆ పరమాత్మ స్వరూపులే అని విశదముగా సోపపత్తికముగా నిరూపించినది.

కౌషీతక్యుపనిషత్ : ఋగ్వేదీయమైన ఈ ఉపనిషత్తున 4 అధ్యాయములు కలవు. 1 కర్మమార్గానుసరణముచే స్వర్గము, దేవయానము. పితృయానము 2.3 దార్శనిక సిద్ధాంతములు, ప్రతర్దన ఇంద్రుని ద్వారా బ్రహ్మవిద్యోపదేశము ప్రాణతత్వ వర్ణనము 4 బృహదారణ్యకోపనిషదంతర్గత బాలాకి అజాత శత్రు సంవాదము.

మైత్రాయణీయోపనిషత్ . యజుర్వేదీయమైన ఈ ఉపనిషత్తున 7 ప్రపాఠకములు కలవు గద్యపద్యోభయమిశ్రితము. ఏడవ ప్రపాఠకమున ఈశావాస్యమునుండి కఠోపనిషత్తునుండి రెండేసి మంత్రములు ఉల్లేఖించబడినవి. మిగతా భాగమంతా అర్వాచీనముగా కనపడుచున్నది సాంఖ్యము, హఠయోగము చక్కగా నిరూపించబడినవి.

**వేదాంగములు :** 'అంగ్యంతే జ్ఞాయంతే ఏభిరితి అంగాని, వేదస్య అంగాని వేదాంగాని' వస్తు తత్త్వమును తెలుసుకొనుట కుపకరించునవి అంగములు. వేదముయొక్క వాస్తవికార్థమును తెలుపునవి వేదాంగములు. మొట్టమొదట నాల్గు వేదములతోపాటు వేదాంగముల పరిచయము 'తత్రాపరా ఋగ్వేదో, యజుర్వేదః, సామవేదః, అధర్వవేదః, శిక్షా, కల్పో, వ్యాకరణం, నిరుక్తం, ఛందో, జ్యోతిషమితి" ముండకోపనిషత్తునందు కనబడుచున్నది.

వేదాంగములు వేదమునకు అంగములని పాణినీయ శిక్షయందు ఈ విధముగా వర్ణింపబడినది- "ఛందః పాదౌతు వేదస్య హస్తౌ కల్పోఽథ పఠ్యతే, జ్యోతిషా మయనం చక్షుః నిరుక్తం శ్రోత్ర ముచ్యతే. శిక్షా ప్రాణంతు వేదస్య ముఖం వ్యాకరణం స్మృతం, తస్మాత్ సాంగ మధీత్యైవ బ్రహ్మలోకే మహీయతే" ఛందస్సు పాదములు, కల్పము చేతులు, జ్యోతిషము కన్నులు, నిరుక్తము చెవులు. శిక్ష ముక్కు, వ్యాకరణము ముఖము కావుననే అంగ సహితముగా వేదము నధ్యయనము చేసినవాడే బ్రహ్మలోకము నందకల్గుతాడు.

**శిక్షా :** "స్వర వర్ణాద్యుచ్చారణ ప్రకారో యత్ర శిక్ష్యతే, ఉపదిశ్యతే సాశిక్షా" అని సాయణాచార్యులు వర్ణోచ్చారణ పద్ధతిని బోధించునది శిక్ష అని నిర్వచించినారు ఏ వర్ణమును ఏయే స్థానమునుండి పలుకవలెను? అందులకై ఏ ప్రయత్నము చేయాలి? వర్ణములెన్ని? అవి ఏవిధముగా విభజింపబడుతాయి? ఎన్ని స్థానములు? ఎన్ని ప్రయత్నములు, శరీరమందలి వాయువు వర్ణరూపాన్ని ఎలా ధరిస్తుంది? స్వరములెన్ని? ఎలా ఉచ్చరించాలి? ఇత్యాది ప్రకారములను శిక్ష బోధిస్తుంది వేద పఠనమునకు శిక్షాజ్ఞాన మెంతేని ఆవశ్యకము శుద్ధోచ్చారణము, సస్వరపఠనము వేదమునకు ప్రాణములు ఈ విషయమే ప్రాతిశాఖ్య గ్రంథములలో విపులంగా వివరించినవి

ప్రాతిశాఖ్యమనగా ప్రతి శాఖకు సంబంధించినదని అర్థము ఋగ్వేద శాఖలకు శౌనక మహర్షి రచించిన ఋక్ ప్రాతిశాఖ్యము శుక్ల యజుర్వేద శాఖలకు కాత్యాయనుని శుక్ల యజుః ప్రాతిశాఖ్యము కృష్ణ యజుర్వేద శాఖలకు తైత్తిరీయ ప్రాతిశాఖ్యము సామవేదమునకు సామ ప్రాతిశాఖ్యము పుష్ప సూత్రము, పంచవిధ సూత్రము - అధర్వ వేద శాఖలకు అధర్వ ప్రాతిశాఖ్యమును కలవు ఇవియేకాక మరికొన్ని శిక్షా గ్రంథములు కలవు

ఋగ్వేదమునకు పాణినీయ శిక్ష, శుక్ల యజుర్వేదమునకు యాజ్ఞవల్క్య శిక్ష, కృష్ణయజుర్వేదమునకు వ్యాస శిక్ష, సామవేదమునకు నారదశిక్షా, అధర్వ వేదమునకు మాండూక్య శిక్ష, ఇవియేకాక భారద్వాజ శిక్షా, వశిష్ఠ శిక్ష, పరాశర శిక్ష, కౌండిన్య శిక్ష ఇత్యాది 34 శిక్షా గ్రంథములున్నవి తైత్తిరీయోపనిషత్తునందు "వర్ణః, స్వరః, మాత్రా, బలం, సామ, సంతానః ఇత్యుక్తః శిక్షాధ్యాయః" అని శిక్ష ఆరు అంగములు కలదిగా వర్ణింపబడినది వాటిని పరిశీలింతము.

వర్ణః = అక్షరములు. సంస్కృతమున 53 వర్ణములు.

స్వరః : ఉదాత్త, అనుదాత్త, స్వరితమని ముప్విధము

మాత్రా : స్వరములనుచ్చరించుటకు పట్టు కాలమునకు, చిటుకి వేయు కాలమునకు మాత్రయని పేరు హ్రస్వ, దీర్ఘ ప్లుతములని ముప్విధములు.

బలం . వర్ణముల నుచ్చరించునపుడు చేయు ప్రయత్నము ఆభ్యంతర బాహ్యమని ద్వివిధము. కంఠాదులెనిమిది స్థానములు వర్ణోత్పత్త్యాధారములు.

సామ : సమవిధిగా, స్పష్టముగా, సస్వరముగా ఉచ్చరించుట.

సంతానః : సంహితాపాఠము. పదవిభాగమున సంధి నియమము పాటించుట. సంధి జ్ఞానము కలిగియుండుట

**వ్యాకరణము :** సాధూనేవ ప్రయుంజీత, న అసాధూన్ గవాదయ ఏవ సాధవః న గావ్యాదయః "నమ్లేచ్ఛితవై నాప భాషితవై మ్లేచ్ఛోహ వా యదప శబ్దః" అని వేదము చెప్పినట్లుగా సాధు, అసాధు ప్రయోగ జ్ఞానమునకై వ్యాకరణ మెంతేని అవసరము రక్షోహాగమ లఘ్వసందేహాః ప్రయోజనం" అని మహాభాష్యకర్త వ్యాకరణ ప్రయోజనముల వెల్లడించినారు. వేదమును రక్షించుటకు ఊహ 1 చేయుటకు, సంక్షేపముగా వాక్యరచన చేయుటకు, సందేహ రాహిత్యమునకు వ్యాకరణమవసరము

'ఐంద్రం చాంద్రం కాశకృత్స్నం కౌమారం శాకటాయనం, సారస్వతం చాపిశలం శాకటం పాణినీయకం' అని నవ వ్యాకరణములు ప్రసిద్ధములు. వీటన్నిటయందును వైదిక లౌకికోభయ విధములగు శబ్దములను సాధించుటయందు పాణినీయమే ప్రాధాన్యము వహించుచున్నది.

యేనా క్షర సమామ్నాయం అధిగమ్య మహేశ్వరాత్।
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినయే నమః.

పాణిని క్రీ పూ 5వ శతాబ్దివాడని చారిత్రకుల అభిప్రాయము ఈతడు శాలాతుర నివాసి ఈ శాలాతురమే హలాడుర్, హలాహూర్‌గా వ్యవహరింపబడి నేడు లాహోర్‌గా మారినది ఇది తక్షశిలకు సమీపమున నున్నది ఈతని తండ్రి పేరు శలంకు, తల్లి పేరు దాక్షి. పాణిని వ్యాకరణమునకు సూత్రములను వ్రాసినాడు. వ్యాకరణమనగా శబ్దములను ప్రకృతి ప్రత్యయములుగా విభజించి, యే యర్థమున నేయే రూపము సాధ్యమగునో నిర్ణయించు శాస్త్రము. ఈతని సూత్ర గ్రంథమునకు అష్టాధ్యాయి అని పేరు. పేరువలననే ఇది యెనిమిదధ్యాయములు కల గ్రంథమని తెలియుచున్నది ఒక్కొక్క అధ్యాయమున నాలుగేసి పాదములు కలవు. మాహేశ్వర సూత్రములతో గలసి మొత్తము 3997 సూత్రములు కలవు.

1 ఊహ : ప్రకృతియగు అగ్నేయ 'యాగమున అగ్నయే అని ఉండును వికృతియగు సౌర్య యాగమున సూర్యాయ అని ఊహించుట

అధ్యాయముల విషయమును పరిశీలింతము 1. శాస్త్రమునకంతయు వెలుగుజూపు సంజ్ఞా పరిభాషా సూత్రములును, వాటివలె నుపయోగపడు అతి దేశనియమ సూత్రములు. 2 సమాస కారక సంబంధిత సూత్రములు. 3 ధాతువులు వానికి సంబంధించిన వివిధ ప్రత్యయములు 4-5. మొదట స్త్రీలింగములలో వచ్చు ప్రత్యయములు. తరువాత తద్ధిత ప్రత్యయములు 6. ప్రత్యయముల వలన ప్రకృతిలో జరుగు మార్పులను వివరించు ప్రకృతి కార్యములు. 7 కేవల ప్రత్యయములకును, ప్రకృతి ప్రత్యయములకు సంబంధించిన కార్యములు 8. మొదటి పాదమున, పదములందు జరుగు షత్వణత్వాది కార్యములు చివరి మూడు పాదములలో పూర్వ కార్య ప్రవృత్తిలో నసిద్ధములగు కార్యములు వివరింపబడినవి. కాత్యాయనుడు వార్తికముల రచించగా, పతంజలి పాణిని సూత్రములపై మహాభాష్యము వ్రాసినాడు. ఈ పరంపరయందు వామన జయాదిత్యుల కాశికా, జినేంద్రుని న్యాసము, హరదత్తుని పదమంజరియు, నాగేశభట్టు పరిభాషేందు శేఖరాది గ్రంథములు ప్రసిద్ధములు.

కాశీపండితులు రామచంద్ర పండితులు - క్లేశకరమగు అష్టాధ్యాయి పద్ధతిని వదలిపెటి, రూపసాధనకై అనువగు సూత్రములను గ్రహించి, ఆయా రూపముల నిరూపించు సరళ పద్ధతిన 'ప్రక్రియా కౌముదిని' రచించినాడు ఈతని శిష్యుడు భట్టోజి దీక్షితులు గురువు బోధించిన ప్రకారముననే సిద్ధాంత కౌముదిని రచించినాడు వరదరాజ పండితుడు లఘు సిద్ధాంత కౌముది నంది జేసినాడు ఇంకా ఎన్నో వ్యాకరణ గ్రంథములెన్నో అవతరించి సంస్కృత వాఙ్మయాన్ని నియమబద్ధ భాషగా నిరూపించినవి కావుననే MACDONAL (మ్యాక్డోనల్) సంస్కృత వ్యాకరణ మహత్త్వాన్ని కొనియాడుతూ .. భారతీయ వైయాకరణులు సృష్టించిన పరిపూర్ణము మరియు అతివిశుద్ధమగు వ్యాకరణ పద్ధతి ఏ దేశమందును, ఏ భాషయందును గాంచలేము" అని ముక్తకంఠముగా పలికినాడు

**ఛందస్సు :** వేద మంత్రోచ్చారణమున ఎక్కడ పదము నిలుపవలెను, ఎక్కడ అవిచ్ఛిన్నముగా పలుకవలెనను జ్ఞానమునకై ఛందస్సు అవసరము. 'ఛద ఆచ్ఛాదనే' కప్పుట అను అర్థముగల ధాతువునుండి నిష్పన్నమైనది "ఛందాంసి ఛాదనాత్" అని యాస్కుడు కవి భావనల కప్పునది ఛందస్సని పేర్కొన్నాడు "యద క్షర పరిమాణం తచ్ఛందః" అని కాత్యాయనుడు నియ

క్షర పరిమాణమును నిరూపించునది ఛందస్సని నిర్వచించినాడు. శాంఖాయన శ్రౌతసూత్రము (7.27) ఋగ్వేద ప్రాతిశాఖ్యము (16.13) సామవేద నిదానము పింగళాచార్యుని ఛందశ్శాస్త్రము. కాత్యాయనుని ఛందోऽను క్రమణిక యందును ఈ ఛందోవిచారము కనబడుచున్నది లౌకిక ఛందస్సులకు వృత్త రత్నాకరము ప్రసిద్ధము

**నిరుక్తము** : శబ్దముల నిర్వచించునది నిరుక్తము. B C 800 యాస్క మహర్షి రచించిన నిరుక్త గ్రంథము ప్రామాణికము. నిఘంటువను వైదిక శబ్ద కోశమునకు వ్యాఖ్య ఇది ఇందు యాస్కుడు తన పూర్వులగు ఔపమన్యవ, ఔదుంబరాయణ, గార్గ్యాది పదిహేను నిరుక్తకారుల పేర్కొంటూ వార మతముల ప్రదర్శించి నాడు. వారి గ్రంథములు లభించుటలేవు నిరుక్తమును వ్యాఖ్యానించిన వార లలో దుర్గాచార్య, స్కంధస్వామి మహేశ్వరులు ముఖ్యులు వైదిక దేవతావాచ కములగు అగ్ని - ఇంద్ర - వరుణ - సవితాది శబ్దముల నిర్వచనములనుస రించియే ఈ దేవతా సంబంధములగు మంత్రములు ఆధ్యాత్మికములు, అధి దైవికములుగా సూచింపబడినవి.

నిఘంటు గ్రంథమున ఐదు అధ్యాయములుండగా, నిరుక్తమున పన్నెండు అధ్యాయములలో ఆ విషయయే స్పష్టీకరింపబడినది. మొదటి మూడు అధ్యాయములందు పర్యాయ పద విచారము కలదు ఇందు 21 భూమి వాచక పదములు 30 మేఘ వాచకములు 57 వాణీవాచకములు 100 జలవాచకములు మొదలగు పదములు విచారింపబడినవి ఈ మూడు అధ్యాయములకు నైఘం టుక కాండమని పేరు నాల్గవ అధ్యాయమున కఠినములగు, అస్పష్టములగు శబ్దములు విచారించబడినవి ఈ శబ్దముల వివేచనముల వ్యాఖ్యానము స్పష్టీకర ణము నిరుక్తమున 4, 5, 6 అధ్యాయములలో వివరించబడినది. వీటికి నైగమ కాండమని పేరు. ఐదవ అధ్యాయమునందు దేవతావాచక శబ్దముల వివేచనము- నిరుక్తమున 7 నుండి 12 అధ్యాయములలో ఇది నిరూపించబడినది. దీనికి దైవత కాండమని పేరు నిరుక్త పరిశిష్టము పదమూడవ అధ్యాయము పేర లభించుచున్నది. ఇందు - అక్షర - సోమ - శతవేదాది విచారము కలదు.

నిరుక్త ప్రతిపాద్య విషయములు ప్రధానముగా ఐదని చెప్పవచ్చును. వర్ణాగమము, వర్ణ విపర్యయము - వర్ణవికారము - వర్ణనాశము - ధాతువులను అనేకార్థములందు ప్రయోగించుట.

వర్ణాగమో వర్ణవిపర్యయశ్చ ద్వావపరౌ వర్ణవికారనాశౌ। ధాతో స్తదర్థాతిశయేన యోగః తదుచ్యతే పంచవిధం నిరుక్తం. శబ్ద వ్యుత్పత్తి, శబ్దనిర్వచనము (Etymologmy) భాషా విజ్ఞానము (Philology) అర్థవిజ్ఞానము (Semantics) ఇవి తెలుసుకొనుటకు నిరుక్తమే ప్రాచీన ప్రామాణిక గ్రంథము

**జ్యోతిషము :** వేదములు యజ్ఞములను బోధించినవి ఆ యజ్ఞములనుష్ఠించు శుభముహూర్తముల నిర్ధారించునది జ్యోతిషము. "వేదాహి యజ్ఞార్థ మభి ప్రవృత్తాః కాలానుపూర్వ్యా విహితాశ్చయజ్ఞాః తస్మాదిదం కాలవిధాన శాస్త్రం యో జ్యోతిషం వేద స వేద యజ్ఞం" అని వేదాంగ జ్యోతిష గ్రంథమున వేద జ్యోతిశ్శాస్త్ర సంబంధము నిరూపింపబడినది. ఋగ్వేద సంబంధమైనది ఆర్చ జ్యోతిషము 36 శ్లోకములతో యున్నది యజుర్వేద సంబంధి యాజుష జ్యోతిషము 43 శ్లోకములతో యున్నది. పన్నెండు రాశుల గణనము ద్వారా శుభాశుభ ముహూర్తములు నిర్ధారింపబడును రాశులకంటే అశ్వినీ, భరణ్యాది నక్షత్రములు గణనమునకు ప్రాశస్త్యము ఇవ్వబడినది. జ్యోతిష్కులు అనగా నక్షత్రముల ఆ నక్షత్ర గమనమునమనుసరించి గణనము చేయునది - కావనే దీనికి జ్యోతిషమని పేరు. వైదిక జ్యోతిషమున సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్రముల గమనము - నిరీక్షణ పరీక్షణములు సౌర చాంద్రమాన ప్రకారములు వివేచింపబడినవి. చాంద్రమానము యాజ్ఞిక కలాపములకు ప్రశస్తముగా చెప్పబడినది.

**కల్పము :** 'కల్ప్యతే యాగ ప్రయోగోఽత్ర కల్పః' యాగ ప్రయోగముల కల్పించునది కల్పము. 'వేద విహితానాం కర్మణాం అనుపూర్వ్యేణ కల్పనా శాస్త్రం కల్పః' అని సాయణుల వ్యుత్పత్తి. ఈ కల్ప సూత్రములు, శ్రౌత - గృహ్య - ధర్మ - శుల్బ సూత్రములని చతుర్విధములు.

శ్రౌత సూత్రములు : శ్రుతి బోధించు జ్యోతిష్టోమాది యజ్ఞముల క్రమమును బోధించును ఋగ్వేదమునకు అశ్వలాయన శాంఖాయన సూత్రములు, శుక్ల యజుర్వేదమునకు కాత్యాయన శ్రౌతసూత్రములు కృష్ణ యజుర్వేదమునకు, బోధాయన, అపస్తంబ హిరణ్యకేశి, వైఖానస, భారద్వాజ, మానవ, వరాహ, శ్రౌత సూత్రములు. సామవేదమునకు అర్షేయ, లాట్యాయన, ద్రాహ్యాయణ, జైమినీయ శ్రౌత సూత్రములు. అథర్వవేదమునకు వైతాన సూత్ర

ములు. ఆయా వేద శాఖీయులు యజ్ఞకర్మల నాచరించునపుడు, ఆయా సూత్రముల పాటింపవలయును.

గృహ్య సూత్రములు : గర్భాదాన ప్రభృతి షోడశ సంస్కారములు పితృయజ్ఞము (శ్రాద్ధతర్పణాదులు, ఋషియజ్ఞము (లేదా అధ్యయనము) భూత యజ్ఞము పశుపక్ష్యాదుల కాహారము నొసంగుట, మనుష్యయజ్ఞము (అతిథి సత్కారము) దేవయజ్ఞము (వైశ్వదేవము అను పంచ మహాయజ్ఞములు గృహ నిర్మాణము (వాస్తువు), పశుపాలనము. రోగనాశక విధులు, గృహస్థాశ్రమల నుపకరించు సంస్కారములన్ని వర్ణింపబడినవి ఋగ్వేదమునకు ఆశ్వలాయన, శాంఖాయన, కౌషీతకి గృహ్య సూత్రములు శుక్ల యజుర్వేదమునకు పార స్కర గృహ్య సూత్రములు కృష్ణ యజుర్వేదమునకు బోధాయన, ఆపస్తంబ, హిరణ్యకేశి, భారద్వాజ మానవ - కాఠక గృహ్య సూత్రములు- సామవేద మునకు గోభిల, ద్రాహ్యాయణ, ఖాదిర, జైమినీయ గృహ్యసూత్రములు, అథర్వ వేదమునకు కౌశిక గృహ్య సూత్రములు లభించుచున్నవి

ధర్మ సూత్రములు : చతుర్వర్ణములవారు, చతురాశ్రమములందు అను ష్ఠింపదగిన ధర్మములు నిరూపింపబడినవి ఋగ్వేదమునకు వశిష్ఠ, విష్ణు ధర్మ సూత్రములు, శుక్ల యజుర్వేదమునకు హారీత, శంఖ ధర్మసూత్రములు, కృష్ణ యజుర్వేదమునకు బోధాయన, ఆపస్తంబ, హిరణ్యకేశి ధర్మసూత్రములు సామ వేదమునకు గౌతమ ధర్మసూత్రములు లభించుచున్నవి.

శుల్బ సూత్రములు : యజ్ఞ నిర్మాణమును నిరూపించుచున్నవి. శుక్ల యజుర్వేదమునకు కాత్యాయన శుల్బ సూత్రములు, కృష్ణ యజుర్వేదమునకు బోధాయన, ఆపస్తంబ - మానవ శుల్బ సూత్రములు లభించుచున్నవి.

## దర్శనములు :

ఇయం విసృష్టి ర్యత ఆబభూవ యదివాదధే యదివాన,
యో అస్యాధ్యక్షః పరమేవ్యోమన్ సో అంగవేద యదివాన వేద.1

ఈ ప్రపంచ సృష్టి ఎప్పుడు మొదలు ఆరంభమైనది. ఎక్కడి నుండి సృజింపబడినది ఎవరిచే సృజింపబడినది ఎందుకు సృజింపబడినది. ఈ సంసార

1 ఋగ్వేద సంహిత నాసదీయాసూక్తము.

యాత్రలో జీవులెందుకు బద్ధులగుచున్నారు. ఎంతవరకీ బంధము విడిపడు ఉపాయమేలేదా? అను తాత్త్విక చింతన "సంగచ్ఛధ్వం సంవదధ్వం సంవో మనాంసి జానతాం" అని ఋగ్వేదమున ఆరంభింపబడినదై, ఉపనిషత్తుల కాల మున వికాసమునొంది, దర్శనములుగా అవతరించినది.

దర్శయంతీతి దర్శనాని యధార్థ తత్త్వమును బోధించునవి దర్శనాలు. మానవులకు తత్త్వాన్ని, సత్యాన్ని బోధించి మోక్షమార్గము వైపు పయనించు నటుల చేయుటయే వీని ఉద్దేశ్యము.

"ప్రత్యక్షేణానుమిత్యావా యస్తూపాయో న విద్యతే
ఏనం విదంతి వేదేన తస్మాద్వేదస్య వేదతా"

ప్రత్యక్షాదులచే తెలుసుకోలేనిదానిని కూడా బోధించు వేదమును ప్రమాణ ముగా అంగీకరించినవి వైదిక దర్శనములు ఆస్తిక దర్శనములు, వేద ప్రమా ణము నంగీకరించని జైన, బౌద్ధ, చార్వాకాది దర్శనములు అవైదికములని భేదము. సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, మీమాంస, వేదాంతములను ఆరు ఆస్తికదర్శనములు వీటిలో **సాంఖ్యదర్శనము** అతిప్రాచీనమైనది 'సంఖ్యాయా ఇదం సాంఖ్యం' "సంఖ్యయా నిర్మితం సాంఖ్యం" అని సంఖ్యా శబ్దమునకు తద్ధిత ప్రత్యయము చేర్చగా సాంఖ్యశబ్దము సిద్ధిస్తూంది. సంఖ్య నాధారముగా గొని బోధించునదని అర్థము ఆ సంఖ్య ఏమిటి? అన్న ప్రశ్నకు పంచవింశతి (25) ఇరువది ఐదు తత్త్వముల సఖ్య అని చెప్పవచ్చును.

"పంచ వింశతి తత్వజ్ఞో యత్ర కుత్రాశ్రమే రతః
జటీముండీ శిఖీవాపి ముచ్యతే నాత్ర సంశయః"

జటాధారియగు కాపాలిక మతస్థుడును, ముండనము చేయించుకొన్న సన్యాసియు, శిఖను ధరించు వైదికుడును, ఎవ్వరైనను, ఏ కులస్థుడైనను, ఏ ఏ ఆశ్రమస్థుడైనను, ఈ 25 పదార్థములను తెలుసుకొంటె ముక్తుడౌతాడు. అని, సంఖ్యకు ముక్తి కారణము చెప్పనైనది, కాననే దీనికి సాంఖ్యమని పేరు.

"ఋషిం ప్రసూతం కపిలం యస్త మగ్రే
జ్ఞానైర్బిభర్తి జాయమానంచ పశ్యేత్" అని శ్వేతాశ్వతరోపనిషత్తు (5.7) నందు జ్ఞానులలో అగ్రగణ్యుడిగా స్తుతింపబడిన కపిలమహర్షి దీనికి ప్రవర్తకుడు. ఈ మహర్షి 526 సూత్రముల రచించి, విషయ, ప్రధానకార్య,

వైరాగ్య, అఖ్యాయిక, పరపక్ష నిర్ణయ తంత్రార్థ సంక్షేపములను ఆరు అధ్యాయములందు విషయ విభాగముచేసి నిబద్ధము గావించినాడు.

ఈ సూత్ర గ్రంథమునకు చాలామంది వ్యాఖ్యానముల రచించినారు అందు జ్ఞాన భిక్షువు రచించిన సాంఖ్య ప్రవచన భాష్యము మొదటి వ్యాఖ్యా గ్రంథము "కాలార్క భక్షితం సాంఖ్య శాస్త్రం జ్ఞానసుధాకరం, కలావ శిష్టం చయదపి పూరయిష్యే వచోఽమృతైః"

జ్ఞానామృత సింధువైన ఈ సాంఖ్య శాస్త్రము కాలముచే లుప్తమై ఏదో కొద్ది మిగులగా, తిరిగి నావాక్కులచే పునరుద్ధరిస్తానని విజ్ఞానభిక్షువు తెలిపినాడు. ఈశ్వరకృష్ణుడు సాంఖ్యకారికల ప్రాస్తా... ఏతత్పవిత్ర మగ్ర్యం. ముని రాసురయేఽనుకంపయా ప్రదదౌ, ఆసురిరపి పంచశిఖాయ తేనచ బహుధా కృతంతంత్రం"

ఈ పవిత్రమగు సాంఖ్య శాస్త్రమును కపిలుడు ఆసురికి, అసురి పంచశిఖున కుపదేశించినాడు. అతడే ఈ సాంఖ్యమును విపులముగా బోధించినాడు. అని సాంఖ్య సంప్రదాయమును విన్నవించినాడు. కాని అసురి పంచశిఖుల రచనలు కానరావు ఈశ్వరకృష్ణుని కారికాగ్రంథము డెబ్బది శ్లోకములతో కూడుకొని సువర్ణసప్తతి. హిరణ్యసప్తతి అని చైనాయందును ప్రసిద్ధిగాంచినది. ఈ కారికా గ్రంథ వ్యాఖ్యలలో 1. గౌడపాద భాష్యము. 2. మారరవృత్తి. 3 శంకరుని విజయ మంగళటీక 4. వాచస్పతి కృత తత్త్వ కౌముది. 5. నారాయణ తీర్థుల చంద్రిక ప్రసిద్ధములైనవి.

ప్రత్యక్షము, అనుమానము, శబ్దము అని మూడు ప్రమాణములను అంగీకరిస్తారు ఈ సత్కార్యవాదులు. (1) ప్రకృతి - (సత్త్వ, రజ, స్తమస్సుల సామ్యావస్థ) (2) పురుషుడు 3. మహదాదులు ఏడు (బుద్ధి, అహంకారము, శబ్ద, స్పర్శ, రూప, రస గంధములను పంచతన్మాత్రలు) 10-24 షోడశ గణము (పృధివ్యప్తేజో వాయ్వాకాశములు పంచభూతములు కన్ను, ముక్కు, నాలుక, చర్మము, చెవి ఐదు జ్ఞానేంద్రియములు వాక్పాణిపాద పాయూపస్థలను ఐదు కర్మేంద్రియములు, మనస్సు) అనునవే 24 తత్త్వములు. పురుషుడు పుట్టువాడు, కాదు పుట్టించువాడు కాడు. నిత్యుడు - ప్రకృతి నిత్యమైనది దేనినుండి పుట్టునది

---

విజ్ఞానభిక్షువు - సాంఖ్య ప్రవచన భాష్యావతారికా.

కాదు కాని, మహదాదులను పుట్టిస్తుంది. మహదాదులు ప్రకృతినుండి జన్మించినవై, షోడశ గణాన్ని పుట్టిస్తాయి. ఈ విధముగా ప్రకృతియే సర్వ ప్రపంచ సృష్టికి కారణము తామరాకునందలి నీటిబొట్టు వలె పురుషుడు నిర్లేపుడు, నిమిత్తమాత్రుడు

పురుషుడు కర్తృత్వ, భోక్తృత్వాది గుణరహితుడై నప్పటికిని, ప్రకృతి సంయోగమువలన ప్రకృతి గుణములను, తన గుణములుగా భావించి దుఃఖముల ననుభవిస్తున్నాడు.

అజామేకాం లోహిత శుక్ల కృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాం
అజోహ్యేకో జుషమాణోऽనుశేతే జహాత్యేనాం భుక్తభోగా మజోన్యః

ప్రకృతియే ప్రజల సృష్టిస్తుంది ప్రకృతియే ప్రజల నశింపజేస్తుంది కాన ఈ సంసార బంధము, ఈ సుఖ దుఃఖాదులు ప్రకృతి కార్యములే అని తలంచి వైరాగ్యాన్నాశ్రయించినట్లయితే ముక్తి నొందుతాడని సాంఖ్య దర్శనము బోధిస్తుంది.

**యోగదర్శనము :** సాంఖ్య యోగములు వేరుగా భావించినవారు తెలివి లేనివారని గీతలో తెల్పబడినది సాంఖ్యము తత్వానుభవ రూపమైనది. యోగము ఆచరణరూపమైనది తాత్వికముగా రెండునూ ఒకటే భేదము ఇంకొక విషయము నంగీకరించుటచే కలిగినది యోగ సూత్రమున పతంజలి వ్యక్తి స్సంబంధ దైవమును అనుసరించెను అందుచేత యోగమును సేశ్వర సాంఖ్యమనిరి పతంజలి ఈ స్వీయ దైవ ఆరాధన (ధ్యాన మొక్కటియే మోక్ష సాధనమనక, సాంఖ్యులవలె, ఆత్మానాత్మ వివేచనమే మోక్ష కారణముగా అంగీకరించును. శుద్ధాత్మ స్వభావ ప్రత్యక్షమునకు, యోగ సూత్రమున వివిధ ధ్యాన మార్గములు నిరూపించబడినవి.

మానసిక పంచవిధ వృత్తులను నియమించి అదుపులో నుంచుట యోగము. మనస్సు చంచలము ఆ మనస్సే తానని శుద్ధాత్మ అనుకొనును ఆత్మ నిర్మలత్వము వ్యేచ్ఛ ఈ చంచల మనస్సుచేత నిరోధింపబడినవి. ఈ మనోవృత్తులే తాననుకొనుటకు హేతువు అజ్ఞానము (అవిద్య). ఈ అజ్ఞాన ప్రభావముచే అనిత్యమును నిత్యమని, మాలిన్యమును నిర్మలమని దుఃఖమును సుఖమని, అనాత్మను ఆత్మ అని ఆత్మ పరిగణించును ఈ అజ్ఞాన మూలముననే ఆత్మ, బుద్ధి (మనస్సు) తానే అని భావించును; ఆ హేతువుచేత సక్తత

అనహ్యత కలుగును. పరిణామమున బ్రతుకుమీద ఆశ, చావన్న భయం జనించును. ఆధ్యాత్మిక జీవనమును దుర్భరముగా చేయు కోరికలు జనించును. ఈ కోరికలను నిరోధించ వివిధ నియమములు కలవు.

నిర్మలతలను చేకూర్చు పరికరములివి : అనురాగము, మైత్రి, కరుణ, ముదితము, ఉపేక్ష - వీనితోపాటు అహింస సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అవసరములు మానసిక నిశ్చలత్వ సంపాదనమే సమాధి. ఈ నియమములు సమాధి స్థితిని సిద్ధింపజేయును. సంప్రజ్ఞాత సమాధిలో ఆత్మ బుద్ధి ఒకటి కాదన్న జ్ఞానముండగా, అసంప్రజ్ఞాత సమాధిలో అభేద జ్ఞానమునకు పరమావధి అయిన ముక్తి బంధ రాహిత్యము కలిగి ఆత్మ స్వీయ నిర్మాలిన్య స్థితిలో శుద్ధాత్మగా ఉండిపోవును. ఆత్మ స్వీయ శుద్ధ పదమును తిరిగి సంపాదించుకొనుటయే ముక్తి

ఈ యోగధర్మనమున పతంజలి మహర్షి రచించిన 'యోగసూత్రములు , ఏతద్గ్రంథముపై రచించిన వ్యాఖ్యా గ్రంథములు, 'యోగవాశిష్ట' మను వశిష్ట మహర్షి శ్రీరామచంద్రునకు ప్రబోధించు యోగమార్గోపదేశకమగు గ్రంథమును ప్రసిద్ధములు.

**న్యాయదర్శనము:** ప్రమాణముల చేత యథార్థమును పరీక్షించునది న్యాయదర్శనము. న్యాయము ప్రధానముగా తర్కము జ్ఞానము ఆలోచనము. జీవాత్మను ముక్తి పొందించుటే దీని లక్ష్యము న్యాయ సూత్రము ఈ శాఖకు చెందిన మొదటి క్రమబద్ధమైన గ్రంథము ఈ న్యాయ సూత్రములను రచించినవాడు గౌతముడు. కొందరు విద్వాంసులు అక్షపాదుడు అను పేరును ఈతడే కలిగియుండెనని ఊహింతురు. మరికొందరు న్యాయ సూత్రమున మొదటి భాగము గౌతమునిచే రచింపబడినదనియు, రెండవ భాగము అక్షపాదునిచే రచింపబడినదని అందురు ఈతని కాలము క్రీ.పూ. 300 అని నిర్ధారింపబడినది.

ఈ న్యాయదర్శనమున 5 అధ్యాయములు కలవు ఒక్కొక్క అధ్యాయము రెండేసి అహ్నికములు కలిగి యున్నది ప్రారంభమున "ప్రమాణ ప్రమేయ." అను సూత్రమున ప్రమాణము మొదలగు పదహారు (16) పదార్థముల యొక్క యథార్థ జ్ఞానము వలన మోక్షము సిద్ధించును అని ప్రారంభించి

ప్రమాణముల యొక్క లక్షణ స్వరూపములు విస్తృతముగా వర్ణింపబడినవి. న్యాయసూత్రముల పైన భాష్యమును రచించినవాడు వాత్స్యాయనుడు. ఈతని అసలు పేరు పక్షిలస్వామి యనియు, వాత్స్యాయనుడనునది ఈతని గోత్ర నామము కావచ్చునని విమర్శకుల అభిప్రాయము. కామసూత్రముల రచించిన వాత్స్యాయనుని కంటే ఈతడు భిన్నుడు. క్రీ శ. 300 ఈతని కాలమని నిర్ణయించబడినవి

న్యాయవార్తిక గ్రంథమును రచించినవాడు ఉద్యోతకరుడు. ఈతను పాశుపత సంప్రదాయమునకు చెందినవాడు. భరద్వాజ గోత్రీయుడు కావుననే పాశుపతాచార్య ఉద్యోతకర భరద్వాజుడని ప్రసిద్ధి చెందినాడు. సుబంధు (క్రీ. శ. 650) తన వాసవదత్త గ్రంథమున ఉద్యోతకరుని స్మరించుటచే ఈతడు క్రీ. శ. 600 వాడని నిర్ధారించ వచ్చును దిజ్ఞాగుడు మొదలగు బౌద్ధుల యొక్క మతములను నిరాకరిస్తూ న్యాయ భాష్యము పైన ఈ వార్తిక గ్రంథమును రచించినాడు.

ఈ న్యాయవార్తిక గ్రంథమునకు తాత్పర్య టీక యను వ్యాఖ్యానమును వ్రాసినవాడు వాచస్పతిమిశ్రుడు. సర్వ తంత్ర స్వతంత్రుడన్న బిరుదును వహించి, భారతీయ దర్శనములన్నింటిపై ఈతను గ్రంథములను రచించినాడు 9 వ శతాబ్దము ఈతని కాలము త్రిలోచనుడు ఈతని గురువు. ధర్మకీర్తి, ధర్మోత్తరుడు మొదలగు బౌద్ధుల మతముల ఖండిస్తూ న్యాయవార్తిక గ్రంథంపై ఈ తాత్పర్య టీకను రచించినాడు

వాచస్పతి మిశ్రుని సమకాలీనుడైన జయంత భట్టు షోడశ పదార్థముల యొక్క క్రమమును బోధిస్తూ, న్యాయమంజరి అను గ్రంథమును రచించినాడు. ఈతని భాష సరళమై సుబోధమై కొత్త న్యాయ శైలిని అనుసరించినది.

12 వ శతాబ్దమున గంగేశ ఉపాధ్యాయుడు ఉదయించి నవ్య న్యాయమును ప్రబోధించినాడు ఈతని తత్త్వ చింతామణి గ్రంథము నవ్య న్యాయమునకు ఆధారమైనది మిథిలా దేశమున వర్ధమానోపాధ్యాయుడు, పక్షధర మిశ్రుడు, వాసుదేవమిశ్రుడు మొదలగు విద్వాంసులు ఈ నవ్య న్యాయమును వృద్ధి పొందించినారు. నవద్వీపమున రఘునాథ శిరోమణి (15 వ శతాబ్ది) మధురానాథ తర్క వాగీశుడు (16 వ శతాబ్ది) జగదీశ తర్కాలంకారికుడు (17 వ

శతాబ్ది) గదాధర భట్టాచార్య (17 వ శతాబ్ది) మొదలగు వారలు ఈ నవ్య న్యాయమును ప్రబోధిస్తూ గ్రంథముల రచించినారు.

పదవ శతాబ్దమున న్యాయ వైశేషికములు ఒకే దర్శనముగా, శాస్త్రముగా మార్పుచెందినవి. కావుననే నైయాయిక ప్రకరణ గ్రంథకారులు వైశేషిక సమ్మతములగు ద్రవ్య- గుణ - కర్మ - సామాన్య - విశేష - సమవాయ - అభావములను ఏడు పదార్థములను వైశేషికసమ్మతములగు షోడశ పదార్థములలో, అనగా 'అర్థము' అను ప్రమేయ జాతమున అంతర్భవింపజేసినారు. ఈ ప్రకరణ గ్రంథములలో భాసర్వజ్ఞుని (క్రీ శ 10వ శతాబ్ది) న్యాయసారము, వరదరాజుని (12వ శతాబ్ది) తార్కికరక్షా గ్రంథము, గంగేశోపాధ్యాయుని తత్త్వచింతామణి, కేశవమిశ్రుని (13వ శతాబ్ది) తర్క భాషాగ్రంథములు ప్రధానమైనవి. వైశేషిక దర్శనమున శివాదిత్యుని (10వ శతాబ్ది) సప్తపదార్థి, ఉదయనుని (11వ శతాబ్ది) లక్షణావళీ వల్లభాచార్యుని (12వ శతాబ్ది) న్యాయ లీలావతీ, అన్నంభట్టుని (17వ శతాబ్ది) తర్క సంగ్రహము, విశ్వనాథ న్యాయ పంచాననుని (17వ శతాబ్ది) కారికావళీ, ముక్తావళులు, జగదీశ తర్కాలంకారుని (17వ శతాబ్ది) తర్కామృతము, లౌగాక్షి భాస్కరుని(17వ శతాబ్ది) తర్క కౌముదియు ప్రసిద్ధములు.

**వైశేషిక దర్శనము :** విశేషమను పదార్థమును అధికముగా అంగీకరించినందున వైశేషిక దర్శనమని దీనిపేరు. ఈ దర్శనమునకు ప్రవర్తకుడు కణాదుడు. కాశ్యపుడు, ఉలూకుడనియు ప్రసిద్ధి. ఈ కణాద మహర్షి 370 సూత్రములు రచించి, పది అధ్యాయములలో పదిలపరచినాడు. ఒక్కొక్క అధ్యాయమున రెండేసి ఆహ్నికములు కలవు అధ్యాయ విషయముల పరిశీలింతము. 1. పదార్థములు, 2 ద్రవ్యము, 3 ఆత్మాంతఃకరణములు, 4. శరీరభేదము, 5. కర్మ, 6. శ్రౌత ధర్మములు, 7. గుణములు, సమవాయము, 8. జ్ఞానము, తదుత్పత్తి, తన్నిదానము, 9 ప్రాగభావాదులు, 10. ఆత్మ గుణములు.

ఈ సూత్రములపై భారద్వాజవృత్తి గ్రంథము, ప్రశస్తపాద భాష్యము, శంకరమిశ్రుని ఉపస్కారము, జయనారాయణ భట్టాచార్యుని కణాద సూత్ర వృత్తి గ్రంథము, చంద్రకాంత భట్టాచార్యుని వైశేషిక భాష్యమును సూత్ర వ్యాఖ్యాన రూపములైనవి. పదార్థ వ్యాఖ్యారూపములైన గ్రంథములలో వ్యోమ

శివాదార్యుని వ్యోమవతి. శ్రీధరుని న్యాయకందలి, ఉదయనుని కిరణావలి, శ్రీవత్సుని లీలావతి. జగదీశుని భాష్యసూక్తి. శంకరుని కణాద రహస్యము ప్రధానములైనవి.

ఆయా పదార్థముల కుణ్ణముగా పరిశీలించినందువలన జ్ఞానము ముక్తిని కలిగిస్తుంది. "ధర్మవిశేష ప్రసూతాత్ ద్రవ్యగుణ కర్మ సామాన్య విశేష సమవాయానాం పదార్థానాం సాధర్మ్య వైధర్మ్యాభ్యాం తత్వజ్ఞానాన్నిశ్రేయ సాధిగమః" జీవాత్మ జ్ఞానస్వరూపి యైనవాడు ఈశ్వరుడని చెప్పబడు పరమాత్మ జీవాత్మకంటె భిన్నుడు ఈతడు సర్వజ్ఞుడు. సర్వవ్యాపి, నిత్యశుద్ధ ముక్తస్వభావుడు జీవాత్మ సుఖ దుఃఖముల ననుభవిస్తూ జనన మరణ జాలముల పడుచున్నాడు అనాది వాసనా సంస్కారములచే దేహమే తానని భావిస్తూ విషయములందు రమించుచున్నాడు. అట్టి ప్రవర్తించి పుణ్య పాపముల నాచరిస్తూ సుఖ దుఃఖముల ననుభవించుచున్నాడు తత్వ జ్ఞానముచే, మిథ్యాజ్ఞానము నశింపగా, కోరికలు లేనందున కర్మల నాచరించనందున కర్మ జన్యములైన పుణ్యపాపములు లేనందున సుఖ దుఃఖ సంబంధము లేదు. ఇదియే మోక్షమని చెప్పబడుతుందని వైశేషిక దర్శనసారము.

**మీమాంసాదర్శనము :** మీమాంస అనగా విచారమని అర్థము. వేదము యొక్క పూర్వభాగమైన సంహితారణ్యకములు బోధించు కర్మకాండను వివేచించు దర్శనము పూర్వమీమాంస ఈ దర్శనమునకు ప్రవర్తకుడు జైమిని మహర్షి. ఆతడు 2700 సూత్రములు వ్రాసి 12 అధ్యాయములలో నిబద్ధముగావించినాడు. అధ్యాయముల విషయములను విచారింతము : 1 ధర్మము, 2 కర్మభేదము, అంగత్వము, 4 ప్రయోజ్య ప్రయోజకత్వము, 5. క్రమము, 6. అధికారము, 7. సామాన్యాతిదేశము, 8 విశేషాతిదేశము, 9. ఊహ, 10. బాధ, అభ్యుచ్చయము, 11. తంత్రము, 12. ఆవాపము. ఈ సూత్రములపై వ్రాసిన ఉపవర్ష - భవదాస - బోధాయన వృత్తిగ్రంథములు లభించుట లేవు శబరస్వామి వ్రాసిన భాష్యము సమగ్రముగా లభించుచున్నది. ఈ భాష్యముపై కుమారిలభట్టు వ్యాఖ్య వ్రాసినాడు.

ప్రథమాధ్యాయ ప్రథమపాద వ్యాఖ్యకు శ్లోకవార్తికమని పేరు, ద్వితీయ పాదము నుండి తృతీయాధ్యాయ సమాప్తి వరకు గల వ్యాఖ్యకు. తంత్రవార్తికమని పేరు. మిగతా వ్యాఖ్యకు టుప్ టీక యని పేరు. ఈ కుమారిలభట్టు మన

తెలుసువారు. శాబరభాష్యమునకే ప్రభాకరుడు బృహతీ లఘ్వీ అను రెండు వ్యాఖ్యల వ్రాసినారు. ఈ వ్యాఖ్యాకారులలో భిన్నమైన అభిప్రాయము లేర్పడినవి కాననే మీమాంస కుమారిల ప్రవర్తితము భాట్టమతమనియు, ప్రభాకర ప్రవర్తితము గురుమతమనియు ప్రసిద్ధిబడసినది శాలికానాధుని, ఋజువిమలా, ప్రకరణపంచిక, భవనాథుని నయ వివేకము గురుమతమున ప్రసిద్ధి బడయగ, మండనమిశ్రుని విధి, భావనా, విభ్రమ వివేకములు పార్థసారథి శాస్త్రదీపిక, న్యాయ రత్నమాలా, న్యాయ రత్నాకరములు, మాధవాచార్యుని జైమినీ న్యాయ మాలా ఖండదేవుని భాట్టరహస్యము భాట్టకౌస్తుభము భాట్టమున ప్రసిద్ధిగాంచినవి.

మీమాంసకులు ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద అర్థాపత్తి, అనుప లబ్ధులనారింటిని ప్రమాణముగా అంగీకరించినారు ప్రాభాకరులు అనుపలబ్ధి నంగీక రించక, అధికరణ స్వరూపముగా నిరూపించినారు మీమాంసకులు స్వతః ప్రామాణ్యవాదులు పరతః అప్రమాణమనియు వీరి అభిప్రాయము. వేదము అపౌరుషేయము - వేదబోధిత కర్మలు కామ్యనైమిత్తిక నిత్యములని త్రివిధ ములు. కర్మాచరణచే ఆత్మయందు అపూర్వము జనించి ఫలాన్ని ప్రసా దిస్తూంది. భగవంతుడు ఫలదాతకాడు. సృష్టి స్థితి లయకారుడిగా ఈశ్వరునవ సరములేదు.' నకదాచిదనీదృశంజగత్' జగత్తుకు సృష్టి ప్రళయములు లేవు. నిత్యము. దేవతకు విగ్రహము లేదు. శబ్దమే దేవత. నిత్య నైమిత్తికము లనుష్ఠించి, కామ్య కర్మల త్యజించి ధర్మాధర్మ సంబంధరహితుడైన వాడు ముక్తి నొందుతాడు.

**వేదాంతము :** వేదము యొక్క అంత భాగమున సిద్ధాంత రూపమున నున్న ఉపనిషత్తులే వేదాంతము. నేడు రెండువందల పైన ఉపనిషత్తులు లభించుచున్నవి. ముండకోపనిషత్తు 108 ని బోధించినది వీటిలో "ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః, ఐతరేయంచ ఛాందోగ్యం బృహదా రణ్యకం తథా." అని శంకరాచార్యులచే వ్యాఖ్యానింపబడిన ఈశాది దశోప నిషత్తులే వేదాంతానికి మూలములు. ఈ ఉపనిషత్తులలోని పరస్పర భిన్న సిద్ధాంతముల విరోధముల పరిహరించ వ్యాసమహర్షి 550 సూత్రముల రచించి, సమన్వయ, అవిరోధ, సాధన, ఫలాధ్యాయములుగా నిరూపించినాడు భగవద్గీత కూడా ఉపనిషత్తత్వమునే విశదీకరించినది ఈ మూడు కలిసి ప్రస్థానత్రయ మని ప్రసిద్ధి గాంచినవి.

ఈ బ్రహ్మసూత్రములపై భగవద్గీతపై, ఉపనిషత్తులపై ఎందరో ప్రవర్తకులు తమ సంప్రదాయానుసారముగా భాష్యములు వ్రాసినారు.

| | ఆచార్యులు | సమయము | భాష్యము | మతము |
|---|---|---|---|---|
| 1 | శంకరాచార్య | 700 | శారీరకము | అద్వైతము |
| 2. | భాస్కరాచార్య | 1100 | భాస్కరము | భేదాభేదము |
| 3 | రామానుజాచార్య | 1140 | శ్రీభాష్యము | విశిష్టాద్వైతము |
| 4. | మధ్వాచార్య | 1233 | పూర్ణప్రజ్ఞము | ద్వైతము |
| 5. | నింబార్కాచార్య | 1250 | వేదాంత పారిజాతము | ద్వైతాద్వైతము |
| 6 | శ్రీకంఠుడు | 1270 | శైవము | శైవ విశిష్టాద్వైతము |
| 7. | శ్రీపతి పండితులు | 1400 | శ్రీకరము | వీరశైవ ద్వైతము |
| 8 | వల్లభాచార్య | 1200 | అణుభాష్యము | శుద్ధాద్వైతము |
| 9. | విజ్ఞానభిక్షువు | 1[illegible]00 | విజ్ఞానామృతము | అవిభాగా ద్వైతము |
| 10. | బలదేవుడు | 1725 | గోవింద భాష్యము | అచింత్య భేదాభేదము |

**పురాణములు :** "జగతః ప్రాగవస్థామనుక్రమ్య సర్గ ప్రతిపాదకం వాక్య జాతం పురాణం" ప్రపంచము యొక్క ఉత్పత్తిని, వికాసమును బోధించునవి పురాణములు. పురాతన రచనలయ్యు నవ్యములుగా భాసిల్లునందున "పురాపి నవం" అను వ్యుత్పత్తి ననుసరించి పురాణ నామము. సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ, వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణం. సర్గము = సృష్ట్యుత్పత్తి వర్ణనము. ప్రతిసర్గము = ప్రళయము, సృష్టి యొక్క పునః ప్రాదుర్భావము వంశః = దేవతల, ఋషుల, రాజుల వంశావళి వర్ణనము. మన్వంతరాణి = ప్రత్యేక మనువుల కాలము, ఆ కాలమందలి ప్రముఖ ఘటనలు,

వంశానుచరితము = సూర్యవంశ, చంద్రవంశాది రాజుల జీవితచరితము అని ఐదు విధముల పురాణ లక్షణముల వివరించినారు.

ఈ పేర్కొన్న లక్షణముల కంటే అధికముగా ప్రార్థనలు, వ్రతములు, ఉపాఖ్యానములు, తీర్థములు, యాత్రాస్థలములు, జ్యోతిషము, శరీర విజ్ఞానము, ఆయుర్వేదము, వ్యాకరణాది శాస్త్రములు కానవచ్చును ఈ పురాణములు బి సి. 600 నుండి ఎ. డి. 50౨ వరకు రచింపబడినవని చరిత్రకారుల అభి ప్రాయము. సనాతన ధర్మమునకు పురాణములే ప్రాణభూతములు. ధర్మ విషయమున వీటికి వేద తుల్యత్వము బ్రహ్మ, విష్ణు, శివ, గణేష. సూర్యాది దేవతల ఉపసనా పద్ధతులు అర్చనా విధానములు వీటి వల్లనే తెలునుకొన వచ్చును. పరీక్షిత్తు మొదలుకొని నందాదుల వరకు గల రాజుల చరితను తెలుసుకొనుటకు పురాణములే శరణ్యములు. మౌర్య వంశావళికై విష్ణు పురాణము 'ఆంధ్ర శాతవాహనవంశావళికై మత్స్యపురాణము' గుప్తవంశావళికై వాయు పురాణము అత్యంత ప్రామాణికములుగా స్వీకరించబడినవి.

పురాణము లెన్ని ? అను విషయమున అష్టాదశ పురాణములను తెలుపు ప్రసిద్ధ శ్లోకమిది "మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయం అనాపలింగ కూస్కాని పురాణాని ప్రచక్షతే." మద్వయం = మత్స్య, మార్కండేయ, భద్వయం = భవిష్య, భాగవత, బ్రత్రయం = బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, వచతుష్టయం = వరాహ, వామన, వాయు. విష్ణు, అ = అగ్ని, నా = నారద, ప = పద్మ, లిం = లింగ. గ = గరుడ, కూ = కూర్మ, స్కా = స్కాంధ, ఈ పదునెనిమిది ప్రధానమైన పురాణములు.

ఇవే కాక సనత్కుమార, నారసింహ, స్కాంద, శివధర్మ, ఆశ్చర్య, నారదీయ, కాపిల, ఔశనస, బ్రహ్మాండ, వారుణ, కాళికా, మహేశ్వర, సాంబ, సౌర, పారాశర, మారీచ, భార్గవ, దేవీభాగవతములుఉపపురాణములు కలవు, మహాపురాణముల విషయమును కొద్దిగా స్పర్శింతము

విష్ణుపురాణము : పరాశరుడు దీని కర్త. దార్శనిక, సాహిత్యక, ఐతి హాసిక దృష్ట్యా దీని మహాత్వ మధికము. వైష్ణవుల కత్యంత ప్రియమైనది విష్ణువే అవతారము లన్నింటికి మూలపురుషుడిగా, ఉపాసనా విధానము వర్ణింప బడినది. ఈ ఒక్క పురాణముననే పురాణ లక్షణములు చక్కగా కని

పించును మౌర్యరాజుల వంశావళి ఇందివ్వబడినది. భారతదేశ రాజకీయ చరిత్రకిది ప్రామాణికమైన ఆధార గ్రంథము

భాగవతము : 'విద్యావతాం భాగవతే పరీక్షా' అని ప్రశస్తిగాంచినది. 12 స్కంధములు 1800 శ్లోకములు కలది దశమస్కంధము కృష్ణమూలము. నిగమకల్ప తరోర్గలితం ఫలం శుక ముఖామృత ద్రవ సంయుతం పిబత భాగవతం రసమాలయం ముహురహో రసికా భువి భావుకాః॥ వైష్ణవులకిది ప్రమాణగ్రంథము రామాయణ భారతములతో సమానమైన గౌరవమును పొందుచున్నది.

అగ్నిపురాణము దీనిని కోశ గ్రంథముగా పేర్కొనవచ్చును. దీనిలో పేర్కొనని విషయము లేదు అలంకారశాస్త్రము. ఆయుర్వేదము, వృక్షాయుర్వేదము, నాట్యశాస్త్రము, వైదిక కర్మకాండలు, రాజనీతి, స్థాపత్యము మొదలగు అన్ని విషయములు ఇందు వర్ణింపబడినవి.

మత్స్యపురాణము : రాజ చరిత్రలను ప్రామాణికంగా ప్రబోధించు పురాణమిది ఆంధ్ర రాజులైన శాతవాహనుల చరిత్రమునకు ఆధార గ్రంథమిది. ఇందు దక్షిణ భారతమందలి వాస్తుకల, స్థాపత్యకళ, శిల్పకళ మొదలగునవి సుందరముగా వర్ణించబడినవి' మరియు పర్వదినములు తీర్థములు. శైవ వైష్ణవ విధులును తెలుపబడినవి

మార్కండేయ పురాణము ఇందు ఇంద్రుడు - బ్రహ్మ - సూర్యుడు ముఖ్య దేవతలుగా చిత్రింపబడినారు. దుర్గామాత స్తుతిపరమగు దేవీ మాహాత్మ్యము వర్ణింపబడినది

భవిష్య పురాణము ముందు రాబోవునది, జ్యోతిష విజ్ఞానము వివరింపబడినది - చాతుర్వర్ణ్య విధులు - అగ్ని - సూర్య - నాగారాధనలు ఇందు విశేషముగా చెప్పబడినవి దీని పరిశిష్ట భాగమే భవిష్యోత్తర పురాణము.

బ్రహ్మాండ పురాణము : ఇందు తీర్థ మాహాత్మ్యములు, ఉపాఖ్యానములు కలవు. ఏడు కాండములతో గల అధ్యాత్మ రామాయణ మిందులోనిదే.

బ్రహ్మ వైవర్త పురాణము : ఇందు జగత్సృష్టికి బ్రహ్మయే వివర్తముగా నిరూపించబడినాడు, కాన దీనికీ నామము - ఇందు బ్రహ్మ - ప్రకృతి - గణేష - కృష్ణ జన్మములను నాల్గు ఖండములు కలవు.

బ్రహ్మ పురాణము : దీనికి ఆదిపురాణమని పేరు. ఇందు సూర్యుడు శివుడిగా వర్ణింపబడినాడు దీని పరిశిష్టమే సౌర పురాణమని చెప్పబడుచున్నది.

వామన పురాణము . విష్ణువుయొక్క వామనావతారము ప్రధానముగా వర్ణింపబడినది.

వరాహ పురాణము . వరాహావతార చరితము-హిరణ్యాక్షవధను ప్రధానముగా వర్ణిస్తూ - నచికేతూపాఖ్యానము, మధురామాహాత్మ్యము కూడా వర్ణింపబడినవి.

వాయు పురాణము : శివపురాణమనియు దీనినందురు.

నారద పురాణము : బృహన్నారదీయమని దీనినందురు.

పద్మ పురాణము ఇందు సృష్టి, భూమి, స్వర్గ, పాతాల, ఉత్తరము లను ఐదు ఖండములు కలవు ఇదొక్క పురాణమే రాధను కృష్ణ ప్రేయసిగా స్పష్టముగా ఉల్లేఖించినది. భాగవతాది గ్రంథముల మాహాత్మ్యములు రమ్యముగా వివరింపబడినవి.

లింగ పురాణము · 11000 శ్లోకములు కలవు. శివుని ఇరువది ఎనిమిది అవతారములు రమ్యముగా నిరూపించబడినవి ఇందలి శివలింగ పూజా మాహాత్మ్యము శ్రేష్టము

గరుడ పురాణము · 1 000 శ్లోకములతో కూడుకొన్నది గణితము, ఫలిత జ్యోతిష్యము, వ్యాకరణము - ఆయుర్వేదము. శ్రాద్ధ తర్పణ విధులు, ప్రేతత్వముక్తి - నరకబాధలు వర్ణింపబడినవి. ప్రేత దీనిని విన్నటులైతే ముక్తినొందునని సర్వవిదితము.

కూర్మ పురాణము : శివుని ఈశ్వరతత్త్వము - ఈశ్వరగీత, వ్యాసగీత, జ్ఞానప్రాప్తికై కర్తవ్యములు - సమాధి సాధనములు వివేచింపబడినవి.

స్కాంధ పురాణము . ఇందు సనత్కుమారీయ - బ్రాహ్మీ - వైష్ణవీ - శాంకరీ (అగస్త్య) - సౌరీ అను ఐదు సంహితలు కలవు కాశీఖండమను పేర ఏబది అధ్యాయములు వేరుగా కలవు. ఇందు వారణాస్యాది క్షేత్రములు వర్ణింపబడినవి. శివభక్తి ప్రధానమైనది సత్యనారాయణ వ్రతాది నోములు వివరింపబడినవి జగన్నాధ క్షేత్రమాహాత్మ్యాదులెన్నో రమ్యముగా చిత్రింపబడినవి. 'ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్".

## శ్రీమద్రామాయణము :

వేద వేద్యే వరే పుంసి జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా ॥

వేదముల చేత ప్రతిపాదించబడు పురుషోత్తముడు దశరథునికి కుమారుడైన శ్రీరాముడిగా జన్మించగా, వేదమే వాల్మీకి ముఖమునుండి శ్రీరామాయణ కావ్యముగా అవతరించినది కావుననే శ్రీమద్రామాయణమునకు వేదములతో సమానమయిన గౌరవము కలదు మహర్షి వాల్మీకి ఆదికవి. అతని కావ్యమే ఆది కావ్యము. మహర్షి వాల్మీకి విషయమున అనేక విధములగు వాదములు కలవు పుట్టుకచేత బోయవాడై, అడవిదొంగయై, అరణ్యములలో సంచరిస్తూ సప్తఋషుల యొక్క సదుపదేశముచే రామనామాన్ని పలుకరాక, 'మరామరా'యని జపము చేస్తూ తన శరీరముపై పెద్ద పుట్టలు (వల్మీకములు) పెరిగినను, కఠినముగా తపస్సు చేయుచుండెను తపస్సుకు సంతోషించిన బ్రహ్మదేవుడు శ్రీరామ చరిత్రను వ్రాయుమని అనుగ్రహించగా ఈ రామాయణాన్ని రచించినాడు. ఈ రామాయణమున 7 కాండలు కలవు 24000 వేల శ్లోకాలతో, ప్రతి వేయి శ్లోకాదిన గాయత్రి మంత్రాక్షరం కూర్చబడినది.

1) బాలకాండము : శ్రీరాముని జననము 7వ యేట విశ్వామిత్రుని యాగ సంరక్షణము. మిథిలా నగరమున శివధనస్సును విరచి, సీతను పెండ్లియాడుట

2) అయోధ్యాకాండము . దశరథ మహారాజు శ్రీరామునకు యౌవ్వరాజ్య పట్టాభిషేకమును చేయదమునకు సంకల్పించగా, కైకేయి రెండువరముల కోరి శ్రీరాముని అరణ్యమునకు పంపుట

3) అరణ్యకాండము : సీతారామ లక్ష్మణులు అరణ్యవాసము చేయుచుండగా లంకాధిపతియైన రావణాసురుడు సీతను ఎత్తుకొని పోవును. సీతను వెతుకుతూ రామలక్ష్మణులు అరణ్యములలోని ఋషులను దర్శించి చివరకు పంపానదీ తీరమున శబరి మాతను దర్శింతురు.

4) కిష్కింధాకాండము : రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతము చేరుకొని అగ్నిసాక్షిగా సుగ్రీవునితో స్నేహము చేయుదురు శ్రీరాముడు వాలిని చంపి సుగ్రీవుని కిష్కింధా నగరమునకు అభిషిక్తుని చేయును. సుగ్రీవుడు సీతను వెదకుటకై నలుదిశల తన కపి సైన్యమును పంపును.

5) సుందరకాండము : సీతాన్వేషణకై దక్షిణదిక్కుగా ఉయలు దేరిన అంజనేయుడు, శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటి లంకానగరమును ప్రవేశించి, అశోక వనమున సీతను కలసి, శ్రీరామ సందేశమును విని పించి, లంకానగరమును కాల్చి తిరిగి వచ్చును.

6) యుద్ధకాండము : రామరావణ యుద్ధము శ్రీరామ విజయము రాముడు సీతాదేవితో అయోధ్యకు వెళ్ళుట శ్రీరామ పట్టాభిషేకముతో ఈ కాండము ముగియును.

7) ఉత్తరకాండము : సీతాపరిత్యాగము, వాల్మీకి ఆశ్రమమున లవ కుశ జననము చివరకు సీత భూమాత యొడిలో కలిసిపోగా కుశునకు రాజ్య భారము అప్పగించి శ్రీరాముడు అవతారము చాలించును.

ఋగ్వేదం పదవ మండలం 93వ సూక్తంలో రాముడి పేరుకనిపిస్తుంది. మొదట్లో కొన్ని శతాబ్దాలవరకు బహుశా రామాయణం పాటగా వ్యాపించి ఉండ వచ్చును. ఆ దశలో గాయకులు వాళ్ళ అభిప్రాయాలకి అనుకూలంగాను శ్రోతల అభిరుచులనుబట్టి మార్పులు చేర్పులు చేసి వుండవచ్చును. ఆ గ్రంథం లిపి బద్ధం ఆయిన తర్వాత కూడా అనేక శతాబ్దాలు అదేవిధంగా మార్పులు అనుభ వించి యుండవచ్చును. వాల్మీకి రాముడికి సమకాలికుడా? కావ్యారంభంలో వాల్మీకి ప్రస్తుతం లోకంలో మహావ్యక్తి ఎవరు? ఇత్యాది అడుగుతాడు. వాల్మీకి రాముడికి సమకాలికుడైతే ఆ ప్రశ్నలు అడిగేవాడుకాడు. రాముడు వేదకాలం నాటి రాజు. వాల్మీకి సంస్కృత భాషాకవి. కావున వీరిరువురికి చాలా కాలాంత రము ఉండి ఉండాలి. లౌకిక సంస్కృత భాష వేదకాలంకంటే చాలా తరు వాతది. తనకన్నా ముందు వేదమంత్రాలు ఉండగా తన నోటినుండి అకస్మాత్తుగా శ్లోకం బహిర్గతం అయినందుకు వాల్మీకి ఆశ్చర్యపడ్డాడు. బహుశా కవి ఉద్దేశం సమకాలిక వ్యావహారిక భాషలో తాను మొదటి శ్లోకం అనాలోచితంగా చెప్పానని అయి ఉండవచ్చును. 1) లోకంలో ఎన్నో రామాయణ కథలు ఉన్నాయి. వాట న్నిటిలో, రెండు ప్రాచీనములు, ఒకటి వాల్మీకి రచితమైన రామాయణ కావ్యం రెండవది మహాభారతారణ్య పర్వస్థమైన రామోపాఖ్యానము. అందుచేత ఈ రెండు కథలు మాత్రమే రామ కథలుగా ఈ చర్చలో సంగ్రహించబడినాయి. అన్యములు అనంతరిక కల్పనా సంవలితములు, ఉపేక్షింపబడినాయి. ఈ రెండు కథలలో పరస్పరత చిన్న చిన్న తేడాలు కొన్ని ఉన్నాయి. ఉదా: కుంభకర్ణుని

రాముడు చంపినట్లు రామాయణంలో ఉంటే (6, 55, 124) లక్ష్మణుడు చంపినట్లు రామోపాఖ్యానంలో ఉంది (3, 271, 17). 2) శూర్పణఖకి ముక్కు, చెవులు కోసినట్లు రామాయణంలో ఉండగా (317, 20-21) ముక్కు పెదవి కోసినట్లు రామోపాఖ్యానంలో ఉంది (271.44). 3) రామాయణం ప్రకారం రావణ, కుంభకర్ణ, విభీషణుల తల్లి కైకసి (7. 9, 23.27) మహాభారతం ప్రకారం రావణ, కుంభకర్ణుల తల్లి పుష్పోత్కట, విభీషణుని తల్లి మాలిని (3, 259, 78), 4) రామాయణంలో లక్ష్మణ వాక్యం తర్వాత సుగ్రీవుడు సీతాన్వేషణకై సేనలని పంపుతాడు. రామోపాఖ్యానంలో ముందే పంపుతాడు. రామాయణంలో కైక దశరథుని నుండి రెండు వరాలు (అయో 9, 13, 10, 26) పుచ్చుకొంటుంది మహాభారతం (వన 261, 21, 25) ప్రకారం ఒక వరం వల్లనే రెండు ప్రయోజనాలను సాధిస్తుంది కథా కథనాన్ని బట్టి చూస్తే రామోపాఖ్యానం ప్రాచీనం, రామాయణం అర్వాచీనంగా తోస్తుంది. రామాయణంలో నున్న సీతాగ్ని ప్రవేశం రామోపాఖ్యానంలో లేదు. కాని అక్కడ అటువంటిదే ఇంకో సన్నివేశం చెప్పబడింది దీనినిబట్టి అగ్నిప్రవేశ సన్నివేశం అవాల్మీకము అనంతరం చేర్చబడింది కావచ్చును. కొందరు గాయకులు అగ్ని ప్రవేశ సన్నివేశాన్ని కొందరు రామోపాఖ్యాన సన్నివేశాన్ని కల్పించి గానము చేసి వుండవచ్చును,

ఉత్తరకాండ యావత్తు అనంతరం చేరిన అవాల్మీకమైన అనుబంధము కావచ్చును రామోపాఖ్యానములో బాలకాండకు ఉత్తరకాండకు సంబంధించిన కథాభాగములు లేవు, ఇంతేకాక ఉత్తరకాండలో చాలాభాగాలు ముందటి కాండల లోని భావాలకు విరుద్ధంగా ఉన్నవి.

(1) అహల్య కథలో ఇంద్రశాపం బాలకాండలో (47, 26) ఒకలా ఉంటే ఉత్తరకాండలో ఇంకోలా ఉంది (30, 29). (2) ఉత్తరకాండలో రాముడు తపస్సు చేసుకుంటున్న శంబూకుడన్న శూద్రుడిని చంపుతాడు (65, 23) శూద్రులు ఆ కాలంలో తపస్సు చేయకూడదని హేతువు చెప్పబడింది. కాని రామాయణ కాలంలో శూద్రులకు తపోనిషేధం ఉన్నట్లు కనిపించదు.

దశరథుడు ఏనుగనుకొని చంపిన ముని బాలుడు శూద్రుడే 1 (3) ఉత్తర కాండలో రావణుడు రంభను బలాత్కరిస్తాడు. కాని సుందరకాండలో ఇతని ప్రవర్తన ఇంతకన్నా కొంత సౌజన్యవంతంగా కనిపిస్తుంది 2 (4) ఉత్తర కాండలో జన్మవాదం వలన రాముడు సీతను పరిత్యజించడం మన బుద్ధిని మనస్సును దేనిని సమాధానపరచదు ఏటన్నిటిని బట్టి పరిశీలించగా వాల్మీకీయ రామాయణంలో అక్కడక్కడ కొన్ని మార్పులు చేర్పులు జరగడం మాత్రం కాదు. అనుబంధాలు సమాయోజనాలతో అది పునా రచింపబడినదని తోస్తోంది.

బాలకాండలో మొదటి కొన్ని సర్గలు వాల్మీకి రచించినవి కావని తేట తెల్లంగా తెలుస్తుంది కవి తనను గురించి తాను వాడుకొన్న విశేషణాలు 'వాగ్విదాంవరః, మహామునిః మహాప్రాజ్ఞః భగవాన్" ఇత్యాదులు ఈ కావ్య భాగము అన్యకృతమని సూచిస్తున్నాయి వాల్మీకి యొదల భక్తికల ఇంకొక కవి ఆయన ఈ కథను ఎట్లా తెలుసుకొన్నాడో, ఎట్లా మొదటి శ్లోకం రచించినాడో ఆ సంగతి అంతా ఇక్కడ వివరించాడు

వాల్మీకి కావ్యమంతా అనుష్టుప్ ఛందస్సులో రచించాలని సంకల్పించాడు (1.2.40). కాని వివిధ ఛందస్సులలో శ్లోకాలు రామాయణంలో కనిపిస్తాయి. దీనిని బట్టి రామాయణం మొదట పూర్తిగా అనుష్టుప్పులో రచితమైనదని ఊహించవచ్చును.

చాలాకాలం తర్వాత ఆ కావ్యం పరిమాణంలో పెరిగిపోయిఉండవచ్చును ఇతరుల చేర్పులతో అప్పుడు ఇంకొక కవి తన కాలం నాటి కావ్య రచనా పద్ధతుల ప్రకారం తిరిగి రచించి, సర్గకాండ విభాగం చేసి యుండవచ్చును· రామాయణం మహాభారతం కన్నా ప్రాచీనమైనదైనా భాషని బట్టి అర్వాచీన మైనదిగా కనిపించడానికి ఇది కారణం కావచ్చును. ఆ కారణం చేతనే కొందరు రామాయణ రచన మహాభారత రచనానంతరం జరిగినదని అభిప్రాయపడు చున్నారు. కాని ఈఅభిప్రాయం కేవలం భ్రమ. రాముని సంక్షేపకథ భారతంలో రామోపాఖ్యానంలో ఉంది రామోపాఖ్యానం ఏదో అలవోకగా వ్రాయబడింది

---

1 ఈ మునిబాలుడు (శ్రవణ కుమారుడు) వైశ్యునకు శూద్ర స్త్రీ యందు పుట్టినవాడు (2.57.37) కనుక శూద్రుడు.

2. స్వధర్మో రక్షసాం భీరు (సుందరి 5,౧)

కాదు. అదొక పరిపూర్ణ కావ్యం. నిపుణంగా సంయమించి రచించిన రచన; కనుక మహాభారతం రచితమైన కాలానికి రామాయణం ఉండి ఉండాలి ఎంతగా మార్చి తిరిగి వ్రాయబడినా రామాయణ భాష చాలా చోట్లలో చాలా ప్రాచీనమైనదిగానే కనిపిస్తుంది అయితే గహనంగా తయారయిన ప్రస్తుత రామాయణంలో వాల్మీకి అసలు రచన ఏదో నిగ్గుతియ్యడం ఇప్పుడు అసాధ్యం.

## మహాభారతం

ధర్మే చార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్॥

మహత్వాత్, భారవత్వాచ్చ మహాభారతముచ్యతే. లక్ష శ్లోకములతో కూడుకొని స్వరూపమున మహత్తై నదై వేదధర్మాన్ని సరళముగా బోధించుటచే విషయ ప్రతిపాదనమునను గొప్పదై, మహాభారతమను నామ సార్థక్యము నొందుచున్నది. ఈ గొప్పదనము ఆకారమునను, విషయమునను ఒకేసారి నొందక మూడవస్థల నందు పొందినదని విమర్శకుల అభిప్రాయము

తతో జయ ముదీరయేత్, జయనామే తిహాసోఽయం

అష్టౌ శ్లోక సహస్రాణి అష్టౌ శ్లోక శతానిచ' అని 8800 శ్లోకములతో కృష్ణద్వైపాయన వ్యాసమహర్షి జయగ్రంథమును రచించి, వైశంపాయనున కుపదేశించినాడు. ఇది మొదట అవస్థ.

సర్పయ జ్ఞావసరమున వైశంపాయనుడు
చతుర్వింశతి సాహస్రీం చక్రే భారత సంహితాం,
ఉపాఖ్యానైర్వినా తావత్ భారతం ప్రోచ్యతేబుధైః.

జనమేజయునకు 24000 శ్లోకములతో భారతము నుపదేశించెను. ఇది రెండవ అవస్థ

నైమిశారణ్యమున సూతపౌరాణికుడు శౌనకాది మహర్షులకు ఉపాఖ్యానముల జోడించి లక్ష శ్లోకములతో మహాభారతము నుపదేశించినాడు. ఇది మూడవ అవస్థ ఇదియే పరిపూర్ణావస్థ. నేడు మనకు కనిపించు గ్రంథమీ పరిపూర్ణావస్థకు చెందినది.

భగవంతుడే వ్యాసరూపము ధరించి మహాభారతమును రచించినాడని ఆస్తికుల అభిప్రాయము. ఏది ఎటులైనను క్రీ. పూ. 500 నాటికరది పూర్వము_

దని ఐతిహాసికుల అభిప్రాయము ఇందు 18 పర్వములు కలవు. పర్వములను వీక్షింతము.

చంద్రవంశజులగు కౌరవ పాండవోత్పత్తిని ఆదిపర్వము ధర్మజ దుర్యోధనుల ద్యూతక్రీడను సభాపర్వము. పాండవుల వనవాసమును అరణ్య పర్వము పాండవుల అజ్ఞాతవాసమును విరాటపర్వము. శ్రీకృష్ణరాయబారమును ఉద్యోగపర్వము భగవద్గీతను, కురుక్షేత్ర సంగ్రామారంభమును, భీష్ముని పరాజయమును భీష్మపర్వము- అభిమన్యు, ద్రోణవధల ద్రోణపర్వము - కర్ణ యుద్ధమును కర్ణపర్వము - శల్య ప్రతాపమును శల్యపర్వము - నిద్రించిన ఉప పాండవులు అశ్వత్థామచే చంపబడుటను సౌప్తిక పర్వము . శోకాకుల స్త్రీల ఆలాపములను స్త్రీ పర్వము - రాజధర్మములను, మోక్షధర్మములను ధర్మజు నకు భీష్ముడుపదేశించుటను శాంతి పర్వము - ధార్మిక, నీతికథలను, భీష్మ నిర్యాణమును స్వర్గారోహణ పర్వము - యుధిష్ఠిరు డనుష్ఠించు అశ్వమేధయాగ ప్రశంసను అశ్వమేధ పర్వము, ధృతరాష్ట్రాదుల వానప్రస్థాశ్రమమును ఆశ్రమ వాసపర్వము. యాదవులు పరస్పర కలహముచే నశింగినారని మౌసలపర్వము- పాండవుల హిమాలయ యాత్రను మహాప్రాస్థానిక పర్వము - పాండవుల స్వర్గా రోహణమును స్వర్గారోహణపర్వము తెలుపుచున్నవి.

మద్వయం భద్వయం చైవ సద్వయం వద్వయం తథా
అ - స్వో - స్త్రీ - కి - ద్రకాశ్చేవం అత్రయీ భాతి భారతే.

అని పర్వముల ఆద్యక్షరములతో కూర్చిన శ్లోకము.

## కావ్యములు :

సంస్కృత - కావ్యముల ఉత్పత్తి ఋగ్వేదమున భాసిల్లుచున్నది. ఋగ్వే దములోని కొన్ని మంత్రములందు కేవలం దేవతాస్తుతియే కాకుండ, కవి ప్రతి భను ద్యోతింపజేయు రమణీయార్థ ప్రతిపాదకములగు రసాత్మకములగు కవి తల గాంచవచ్చును. డా. ఓల్డన్‌బర్గ్ ఋగ్వేదములోని సుమారు 20 సూక్త ములను ఆఖ్యాన సూక్తములుగా పేర్కొన్నాడు. వింటర్‌నిట్స్ వీటినే భారతీయ కావ్య-నాటక ధారలకు మూల స్రోతస్సులుగా పేర్కొన్నాడు. బ్రాహ్మణము లలో, పురాణములలో కావ్యచ్ఛాయ యున్నను, వాల్మీకి రామాయణమే ఆది మహాకావ్యము భారతమున అక్కడ అక్కడ కావ్యశైలి కనిపించినను, భారత ముఖ్య విషయము ఇతిహాసమే కాని, మహాకావ్యము కాదు. రుద్రట కావ్యా

లంకార వ్యాఖ్యానమున పాణిని పాతాల విజయము, జాంబవతీ విజయమను రెండు కావ్యముల రచించినాడని తెలుపబడినది.

పాణిని : క్రీ॥పూ॥ 450 పాణిని 'జాంబవతీ విజయము' అను మహా కావ్యమును వ్రాసినాడు. ఇది 18 సర్గలతో కూడినది ఇందు శ్రీకృష్ణుడు పాతాళ లోకాన్ని జయించి జాంబవతిని పెళ్ళియాడుట వర్ణింపబడినది. పాతాళ విజయ మను ఇంకొక కావ్యమును కూడా పాణిని రచించెను.

నమః పాణినయే తస్మై యస్మాదావిర భూదిహ।
ఆదౌ వ్యాకరణం కావ్యమను జాంబవతీ జయం॥

వరరుచి · క్రీ॥పూ॥ 350 వరరుచి 'స్వర్గారోహణ' మను కావ్యాన్ని రచించినాడు. దీనిని పతంజలి తన మహాభాష్యమున 4.3.101 వారరుచం కావ్యం అని సంబోధించినాడు సముద్రగుప్తుని కృష్ణ చరితమునందు కూడా యః స్వర్గారోహణం కృత్వా స్వర్గ మానీతవాన్ భువి। కావ్యేన రుచిరేణైవ ఖ్యాతో వరరుచిః కవిః॥ అని ఉల్లేఖించబడినది

పతంజలి : క్రీ॥ పూ॥ 150 పతంజలి 'మహానంద'మను కావ్యాన్ని రచించినాడు. సముద్రగుప్తుని కృష్ణచరిత ప్రస్తావన యందు 'పతంజలి యోగ శాస్త్రమునకు వ్యాఖ్యాన రూపముగా మహానందమను పేరుగల మహాకావ్యాన్ని రచించినాడని' ఉల్లేఖించబడినది

ప్రథమ శతాబ్దినందలి శిలాలేఖములందు ఈ కావ్యచ్ఛాయ స్పష్టముగా గోచరించుచున్నది క్రీ॥శ॥ 150 రుద్రదాముని గిర్నార్ శాసనము అలంకృత కావ్యశైలికి చక్కని నిదర్శనము. మహాకవి కాళిదాసు రచనలచే ఈ కావ్యధార అఖండ రూపమున ప్రవహించద మారంభించినది.

**కాళిదాసు :** సంస్కృత సాహిత్యమున అద్వితీయ స్థానమును అలంక రించినవాడు మహాకవి కాళిదాసు. మూడు నాటకములను రెండు మహాకావ్యము లను రెండు ఖండ కావ్యములను రచించినాడు ఈ కవి తన జీవితమును గూర్చి ఏమి చెప్పలేదు కావున ఈతని దేశ కాలాదుల గురించి విమర్శకులు పలువిధము లైన వాదములను లేవనెత్తినారు ఇందులో రెండు వాదములు. 1) క్రీ॥శ॥ 4వ శతాబ్దికి చెందినవాడని పురాతత్వజ్ఞుల వాదము 2) క్రీ॥పూ॥ మొదటి శతాబ్దానికి చెందినవాడని సాహితీ విమర్శకుల అభిప్రాయము విక్రమోర్వశీయము అనునది

ఈతని నాటకము విక్రమ అను పదము విక్రమాదిత్య నామమునకు సంకేతము. విక్రమాదిత్యుడనగా గుప్తవంశపు రాజయిన రెండవ చంద్రగుప్తుడు (క్రీ॥శ॥ 375 నుండి క్రీ॥శ॥ 413) ఈ రాజు ఆస్థానమున కాళిదాసు ఉండదముచేత తన ఆశ్రయదాత పేరు చిరస్థాయిగా ఉండడమునకై ఈ నాటకమునకు ఈ నామకరణముచేసినాడు. చంద్రగుప్తుని కుమారుడైన కుమారగుప్తుని స్మృత్యర్థమే తన కావ్యమునకు కాళిదాసు కుమార సంభవమని నామమును ఇచ్చినాడు. చంద్రగుప్తుని స్మృత్యర్థము తన కావ్యములందు మాటిమాటికి చంద్ర పదములను ప్రయోగించినాడు సముద్రగుప్తుని ద్విగ్విజయాన్ని చూసి రఘువంశములో రఘుమహారాజుయొక్క దిగ్విజయ యాత్రను వర్ణించినాడు. మాలవికాగ్ని మిత్రమునందలి అశ్వమేధయాగ వర్ణనకు సముద్రగుప్తః ధనుష్ఠించిన అశ్వమేథ యాగమే ఆధారము. కాళిదాస కావ్యములయందలి సుఖ శాంతి యుక్తమయిన సమాజవర్ణన గుప్తకాలీన సమాజమునకు ప్రతిబింబము. కావున కాళిదాసు గుప్తకాలీనుడనుట సమంజసమని పురాతత్వవేత్తల అభిప్రాయము.

మహాకవి కాళిదాసు క్రీ॥ శ॥ ప్రథమ శతాబ్దికి చెందినవాడనుటకు పెక్కు నిదర్శనములు కలవు. 1. వైదిక ప్రయోగములు : వేదములో కనిపించునటుల ధాతువు మధ్యన సుబంత శబ్ద ప్రయోగము: ఏధయాంతమాస అనునవి ఉదాహరణములు. 2 శుంగవంశపు రాజైన అగ్నిమిత్రుని నాయకుని ఆధారముగా చేసుకొని రచించిన 'మాల వికాగ్ని మిత్ర' నాటకము కాళిదాసు అగ్నిమిత్ర సమకాలీనుడనుటకు నిదర్శనము. 3. మేఘదూతమున విదిశా నగరమును రాజధానిగా ప్రసిద్ధిచెందినదని వర్ణించుట విదిశ క్రీ॥ పూర్వమే రాజధాని. ఆతరువాత ఉజ్జయినీ రాజధానియైనది 4 కాళిదాసుని రచనా ప్రభావము అశ్వఘోషుని రచనలపై ఎంతేని కలదు. కావున కాళిదాసు క్రీ॥పూ॥ ప్రథమ శతాబ్దికి చెందిన వాడని సంస్కృత వాఙ్మయ విమర్శకుల అభిప్రాయము.

కాళిదాస కాలాన్ని నిర్ణయించుటలో శాసనములు మౌనమునే వహించుచున్నవి. 'యేనాయోజి జినవేశ్మ .. ' యన్న క్రీ॥శ॥634 నాటి ఐహోలు పులకేశి శాసనము కాళిదాసునుట్టంకించుటచే క్రీ॥శ॥ ఏడవ శతాబ్దముకంటే పూర్వీకుడని తెలియుచున్నది. కాళిదాసు 'ఋతుసంహారము' అను తన ఖండకావ్యమున వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిరమ్ములను ఆరు ఋతువులను

వర్ణించినాడు. ప్రాకృత సంస్కృత శాసనమ్ముల పరిశీలించగా మౌర్య, శుంగ, శాతవాహన, శక, కుషాన శాసనములందు కేవలము మూడు ఋతువులే చెప్ప బడగా కాళిదాసుచే ఆరు ఋతువులు వర్ణింపబడుటచే, ఆరు ఋతువులు కేవలము గుప్తశాసనములందే ఉట్టంకించ బడటముచేత కాళిదాసు గుప్తకాలీనుడనియు క్రీ॥ శ॥ నల్గవ శతాబ్దానికి చెందినవాడని స్పష్టమగుచున్నను, మాలవికాగ్ని మిత్ర నాటక సంఘటన వర్ణనలనుబట్టి, మేఘదూతములోని ఉజ్జయినీ వర్ణన సందర్భమున పేర్కొన్న వత్సరాజసంబంధి జనశృతులవర్ణనముచేతను,విక్రమా దిత్య ఆస్థానకవిగా కీర్తింపబడుటచేతను క్రీ॥పూ॥ మొదటి శతాబ్దికి చెందినవాడుగా కాళిదాసు పండిత పామర అంగీకృతుడు.

## రఘువంశము :

మనువు మొదలుకొని 31 రాజుల జీవనము 19 సర్గలతో వర్ణింపబడినది. దిలీప - రఘు - అజ - దశరథ - శ్రీరాముల జీవితములు విశదముగా వర్ణింప బడినవి. సర్గానుసారి కథను తిలకింతము. 1. సంతానరహితుడైన దిలీప మహారాజు వశిష్టాశ్రమాన్ని చేరుకొని, మహర్షి అనుమతిచే కామధేను తనయ అగు నందినిని సేవించును. 2. నందినీ సేవ, రాజునకు పరీక్ష, ప్రసన్నయైన నందిని రాజుకు సంతానమగునటుల వరము నొసంగును. 3. రఘు జననము - అధ్యయనము - ఇంద్రునితో యుద్ధమునందు విజయప్రాప్తి, రఘువు రాజ్యాభి షిక్తుడగును. 4. దిగ్విజయమునకై బయల్వెడలును. 5. కౌత్సుడు (14 కోట్ల ధనమును) గురుదక్షిణకై రాజును యాచించుట. అందుకై రఘువు కుబేరుని ఆక్రమింప తలంచగా ధనవృష్టి కురియుట కౌత్సుడు సంతసించి చక్కని పుత్రుని పొందుమని ఆశీర్వదించగా అజుడు జన్మించును. 6. ఇందుమతీస్వయం వర వర్ణనము. 7. అజ - ఇందుమతుల వివాహము. 8 అజరాజుకు పట్టాభి షేకము - దశరథ జననము ఇందుమతీ వియోగము - అజవిలాపము 9. దశ రథ మృగయావర్ణనము - శ్రవణకుమార హత్య - దశరథునకు శాపము. 10. పుత్రకామేష్టి - రామాది నల్గురు పుత్రుల జననము 11. సీతాస్వయం వరము - సీతాకళ్యాణము. 12. రామ వనవాసము, సీతాపహరణము .లంకా యుద్ధము, రావణవధ. 13. అయోధ్యా ప్రత్యాగమనము. 14 శ్రీరామ రాజ్యాభి షేకము, సీతాపరిత్యాగము. 15. కుశలవుల జననము - రామావతార నిర్యాణము. 17. కుశుని పట్టాభిషేకము, కుముద్వతితో కుశునకు వివాహము.

17. కుశుని స్వర్గ ప్రస్థానము, అతని కుమారుడైన అతిథిని రాజుగా అభిషేకించుట. 18. అనంతర రాజుల సంక్షిప్త వర్ణనము. 19. అగ్నివర్ణుడను పుట్టంధుడైన రాజు యొక్క అభిషేకము, అతని విషయభోగాసక్తి, రాజయక్ష్మ రోగ పీడితుడై మరణించుట - అతని పట్టపురాణికి రాజ్యాభిషేకము, గర్భస్థబాలుడే ఉత్తరాధికారి యన్న నిర్ణయముతో ఈ కావ్యము సమాప్తమౌతుంది.

కాళిదాస కమనీయ కవిత గూర్చి విననివారుండరు. ఈతని కవితభావ, రసానుకూలయై ప్రకరణ - ప్రసంగ - పాత్ర - వర్ణ్య విషయానురూపయై ప్రవహిస్తూంది. వాల్మీకి ఆశ్రమమున జానకి యొక్క రాకను చూసిన నెమళ్ళు నాట్యాన్ని - తుమ్మెదలు ఝుంకారాల్ని. మృగములు లేతగడ్డి కబళములనుకూడా వదిలివేస్తూన్నాయట.

నృత్యం మయూరాః కుసుమాని భృంగాః
దర్భానుపాతాన్ విజహుర్హరిణ్యః (ర వ.)
రసరాజైన శృంగారాన్ని పోషిస్తూన్న పదముల నడక... ....
స్వర్వాహినీ వారి విహారచారీ
రతాంతనారీ శ్రమ శాంతకారీ ।
తౌ పారిజాత ప్రసవ ప్రసంగౌ
మరుత్సిషేవే గిరిజా గిరీశౌ ॥

ఇందు వ, ర, శ, స వర్ణములు అనుప్రాసకు మూలమై శ్రుతి సౌఖ్యాన్ని కలుగజేస్తూన్నవి.

కాళిదాస భావాన్ని భాష అనుసరిస్తూంటే అనుప్రాస - యమకాదులు అప్రయత్నముగానే భాషను అనుసరిస్తూంటాయి. స్థాలీపులాకా న్యాయముగా ఒక శ్లోకమును తిలకింతము :

తతో మృగేంద్రస్య మృగేంద్రగామీ
వధాయ వధ్యస్య శరం శరణ్యః ।
పురోఽపవత్వం నపురోఽపవామి
నాహం పునో గోఽస్మి పునస్సతస్త్వమ్ ॥

**కుమారసంభవము :**

ఈ మహా కావ్యమున హిమాలయ పుత్రిక పార్వతి తపమాచరించి శివుని యొక్క భార్యయై, కుమారస్వామిని ప్రసవించుట 17 సర్గలలో వర్ణింపబడినది. 1. హిమాలయ వర్ణనము - పార్వతీజననము. 2 తారకాసుర పీడితులైన దేవతలు బ్రహ్మను స్తోత్రము గావించుట - పార్వతీపరమేశ్వర పుత్రుడు కుమారస్వామి తారకుని సంహరిస్తాడని బ్రహ్మ ఓదార్చుట 3. మన్మథుడు శివుని తపస్సునకు భంగముచేయ యత్నించి ముక్కంటి మూడవ కంటికి భస్మీభూతుడగుట. 4 రతి నాశముచే రతి విలాపము 5 పార్వతి తపస్సు, బ్రహ్మచారి వేషధారియై శివుడు పార్వతిని పరీక్షించుట. 6. కన్యార్థియై శివుడు పార్వతి యాచనకై సప్తఋషుల పంపుట 7. గిరిజాకళ్యాణము 8 పార్వతీ పరమేశ్వరుల దాంపత్య జీవనము. 9. పార్వతితో సంచరిస్తూ శివుడు కైలాసమును చేరుట 10. పార్వతి గర్భమును ధరించుట. 11 కుమార జననము-బాల్య క్రీడావర్ణనము 12. కుమారస్వామి దేవసేనకు సేనాధిపత్యమును వహించుట- 13. కుమారస్వామి సైన్యమును నడిపించుట. 14 దేవసేనా ప్రయాణము. 15. దేవాసుర సైన్య సంఘర్షణ. 16 యుద్ధవర్ణనము. 17. తారకాసురవధ.

కొందరు మల్లినాథ సూరి 7 సర్గలకే వ్యాఖ్య వ్రాసినారు కావున కాళిదాసు కృత మంతవరకే అని అందురు అది యుక్తముకాదు. వామనుడు 8వ సర్గ నుండి కొన్ని శ్లోకములను ఉదాహరించినాడు కుమార సంభవ కథ 11వ సర్గ యందు ఉన్నది 9వ సర్గ లేకున్న కావ్యానికి మహాకావ్యత్వమే సంభవించదు కావున 17 సర్గలు కాళిదాసు రచించినాడనుటయే సమంజసము.

లలిత భావముల కవి యీతడు. ఈతని కావ్యములందు, కల్పనలత్యంత ఉన్నతములైనవి. మనోభావ విశ్లేషణము, మార్మికాభి వ్యక్తి, భావ సౌందర్యము ప్రతిచోట గాంచవచ్చును • ఏవం వాదిని దేవర్షౌ పార్శ్వే పితురధోముఖీ। లీలాకమల పత్రాణి గణయామాస పార్వతీ॥ (కు. సం ) నారదుడు శంకరుని గూర్చి చెప్పుతూండే అక్కడే తండ్రివద్ద ఉన్న పార్వతి చేతిలో ఉన్న కమలము యొక్క రేకులను లెక్కపెడుతూంది అనుచోట పార్వతి వ్రీడా భావము కడు రమ్యము 'ద్వయంగతం సంప్రతి శోచనీయతాం' అన్న శ్లోకము కోమల భావమునకు, లలిత పద విన్యాసమునకు నిదర్శనము. 'గృహిణీ సచివః సఖీ మిథః

ప్రియశిష్య' అనునది దాంపత్య జీవనమునకు ఆదర్శము 'ఉపమా కాళిదాసస్య' అని 'సంచరిణీ దీపశిఖేవరాత్రి' అని 'దీపశిఖా కాళిదాసు' అనియు కీర్తినొందిన యాతని కావ్యములందు రస - అలంకార గుణ - విన్యాసముల దర్శిస్తూ కీలు మెరుపుటయే మన కర్తవ్యము.

**అశ్వఘోషుడు :** కాళిదాస సమకాలికుడు. సమకావ్యకర్త. అశ్వఘోషుడు. అయోధ్యవాసి సువర్ణాక్షితనయుడు, కనిష్క చక్రవర్తియొక్క రాజగురువు. (ఆస్థాన పండితుడు) పరంత మహాపండిత, ఇత్యాది బిరుదాంకితుడు క్రీ శ॥ 78 వాడు 28 సర్గలు కల్గిన బుద్ధచరితము 18 సర్గలు కల్గిన సుందరనందాన్ని వ్రాసినాడు

బుద్ధచరితమున బుద్ధుని జీవనము, ఉపదేశములు సిద్ధాంతములు రమ్యముగా వర్ణింపబడినవి క్రీ॥శ॥ 414 సం॥న ధర్మక్షేముడిచే చైనాభాషయందు, 7వ శతాబ్దినందు టిబెట్టు భాషయందు అనువదింపబడినదీ బుద్ధచరితము.

చీనా యాత్రికుడు ఇత్సింగ్ ఈ కవినెంతగానో పొగడినాడు. బుద్ధచరితముయొక్క 17సర్గలుమాత్రమే సంస్కృతమున లభించుచున్నవి కథను పరిశీలింతము 1 గౌతమజననము, 2 అంతఃపుర విహారము, 3. సంవేగోత్పత్తి, 4 స్త్రీనివారణము, 5 అభినిష్క్రమణము, 6, 7. తపోవన గమనము, 8. అంతఃపుర విలాపము, 9. కుమారాన్వేషణము, 10. మగధగమనము, 11. కామనింద, 12. అరాడ్ గురుప్రాప్తి, 13. మారునిపై జయము 14 బుద్ధత్వ ప్రాప్తి మిగతా గ్రంథమునందు బుద్ధ శిష్యచరితములు, ఉపదేశములు, బౌద్ధ సిద్ధాంతములు - బుద్ధనిర్యాణము - అశోకుని కాలముపరకు గల బౌద్ధమత చరిత్రములు చిత్రింపబడినవి.

సుందరనందము - గౌతమబుద్ధుని తమ్ముడు నందుడు అతని భార్య సుందరి. ఈ కావ్యమున వీరి వృత్తాంతము వర్ణింపబడినది సర్గానుసారికథ ఈ విధముగా ఉన్నది. 1-3. శాక్యవంశ వర్ణనము, సిద్ధార్థ జననము, అభినిష్క్రమణము బుద్ధత్వప్రాప్తి.కపిలవస్తు పురాగమనము 4 సుందరీనందుల విహారము, భిక్షకై బుద్ధుడువచ్చి మరలి వెళ్ళినటుల తెలుసుకొని నందుడు వ్యథనొంది బుద్ధుని అనుసరింపగా, సుందరి అతని వక్షమున పత్రలేఖను గీసి ఇది ఆరిపోవు లోపల రావలయునని ప్రార్థించును. 5. నందుడు బుద్ధుని దర్శింప,

నందుని చేతిలో భిక్షాపాత్రపెట్టి, ముండనముగావించి, బౌద్ధభిక్షువుగా బుద్ధుడు మార్చివేస్తాడు. 6. సుందరి విలాపము. 7. సుందరిని చూడవలెనన్న నందుని చేష్టలు. 8 ఆకాశమున ఎగురుచున్న కోతిని చూపించి, కోతికంటే సుందరి అందమైనదా? అను ప్రశ్నింప బౌనని నందుని జవాబు స్వర్గమునందలి అప్సరసల చూపించగా, నందుడు సుందరిని మరచి, అప్సరసల పొందును కోరుతాడు తపస్సు ద్వారా వారిని పొందవచ్చునని తెలుసుకొని నందుడు 12 తపమాచరించును. 13. బుద్ధుని ఉపదేశములు 14 ఆర్య సత్యవర్ణనలు 17-18 పరమ శాంతికై తపస్సు, మారునిపై విజయము నిర్వాణసిద్ధి వర్ణింపబడినవి.

భాషా సౌష్ఠవము - బుద్ధుని ఉపదేశముచే ప్రతిబుద్ధుడైన నందుని అవస్థ

'నమే ప్రియం కించన నాప్రియంమే
నమేను రోధోస్తి కుతో విరోధః।

గౌతమబుద్ధుని జన్మసమయ ప్రకృతి ఆహ్లాదకతను వర్ణిస్తూ ...

వాతావవుః స్పర్శసుఖా మనోజ్ఞా
దివ్యానివాసాంస్యవపాతయంతః॥

గౌతమబుద్ధుని తండ్రి శుద్ధోదనుని ఆత్మసంయమము.....

తత్యాజ శస్త్రం విమమర్శ శాస్త్రం
శమం నిషేవే నియమం విషేహే।

ఇత్యాదులందు భాష భావానుకూలముగా ఆరోహణావరోహణ క్రమములు కలిగి శ్రోతల మనస్సుల నాకర్షించును.

భావాభివ్యక్తి : నస్నౌ శరీరం పవితుం మనశ్చ
సోమం పపౌ శాంతిసుఖంచ హార్దమ్॥

ఇందు 'పపౌ' త్రాగెను (పాపానే), రక్షించెను (పారక్షణే) ఇత్యాది శ్లిష్టప్రయోగములు కోకొల్లలు.

రస పరిపాకము : 'భావానురక్తౌ గిరినిర్ఝరస్యాం
తౌ కిన్నరీ కింపురుషావివోభౌ'।

సుందరీనందులు కిన్నరీ కింపురుషులవలె అనురక్తులై రూప సౌందర్య ముగ్ధులై ఆనంద సాగరమున ఓలలాడుచున్నారను సామ్యము అద్భుతము.

తాం సుందరీం చేన్న లభేతనందః
సావా విషేవేత నతం నత భ్రూః॥

ద్వంద్వం ధృవంతద్వికలం నశోభే
కాన్యోన్య హీనావివ రాత్రిచంద్రౌ॥

నంద సుందరులు విడిపోతే రాత్రి చంద్రుల విడిపోవడంవలె ఉంటుందన్న కవికల్పనావర్ణనౌచిత్యము ఆహ్లాదకరము. 'దీపోయధా నిర్వృతి మభ్యుపేతః' అని నిర్వాణము దీపనిర్వాణముతో పోలుస్తూ బౌద్ధ ధర్మ ప్రేమను కురిపించినాడు

అశ్వఘోషునియొక్క, కాళిదాసుయొక్క వర్ణనా సాదృశ్యము లు.

1) సౌందర నందమున సుందరీ విలాపము, కుమార సంభవమున రతీ విలాపము.

2) సౌందర నందమున నందుని విలాపము, రఘువంశమున అజవిలాపము.

3) బుద్ధచరితము మూడవ సర్గయందు బుద్ధుని దర్శనార్థము స్త్రీ జన సమ్మర్దము, వారల ఔత్సుక్యము, కుమారసంభవము ఏడవ సర్గయందు శివ దర్శనార్థమై, రఘువంశమునందు ఏడవ సర్గయందు అజునియొక్క దర్శనమునకై ప్రజల సమ్మర్దము

4) సోనిశ్చయాన్నాపి నయయౌ నతస్థౌ।
తరం స్తరంగేష్వివ రాజహంసః॥ అశ్వఘోషుడు
మార్గా చలవ్యాకులితేవ సింధుః।
శైలాధి రాజతనయా నయయౌ నతస్థౌ॥ కాళిదాసు

5) ఆదిత్య పూర్వం విపులం కులంతే
నవం వయో దీప్త మిదం వపుశ్చ॥ అశ్వఘోషుడు
ఏకాత పత్రం జగతః ప్రభుత్వం
నవం వయో దీప్త మిదం వపుశ్చ॥ కాళిదాసు.

ఈ విధముగా అశ్వఘోషుని రచనల యందు కాళిదాసు రచనల యందును శైలీ భాషా ప్రయోగ సాదృశ్యములు కడు స్పష్టములు.

**భారవి :** "యోనాయోఽజి జిన వేశ్మ స్థిరమర్థవిధౌ వివేకనాజిన వేశ్మ। సవిజయతాం రవి కీర్తిః కవితాశ్రిత కాళిదాస భారవికీర్తిః". అని ఐహోలు శాసనమున కీర్తింపబడిన భారవి క్రీ॥శ॥ 634 కంటే పూర్వవర్తి, విష్ణువర్ధన రెండవ పులకేశి సభాపండితుడు. క్రీ॥శ॥ 560 కాలము వాడనియు, ఈతని పేరు

దామోదరుడనియు విమర్శకుల అభిప్రాయము ఈతడు 18 సర్గలతో కిరాతార్జునీయ కావ్యాన్ని వ్రాసినాడు. కౌరవులపై విజయము సాధింప అర్జునుడు హిమాలయముపై తపమాచరించుట, శివుడు కిరాత వేషధారియై అర్జునుని పరీక్షింప యుద్ధముచేసి, ప్రసన్నుడై పాశుపతాస్త్రమును ప్రసాదించుట ఇందు వర్ణితము

1. పాండవులు అరణ్యవాసము చేస్తూ ఒక వనేచరుని దుర్యోధనుని వృత్తాంతమును తెలుసుకొనుటకు చారుడిగా పంపగా,తిరిగివచ్చి రారాజు పాలనా విశేషములు తెలుపును కౌరవుల గూర్చి చేయవలసిన కర్తవ్యమును ద్రౌపది పలుకును. 2. యుధిష్ఠిర భీమ సంవాదము - వ్యాసాగమనము. 3.ధర్మజ-వ్యాస సంవాదము పాశుపతాస్త్ర ప్రాప్తికై హిమాలయమున తపమాచరించుమని అర్జునుని పంపును. 4. శరదృతు వర్ణనము. 5 హిమవన్నగ వర్ణనము 6. అర్జునుని తపము - తపోవిఘ్నమునకై అప్సరసల రాక. 7 గంధర్వుల, అప్సరసల విలాసవర్ణనము. 8. ఉద్యాన-జలక్రీడలు 9 సాయంకాల చంద్రోదయ - సురత - ప్రభాత వర్ణనలు 10 వర్షాగమము - అప్సరసల చేష్టలు-వారి ప్రయత్న వైఫల్యములు. 11 మునిరూపమున ఇంద్రుని ఆగమనము - ఇంద్ర - అర్జున సంవాదము, పాశుపతాస్త్ర ప్రాప్తికై శివారాధన చేయుమని ఇంద్రుని సలహా 12 అర్జునిని తపస్సు - సూకరరూపియైన మూకాసురుని చంపుటకై అర్జునుని యత్నము కిరాత వేషధారియైన శివుని ఆగమనము 13. శివుని, అర్జునుని బాణములచే వరాహమరణము, బాణ విషయమున వివాదము. 14. సేనాసహితుడైన శివుని ఆగమనము. 15. చిత్రయుద్ధ వర్ణనము. 16 శస్త్రయుద్ధము. 17 శివార్జునుల యుద్ధము. 18 బాహు యుద్ధము - శివప్రాకట్యము - ఇంద్రాగమనము - పాశుపత ప్రాప్తి. సఫలమనోరథుడై అర్జునుడు ధర్మరాజును చేరును.

"భారవేరర్థ గౌరవం" అని అర్థ గౌరవానికి ప్రసిద్ధినొందిన దీతని కావ్యము. "స్ఫుటతాన పదైరపాకృతా నచనస్వీకృత మర్థగౌరవం। రచితాపృథగర్థతా గిరాం నచసామర్థ్య మపోహితం క్వచిత్॥ పదములందు స్పష్టత్వము - అర్థగౌరవము - పునరుక్తదోష రాహిత్యము భీముని వచనాల్లోనే కాదు భారవి శ్లోకాల్లో ఉంది.

సాంసారిక విషయ భోగముల నశ్వరత్వమును, దుఃఖ పర్యవసానత్వ మును వర్ణిస్తూ

'శరదంబు ధరచ్ఛాయా గత్వర్యో యవ్వనశ్రియః
అపాత రమ్యా విషయాః పర్యంత పరితాపినః

యవ్వనము శరత్కాలీన మేఘములాంటిది విషయ భోగములు పైకి మనోహర ములుగా కనిపించినను, అంతతః దుఃఖమును కలిగించునవి.

వివిక్త వర్ణాభరణా సుఖశ్రుతిః
ప్రసాదయంతీ హృదయాన్యపి ద్విషాం।
ప్రవర్తతే ప్రాకృత పుణ్య కర్మణాం
ప్రసన్న గంభీర పదా సరస్వతీ॥

ప్రసాద, మాధుర్య, అర్థ గౌరవాది యుక్తమైన వాణి పుణ్యాత్ములకే లభిస్తొం దన్న భారవి శ్లోకము, భారవికే సార్థకము. సహసా విదధీతనక్రియాం లాంటి సామెతలు ఈతని కావ్యంలో కోకొల్లలు.

'ననో ననునో్న నున్నో నానా నానాననా నను।
నున్నో ఒనున్నో ననున్నే నో నానేనానున్న నున్ననుత్'

ఇత్యాది చిత్రాలంకారములు భారవి ప్రత్యేకతలు.

**మాఘుడు :** మాఘకవి శిశుపాల వధ మహాకావ్యాన్ని రచించినాడు. ఈ కవియొక్క తాత అయిన సుప్రభదేవుడు వర్మలాత ప్రభువు వద్ద ప్రధానమంత్రిగా ఉండెను. వర్మలాత ప్రభువుకు సంబంధించిన శిలా లేఖ ములు వసంత గఢమున లభించుచున్నవి. ఈతడు క్రీ॥శ॥ 625 నాటి వాడని పరిశీలకుల అభిప్రాయము. కావున మాఘకవి యొక్క తాత క్రీ॥శ॥ 650. మాఘకవియొక్క తండ్రి క్రీ॥శ॥ 650. ఈ కవి క్రీ॥శ॥ 675 వాడని నిర్ధా రించవచ్చును.

అనుత్సూత్ర పదన్యాసా సద్వృత్తిః సన్నిబంధనా।
శబ్దవిద్యేవ నోభాతి రాజనీతి రపస్పశా॥ అని సూత్ర న్యాసపదాన్ని స్మరిం చుటచే, క్రీ॥శ॥ 700 కాలమున కాశికా వృత్తిపైన జినేంద్రబుద్ధి న్యాసాన్ని వ్రాసి నాడు కావున తరువాతివాడనుట సమంజస్సంకాదు. "కృతగురు పద న్యాసాలోక

శబ్దావతరణేపి" అని 620 నాటి బాణుడు పేర్కొన్నందున ఆ న్యాస గ్రంథాన్ని స్వీకరించవచ్చును. కావున మాఘకవి క్రీ॥శ॥ 675 నాటి వాడనుట సమంజసము.

శిశుపాలవధమునందు నారదుని ద్వారా శిశుపాల పూర్వజన్మల వివరములు. అతని అత్యాచారములు. శ్రీకృష్ణునిచే అతనిని సంహరింప ప్రార్థన. ధర్మరాజు రాజసూయాన్ని చేయ శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థపురమునకు వెళ్ళుట అక్కడ కృష్ణునిద్వారా శిశుపాల వధ వర్ణింపబడినది. సర్గానుసారి కథ .. 1. నారదాగమనము, శ్రీకృష్ణుని ద్వారా అతనికి సత్కారము నారదుని ద్వారా శిశుపాల పూర్వజన్మ, అత్యాచారముల కథనము ఇంద్ర సందేశము. 2 శ్రీకృష్ణ, బలరామ, ఉద్ధవ మంత్రణములు, బలరాముడు శిశుపాలుని త్వరగా చంపవలయునని తొందరచేయ ఉద్ధవుడు యుధిష్ఠిర రాజసూయ యాగమునకు వెళ్ళుమని బోధించును. 3 ద్వారకనుండి ఇంద్రప్రస్థ ప్రయాణము. 4, 5. రైవతకాద్రి వర్ణనము. 6. ఆరు ఋతువుల వర్ణనలు. 7. వనవిహార వర్ణనము 8. జలక్రీడ. 9 సాయంకాల, చంద్రోదయ, వర్ణనలు. 10 పాన గోష్ఠి-రాత్రిక్రీడా వర్ణనము 11 ప్రభాత వర్ణనము, 12. యమునా వర్ణనము. 13. నగర ప్రవేశము. పాండవుల స్వాగత సన్నాహము 14. రాజసూయమున అగ్రపీఠమున కృష్ణుని పూజించుమని భీష్ముడు పలుకును. 15. శిశుపాలుని కోపము. స్వపక్షీయులతో కలసి కృష్ణునిపై యుద్ధము. 16. శిశుపాలుని దూత యొక్క ఉభయార్థక వాక్య ప్రయోగములు, సాత్యకి జవాబు. 17. కృష్ణపక్షీయుల సన్నాహము. 18. ఉభయ సేనలయొక్క యుద్ధము 19. చిత్రాలంకార యుక్తములైన శ్లోకములచే విచిత్ర వ్యూహరచన, యుద్ధవర్ణనము. 20. శ్రీకృష్ణ శిశుపాలుల యుద్ధము - సుదర్శన చక్రముచే శిశుపాల శిరచ్ఛేదముచే కావ్యము ముగుస్తుంది.

ఉదయతి వితతోర్ధ్వరశ్మిరజ్జా-
వహిమరుచౌ హిమధామ్ని యాతిచాస్తం।
వహతి గిరి రియం విలంబి ఘంటా
ద్వయ పరివారిత వారణేంద్రలీలాం॥

రైవతకాద్రి ఉదయిస్తూన్న సూర్యునొకవైపు అస్తమిస్తూన్న చంద్రునొకవైపు

ధరిస్తూ, రెండు ఘంటలు కట్టుకొన్న ఏనుగులా [illegible] [illegible] నిదర్శనను ప్రదర్శించి ఘంటామాఘుడని ప్రసిద్ధత నొందినాడు

ఉపమా కాళిదాసస్య భారవేరర్థ గౌరవమ్।

దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయోగుణాః॥

అని ఉపమాలంకార ప్రయోగానికి, అర్థ గౌరవానికి, లలిత పద ప్రయోగానికి ప్రసిద్ధిగాంచిన దీతని కావ్యము.

ఉపమా : ఉత్తిష్ఠ మానస్తు పరో నోపేక్ష్యః పథ్యమిచ్ఛతా।
సమౌహి శిష్టైరామ్నాతౌ వర్ధంతా వామయస్తథా॥

హితవరి పెరుగుతూన్న వ్యాధిని ఉపేక్షించకూడదు, పెరుగుతూన్న శత్రువును వీరుడు ఉపేక్షించరాదని ఉపమా.

పదైః కలిపయైరేవ ప్రథితస్య స్వరైరివ।

అనంతా వాఙ్మయ స్యాహో గేయస్యేవ విచిత్రతా॥

'సరిగమపదని' అను సప్తస్వరముల పైననే సమస్త సంగీత శాస్త్ర మాధారపడి నట్లు, కొన్ని అక్షరములపైననే సమస్త వాఙ్మయ మాధారపడియున్నదన్న ఉపమయు మాఘుకవి ఉపమాలంకార ప్రియత్వమును చాటుచున్నది.

అర్థగౌరవము : సమయ ఏవ కరోతి బలాబలం
ప్రణిగదంత ఇతీవ శరీరిణామ్।
శరది హంసరవైః పరుషీకృత
స్వరమయూర మయూరమదేయతామ్॥

సమయమే మనుష్యుని ఉన్నతికి, పతనానికి కారణమౌను, శరదృతువున హంస ధ్వని యుండగా నెమళ్ళ కేకారవములు కఠోరములుగా కనిపించును.

యాం యాం ప్రియః ప్రైక్షత కాతరాక్షీం
సా సా హ్రియా నమ్రముఖీ బభూవ।
నిశ్శంకమన్యాః సమమాహితేర్ష్యా-
స్తత్రాంతరే జఘ్నురముం కటాక్షైః॥

శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి పోతూంటగా, వనితలందరూ వచ్చి అతని చుట్టు ముట్టినారు. అతడు కృష్ణయ్య శ్రీగంటి చూపులతో ఏవతెనైనా చూస్తు ఉన్నాడో వారందరూ [illegible] సిగ్గుతో తలవొంచినారు మిగతవారలు తమను చూడటంలేదన్న ఈర్ష్యతో కృష్ణునిపై కటాక్ష ప్రసారములు చేస్తున్నారు.

పదలాలిత్యము : మధురయా మధు బోధితమాధవీ-
మధుసమృద్ధి సమేధిత మేధయా।
మధు కరాంగనయా ముహు రున్మద-
ధ్వని భృతా నిభృతాక్షర ముజ్జగే॥
నవ పలాశ పలాశవనం పురః
స్ఫుట పరాగ పరాగత పంకజమ్।
మృదులతాంతలతాంతమలోకయ-
త్ససురభిం సురభిం సుమనోభరైః॥

## భారవి మాఘ సామ్యములు :

| భారవి | మాఘము |
| --- | --- |
| 1. మహాభారత కథాధారము | 1. మహాభారత కథాధారము |
| 2. శ్రీశబ్దముచే గ్రంథారంభము | 2 శ్రీశబ్దముచే గ్రంథారంభము |
| 3. సర్గాంత శ్లోకమున లక్ష్మీశబ్దము | 3. సర్గాంతమున శ్రీశబ్దము |
| 4. 1వ సర్గనందు యుధిష్ఠిర వనేచర సంవాదము-రాజనీతి చర్చ | 4. కృష్ణనారద సంవాదము రాజనీతి చర్చ |
| 5. 2వ సర్గనందు రాజనీతి వర్ణనము | 5. 2 నందు రాజనీతి వర్ణనము |
| 6. 5వ సర్గనందు హిమవన్నగ వర్ణనము | 6. 4వ సర్గనందు రైవతక వర్ణనము |
| 7. 9వ సర్గనందు సాయంకాల చంద్రోదయ వర్ణనములు | 7. 9వ సర్గనందు సాయంకాల చంద్రోదయ వర్ణనములు |
| 8. శివస్తుతితో సమాప్తి | 8. కృష్ణస్తుతితో సమాప్తి |

**శ్రీహర్షుడు:** నైషధం విద్వదౌషధమ్మని ఖ్యాతినొందిన నైషధీయ చరిత్ర మహాకావ్యమును వ్రాసినవాడు శ్రీహర్షుడు. 22 సర్గలతో కూడుకొనినదీ కావ్యము. సర్గాంత పద్యములందు తన పరిచయమును వ్రాసినాడు. ఈ కవి తల్లిదండ్రులు మామల్లదేవి శ్రీహీరులు. ఈతడు క్రీ॥శ॥ 1163-1194 కన్నోజును పాలించిన జయచంద్రుని ఆశ్రయించినవాడు. 'తాంబూల ద్వయ మాసనంచ లభతే యః కాన్యకుబ్జేశ్వరాత్' అని తనుగూర్చి చెప్పు

కొన్నారు. 'తచ్చింతామణి మంత్ర చింతన ఫలే' అని చింతామణి మంత్ర ప్రభావమున తనకు విద్య వచ్చినటుల సెలవిచ్చినాడు. సర్గాంత శ్లోకముల ననుసరించి 'స్థైర్య విచార ప్రకరణము, శ్రీ విజయ ప్రశస్తి, ఖండన ఖండ ఖాద్యము, గౌడోర్వీశకుల ప్రశస్తి, అర్ణవ వర్ణనము-ఛందః ప్రశస్తి, శివశక్తి సిద్ధి-నవసాహసాంక చరిత్ర చంపూ, ఈశ్వరాభిసంధి - గ్రంథములీతని రచనలని తెలియు చున్నవి.

నైషధీయ చరితము 22 సర్గల కావ్యము. 1. నలదమయంతులు పరస్పరము వారివారల గుణములు విని ఆకృష్టులగుదురు - నలుడు వనవిహారము చేయుచు హంసను పట్టుకొనును. దయార్ద్ర హృదయుడై వదలును. 2. హంస కృతజ్ఞతలు చెప్పి, దమయంతి గానముచేయును నలుని కోరికపై హంస దమయంతి వద్దకు దూతగా కుండిననగరానికి వెళ్లను. 3. దమయంతికి నలుని గుణములను వినిపించును. దమయంతి నలునియందు అనురక్త యగును.హంస తిరిగి నలుని చేరుకొనును. 4. దమయంతి వైకల్య వర్ణనము - భీమ రాజు దమయంతి స్వయంవరాన్ని ప్రకటించును. 5. ఇంద్రాగ్ని యమ వరుణులు నలుని దూతగా దమయంతి వద్దకు పంపుదురు. 6. నలుడు అదృశ్య రూపమున దమయంతిని చేరుకొనును. 7. దమయంతి నఖశిఖ పర్యంత వర్ణనము. 8. నలుడు ప్రకటుడై దిక్పతుల సందేశాన్ని వినిపిస్తూ, ఆ నల్గురిలో ఒకరిని పెళ్ళియాడుమని ప్రార్థించును 9. నలదమయంతుల వార్తాలాపములు. దమయంతి దేవతల్లో ఎవ్వరిని తాను వివాహమాడనని నిశ్చయముగా పలుకగ, నలుడు రాజీపడును 10. దమయంతీ స్వయంవరం 11, 12 స్వయంవరానికి విచ్చేసిన రాజులను సరస్వతి పరిచయము చేయును. 13. ఇంద్రాదులు నలరూపాన్ని ధరించి రాగా ఐదుగురు నలులను శ్లేషచే వర్ణించుట. 14. దేవతల స్వీకారముచే దమయంతి నలుని వరించును. 15. వివాహ ప్రయత్నములు. 16. వివాహము విందు. 17. దేవతలతో కలి పురుషుడు కల్సియును. చార్వాక సిద్ధాంతాన్ని కలి ఉపన్యసింప దేవతలు ఖండింతురు. కుద్ధుడైన కలినలునకు రాజ్యభ్రష్టునగునటుల. దమయంతీ వియోగాన్ననుభవించునటుల శపించును. 18. నలదమయంతుల మొదటిరాత్రి, కామ్యకేళీ వర్ణనము 19.22 నలదమయంతుల దినచర్య దేవస్తుతి- చంద్రోదయ, సూర్యోదయ వర్ణ

నల్చునలద్ధమయంతీ విలాప వర్ణనము. కవి పరిభయ వర్ణనముతో ఈ కావ్యము ముగుస్తుంది.

'మృదేకస్మాతా జననీ జరాతురా
నవ ప్రసూతి ర్వరటా తపస్వినీ।
గతి స్తయోరేష జనస్త మర్దయ.
న్నహో విధేత్వాం కరుణా రుణద్ధినో।" అనునది కరుణ రస ప్రవాహమునందు భావ సౌష్ఠవ ప్రసాద గుణసుందర ప్రయోగ మనోహరముకాగా

'హృతసార మివేందు మండలం దమయంతీ వదనాయ వేధసా।
కృతమధ్యబిలం విలోక్యతే ధృతగంభీర ఖనీ ఖనీలిమా॥
అనునది ఉత్ప్రేక్షా చమత్కృతిని ద్యోతింపగా

'గమికర్మీకృత నైకనీవృత'ఇత్యాదులు కవియొక్క పద ప్రయోగ నైపుణ్యమును ప్రదర్శించుచున్నవి.

భట్టి : వ్యాకరణ శాస్త్రమును సుకరముగా బోధింప తలంచి రచించిన వ్యాకరణ నియమముల బోధిస్తూ- లక్ష్య గ్రంథముగా రావణవధ కావ్యాన్ని వ్రాసినాడు. వల్లభరాజగు శ్రీధరసేనుని ఆస్థాన పండితుడు. క్రీ॥శ॥ 610 సం॥నాటి శిలా శాసనమున శ్రీధరసేనుడు భట్టికి భూదానము చేసినటుల కన్పించుచున్నది. మరియు క్రీ॥శ॥ 620 నాటి భామహుడు

"వ్యాఖ్యాగమ్య మిదం కావ్యముత్సవః సుధియామలం।
హతాదుర్మేధసశ్చాస్మిన్ విద్వత్ప్రియ తయామయా॥"

అనుభట్టి శ్లోకమును "కావ్యాన్యపి యదీమాని వ్యాఖ్యా గమ్యాని శాస్త్రవత్
ఉత్సవః సుధియామేవ హంత దుర్మేధసోహతాః॥"

అని కావ్యాలంకారమున ఉదాహరించినాడు కావున క్రీ॥శ॥ 610 కంటే పూర్వుడని సిద్ధించుచున్నది. "దీపతుల్యః ప్రబంధోయం శబ్దలక్షణ చక్షుషాం హస్తామర్ష ఇవాంధానాం భవేద్వ్యాకరణాదృతే॥"అని తన కావ్య మహిమను చెప్పినాడు. ఈ కావ్యము 22 సర్గలతో నాల్గు కాండములుగా విభజించబడినది. రామజన్మ ప్రభృతి రామరాజ్యాభిషేక పర్యంత కథ వర్ణింపబడినది.

1. ప్రకీర్ణకాండము : 1 నుండి 5 సర్గలు - రామజననము మొదలుకొని రావణుడు సీతనెత్తుకొని పోవు వరకు వర్ణింపబడినది. కృత్ ప్రత్యయములు,

ముఖ్యముగా వర్ణింపబడినవి. 2. అధికారకాండము : 6 నుండి 8 కాండలు; వాలి వధ - సుగ్రీవ రాజ్యాభిషేకము - లంకాదహనము వర్ణింపబడినవి. ఇందు లుఙ్, కృత్, షత్వ, ణత్వ, కారక, ఆత్మనే పదాదులు నిరూపించబడినవి. 3. ప్రసన్న కాండము : 10 నుండి 13 సర్గలు సీతాభిజ్ఞాన దర్శనము, విభీషణ శరణాగతి - సేతుబంధము వర్ణింపబడినవి. ఇందు శబ్దాలంకారములు, అర్థాలంకారములు వర్ణింపబడినవి. 4, తింగ న్తకాండము : 14 నుండి 22 సర్గలు లిట్, లుఙ్, ల్రుట్, లఙ్, లట్, లిఙ్, లోట్, ల్రుఙ్, లుట్ ఈ తొమ్మిది లకారముల ప్రయోగములు నిరూపించబడినవి. రామరావణ యుద్ధము, రావణ వధము - విభీషణ రాజ్యాభిషేకము, శ్రీరామ పట్టాభిషేకము వర్ణింపబడినవి.

'రామోపి దారాహరణేన త ప్తః వయం హతై ర్బంధుభిరాత్మతుల్యైః।
త ప్తస్య త ప్తేన యథాయసోనః సంధిః పరేణాస్తు విముంచ సీతాం॥'

సీతా హరణముచే శ్రీరాముడు సంతప్తుడైనాడు బందువుల మరణముచే మనము తపించిపోతున్నాము. కావున సీతను వదిలిపెట్టి సంధి చేసుకోవడం మంచిది. త ప్తము లైన రెండు ఇనుము ముద్దలు కలిసినట్లుగా తపించిన మనము, రాముడు కలిసిపోవడం మంచిది. అను సంధి ఉపదేశము సుందరమైనది. 'నతజ్జలం యన్న సుచారు పంకజం నపంకజం తద్ యదలీనషట్పదం। న షట్పదో సౌ నజుగుంజ యఃకలం నగుంజితం తన్న జహారయన్మనః' అను చోట ఏకావలీ అలంకారము 'నగజా నగజా దయితా దయితా విగతం విగతం లలితం లలితం। ప్రమదా ప్రమదా మహతా మహతా మరణం మరణం సమయాత్ సమయాత్।' ఇత్యాది యమకములు ఈతని కవితా రమణీయతను వెదజల్లుచున్నవి.

**కుమార దాసు :** 'జానకీ హరణం కర్తుం రఘువంశే స్థితేసతి।
కవిః కుమార దాసశ్చ రావణశ్చ యది క్షమః॥'

అని రఘువంశముండగా జానకీ హరణాన్ని చేయడానికి రావణుడు తాను మాత్రమే సమర్థుడమని చెప్పుకొన్న ఈ కుమారదాసుడు రావణునివలె శ్రీలంక దేశస్థుడని క్రీ॥శ॥ 650 నుండి క్రీ॥శ॥ 750 మధ్య కాలవ ర్తి అని విమర్శకుల అభిప్రాయము ఈతని కావ్యము జానకీ హరణము. 20 సర్గలతో కూడు కొన్నది. 25 సర్గలు కలదని కొందరి అభిప్రాయము. ఈ కావ్యమునందు

రామాయణ కథ వర్ణితము. అయోధ్యాధిపతియైన దశరథుని రాజ్యపాలన వర్ణనము నుండి రావణుని రాముడు జయించువరకు వర్ణింపబడినది. ఈతని రచన యందు కాళిదాసు ప్రభావము స్పష్టము వైదర్భీరీతి రచనము. ఈతని కవిత సరళము - సరసము, ప్రవాహయుక్తము భావములందు సరసత్వ సుకుమారతలు వ్యాపించి యుండును.

'తతః సలీలం సలిలం విభంద-
న్నేవం వదన్నేవ వరాంగనాభిః।
యాతే చ రామే నయనాభిరామే
దృష్ట్వాదిశః కిం ఫలమ స్తి భూన్యాః।
సారంగాక్షి శర స్తస్య కేవలం తు భరేభరః

దూషణే దూషణో భద్రే న త్రైలోక్యం విలోకణే ఇత్యాదులు.భాషా సౌష్ఠవమును నాద మాధుర్యమును, అలంకారములను ధ్వనింప "సజ్జనేషు విహితం హియద్భృతం సద్య ఏవ ఫలబంధి జాయతే" (సజ్జనులకు చేసిన ఉపకారము అప్పుడే ఫలాన్నిస్తుంది).

'యోషితాం స్వామి సమ్మద ఫలంహి మండనం'
పతి ప్రసాదోన్నతయో క్షి యోషితః' అనునవి అర్థాంతరన్యాసాలంకార ప్రియత్వమును తెలుపుచున్నవి.

స్త్రీయోన పుంసా ముదయస్య సాధనం
తవేవ తద్ధామ విభూతి హేతవః।
తటద్వియుక్తోపి ఘనః ప్రజృంభతే
వినా న మేఘం విలసంతి విద్యుతః॥

వనితలు పురుషుల ఉన్నతికి కారణము కారు. పురుషులే స్త్రీ కళ్యాణ కారకులు. మెరుపులు లేనప్పటికి మేఘము శోభిస్తుంది. కాని మేఘము లేకుండా మెరుపులుండలేవు. అని దుశ్చరితముగల స్త్రీలను నిరాధారలుగా వర్ణించినాడు.

**రత్నాకరుడు :** "ముక్తా కణః శివస్వామీ కవిరానందవర్ధనః।
ప్రథాం రత్నాకర శ్చాగా త్సామ్రాజ్యేఽవంతి వర్మణః॥"

క్రీ॥ శ॥ 855-884 వరకు కాశ్మీరాన్ని పరిపాలించిన అవంతివర్మ ప్రభువు యొక్క సభాపండితుడీ రత్నాకరుడు. ఈతని తండ్రి అద్భుత భానువు. కాశ్మీరాధీశుడగు జయాపీడునాశ్రయించినాడు. కావున ఈ కవి క్రీ॥ శ॥ 800 నుండి 860 కాలమువాడని చెప్పవచ్చును. వక్రోక్తి పంచశిఖ, ధ్వనిగాథాపంజిక, హరవిజయ మీతని కృతులు. హరవిజయము సంస్కృత సాహిత్యమున విశాల కాయమైన బృహత్తమ గ్రంథము. 50 సర్గలతో 4321 శ్లోకములతో కూడు కొన్నది. ఇందు అంధకాసుర జననము, శివుడి ద్వారా అంధకాసుర సంహారము వర్ణింపబడినవి. కథేతివృత్తము చిన్నదైనను, మధ్యమధ్యన అన్య ప్రసంగ ములు కొన్ని సర్గలను వ్యాపించినవి. 11వ సర్గమున అంధకాసుర వధార్థమై శివుడు మంత్రులతో విచారించుట. 13వ సర్గమున శివగణ విహారము, 17వ సర్గ మున శివదూతలతో అంధకాసుర సంవాదము, 24వ సర్గమున శివసేనా సన్నా హము వీటితో కావ్యము సముద్రమువలె ప్రకాశించుచున్నది. ఈకవి బాణసముడు. భారవి మాఘులు సర్గాంతమున లక్ష్మి, శ్రీ శబ్దముల ప్రయోగించినటుల ఈతను రత్న శబ్దమును ప్రయోగించినాడు.

'హరవిజయ కవేః ప్రతిజ్ఞాం శృణుతకృత ప్రణయో మమ ప్రబంధే
అపి శిశురకవిః కవేః ప్రభావాద్భవతి కవిశ్చ మహాకవిః క్రమేణ.'

కవిత్వ మబ్బని శైశవ కవి కూడా ఈ కావ్యాన్ని చదివి కవి కాగలడు. కవి మహాకవి కాగలడని ప్రతిజ్ఞ చేసినాడు.

లలిత మధురాః సాలంకారా ప్రసాదమనోహరా
వికట యమక శ్లేషోదార ప్రబంధ నిరర్గలాః।
అసదృశ మతీ శ్చిత్రే మార్గే మయోద్గిరతో గిరో
నఖలు నృపతే చేతో వాచస్పతేరపి శంకతే॥

ఈ కావ్యమున ప్రసాదము - మాధుర్యము - ఓజస్సు - లాలిత్యము - శ్లేషము - యమకము - చిత్రాలంకారములు - ఉన్నవని పలుకుట అతిశయోక్తి గాదు.

"మాస్మ సంతుహి చత్వారః ప్రాయో రత్నాకరా ఇమే।
ఇతీవ సంస్కృతో ధాత్రా కవిరత్నాకరోఽపరః॥"

నాలుగు రత్నాకరములతో, (సముద్రములతో) సంతోషించని బ్రహ్మ ఇదవ రత్నాకరాన్ని (ఈ కవిని) సృజించినాడని పలికిన రాజశేఖరుని వాక్యము సర్వధా సత్యము.

**హరిశ్చంద్రుడు :** హరిశ్చంద్రకవి జైన మహాకవి. ఏకాదశ శతాబ్దివాడు. జీవంధర చంపూ - ధర్మశర్మాభ్యుదయమీతని రచనలు - ధర్మశర్మాభ్యుదయమున 21 సర్గలు కలవు. 15వ తీర్థంకరుడగు ధర్మనాథుని జీవిత చరితము వర్ణింపబడినది ఈ గ్రంథమునకు జైనసంప్రదాయమున మాఘ నైషధతుల్య గౌరవము కలదు. ఈతని రచనము సరస, సరళ, మాధుర్య రమ ణీయకతల గుబాళింపును వెదజల్లుచున్నది.

'తారకాః క్వను దివో దిపద్యుతో విద్యుతోఽపి నవియంత్యనంబుదే।
క్వావ్యనేధసి నవహ్నయో మహ స్తత్కిమే తదితి ద త్త విస్మయః॥'

ఇత్యాది సుందర సందేహాద్యాలంకారములు ఈతని అలంకార ప్రియత్వ మును వెల్లడి చేయుచున్నవి.

**కవిరాజు :** మాధవభట్టు ఈతని నామము - కవిరాజనునది ఈతని బిరుదు నామము. క్రీ॥శ॥ 1282.87 జయంతపురిని పాలించిన కదంబ వంశీయు. డగు కామదేవ ప్రభువుయొక్క ఆస్థాన వందితుడు. రాఘవ పాండవీయ మీతని కావ్యము. ఇది 13 సర్గలు 668 శ్లోకములతో కూడుకొన్నది. ద్వ్యర్థి కావ్యము ఒక్కొక్క పద్యమున రెండేసి అర్థములు కలవు. ఒకటి రామాయణ కథా సంబంధము కలది. మరొక అర్థము భారత కథా సంబంధముకలది. రామాయణ రూపగంగను, భారత రూప సాగరముతో కలిపి గంగా సాగర సమ్మేళనాన్ని చేయుట భగీరథునకు కవిరాజగు తనకు మాత్రమే సంభవమని పలుకుట ఎంతేని సత్యము.

శ్రీమద్రామాయణం గంగా భారతం సాగరో మహాన్।
తత్సం యోజన కార్యజ్ఞౌ కవిరాజ భగీరథౌ॥
కస్త్రాత్రా కామదేవః సమర విజయినాం కోఽగ్రణీః కామదేవః
కస్త్యాగీ కామదేవః సరసకవిగిరాం కః పదం కామదేవః
కస్సేవ్యః కామదేవః త్రిభువన విదే కః కృతీ కామదేవః
ప్రశ్నానామేవ మేషాం ప్రతి భవన మహో రామవత్కామదేవః॥

అని ఆశ్రయదాతయగు కామదేవుని ప్రశంసిస్తూ వ్రాసిన శ్లోకము పరి సంఖ్యా విరోధాభాసాలంకారములకు చక్కని నిదర్శనము.

శ్రీహర్షుని నైషధముతో సంస్కృత మహా కావ్యధార అంతమగుచున్న దని కొందరి అభిప్రాయము. అది సరియైనదికాదు. మధ్యయుగమునను, ఆధునిక యుగమునను సంస్కృతమున మహా కావ్యములు రచింపబడుచున్నవి. రఘువంశ, మాఘ, నైషధ తుల్యములు కాకున్నను, వీటిలో కొన్ని మహా కావ్య లక్షణ లక్షితములై సహృదయుల మన్ననల హొందుచున్నవి. సంస్కృత మహా కావ్యధార ఎప్పుడును నిరాటంకముగా ప్రవహించుచునే ఉన్నది. మరి కొందరి మహాకవుల పరిచయము క్రింద ఇవ్వబడుచున్నది - వీరిలో క్షేమేంద్రుడు శ్రీహర్ష పూర్వవర్తి - 11 వ శతాబ్దివాడు, గ్రంథ రచన విషయమున వ్యాసుని తరువాత లెక్కింప దగినవాడు. 65 గ్రంథము లితనిచే రచింపబడినవి. వీటిలో 1. రామాయణ మంజరి 2. మహాభారత మంజరి. 3 దశవతార చరితము - ఈ మూడు మహా కావ్యములు. బృహత్కథా మంజరి, బోధిసత్వావదాన కల్ప లత - ఈ రెంటు బృహత్కాయములైన వృత్తి గ్రంథములు. కాశ్మీరీయుడైన ఇతవి భాష సరళము, సరసము, మంజులము. కథను సంక్షేపముగా వర్ణించు టలో ఇతనికి సాటి ఎవరులేరు. రామాయణ కథ, భారత కథ సంక్షేపముగా ఆయా మంజరుల యందు నిరూపింపబడినది. శ్రీమన్నారాయణుని పది అవ తారములు దశావతార చరితమున నిరూపింపబడినవి. బుద్ధుని నారాయణుని అవతారముగా వర్ణించిన వారిలో క్షేమేంద్రుడు మొదటివాడు.

వేంకటనాథుడు : వేదాంత దేశికులని ఖ్యాతి నొందిన ఈ మహాకవి 13 వ శతాబ్దివాడు. కాంచీనగరవాసి - అనేక దార్శనిక గ్రంథములు రచించిన ఈ మహాకవి రామానుజుల విశిష్టాద్వైతమునకు మూలస్తంభం లాంటివాడు. ఇతని యాదవాభ్యుదయ మహా కావ్యము శ్రీకృష్ణ కథా ప్రబోధకమైనది. పాండిత్య ప్రదర్శనము ఈ గ్రంథమున ఎక్కువగా కనబడుచున్నది.

అమరచంద్రసూరి . జైన మతస్థుడైన ఈ కవి (1243.60) అణహిల పట్టణ ప్రభువైన వీసలదేవుని ఆస్థాన పండితుడు. ఇతను మహాభారత కథను సంక్షేపముగా 44 సర్గలతో బాల భారతమను మహా కావ్యమును రచించెను. ఇతవి భాష మరియు శైలి సరళములు, రసవంతములు. వీరనంది అను ఇంకొక జైన కవి (క్రీ॥ శ॥ 1300) చంద్రప్రభ చరితమను మహా కావ్యమును

రచించెను. ఇందు 7 వ తీర్థంకరుడైన చంద్రప్రభుని చరితము సరసమైన భాషలో, ప్రసన్నమైన శైలిలో వివరించబడినది. వస్తుపాలుడను ఇంకొక జైన కవి (13 వ శతాబ్ది) 'నరనారాయణానందము' అను మహా కావ్యమును రచించెను. ఈ కవి గుజరాత్ ప్రభువగు వీరధవలుని వద్ద ప్రధానమంత్రిగా ఉండెను. ఈతని కావ్యమున కృష్ణార్జునుల యొక్క చరితములు, వారికి సంబంధించిన సంఘటనలు అత్యంత రమణీయముగా వర్ణింపబడినవి.

కృష్ణానందుడు (14 వ శతాబ్ది) సహృదయానందమను మహాకావ్యమును రచించెను. ఈతడు ఒరిస్సా నివాసి. 15 సర్గలు కల ఈతని కావ్యమున 'నల దమయంతుల కథ' సరసమైన భాషలో రచింపబడినది. నీలకంఠ దీక్షితుడు - సుప్రసిద్ధ దార్శనికుడు, అలంకారికుడైన అప్పయ్య దీక్షితుని పౌత్రుడు. కాంచీ నగరవాసి. ఈతను 22 సర్గలు కల శివలీలార్ణవ మహాకావ్యాన్ని, 8 సర్గలతో గంగావతరణ కావ్యాన్ని రచించెను. శివుని లీలలు సుందరమైన శైలిలో రమ్యముగా వర్ణింపబడినవి వక్రోక్తి కితడు ప్రసిద్ధుడు సమకాలీనములైన మహా కావ్యములలో ఉమాపతి ద్వివేది యొక్క పారిజాతహరణము (21 సర్గలు), రేవా ప్రసాద ద్వివేది యొక్క సీతాచరితము (10 సర్గలు) మొదలగునవి ప్రసిద్ధములు. మరి కొన్ని మహా కావ్యములు క్రింద పట్టికలో పేర్కొనబడుచున్నవి.

| | | | |
|---|---|---|---|
| ఆర్యశూరుడు | 400 | పారమిత సమాసము | బౌద్ధకథ |
| | | జాతకమల | ,, |
| భర్తృమేంఠుడు | 430 | హయగ్రీవవధ | |
| మాతృగుప్తుడు | 5వ శతాబ్ది | సేతుకావ్యము | |
| బుద్ధఘోషాచార్యుడు | 5వ శతాబ్ది | పద్యచూడామణి | |
| శంకుకుడు | 850 | భువనాభ్యుదయము | |
| నీతివర్మ | 9 శతాబ్ది | కీచకవధము | భీమ-కీచక కథ |
| అభినందుడు | 9 శతాబ్ది | రామచరితము | రామకథ 36 సర్గలు |
| వాసుదేవుడు | 900 | యుధిష్ఠిర విజయము | ధర్మరాజు 8సర్గలు |
| | | త్రిపురదహనము | శివకథ 3 సర్గలు |
| | | శౌరికథోదయము | కృష్ణకథ |

| | | | |
|---|---|---|---|
| హలాయుధుడు | 1050 | కవిరహస్యము | కృష్ణరాజు |
| అభినందుడు | 950 | కాదంబరీ కథాసారము | కాదంబరి8సర్గలు |
| లోలింబరాజు | 1050 | హరివిలాసము | కృష్ణకథ 5 సర్గలు |
| లీలాశుకుడు | 1100 | గోవిందాభిషేకము | కృష్ణకథ 12సర్గలు |
| (బిల్వమంగళ) | | (శ్రీచిహ్నకావ్యము) | |
| కర్ణపూరుడు | 1185 | పారిజాతహ: ణం | కృష్ణకథ 18 |
| జయద్రథుడు | 1200 | హరచరిత చింతామణి | శివకథ 32 |
| మాధవాచార్యుడు | 1225 | యమకభారతము | భారత కథ |
| ఉదయప్రభసూరి | 1240 | ధర్మాభ్యుదయము | శత్రుంజయ తీర్థయాత్ర |
| త్రివిక్రముడు | 1260 | ఉషాహరణము | ఉషా-అనిరుద్ధులు |
| దేవప్రభసూరి | 1250 | పాండవచరితము | భారతకథ 18 |
| నారాయణుడు | 1250 | పారిజాతహరణము | యమకకావ్యం |
| విద్యాచక్రవర్తి | 1300 | రుక్మిణీకల్యాణము | కృష్ణుడు 16 |
| అగస్త్యపండితుడు | 1300 | బాలభారతము | భారతకథ 20 |
| వాసుదేవుడు | 1320 | యుధిష్ఠిరవిజయం | ధర్మజకథ |
| | | నలోదయము | నలకథ 21 |
| సాకల్యమల్లుడు | 1330 | ఉదారరాఘవము | రామకథ 18 |
| మాధవుడు | 1380 | నరకాసురవిజయం | కృష్ణకథ 9 |
| సుకుమారుడు | 1425 | కృష్ణవిలాసము | కృష్ణకథ 4 |
| శంకరుడు | 1430 | కృష్ణవిజయము | కృష్ణకథ |
| కృష్ణాచార్యులు | 1430 | దౌష్యంతిచరితం | భరతకథ 12 |
| రామవర్మ | 14 0 | భారతసంగ్రహం | భారతకథ 22 |
| శివసూర్యుడు | 1450 | పాండవాభ్యుదయము | ,, 8 |
| (అజ్ఞాతము) | 1460 | కుశాభ్యుదయము | కుశకథ |
| చతుర్భుజుడు | 1493 | హరిచరితకావ్యం | కృష్ణకావ్యం 13 |

| | | | |
|---|---|---|---|
| రాజనాథుడు III | 1540 | అచ్యుత రాయాభ్యుదయం | అచ్యుతరాయలు 20 |
| స్వయంభునాథుడు | 1540 | కృష్ణవిలాసము | కృష్ణకథ 14 |
| ఉత్ప్రేక్షావల్లభుడు | 1590 | భిక్షాటనకావ్యం | శివకథ 39 |
| రఘునాథుడు | 1600 | నలాభ్యుదయం | నలకథ |
| | | పారిజాతహరణం | కృష్ణకథ |
| వేంకటేశ్వరుడు | 1600 | సాహిత్య సామ్రాజ్యము | |
| రాజచూడామణి దీక్షితులు | 1620 | రుక్మిణీకళ్యాణము | రుక్మిణీకృష్ణులు 10 |
| మృత్యుంజయ దీక్షితులు | 1620 | ప్రద్యుమ్నోత్తర చరితం | ప్రద్యుమ్నకథ 11 |
| చక్రకవి | 1650 | జానకీపరిణయం | రామకథ 8 |
| వేంకటేశుడు | 1650 | రామచంద్రోదయము | ,, 30 |
| | | రామయమకార్ణవము | ,, |
| వేంకటకృష్ణయజ్వ | 1650 | నటేశవిజయము | శివకథ 7 |
| శ్రీనివాసుడు | 1660 | భూవరాహవిజయము | వరాహావతారం 8 |
| వరదదేశికులు | 1680 | లక్ష్మీనారాయణ చరితం | విష్ణుకథ |
| | | రఘువర విజయము | రామకథ |
| భగవంతు | 1690 | ముకుంద విలాసము | కృష్ణకథ 10 |
| రామభద్ర దీక్షితులు | 1700 | పతంజలి చరిత్రము | పతంజలి 8 |
| ఘనశ్యాముడు | 1725 | వేంకటేశ చరిత్రము | — |
| రామపాణివాదుడు | 1725 | విష్ణువిలాసము | విష్ణుకథ 8 |
| | | రాఘవీయకావ్యము | రామకథ 20 |
| రామవర్మ | 1800 | రామచరితము | ,, 12 |
| కేరళవర్మ | 1860 | విశాఖ రాజకావ్యము | — |
| అభినవ రామానుజాచార్య | 1875 | శ్రీనివాస గుణాకరము | వేంకటేశుడు |

| | | | |
|---|---|---|---|
| లక్ష్మణసూరి | 1880 | కృష్ణ లీలామృతము | కృష్ణకథ |
| విదుశేఖర భట్టాచార్య | 1880 | ఉమాపరిణయము | |
| | | హరిశ్చంద్రచరితము | |
| నారాయణశాస్త్రి | 1900 | సౌందర విజయము | 24 |
| భద్రాద్రి రామశాస్త్రి | 1900 | శ్రీరామ విజయము | రామకథ |
| కాళిదాసు | 1900 | నలోదయ కావ్యము | నలకథ |
| శంకరలాల్ | 1900 | బాలచరితము | |
| హేమచంద్రరాయ్ | 1920 | హైహయవిజయము | కార్తవీర్యుడు |
| | | పాండవ విజయము | పాండవులు |
| అన్నదాచరణులు | 1930 | రామాభ్యుదయము | రామకథ |
| | | మహాప్రస్థానము | పాండవకథ |
| వటుకనాథశాస్త్రి | 1930 | సీతా స్వయంవరము | రామకథ |
| గురుప్రసన్న భట్టాచార్య | 1930 | శ్రీ రాసమహాకావ్యము | కృష్ణకథ |
| నాగరాజు | 1940 | సీతా స్వయంవరము | రామకథ 16 |
| భగవదాచార్య | 1940 | పారిజాతాపహారము | |
| | | పారిజాత సౌరభము | |
| విష్ణుదత్తశుక్ల | 1958 | సౌలోచనీయము | సులోచన |
| | | గంగాకావ్యము | గంగ |
| గంగాధరశాస్త్రి | 20 శతాబ్ది | అలివిలాసి | షడ్దర్శనములు |
| తైలంగ్ | | సంలాపము | |
| భట్టమధురానాథశాస్త్రి | ,, | గోవిందవైభవము | కృష్ణకథ |
| రఘునాథశాస్త్రి | ,, | చంద్రోపాలంభ వర్ణనము | |
| | | సురహేవర్ణన కావ్యము | |
| బదరీనాథ శర్మ మైథిల్ | ,, | రాధాపరిణయము | కృష్ణకథ 20 |
| ఉమాపతి శర్మ ద్వివేది | ,, | పారిజాతహరణము | కృష్ణకథ 22 |
| సత్యవ్రతశాస్త్రి | 1960 | బోధిసత్వచరితము | బుద్ధకథ |
| రేవాప్రసాద ద్వివేది | 1965 | సీతాచరితము | సీతకథ 10 |

మహాకావ్య ప్రత్యేకతలు :

క్రీస్తు శకారంభమునుండి సంస్కృత మహాకావ్యములు వికసితమైన ప్రౌఢ రూపమునొందినవి సమాజమునందలి ప్రథమ వర్గములైన రాజవంశములే ఎక్కువగా వర్ణింపబడినవి. విలాస, వైభవ, శృంగార రసభరితములైనవి పాండిత్య ప్రదర్శనము, కల్పనా వైచిత్ర్యము, కలావైవిధ్యము దర్శన సిద్ధాంత నిరూపణము, వ్యాకరణ శాస్త్ర ప్రదర్శనము ఇత్యాదులకు మహాకావ్యములాలవాలములైనవి.

## ఐతిహాసిక కావ్యములు :

ప్రాచీన భారత చరిత్రను తెలుపునవి సంస్కృత కావ్యములే అని చారిత్రకులు ముక్తకంఠముగా ఉద్ఘోషించినారు. గుప్తకాలము నాటి వత్సభట్టి వ్రాసిన ప్రశస్తులు, బాణభట్టు రచించిన హర్షచరితము ఐతిహాసిక కావ్య రచనకు శ్రీకారము చుట్టినను, మహా కావ్యదృష్టి ననుసరించి పద్మగుప్త పరిమలుడు రచించిన "నవసాహసాంకచరితమే" మొదటి ఐతిహాసిక కావ్యముగా గ్రహించబడుచున్నది. ఇందు సుప్రసిద్ధ ధారాధీశుడైన భోజరాజు యొక్క తండ్రియగు నవసాహసాంక ప్రభువు యొక్క చరితము, శశిప్రభా రాజకుమారితో వివాహము వర్ణింపబడినవి. దీని రచయిత పద్మగుప్త పరిమలుడు వాక్పతిరాజని ఉపాధి గాంచిన నవసాహసాంకుని జ్యేష్ఠ సోదరుడైన ముంజరాజుయొక్క సభయందు ఆస్థాన కవిగా ఉండెను. ఈ ముంజ ప్రభువు స్వయముగా సరస్వతీ ఉపాసకుడు గౌడవధ, ప్రాకృత కావ్యమును రచించినాడు. ఈ వాక్పతిరాజు కీర్తిశేషుడు కాగా అతని సోదరుడు సింధురాజని కీర్తిగాంచిన నవసాహసాంకుని ఆశ్రయించి, అతని సత్కారములచే ప్రసన్నుడై, ప్రసన్నతను కావ్యరూపమున వెలయించినాడు. క్రీ॥ శ॥ 1005 న ఈ గ్రంథము వ్రాయబడినది. 18 సర్గములతో కూడుకొనినది. 12 వ సర్గమున సింధురాజ పూర్వవర్తులగు పరమార వంశ ప్రభువులను కాలక్రమము ననుసరించి వర్ణించినాడు. వైదర్భీరీతిబద్ధమై ప్రసాద గుణ గుంఫితమైనదీ కావ్యము - కాళిదాసానుకరణము స్పష్టము

**విక్రమాంక దేవ చరితము :** దీనిని బిల్హణ కవి రచించినాడు. 18 సర్గలతో కూడుకొన్నది. చివరి సర్గమున తన జీవన చరితమును వర్ణిస్తూ ముక్తి [illegible]డు ముత్తాత - రాజకలశుడు తాత - జ్యేష్ఠకలశుడు తండ్రి - నాగదేవి

తల్లి - ఇష్టరాయ, ఆనందులు సోదరులు అని చెప్పినాడు. ఆశ్రయదాతకై వెతుకుతూ కాశ్మీరము నుండి వెడలి మధుర, కన్నోజ్, ప్రయాగ, కాశీ ఆది అనేక ప్రదేశముల దాటి దక్షిణ భారతమునందలి కళ్యాణ నగరమునందు సుప్రసిద్ధ చాళుక్య వంశీయుడగు ఆరవ విక్రమాదిత్యుని (క్రీ॥ శ॥ 1076-1127) కొలువుకూటము చేరుకొనగా, గుణగ్రాహియగు ఆ ప్రభువు స్వాగతము పలికినాడని తన చరితమును వర్ణించినాడు. మిగతా 17 సర్గలలో విక్రమాదిత్య ప్రభువు చరితమును చాళుక్య వంశ విస్తారమును యాదార్థ్యముగా నిరూపించినాడు. వైదర్భి రీ, ప్రసాద మాధుర్య గుణములు. వీరము ప్రధాన రసము కాగా శృంగార కరుణములు అంగములైనవి.

**రాజతరంగిణీ :** దీని రచయిత కల్హణుడు. ఇది ప్రాచీన కాశ్మీరము యొక్క రాజచరిత్ర. సంస్కృతి - భౌగోళిక వివరణము, సామాజిక వ్యవస్థ సాహిత్య సమృద్ధి - ఆర్థిక దశలను తెలుపు గ్రంథము - ఈ కవి కాశ్మీర దేశమున సంపన్న బ్రాహ్మణ కుటుంబమున జన్మించినవాడు కాననే రాజాస్థానమును తరచు దర్శించినవాడగుటచే, తన అనుభవములను విస్తృతముగా వర్ణించినాడు - ఈతని తండ్రి చణపకుడు కాశ్మీర ప్రభువగు హర్షుని (1048-1101) ప్రధానామాత్యుడిగా ఉండి, ప్రభువు యొక్క సుఖ దుఃఖములందు పాలు పంచుకొన్నవాడు. హర్ష ప్రభువు హత్య చేయబడగా సన్యాసాన్ని గ్రహించినాడు. అప్పుడు ఈతని పినతండ్రి కనకుడు కల్హణుని కాశీ చేర్చినాడు. అక్కడ అలకదత్తుడను గురువు వద్ద విద్యల నభ్యసించి గ్రంథ రచన కుపక్రమించినాడు. ఈతను తలంచుకొంటె ఆనాడు అత్యున్నత రాజ్యాధికార పదవి నధిష్ఠించి ఉండెడివాడు కాని రాజనైతిక పతనములు, అధికార వాంఛచే వారు సలుపు కూట నీతి రాజ మార్పిడులు మొదలగు వాటిచే విసుగు చెంది ఆ రాజుల చరితములను గ్రంథ రూపమున రచించ నిమగ్నుడైనాడు సుస్థల పుత్రుడగు జయసింహరాజు (క్రీ॥ శ॥ 1127-1156) యొక్క ఆశ్రయము గాంచి 1148 నుండి 1150 వరకు రెండు సంవత్సరములలో ఈ గ్రంథమును రచించినాడు.

ఈ గ్రంథమునందు 8 తరంగములు కలవు - మొదటి మూడు తరంగములందు గోనందుడను రాజు యొక్క చరితము పురాణాధారముగా నారంభింపబడి పౌరాణికతలకన్నా కల్పనలకే ఎక్కువ స్థానము ఇవ్వబడినది. కాని 4 వ

తరంగమున క్రీ॥ శ॥ 813 నుండి 1150 వరకు గల నాల్గు శతాబ్దముల కాశ్మీర రాజ చరితము వాస్తవికమై ఇతిహాసమునకు ప్రమాణమైనది - నేటి చారిత్రకుల వలె ఈ కల్హణ కవి వాస్తవికతను వెల్లడించటములో నిర్భయుడు - తన మాతృభూమినందలి దురాచారముల, దుష్ట ప్రవృత్తులను, కాశ్మీరీయుల యొక్క భీరుత్వమును, మిథ్యా భాషణత్వమును, సంగ్రామ పలాయన ప్రవృత్తిని, పరస్పర కలహ ప్రవృత్తిని, ద్రోహ, పక్షపాత - దురాగ్రహములను, సంఘర్ష - సంగ్రామములను, క్షుద్ర హృదయ దౌర్బల్యములను వివరించునపుడు సంకుచిత బుద్ధిని కనబరచలేదు - కాశ్మీర సైనికుల భీరుత్వమును, కపట మోసముల నిందిస్తూ రాజపుత్ర సైనికుల పరాక్రమములను ప్రశంసించినాడు. తన ఆదర్శ లక్ష్యమును వివరిస్తూ

'శ్లాఘ్యః సఏవగుణవాన్ రాగద్వేష బహిష్కృతా ।
భూతార్థ కథనే యస్య స్థేయస్యేవ సరస్వతీ ॥' అని వివరించినాడు. ఈ గ్రంథము ఫారసీ భాషయందు కూడా అనువదించబడుట దీని గొప్పతనము తెలియబడుచున్నది.

కల్హణుని రాజతరంగిణి కథ మరికొందరిచే ముందుకు నడుపబడినది. జోనరాజు (1459 క్రీ॥శ॥) అదేశైలిలో సుల్తాన్ జైనులోద్దీన్ రాజ్యపాలన వరకు వర్ణించినాడు. జోనరాజు శిష్యుడగు శ్రీవరుడు జైనరాజ తరంగిణి నాల్గు భాగములలో క్రీ॥శ॥ 14"9 నుండి 1486 వరకు కాశ్మీరాన్ని పాలించిన రాజుల చరితమును వర్ణించినాడు. ప్రాజ్యభట్టు మరియు అతని శిష్యుడగు శుకుడు రాజావలి పతాకా గ్రంథమున అక్బర్ చక్రవర్తిచే కాశ్మీరాక్రమణ వరకు వర్ణించినాడు. తరువాత కాశ్మీరము మొగలు సామ్రాజ్యమున కలిసిపోయింది.

**కుమారపాల చరితము :** ఆచార్య హేమచంద్రసూరి (క్రీ॥ శ॥ 1089 - 1173) దీనిని రచించినాడు. క్రీ॥ శ॥ 1144 న కుమారపాలితుడు గుజరాత్ రాజ సింహాసనాన్నధిష్ఠించి, క్రీ॥ శ॥ 1452 జైన ధర్మ దీక్షను పొందినాడు. ఈతని ఆశ్రయమును పొందిన హేమచంద్రసూరి కుమారపాలితుని వరకు గల గుజరాత్ ప్రభువుల చరితములను ఈ గ్రంథమున వర్ణించినాడు. ఇందు మొదటి 20 సర్గలను సంస్కృతములోను, మిగతా 8 సర్గలను ప్రాకృతములోను రచించినాడు. కావుననే ద్వ్యాశ్రయ కావ్యమని ప్రసిద్ధి గాంచినది.

శ్వేతాంబర జైన సంప్రదాయ ప్రచారకులైన ఆచార్య హేమచంద్రుడు, తన వైదుష్యముచే 'కలికాల సర్వజ్ఞుడని' ప్రసిద్ధి చెందినవాడు - దర్శన శాస్త్ర-

వ్యాకరణ-కోశ - అలంకార శాస్త్రములందు అనేక గ్రంథముల రచించినాడు. గుజరాత్ రాజుల, మరియు కుమారపాల రాజు యొక్క చరిత్రమును తెలుసు కొనుటకు ఇది చక్కని ప్రమాణ గ్రంథము.

గుజరాత్‌రాజగు వీరధవలుడు మరియు వీసలదేవుడు వారల మంత్రులగు వస్తుపాల తేజపాలుల సంబంధించి ఎన్నియో ఇతిహాస కావ్యము లావిర్భవించి నవి. అందు సోమేశ్వరుడి (క్రీ॥ శ॥ 1176-1262) కీర్తికౌముదీ, అరిసింహుడి సుకృత సంకీర్తనము బాలచంద్రసూరి వసంతవిలాసము మొదలగు మహా కావ్యములు ప్రధానములైనవి

సంధ్యాకరనందిన్ : రామపాల చరితమను ఐతిహాసిక కావ్యమును రచించిన ఈ కవి క్రీ॥ శ॥ 12 వ శతాబ్దివాడు ఇందు బెంగాలు రాజగు కుమార పాలుని వీరోచిత సాహస కృత్యములు చక్కగా వర్ణింపబడినవి. భీమరాజు నుండి హస్తగతమైన రాజ్యము నొందిన కుమారపాలుడు భీమరాజును ఓడించి మళ్ళీ రాజ్యము నొంది, మిథిలపై దండెత్తి, మిథిలను తన రాజ్యమున కలుపు కొన్నటుల చెప్పబడినది. ఐతిహాసిక దృష్ట్యా కాని మహా కావ్యదృష్ట్యా కాని ఈ కావ్యమునకు ఎంతేని ప్రాధాన్యము కలదు.

జయానకుడు : క్రీ॥శ॥ 1200 కాలమున చివరి హిందూ రాజగు పృథ్వీ రాజు దర్బారున ఆస్థానకవిగా ఉండెను.బహుశః కాశ్మీరీయుడై యుండవచ్చును. ఈతనిచే రచింపబడిన పృథ్వీరాజ విజయము ఇతిహాస ప్రధానమైనది. ఇందు అజ్మీర్, ఢిల్లీని పాలించిన చౌహాను రాజవంశావళితో నారంభించి, ఢిల్లీపై పృథ్వీ రాజుయొక్క విజయమువరకు వర్ణించినాడు. భాష, శైలి, వర్ణనలననుసరించి ఇది ఉత్తమమైన కావ్యమైనప్పటికి, దుర్భాగ్యవశాత్ అసమాప్తంగానే ఉండి పోయింది. కాశ్మీర కవియగు జోగరాజు దీనిపై వ్యాఖ్య వ్రాసినాడు.

గంగాదేవి - 14వ శతాబ్దపు ఈ కవయిత్రి తన భర్తయగు విజయనగరా ధీశుడైన వీరకంపరాయల పరాక్రమమును వర్ణింప 'మధురావిజయము' అను వీరకంపరాయ చరితమును రచించినది. ఈమె శైలి ప్రసాదగుణ భూయిష్ఠమై సుప్రసన్నమైనది. నయచంద్రసూరి - 15వ శతాబ్దపు శ్వేతాంబర జైనకవి. వి. సంవత్ 1440న గ్వాలియర్ రాజైన వీరమదేవరాజుయొక్క ప్రేరణచే 'హమ్మీర మహాకావ్యా'న్ని రచించినాడు. ఇందు రణథంభోర ప్రతాపవంతులైన రాజులలో

చివరివాడైన హమ్మీరదేవుని పరాక్రమము వర్ణింపబడినది. ఇందులో 14 సర్గలు 1572 శ్లోకములు కలవు ఐతిహాసిక గ్రంథమైనను, సాహిత్య దృష్ట్యా అపూర్వమైనది. హమ్మీర మద మర్దన కావ్యము కూడా హమ్మీర దేవుని పరాజయమును వర్ణించుచున్నది

చంద్రశేఖర్ : కాశీనివాసి, 11వ శతాబ్ది వాసియగు ఈ కవి సురజన చరిత కావ్యాన్ని వ్రాసినాడు అక్బర్ పాదుషాయొక్క విశ్వాసపాత్రుడైన హారా వంశీ బూందీ రాజు సురజనుడు. ఇందు సురజనుడితో సహా అనేక బూందీరాజుల చరితములు 20 సర్గలలో వ్రాయబడినవి కాళిదాసుని ప్రసాద గుణసంపన్నమైన శైలి ఇందులో కాంచవచ్చును.

లక్ష్మీనారాయణ ద్వివేది:(10 5. 899—14.8.1950) ఉత్తరప్రదేశ్, ఫరూఖాబాద్ జిల్లాయందలి తిర్వా గ్రామవాసి 21 గ్రంథముల వరకు వ్రాసినాడు పురుషోత్తముని, సికందర్‌యొక్క ప్రసిద్ధ ఐతిహాసిక సంఘటనాధారముగాగొని 'పురుసికందరీయం' అను ఐతిహాసిక కావ్యాన్ని వ్రాసినాడు. ఇందు 18 సర్గలు 1100 శ్లోకములు కలవు. కవికల్పనలున్నప్పటికి, ఐతిహాసిక సంఘటనలకు ప్రాధాన్యము ఇవ్వబడినది.

ఈ యుగపు కవులలో శ్రీధర భాస్కర వర్ణేకర్, నాగపుర విశ్వవిద్యాలయ విశ్రాంత సంస్కృత భాషాధ్యక్షులు ప్రసిద్ధులు. ఈతనిచే 12 ఖండ కావ్యములు, 2 నాటకములు, 1 ఐతిహాసిక గ్రంథము రచింపబడినవి 64 సర్గలు కలిగిన 'శివరాజ్యోదయమ్' శివాజీ చరిత్రమును వివరించుచున్నది. ఇతిహాస దృష్ట్యా, మహాకావ్య దృష్టి ననుసరించియు దీనికెంతేని ప్రాధాన్యము కలదు. ఈ శతాబ్దపు సంస్కృత కవులలో ప్రభుదత్తస్వామి ప్రసిద్ధులు మీరట్‌లోని బిల్వేశ్వర సంస్కృత మహావిద్యాలయ విశ్రాంత సాహిత్య విభాగాధ్యక్షులు పూర్వ భారతము, మౌర్య చంద్రోదయమీతని రచనలు పూర్వ భారతమున మహాభారత కాలమునుండి అలెగ్జాండర్ దండయాత్రవరకు గల ఐతిహాసిక సంఘటనలు వర్ణింపబడినవి జనవిజయ ఐతిహాసిక కావ్యాన్ని రచించిన పరమానంద శాస్త్రి అలీగఢ్ విశ్వవిద్యాలయ విశ్రాంత సంస్కృత విభాగాధ్యక్షులు. ఇందు జయప్రకాశ నారాయణచే ఆవిర్భవింపబడిన జనతాపార్టీ విజయము వర్ణింపబడినది. పండితురాలైన క్షమారావు తుకారామ చరితము, రామదాస చరితము, సత్యాగ్రహ గీత, ఉత్తర సత్యాగ్రహగీత, స్వామాజ్య విజయములను ఐతిహాసిక కావ్యముల రచించినది. మరికొన్ని ఐతిహాసిక గ్రంథములు ప్రధానముగా కావ్య కల్పనలకు ప్రాధాన్యమిచ్చినవి క్రింది పట్టికలో పేర్కొనబడుచున్నవి.

| కవి | కాలము | ఐతిహాసిక కావ్యము | నాయకుడు సర్గలు |
|---|---|---|---|
| శివస్వామి | 850 | కప్ఫణాభ్యుదయము | కప్ఫణరాజు 20 |
| శంకుకుడు | 850 | భువనాభ్యుదయము | మమ్మఉప్పలుడు |
| గుణభద్రాచార్య | 855 | జినదత్తచరితము | జినదత్త కథ 9 |
| హాలాయుధుడు | 1000 | కవిరహస్యము | కృష్ణరాజు |
| శంభు | 1088 | రాజేంద్రకర్ణపూరము | హర్షదేవుడు |
| బిల్హణుడు | 1150 | సోమపాల విజయము | సోమపాలరాజు |
| శంకరారాధ్యులు | 1150 | బసవేశ విజయము | బసవకథ |
| సోమనాథుడు | 1150 | పండితారాధ్యచరితం | పండితారాధ్యులు |
| ఆనందగిరి | 1199 | శంకరవిజయం | శంకరాచార్య |
| సోమేశ్వరదత్త | 1179 | కీర్తికౌముదీ, సురథోత్సవం | |
| చందకవి | 1200 | పృథ్వీరాజవిజయము | పృథ్వీరాజు 8 |
| అరిసింహుడు | 1221 | సుకృత సంకీర్తనము | వస్తుపాలుడు11 |
| మాధవాచార్యులు | 1297 | శంకరదిగ్విజయం | శంకరాచార్య 16 |
| నయచంద్రుడు | 1310 | హమ్మీరకావ్యము | హమ్మీరుడు 10 |
| వ్యాసతీర్థులు | 1400 | జయతీర్థవిజయము | జయతీర్థులు |
| కృష్ణపండితుడు | ,, | జయతీర్థ విజయాబ్ధి | ,, |
| సంకర్షణుడు | ,, | జయతీర్థవిజయము | ,, |
| శ్రీనివాసుడు | ,, | జయేంద్రోదయము | ,, |
| రాజనాథుడు II | 1430 | సాలువాభ్యుదయం | సాల్వనరసింహరాయ 13 |
| మహాదేవేంద్ర | 1498 | వ్యాసాచరీయం | శంకరాచార్యులు 12 |
| వామనభట్టబాణ | 2500 | వేమభూపాలచరితం | వేమభూపాలుడు |
| రాజనాథుడు III | 1540 | అచ్యుతరాయాభ్యుదయం | అచ్యుతరాయలు 20 |
| గోవిందదీక్షితులు | 1560 | సాహిత్యసుధ | అచ్యుత,రఘునాథరాయలు |
| వాసుదేవుడు | | గంగావంశానుచరితం | గంగరాజులు |
| రుద్రకవి | 1596 | రాష్ట్రౌఢవంశకావ్యం | రాష్ట్రౌఢవంశము 20 |
| యజ్ఞనారాయణ | 1600 | రఘునాథభూపవిజయము | రఘునాథరాయలు |
| రాజచూడామణిదీక్షితులు | 1620 | శంకరాభ్యుదయము | శంకరాచార్యులు 6 |

| | | | | |
|---|---|---|---|---|
| తిరుమలాంబ | 1600 | వరదాంబికాపరిణయచంపూ | | |
| రామభద్రాంబ | 1600 | రఘునాథాభ్యుదయము | రఘునాథ రాయలు | |
| రామభద్ర దీక్షితులు | 1700 | పతంజలి చరితము | పతంజలి | 8 |
| గోవిందానంద | 1713 | శంకరాచార్యచరితం | శంకరాచార్యులు | |
| ఘనశ్యాముడు | 1725 | భగవత్పాద చరితము | శంకరాచార్యులు | |
| పరమేశ్వర శివద్విజుడు | 1870 | శ్రీరామవర్మ రాజచరితము | రామవర్మరాజు | 8 |
| చండమారుతాచార్య | 1900 | అలీనరాజ్యకథ | | 6 |
| శంకరలాల్ | 1900 | రావజీరాజకీర్తి విలాసము | రావజీరాజు | |
| శివకుమారశాస్త్రి | 1910 | యతీంద్ర జీవన చరితము | భాస్కరానందస్వామి | |
| నాగరాజు | 1940 | భారతీయ దేశభక్త చరితము | | 4 |
| భగవదాచార్యులు | 1940 | గాంధీచరితము | గాంధి | 25 |
| | | స్వాధీన భారతము | భారత | |
| | | భారత పారిజాతము | స్వాతంత్ర్యము | 21 |
| | | రామానందదిగ్విజయము | రామానందులు | |
| మేధావ్రత కవిరత్నుడు | 1950 | దయానంద దిగ్విజయము | దయానంద | |
| రామావతారశర్మ | 20 శతాబ్ది | భారతానువర్ణనము | భారతదేశము | |
| విశ్వనాథ కేశవఛత్రే | ,, | సుభాషచరితము | సుభాష్‌బోస్ | |
| దిలీపదత్తశర్మ ఉపాధ్యాయులు | ,, | మునిచరితామృతము | దయానంద | 22 |
| త్ర్యంబకశర్మ భండార్కర్ | ,, | స్వామి వివేకానంద చరితము | వివేకానందుడు | |
| అఖిలానందశర్మ | ,, | దయానందదిగ్విజయం | దయానంద | 22 |
| భట్టమథురానాథశాస్త్రి | ,, | జయపుర వైభవము | జైపురరాజు | |
| మథురాప్రసాదశాస్త్రి | ,, | ప్రతాపవిజయం | రాణాప్రతాపసింగ్ | |
| | | భారతవిజయం | స్వాతంత్ర్యసంగ్రామం | |
| సదాశివశాస్త్రి | ,, | సింధే విజయవిలాసచంపూ | | |

| | | | |
|---|---|---|---|
| గంగాప్రసాదోపాధ్యాయ | 20 శతాబ్ది | ఆర్యోదయము | ఆర్యసమాజము 21 |
| ద్విజేంద్రనాథశాస్త్రి | ,, | స్వరాజ్య విజయము | స్వాతంత్ర్యము 18 |
| శివవరణ వర్మ | ,, | రాజీవ సౌరభము | రాజీవగాంధి 140శ్లో |
| సుధాకరశుక్ల | ,, | గాంధీ సౌగంధికము | మహాత్మాగాంధి |
| సత్యవ్రతశాస్త్రి | ,, | ఇందిరాగాంధీ చరితము | ఇందిరాగాంధి |
| సత్యవ్రతశాస్త్రి | ,, | గురుగోవిందసింహ మహాకావ్యము | గురుగోవిందసింగ్ |
| బ్రహ్మానందశుక్ల | ,, | నెహ్రూచరితము, శ్రీ గాంధిచరితము | జవహర్‌లాల్ నెహ్రూ, గాంధిమహాత్ముడు |

జైన ఐతిహాసిక కావ్యములు

| | | | |
|---|---|---|---|
| ధనేశ్వరసూరి | 610 | శత్రుంజయ మహాకావ్యము | 14 సర్గలు |
| వీరనంది | 650 | చంద్రప్రభ చరితము | చంద్రప్రభ సూరి 18 |
| జటాసింహనంది | 700 | వరాంగచరితము | వరాంగకథ |
| గుణభద్రాచార్యులు | 855 | జినదత్తచరితము | జినదత్తకథ 9 |
| కనకసేనవాదిరాజు | 950 | యశోధరచరితము | యశోధర 4 |
| మహాసేనుడు | 1010 | ప్రద్యుమ్న చరితము | ప్రద్యుమ్నుడు14 |
| వాదీభసింహుడు | 1025 | క్షత్రచూడామణి | జీవంధరుడు 11 |
| వాదిరాజసూరి | 1025 | పార్శ్వనాథచరితము | పార్శ్వనాథుడు |
| వాగ్భటుడు | 1140 | నేమినిర్వాణము | నేమినాథుడు 15 |
| హేమచంద్రుడు | 1150 | త్రిషష్టి శలాకా పురుషచరితము | 63 జైనమునుల కథలు, 10 పర్వాలు |

| | | | |
|---|---|---|---|
| మునిరత్నసూరి | 1195 | అమమస్వామి చరితము | అమమస్వామి 30 |
| ,, | | మునిసువ్రత చరితము | జైనముని 23 |
| మాణిక్యచంద్రుడు | 1217 | పార్శ్వనాథచరితము | పార్శ్వనాథుడు |
| | | శాంతినాథచరితము | శాంతినాథుడు |
| అభయదేవుడు | 1221 | జయంతవిజయము | జయంతుడు 19 |
| అర్హద్దాసుడు | 1250 | సువ్రతకావ్యము | సువ్రతముని |
| లక్ష్మీతిలకుడు | 1251 | ప్రత్యేక బుద్ధచరితము | జైనమునికథ17 |
| అమరచంద్రుడు | 1560 | పద్మానందకావ్యము | 24 తీర్థంకరులు |
| ధర్మకుమారుడు | 1277 | శాలిభద్రచరితము | శాలిభద్రుడు 7 |
| వీరనంది | 1300 | చంద్రప్రభచరితము | చంద్రప్రభుడు |
| మేరుతుంగుడు | 1306 | ప్రబంధ చింతామణి | జైనకవులు |
| కీర్తిరాజు | 1410 | నేమినాథమహాకావ్యం | నేమినాథుడు 12 |
| చరిత్రసుందరుడు | 1410 | మహీపాలచరితము | మహీపాలుడు 14 |
| భూరామల బ్రహ్మచారి | 1400 | జయోదయకావ్యము | జయకుమారుడు 22 |

## గద్య కావ్యములు :

కావ్యము గద్య, పద్య, చంపూ భేదములచే మూడు విధములు. 'గద వ్యక్తాయాం వాచి' అను ధాతువునకు యత్ ప్రత్యయము చేర్చగా గద్య పదము నిష్పన్నమైనది. ఇది లయ ప్రధానమయి గానము చేయ వీలగు పద్య కావ్యము కంటే భిన్నము - భావ, రసాది వ్యక్తీకరణమునందు స్వతంత్రమయినది. యతి, ప్రాస, వర్ణ - నియమాద్యడ్డంకులు కలిగించకుండా, కవి పాండిత్యమునకు నికషోపలమైనది. "అపాదః పదసంతానో గద్యం" అని దీని లక్షణము

ఈ గద్యకావ్యావిర్భావ విషయమున మూడు వాదములు ప్రసిద్ధములు - 1. పద్య కావ్యముల యొక్క, లోక కథల యొక్క ఆధారముచే గద్య కావ్యములు ఉత్పన్నములు. 2. గ్రీకు గద్యకావ్య ప్రభావముచే ఉత్పన్నములు. 3. పద్యకావ్యమే క్రమముగా వికాసము నొంది- తత్సమానాంతరములగు గద్య కావ్యములకు మాతృక. పద్యకావ్య ప్రభావము వీటిపై ఎంతేని కలదు. కావుననే గద్యకావ్యములందు కూడా గుణ, అలంకార, మానసిక వృత్త్యభివ్యక్తి, - శారీ

రక, నైతిక, ప్రకృతి వర్ణనలు - శబ్దాడంబరము - పాండిత్య ప్రదర్శనము - రసాభివ్యక్తులు కనబడుచున్నవి - కాని పద్యకావ్యమే గద్యకావ్యమునకు ఆధార మని మొదటి వాదము యొక్క సారాంశము

ఇక రెండవ మతము పీటర్సన్ మొదలగు వారలు ప్రతిపాదించగా, ఎందరో ఖండించినారు - సంస్కృత గద్య రచనలందు శాస్త్రీయ, కావ్యీయాలం కారికత - సూక్ష్మ ప్రకృతి వర్ణనము - నైతిక మానసిక, శారీరక గుణ వర్ణ నలు కన్పించగా - ఇందులకు విపరీతముగా గ్రీకు గద్య రచనలందు కథా శ్రితత - సాహసికత, వర్ణనా రాహిత్యములు కనిపించును - కాన గ్రీకు గద్యమే భారతీయ గద్యమునకు మాతృక యనుట ఎంతేని పొసగదు -

ఇక మూడవ వాదాన్ని పరిశీలింతము - వైదిక కాలమునుండే పద్య రచనతో బాటు గద్య రచన నిర్విఘ్నముగా, నిర్విరామముగా సాగి వచ్చు చున్నది - అందులకు గద్యరూపమైన యజుర్వేదము - బ్రాహ్మణములు - ఆరణ్యకములు - ఉపనిషత్తులే ప్రమాణములు - పద్య రచన క్రమముగా వికాసా న్నందించినటుల గద్య రచన కూడా క్రమముగా వికాసాన్నందుతూ ఆలంకారి కులచే వర్ణింపబడినది.

లేఖన సామగ్రి కొరత వలన వల్లెవేయుటకు వీలుగా, ధర్మాన్ని బోధింప పురాణాదులు పద్యరూపములుగా వెల్వడగా, శాస్త్రీయ - దార్శనిక - వైజ్ఞానిక రచనలు గద్యరూపములుగా వెల్వడినవి వాల్మీకి కాలమునందు పద్య రచన రసాలంకార గుణవత్తగు సరసకావ్యత నొందగా, గద్యరచన కూడా నీరసమగు, అమనోజ్ఞమగు, తన పూర్వ రూపాన్ని వదలిపెట్టి, సరసమగు, మనోజ్ఞమగు. రసవదలంకార సద్గుణవత్తగు మనోహర రూపాన్ని ధరించినది జనులనాకర్షింప పద్య రచన రామ కృష్ణాదుల నాశ్రయింపగా, గద్య రచన ఉదయన నర వాహనదత్తాదుల నాశ్రయించినది. కాళిదాస, భారవి, మాఘాదులు క్రమముగా పద్యరచనధారను అలంకార యుక్తములగు కృత్రిమ వర్ణనల జోడించి ప్రవ హింపజేయగా, హరిషేణ, దండి, బాణాదులు గద్యధారను దీర్ఘసమాసయుక్తా లంకార వర్ణనలతో ప్రవహింప జేసినారు - వైదిక సారస్వతమను హిమాలయము నుండి వెల్వడిన పద్యధార గంగ కాగా, గద్యధార యమున అయినది - సహృ దయ హృదయమే సరస్వతికాగా, గంగా యమున లచ్చట త్రివేణీ సంగమా న్నందుచున్నవి.

పద్యము యొక్క ప్రాచీన రూపాన్ని శుక్ల యజుర్వేదమునందు, కృష్ణ యజుర్వేద తైత్తిరీయమునందు, మైత్రాయణీయ, కాఠక సంహితలందును చూడవచ్చును - బ్రాహ్మణారణ్యోపనిషత్తులన్నియు గద్యాత్మకములే. ఈ వైదిక గద్యము సరళము, స్వాభావికము ప్రవహనశీలము, రోచకము, సంవాదాత్మకము నైనది - అథ, వై, ను, వావ, ఖలు, అను నిపాత బహుళమైనది. ఈ గద్య భాగము వ్యాకరణ నియమములకు కట్టుబడినది కాదు -

ఇక వైదిక వాఙ్మయ సంబంధము కల్గిన ప్రాతిశాఖ్య గ్రంథములు, కల్ప సూత్రములు, నిరుక్తము గద్యరూపములైనవే - పురాణములందు కూడా అక్కడక్కడకూడ గద్యాన్ని కాంచవచ్చును-ఇక శాస్త్రీయ గద్యము గంభీరమై, మనన, చింతన, అర్థ విశ్లేషణములచేతనే అర్థమగునదై సామాన్య భావుకున కందరానిదైనది. భారతీయ షడ్దర్శనములు ఈ గద్య మార్గముననే వికసించినవి - సంస్కృత వ్యాకరణ మంతయు సూత్రరూపమైన గద్యాత్మకమే - ఈ సూత్రముల దుర్బోధతను తొలగించ, అనేక భాష్యములు గద్యమార్గముననే అవతరించినవి - ఈ భాష్య గద్యము సరసమై, సరళమై లోకప్రియమైనది - వైద్య గ్రంథములు, అలంకార శాస్త్ర గ్రంథములు, కౌటిల్యుని అర్థ శాస్త్రము కూడా శాస్త్రీయ గద్యమున కుదాహరణములే -

దండి కవి దశకుమార చరితమను గద్య కావ్యము రచించెను. ఈతను క్రీ॥ శ॥ 6 వ శతాబ్దికి చెందినవాడు దక్షిణ భారతము ఈతని జన్మస్థానము కావ్యాదర్శముకూడా ఈతని కృతియే, భరతాచార్యుడు ఉపమా భేదముల ఆయిదింటిని మాత్రమే చూపగా,ఇతడు తన కావ్యాదర్శమున ముప్పదినాలుగుగా నిరూపించినాడు. 'అవంతీ సుందరి కథ'యను గద్య కావ్యమును కూడా ఈతనే రచించెనని కొందరు విమర్శకులు తలంచుచున్నారు దశకుమార చరితము మృదు, పద ఘటితమై భాషా పాటవము గల మొదటి గద్య కావ్యముగా నొప్పుచున్నది రాజవాహనాదులనుపదిమంది రాజకుమారులకథ ఎనిమిది ప్రకరణములలో మనోహరముగా వర్ణింపబడినది.దశకుమార చరితముయొక్క కథ ఈ విధముగా ప్రారంభ<sup>*</sup> గుచున్నది మగధ దేశపు రాజధాని కుసుమపురము (పాట్నా). రాజ హంసుడు రాజు ధర్మపాలుడు, పద్మోద్భవుడు, సితవర్మ, మంత్రులు వీరిలో ధర్మపాలునకు సుమంత్ర, సుమిత్ర, కామపాలురను ముగ్గురు పుత్రులు. పద్మో

ద్భవునకు సుశ్రుత, రత్నోద్భవులనిద్దరు పుత్రులు సితవర్మకు సుమతి, సత్య వర్మలను ఇద్దరు పుత్రులు కలుగుతారు. వీరిలో కామపాలుడు స్వేచ్ఛాచారియై, ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోగా, రత్నోద్భవుడు సముద్ర వ్యాపారానికై వెళ్లుతాడు. సత్యవర్మ సంసారమసత్యమని గ్రహించి తీర్థయాత్రలకై వెళ్ళిపోతాడు మిగిలిన నల్గురు రాజహంసునకు మంత్రులౌతారు మాలవ దేశాధిపతి మానసారుడు మగ ధపై దండెత్తి, రాజహంసుని చేతిలో చిత్తుగా ఓడిపోతాడు. తరువాత తపస్సు చేసి శివుని సంతోషపరచి అజేయమగు గదను పొంది,తిరిగి మగధపై దండెత్తి, విజయమునొందుతాడు పాపము రాజహంసుడు అరణ్యానికి పలాయనము చిత్త గిస్తాడు. రాణులు అడవులలో పతికై వెతకి, వెతకి వేసారి శరీర త్యాగానికి సంసిద్ధులు కాగా రాజహంసుడు కనిపిస్తాడు రాజు రాణులతోసహ వామదేవ ఋషిని దర్శించి, తమ దుఃఖగాథను వినిపిస్తాడు ఋషి ప్రసన్నుడై, ఓదార్చి పుత్ర సంతానమౌతుందని ఆ పుత్రుడు శత్రువుల పాతమార్చి రాజ్యమును తిరిగి సంపాదిస్తాడని భవిష్యద్వాణిని తెలుపుతాడు. ఆ విధముగనే పుత్రుడు పుట్టగా రాజవాహనుడని నామకరణము చేస్తారు నలుగురు మంత్రులకు కూడా మంత్ర గుప్తుడు, మిత్రగుప్తుడు, విశ్రుతుడు, ప్రమతి అను పుత్రులు పుట్టుతారు. యాయావరుడై ఇల్లు వదలిన కామపాలుని పుత్రుడు అర్థపాలుడు, సముద్ర వ్యాపారానికి వెళ్ళిన రత్నోద్భవునియొక్క కుమారుడు పుష్పోద్భవుడు, తీర్థ యాత్రలకు వెళ్ళిన సత్యవర్మ తనయుడు సోమదత్తుడు, వీరలు తమ తండ్రులు కాలగ్రస్తులుకాగా రాజహంసునే ఆశ్రయిస్తారు.

రాజహంసున కాప్తమిత్రుడు మిథిలాధిపతియైన ప్రహారవర్మ మాన సారునిపై దండెత్తి, అపజయమునొంది, అరణ్యము నాశ్రయించగా, భిల్లులు చంపివేస్తారు. ఆతని రాణి ఉపహార వర్మ, అపహారవర్మ అను కవలల ప్రస వించి, కన్నుమూస్తుంది వీరిని పెంచు బాధ్యతకూడా రాజహంసునిపైననే పడు తుంది తన పుత్రుడు, ఏడ్గురు మంత్రిపుత్రులు, ఇద్దరు మిత్రుని పుత్రులు. ఈ పదిమంది కుమారులను పెంచసాగాడు

కాలక్రమమున పెద్దవారలై దిగ్విజయమునకై బయల్వెడలి, ఈదశ కుమారులు తలొక్కదిక్కుగా బయల్వెడల్తారు. చివరికి రాజవాహనుని కలుసు కొని తమ సాహసిక గాథల వినిపిస్తారు. ఈ దశకుమారుల సాహసిక గాథల సంకలనమే ఈ దశకుమార చరితము.

ఈ గ్రంథము పూర్వపీఠిక, ముఖ్యభాగము, ఉత్తరపీఠిక అని మూడు విభాగముల నొందినది పూర్వపీఠికనందు ఐదు ఉచ్ఛ్వాసములు కలవు. 1. రాజవాహన జననము. 2 మంత్రిపుత్రుల జననములు, 3 సోమదత్తుని కథ. 4. పుష్పోద్భవుని చరితము. 5 అవంతిసుందరిని రాజవాహనుడు పెళ్ళాడుట ముఖ్య భాగమునందు ఎనిమిది ఉచ్ఛ్వాసములు కలవు 1 రాజవాహనుని కథ, 2. అపహారవర్మ చరితము, 3. ఉపహారవర్మేతిహసము, 4 అర్థపాలుని ఉదంతము, 5 ప్రమతి జీవితగాథ, 6 మిత్రగుప్తుని ఉపాఖ్యానము, 7. మంత్రగుప్తుని చరిత్ర, 8 విశ్రుతుని విశేషాలు ఉత్తర పీఠికనందు గ్రంథోపసంహారముగా తన రాజ్యమును పదిమంది కుమారులకు పంచియిచ్చిన రాజహంసుని వాన్ప్రస్థ స్వీకారము వర్ణింపబడినది.

"దండినః పదలాలిత్యం" అని లలితపద ప్రయోక్తగా ప్రసిద్ధిబడసిన వాడు ఈ దండికవి. పరిష్కృతమైన గద్యశైలికి జన్మదాత యీతడే గద్యమెలా ఉండాలి? అందు రసము, అలంకారములు, గుణములు ఎలా సమన్వయపరచాలి? అన్న ప్రశ్నలకు చక్కని సమాధానమీతని కావ్యము. ప్రసాద, మధుర గుణయుక్తమైన వైదర్భీరీతి యుక్తమీ కావ్యము కఠినాతి కఠినమైన రాజనీతి కూడా నవనీతమువలె సరళముగా బోధింపబడినది భావానుకూల పదములు ప్రయోగించుట ఈతని ప్రత్యేకత నఖశిఖ పర్యంత వర్ణనము, ప్రకృతి వర్ణనమన్నా ఇతనికెంతో మక్కువ. ఈతని కోమల కాంత పదావలీ రచన మరెక్కడ కానలేము

**సుబంధు :** "కవీనా మగల ద్దర్పో నూనం వాసవదత్తాయా
శక్త్యేవ పాండుపుత్రాణాం గతయా కర్ణగోచరమ్"

అని బాణునిచే స్తుతింపబడిన వాడీ సుబందు కవి బాణుడు ఏడవ శతాబ్ది వాడగుటచే, సుబంధు ఏడవ శతాబ్దికంటె పూర్వుడన్నది నిర్వివాదము. ఈతను 'వాసవదత్తా' అను గద్య కావ్యమును రచించెను కథను పరిశీలింతము.

రాజకుమార్తెయగు వాసవదత్త అందాల రాశి. ఆమెను కందర్పకేతువను రాజకుమారుడు స్వప్నమున గాంచి, ఆసక్తుడై ఆమెకై వెతకనారంభిస్తాడు. తన మిత్రుడగు మకరందునితో బయల్వెడలి, వింధ్యపర్వతాన్ని చేరుకుంటాడు. అక్కడ చిలుకా, గోరంకల గాంచి, వాటి పలుకుల వలన వాసవదత్త కూడా తనవలెనే, కలలో కందర్పకేతువుని గాంచి, అనక్తయై, ఆ భువనసుందరుని

వెతకుటకై సారికను పంపినదని తెలుసుకొంటారు. ఆ చిలుకా గోరింకల మాహాత్మ్యముచే వాసవదత్త కందర్పకేతువులు కలుసుకొంటారు. వాసవదత్త తండ్రి ఆమెను గంధర్వ రాజగు పుష్పకేతువు కిచ్చి పెళ్ళిచేయబోతున్నారని విని, వారిరువురు అశ్వాన్నధిరోహించి వింధ్యపర్వతాన్ని చేరుకుంటారు. ఒక నాడు కందర్పకేతువు నిదురించగా, వనశోభను తిలకించ నిచ్ఛ కలిగిన వాసవదత్త అరణ్యములో తిరుగుతూ బోయవాళ్ళ చేతిలో పడుతుంది. ఆ బోయలు ఆమె సౌందర్యమునకు మోహితులై, కామాసక్తులై, వారిలో వారికే విరోధము కాగా, రెండు వర్గాలుగా చీలిపోయి కొట్టుకొంటుంటారు. ఇదే సమయమని భావించి, వాసవదత్త పరుగెత్తుతూ, స్త్రీలు ప్రవేశించకూడని ఋషి ఆశ్రమాన్ని ప్రవేశించి శిలగా మారుతూంది విరహాకులుడైన రాజు ఆత్మహత్యకై తలపడగా ఆకాశవాణి నివారిస్తూంది రాజు తిరుగుతూ, తిరుగుతూ, ఋషి ఆశ్రమాన్ని చేరుకొని, శిలను కౌగిలించుకోగా స్త్రీగా మారుతూంది వారిరువురూ సంతోషిస్తారు.

ఈ కావ్యరీతి గౌడీ రీతి. ఓజస్సు గుణము సమాసములెక్కువ. కఠినపద విన్యాసము, పాండిత్య ప్రదర్శనము, శ్రమ సాధ్యత్వమిందు స్పష్టము. చిన్న ఇతివృత్తమును గ్రహించి, పెద్దని గద్యకావ్యము రచింప తలంచి అతిదీర్ఘ ములగు ప్రకృతి వర్ణనలు, స్త్రీ సౌందర్య వర్ణనలు, నగ, నగరీ వర్ణనలను జోడించినాడు. శ్లేష-విరోధాభాస, పరిసంఖ్యాద్యలంకారములందు మోహము కలవాడై అతిగా వాడినాడు. "ప్రత్యక్షర శ్లేషమయ ప్రబంధం విన్యాస వైదగ్ధ్యనిధిర్నిబంధం" అని తన కావ్య మహత్వమును ప్రకటించినాడు.

**బాణభట్టు** : సరస్వతీ మూలముగా జనించిన సారస్వత వంశమున కుబేరుడు మహా విద్వాంసుడు. ఈతని పుత్రుడు అర్థపతి ఈతని పుత్రుడు చిత్రభానువు. ఈతని పుత్రుడే బాణుడు 1 ఈతని వంశము వేద, వేదాంగ శాస్త్రములకు నిలయము. చిన్ననాటనే తల్లి గతించగా చిత్రభానువే బాణుని అల్లారుముద్దుగా పెంచినాడు పదునాల్గవ ఏటనే తండ్రి కూడా మరణించగా, స్వేచ్ఛాచారియై, నిరంకుశుడై. ద్యూత - పాన - వేశ్యారతుడౌతాడు తదుపరి

1. కాదంబరీ కథాముఖము.

వివాహము కాగా, ధనార్జనకై రాజ కొలువుకూటాన్ని దర్శిస్తాడు. అచ్చట రాజు "మహానయం భుజంగః" (మిక్కిలి చరిత్రభ్రష్టుడు) అని నిందింపగా, చిన్నతనమున కావచ్చును. కాని ఇప్పుడు పవిత్ర గృహస్థుడను, స్వచ్ఛాచారినే కాని స్వేచ్ఛాచారిని కానని వల్కుతాడు రాజు సంతోషించి సభాపండితునిగా నియమిస్తాడు. హర్షవర్ధనుడు 606 నుండి 648 వరకు పరిపాలించినాడు. అతని ఆస్థానకవి బాణభట్టు కూడా ఆ కాలమువాడే, ఏడవ శతాబ్ది వాడనుట నిర్వివాదము

హర్షచరితము, కాదంబరి ఈతని రచనలు - చండీ శతకమీతని రచన యని కొందరు చెప్పుదురు హర్షచరితము ఆఖ్యాయికా గద్యకావ్యము ఎనిమిది ఉచ్ఛ్వాసములు కలది కథను ఉచ్ఛ్వాసానుసారిగా సంక్షిప్తముగా పరిశీలింతము.

1, 2. బాణుని జీవన వృత్తాంతము - వంశ ప్రవర్తకుడగు వత్సుడు మొదలుకొని బాణజనన పర్యంతము - హర్ష చక్రవర్తి పరిచయము. రాజ సమ్మానము.

3. హర్షుని చరిత్రమిక్కడనుండి ప్రారంభమౌతుంది. పుష్యభూతి వర్ణనము. పుష్యభూతి వంశజుడగు శైవయోగి, భైరవాచార్య చరితములు

4. పుష్యభూతి వంశజుల రాజుల చరితము - ప్రభాకర వర్ధనుని వర్ణ నము - అతనికి యశోవతియందు రాజ్యవర్ధనుడు, హర్షవర్ధనుడను ఇరువురు సుతులు, రాజ్యశ్రీ అను పుత్రిక కలుగుట. గ్రహవర్మ రాజ్యశ్రీల వివాహము.

5. హూణులు హతమార్చ రాజ్యవర్ధనుడు బయల్వెడలుట. హర్షుడు అన్నను వెంబడించి, తండ్రియొక్క అస్వస్థతను విని వెనుదిరుగుట. తల్లి దండ్రుల మరణము.

6. రాజ్యవర్ధనుని ఆగమనము - మాలవాధిపతి గ్రహవర్మను హత మార్చి, రాజ్యశ్రీని బందీ గావించినాడని విని, రాజ్యవర్ధనుడు మాలవాధిపతిపై దండెత్తి, ఓడించుట. గౌడదేశాధిపతి కపటోపాయమునకు రాజ్యవర్ధనునిబలి

7. శశాంకుని హతమార్చ హర్షుని దండయాత్ర - రాజ్యశ్రీకై అన్వే షణము.

8. రాజ్యశ్రీ ఆత్మహత్య చేసుకోపోతున్నదని తెలుసుకొని చెల్లెలును కాపాడుట. దివాకరుని ఉపదేశము చెల్లెలుతో రాజధానికి చేరుకొనుట.

బాణభట్టు మొదటి రచన యగుటచే కథలో అసంపూర్ణత, శిల్పములో అపరిపక్వత కానవచ్చును.

బాణభట్టు కవిత్వ పరిపాకమునకు నిదర్శనము కాదంబరీ గద్యకావ్యము ఇది కవి బుద్ధి విలసితము - కాల్పనికము. కథాత్మక గద్య కావ్యమున కుదాహరణము. ఇందు మూడు జన్మల కథ వ్రాయబడినది.

| | | | | |
|---|---|---|---|---|
| 1. చంద్రుడు | పుండరీకుడు | పత్రలేఖ | కపింజలము | లక్ష్మి |
| 2. చంద్రాపీడుడు | వైశంపాయనుడు | రోహిణి | ఇంద్రాయుధము | చండాలకన్య |
| 3. శూద్రకుడు | 3. చిలుక | | — | — |

(కథాముఖము) విదిశాధిపతి శూద్రకరాజు. అతని కొలువు కూటమునకు చండాలకన్య వచ్చి, మాటలాడు చిలుకను కానుకిస్తూంది ఆ చిలుక తన జీవిత గాథను చెప్తూ.... నన్ను ప్రసవించి మా అమ్మ కన్నుమూయగా, వేటకై వచ్చిన కిరాతకుల చేతిలో మా నాన్న బలియైనాడు తనను జాబాలి ఋషి శిష్యులు రక్షించి, ఆశ్రమమునకు తీసుకపోగా చిలుకయొక్క పూర్వజన్మ గాథను జాబాలి వివరిస్తాడు

(పూర్వార్థ కథ) ఉజ్జయినీ ప్రభువు తారాపీడరాజు అతని అర్ధాంగి విలాసవతి వారికి చంద్రాపీడుడను పుత్రుడు కలుగుతాడు. తారాపీడుని మంత్రి శుకనాసుడు అపర బృహస్పతి అతనికి వైశంపాయనుడను పుత్రుడు కటగుతాడు. ఈ పుత్రులిరువురు ప్రాణస్నేహితులు. కలసి గురుకులమునందు శిక్షణ నొంది విద్యలందు పారంగతులౌతారు. చంద్రాపీడుడు యువరాజ్యాభిషిక్తుడై ఇంద్రాయుధమను అశ్వమునధిరోహించి వైశంపాయనునితో సహా దిగ్విజయ యాత్రకు వెళ్ళుతాడు.

ఒకనాడు హిమవన్నగమున చంద్రాపీడుడు కిన్నరద్వంద్వమును చూసి మోహితుడై వెంబడిస్తూ అచ్ఛోద సరస్సును చేరుకొంటాడు. అక్కడ మహాశ్వేత అను యువ తపస్వినితో పరిచయ మేర్పడుతూంది. ఆమె తన గాథను చెప్పుతూ పుండరీకుడను ఋషి కుమారుని ప్రేమించాను. అతడు నన్ను ప్రేమించి నా కలయికకై పరితపిస్తూ వియోగబాధచే అసువుల బాసినాడు. అందులకై సన్యాసినిగా కాలము గడుపుతున్నాను ఇక్కడికి దగ్గరలోనే నా మిత్రురాలు కాదంబరి ఉన్నది నీవామెను కలుసు కోవలసిందని ప్రేరేపించగా, చంద్రాపీడుడు

కాదంబరిని కలుసుకొంటాడు. మొదటిచూపులోనే వారిలో ప్రేమ అంకురిస్తుంది. అంతలోనె ఉజ్జయిని నుండి తండ్రి రమ్మని కబురంపగా సేనతో వైశంపాయనుని తరలిరమ్మని చెప్పి వెళ్ళిపోతాడు.

(ఉత్తరార్థము) చాలాకాలమైనను వైశంపాయనుడు రాకపోగా, చింతా క్రాంతుడై చంద్రాపీడుడు మహాశ్వేతయందు అసక్తుడై పిచ్చివాడివలె ప్రేమవలుకుల పలికి మహాశ్వేత శాపముచే వైశంపాయనుడు చిలుకగా మారినాడని తెలుసుకొని చంద్రాపీడుడు శరీర త్యాగాన్ని చేస్తాడు కాదంబరి కూడా ప్రియుని అనుసరింప ఆకాశవాణి నివారిస్తూ తిరిగి సమాగమౌతుందని పలుకుతుంది

ఈ విధముగా జాబాలి ఋషివలన పూర్వజన్మ వృత్తాంతమును వినగానే మహాశ్వేత స్మరణకొచ్చినది ఆమెను కలుసుకొనుటకు యత్నించగా ఈ చండాల కన్య పట్టుకొని నీకు సమర్పించినదని చిలుక వివరించినది. అంత చండాలకన్య చిలుకతో నేను నీ తల్లిని లక్ష్మిదేవిని ఓ శూద్రకరాజా! నీవే చంద్రాపీడుడవు, ఈ చిలుకయే పుండరీకుడని తెలపినంతనే వారిరువురు ఆ శరీరముల త్యజించి చంద్రాపీడ, వైశంపాయన శరీరముల ధరిస్తారు కాదంబరీ మహాశ్వేతలతో సుఖముగా జీవిస్తారు

పూర్వార్థమును రచించి బాణభట్టు మహాప్రస్థానము చేయగా, అతని కుమారుడు భూషణభట్టు (పుళిందభట్టు) పూర్తిచేసి తండ్రికి తగ్గ కొడుకని పించుకొన్నాడు. ఈ కాదంబరీ గద్య కావ్యమునకు బృహత్కథ మూలమని విమర్శకుల అభిప్రాయము. బృహత్కథలోని కథ నితివృత్తముగా గొని ఎంతో మార్పులు గావించి మహాకావ్యమును సృష్టించినాడనుట నిర్వివాదము. ఆ రెంటికి గల సామ్య వైషమ్యముల తెలుసుకొందము పాత్రల పేర్లు భిన్నములు పాత్రల సంఖ్య రెండింతలు - కథ విస్తారము. శుకనాస పాత్ర కల్పనము - చంద్రాపీడుని మిత్రునిగా వైశంపాయనుని చిత్రణము - నవీన కల్పనములు - ఏక కిన్నర స్థానమున కిన్నర ద్వద్వము - వర్ణనలందు వైశద్య వ్యాపకతలు - కథా స్వాభావికతాదులు ఈతని ప్రత్యేకతలు. కావుననే "వాణీబాణో బభూవహ" "బాణోచ్ఛిష్టం జగత్సర్వం" అని ప్రశస్తి బడసినాడు.

బాణభట్టు తరువాత నాల్గు శతాబ్దముల వరకు గద్య కావ్యము లావిర్భవించలేదు - ఈ కాలములో వ్రాయబడిన గద్యము శాస్త్రీయ గ్రంథస్థమైనది.

దార్శనికులైన శంకరాచార్యులు, జయంతభట్టు మొదలగు శాస్త్రకారులచే వ్రాయ బడిన గద్యము కొద్దిగా సాహిత్య సీమలను స్పర్శించినను, కావ్యగద్యమని పిలువ బడదు . ఈ పరిస్థితుల్లో కాదంబరి నాదర్శముగా గొని, దానితో పోటీబడు గద్య కావ్యమును రచించి, గద్యకావ్య పరంపరను ముందుకు తీసుకొనుపోవువాడు సాహసవంతుడైన మహాకవి కావాల్సి ఉంటోంది. ఇట్టి కీర్తినందినవాడు కాదం బరితో సమానంగా ఆదరాన్ని చూరగొన్న తిలకమంజరిని రచించినవాడు ధనపాలుడు

**ధనపాలుడు :** ఉజ్జయనీవాసి బ్రాహ్మణుడైన సర్వదేవుని పుత్రుడీతడు . శోభనుడీతని అన్న జైనముని వర్ధమానసూరిచే ప్రభావితుడై జైన దీక్షను స్వీక రించినాడు. ధనపాలుడు కూడా తన అన్ననుండి జైన దీక్షను స్వీకరించినాడు.

తజ్జన్మా జనకాంఘ్రిపంకజరజః సేవా ప్తవిద్యాలవః
విప్రశ్రీధనపాల ఇత్యవిశదామేతామబధ్నాత్కథాం ।
అక్షుణ్ణోఽపి వివిక్తసూక్తిరచనేయః సర్వవిద్యాబ్ధినా
శ్రీముంజేన సరస్వతీతి సదసి క్షోణీభృతా వ్యాహృతః ॥

తిలకమంజరిలోని ఈ శ్లోకం వలన ధనపాలుడు ధారారాజు ఆస్థానమున భోజునకంటే పూర్వమే ముంజరాజు కాలముననుండెనని, 'సరస్వతి' అన్న బిరుదును ముంజరాజు నుండి పొందెననియు తెలియుచున్నది - భోజరాజు ఆస్థానమున ఉండి, జైన ధర్మ సిద్ధాంతముల ఉపదేశించి భోజుని వేటనుండి నివర్తింపజేసినాడని ప్రభావకచరితము ద్వారా తెలియుచున్నది. కావున క్రీ॥ శ॥ 950.1050 మధ్యవర్తిగా ఇతనిని గణింపవచ్చును -

ఈ కవి పాఇఅలచ్ఛీనామమాలా అను ప్రాకృత కోశ గ్రంథమును ఋషభపంచాశిక అను మొదటి తీర్థంకరుడైన ఋషభనాథుని స్తుతించు 50 శ్లోక ములు గల స్తోత్రమును, తిలకమంజరిని రచించెను కాదంబరి నాదర్శముగా గొని వ్రాసినటుల తిలకమంజరి కనిపించును. కాదంబరిలోని గుణదోషములు ఇందులోను ప్రతిబింబించినవి. వికటారణ్య వర్ణనలు, శ్లేష, పరిసంఖ్యాద్యలంకార భరితమూలైన వర్ణనలు, దీర్ఘ సమాస పదములు. శృంఖలాబద్ధమైన శైలి బాణుని తలపింపజేస్తాయి - కాదంబరి కంటె విపరీతంగా ఇందు సంగీత, జ్యోతిష

శాస్త్రాది సంబంధములైన సామగ్రి ఇందులో లభిస్తుంది. అనేక చోట్ల శాస్త్ర వివరణ చర్చలు అధికంగా ఉండటముచేత కథా ప్రవాహంలో బాధ కలుగు తుంది కావుననే నీరసమై, లోకప్రియముకాలేదు - ధారాధీశుడైన భోజమహా రాజుకు జైన ధర్మమును బోధించ ఈ గ్రంథము వ్రాయబడినట్లుగా కనిపిస్తుంది. తిలకమంజరీ, సమరకేతుల ప్రణయ గాథను బోధించు గ్రంథమైనను మధ్య మధ్యలో జైన ధర్మ సిద్ధాంతములు జోడింపబడినవి. ఒక్కొక్కసారి ఇది శృంగార గ్రంథమా, లేక ధర్మ గ్రంథమా అన్న భ్రమనుకూడా కలిగిస్తూంది తిలకమంజరి ప్రభావము తదనంతర జైన గ్రంథములపై ఎంతేని కలదు - సోమేశ్వర కవి -

వచనం ధర్మపాలస్య చందనం మలయస్య చ ।

సరసం హృది విన్యస్యకోఽభూన్నామ ననిర్వృతః ॥ అని ధనపాలుని పొగడినాడు - ధనపాలుని శైలిని తెలుసుకొనుటకి గద్యము - యథా న ధర్మః సీదతి, యథా న రాజలక్ష్మీరున్మనాయతే, యథా న కీర్తిః మందాయతే, యథా న ప్రతాపోనిర్వాతి, యథాన గుణాః శ్యామాయంతే, యథా న శ్రుతముపహాస్యతే, యథా నపరిజనో విరజ్యతే, యథానమిత్రవర్గోగ్లాయతి, యథానశత్రవస్తరలా యంతే, తథా సర్వమన్వతిష్ఠత్. అనునది సరస, సరళ, వ్యావహారిక భాష కుదాహరణము కాగా - అస్తి రమ్యతా నిరస్తసర్వలోకా, స్వపదాపహార శంకిత శతక్రతు ప్రార్థితేన శతతమక్రతు వాంఛావిచ్ఛేదదుర్ధమివ పార్థివానా మిక్ష్వాకూణా ముత్పాదితా ప్రజాపతినా, వృతోజ్జ్వల వర్ణశాలినీ కర్ణికేవాంభోరుహస్య, మధ్య భాగమలంకృత్య స్థితాభారతవర్షస్య....అయోధ్యేతి యథార్థాభిధానానగరీ....అను గద్యము గాఢబంధ శైలికి నిదర్శనము.

**వాదీభసింహుడు** (క్రీ॥ శ॥ 1000) : ఈతని పేరు ఓడయదేవుడు. వాదిరూపులైన ఏనుగులకు సింహములాంటివాడు. కావున వాదీభసింహుడని ప్రసిద్ధినొందినాడు. జైన ధర్మావలంబియైన ఈ కవి గుణభద్రుని ఉత్తర పురా ణమునుండి సత్యధరుని కథను మరియు అతని పుత్రుడగు జీవందరుని కథను గ్రహించి, 11 లంబకములు (సర్గలు) కల్గిన గద్య చింతామణిని రచించినాడు.

ఈతనిపై బాణుని ప్రభావమెంతేని కలదు. మధ్యమధ్యన జైన ధర్మ ప్రబోధములను జోడించి, కథా ప్రవాహమునకు బాధను కల్గించి, కావ్యముయొక్క కళాత్మక శిల్పమునకు భంగము కలిగించినాడు.

సోడ్ఢలుడు : కొంకణ దేశాధీశుడైన చిత్రరాజా నాశ్రయించిన గుజరాత్ కాయస్థుడైన ఈ కవి ఉదయసుందరి కథను రచించెను క్రీ॥శ॥ 1025-50 రచనాకాలమని అంగీకరించబడినది. ఇందులో 8 ఉచ్ఛ్వాసములు కలవు ఇందులో నాయిక ఉదయసుందరి. నాయకుడు మలయవాహనుడు. వీరి ప్రణయము సరసమైన, మధురమైన శైలిలో వర్ణించబడినది ఇందు గద్యకావ్యపు లక్షణములన్ని గోచరించినను. కాదంబరియొక్క గాఢ బంధత, సరసతలు కానరావు.

వామనభట్టబాణుడు : ఆంధ్రదేశీయుడైన ఈ కవి తన ఆశ్రయదాతయగు రెడ్డిరాజగు వేమభూపాలుణ్ణి వర్ణిస్తూ వేమభూపాల చరితాన్ని వ్రాసినాడు. ఈతని కాలము 15వ శతాబ్ది ఉత్తరార్ధముగా అంగీకరించవచ్చును. బాణుని హర్షచరిత ప్రభావమెంతేని కలదు, కావుననే బహుజనామోదము నందలేకపోయినది.

విశ్వేశ్వరపాండేయ: ఉత్తరప్రదేశ్, అల్మోడాజిల్లాలోని ఒకకు గ్రామంలో క్రీ॥శ॥ 1780న జన్మించినాడు. ఈతని తండ్రి లక్ష్మీధర పాండేయ. వ్యాకరణ, తర్క, మీమాంసా, జ్యోతిష, అలంకార శాస్త్ర నిష్ణాతుడీకవి. అలంకార కౌస్తుభమున అలంకార తత్త్వమును, 'వైయాకరణ సిద్ధాంత సుధానిధి' అను అష్టాధ్యాయీ వ్యాఖ్యానమునందు వ్యాకరణ తత్వమును చక్కగా నిరూపించినాడు. ఇవేకాక అలంకార ముక్తావళి, అలంకార ప్రదీపము, రసచంద్రిక, కవీంద్ర కర్ణాభరణము, ఆర్యా సప్తశతి, రోమావలీ శతకము, వక్షోజ శతకము, మందార మంజరి ఈతని రచనలు. వీటిలో మందారమంజరి గద్యకావ్యము : ఇది కాదంబరివలె పూర్వభాగమీ కవి రచింప, ఉత్తర భాగమీతని శిష్యునిచే రచింపబడినది. కథ, వర్ణన, శైలి, భావము, కళ, శిల్పము వీటన్నిటియందును కాదంబరి ప్రభావ మెంతేని కలదు. చిత్రభానువను రాజకుమారుడు, మందార మంజరియను విద్యాధర కుమారి ఇందులో నాయక నాయికలు. వీరి ప్రణయకథ ప్రధానమైనది. దీనితోపాటు అనేక ఉపకథలను జోడించడంచేత అసాంతం గ్రంథం చదువనిదే కథ అసలు అర్థముకాదు. వర్ణనల్లో అస్వాభావికత, పాండిత్య ప్రదర్శన, అలంకారకములధికంగా ప్రయోగించుటవలన కొన్నిచోట్ల వ్యాఖ్యానము చూడ

నిది అర్థము కానేకాదు. ఉదాహరణకు .. హరలీలేవ కిరాతాక్రితా, రాత్రి రేవ ప్రాగ్జ్యోతిషోల్లసితా, ముముక్షు రివాశ్రితకాశి, నర్మదేవ మేకలాశ్రితా, యువతి దృగివ సాంజనా ... ప్రాచీదిక్ . మరియు 'యాజ్ఞా నిరాపో మానివిమ్న న దాత్య మ అశ్లీల భాషణ మశ్వమేథ విధిమ రతి ప్రయోగేషు చ న సద్గోష్ఠిషు, ద్విజపరీక్షణం లక్షణ విచారేషు నదానేషు, శృంగిలంఘనం వధూనాం కటాక్షేష న జనేషు సమభవన్ ..

**అంబికాదత్తవ్యాస్:** సంస్కృత సాహిత్య గంగ ప్రవహిస్తూ ప్రవహిస్తూ శుష్కించగా, ప్రవాహమే ఆగిపోగా, స్వీయ ప్రతిభా విశేషముచే పునః సాహిత్య గంగను గతిశీలంగా చేసినవాడు ఆధునిక బాణభట్టని ఖ్యాతినొందినవాడు అంబికా దత్తవ్యాస్. క్రీ॥శ॥ 1858-1900 పాట్నా గవర్నమెంట్ సంస్కృత కాలేజి నందు ఆచార్యులుగా బోధన వృత్తిని స్వీకరించినారు. సంస్కృతము, హిందీలో 75 గ్రంథములవరకితను రచించినాడు అన్నింటిలో ఉత్తమమైనది శివరాజ విజయము. ఐతిహాసిక కావ్యము 12 ఉచ్ఛ్వాసములతో కూడుకొన్నది. ఛత్రపతి శివాజీ చరితాన్ని బోధించునది. ఆధునిక సంస్కృత సాహిత్యముయొక్క యుగప్రవర్తక గ్రంథమిది. ఛత్రపతి శివాజీ వీర కృత్యములతోపాటు మొగల్ సామ్రాజ్యముపై అతని విజయమిందు వర్ణింపబడినది. ఇందలి భాష సహజము, సరళము, సరసము. కథావర్ణనలో ఎలాంటి బాధలేకుండ శీఘ్రముగా నడుస్తుంది. ప్రాచీన గద్య కావ్యములోని దీర్ఘ సమాస రచన, నీరస వర్ణనము మొదలగు దోషములను నివారించి కవి తన ప్రతిభచే నవలా మార్గమున ఈ కావ్యమును రచించినాడు చదువుతుంటే పాఠకులకొక ఉత్సుకతను కలిగింప చేస్తూందే తప్ప విసుగును కలిగించదు సంస్కృత గద్య సాహిత్యమున ఈ కావ్యము మైలురాయిలాంటిది

కదలీదలం కుంజాయితస్య ఏతత్కుటీరస్య సమంతాత్ పుష్పవాటికా పూర్వతః పరమ పవిత్ర పానీయమ్, పరః సహస్ర పుండరీక పటల పరిలసితం, పతత్రికుల కూజిత పూజితం సర ఆసీత్. ఇత్యాదులు కవియొక్క వస్తువర్ణన సఫలతకు నిదర్శనములు. ఆధునిక కాలమందలి నవలలవలె చక్కని సంవాదములు ఇందు శోభింపబడినవి. ఉదాహరణకు గౌరీసింహః-కుతోఽసి యవన కుల కలంక. యవనయువకః . అః వయమపి కుత ఇతి ప్రష్టవ్యాః. కాతరతమ కంధరి కుంద రేష్యసి శరాము. చక్కని సంవాదములతో, నవలా కావ్య ప్రక్రి

యతో వ్రాయబడిన ఈ శివరాజ విజయమున అన్ని సాహిత్య శిల్ప గుణములు కాంచవచ్చును.

**హృషికేశ్ భట్టాచార్య** క్రీ॥శ॥ 1850: బంగ్లాదేశ్, జైపూర్ జిల్లాలోని ధుగియాపూర్ గ్రామమున మధుసూదనశర్మ గృహమున జన్మించెను. సంస్కృతాంగ్లాది భాషలందు నిష్ణాతుడు. లాహోరులోని ఓరియంటల్ కాలేజినందు సంస్కృతాచార్యులుగా పనిచేసెను. ఎన్నో సంస్కృత గ్రంథములను, ఆంగ్ల గ్రంథములను కూడా సంస్కరించి ప్రచురించెను. వీరిచే ఆంగ్ల గ్రంథములెన్నో సంస్కృత భాషలోనికి అనువదింపబడినవి వీటిలో 'పర్యాటక త్రింశత్'హేమ్లెట్ చరితములు ముఖ్యములైనవి. 1872 న 'విద్యోదయ'మను సంస్కృత సాహిత్య విమర్శన రూపమగు మాసిక పత్రికను ఆరంభించిరి. వీరి మరణ (1913) అనంతరము వీరి పుత్రులు భవవిభూతి, భవభూతి ఈ భారమును స్వీకరించినారు విద్యోదయములోని నిబంధములన్ని కూడ చక్కని గద్యకావ్యములు. మ్యాక్స్‌మూలర్ మొదలగు పాశ్చాత్య విద్వాంసులు ఈతని నిబంధముల ప్రతిపాదన శైలిని, భాషా ప్రవాహమును స్తుతించినారు. గిరిధరశర్మ చతుర్వేది ముద్రయతి వదనవివరం మృత భాషావాదినాం ముహేరాణాం, స్మరయతిచ భట్టబాణం భట్టాచార్యస్య సావాణీ॥ అని భట్టాచార్య సంస్కృత భాషను పొగడినాడు. ఈతని నిబంధములు 'విద్యోదయ' పత్రికయందు లభ్యములగుచున్నను. 11 నిబంధములు 'నిబంధమంజరి' అన్న పేరుతో ప్రచురితమైనది. ఈ గ్రంథమున విషయ వైవిధ్యంతోపాటు శైలీ వైవిధ్యము కూడా కలదు. 'సంస్కృత భాషాయాః వైశిష్ట్యం', 'ఉదారదర్శనం', 'మహారణ్య పర్యవేక్షణం' 'ఉద్భిజ్జ పరిషత్' ఇత్యాది నిబంధములు ప్రతిపాదక శైలి ననుసరించియు, విషయ మహత్త్వము ననుసరించియు పేర్కొనదగినవి. ఉదాహరణ కొక గద్యము నియతి కృత నియమ వశాద్వా నిరంతర వైచిత్ర్య దర్శనానురాగిణః పరమేష్ఠినో ఽ వంధ్యాభిలాషాద్వా, దుర్భేద కార్యకారణధారా ప్రాబల్యాద్వా మానవానాం వాగ్యంత్రగత నైసర్గిక వైషమ్యాత్ సముత్పన్నాః భిలపరస్పరం విభిన్న రూపా బహువిధా భాషాః ..

**క్షమారావు :** (1890-1954) : మహారాష్ట్ర విద్వాంసులలో ఖ్యాతినొందిన పండిత శంకర పాండురంగ మరియు ఉషల కూతురు క్షమా విల్సన్ కాలేజీలో డిగ్రీ చదువుతుండగా డా. రాఘవేంద్రరావుతో వివాహము జరిగినది. ఈమె

సంస్కృతము, మరాఠీ, ఇంగ్లీషు, గుజరాత్ మొదలగు భాషలలో ప్రావీణ్యురాలు. సంస్కృత సాహిత్యమున ఆధునిక పద్ధతిన కథలు వ్రాయ శ్రీకారము చుట్టినదీమె. స్వాతంత్ర్య సంగ్రామమున పోరాడుటకై గాంధి అనుమతివ్వకపోగా, తన శక్తినంత రచనలందుపయోగించినది స్వాతంత్ర్యనినాదము, గాంధీ వాదము ఈమె రచనల్లో ప్రతిబింబించినవి కథాముక్తావళీ గద్యకావ్యము ఆధునిక లఘు కథల సంకలనమిది. ఇందలి కథలు ఈమె యొక్క అత్యంత ప్రౌఢమైన శైలికి నిదర్శనములు. 'రావోపాహ్వ క్షమాదేవి గద్యే భాభాయతే ధృవం.'

కాశీనగరవాసి, ప్రభుత్వ సంస్కృత కళాశాలా విశ్రాంత సాహిత్య విభాగాధ్యక్షులు. నారాయణ శాస్త్రిఖిస్తే 'దరిద్రాణాం హృదయం' మరియు 'దివ్యదృష్టి' అను రెండు లఘు గద్య కావ్యముల రచించినారు. జయపుర నివాసీ భట్ట మథురానాథశాస్త్రి 'భారతీ' మరియు 'సంస్కృత రత్నాకర' పత్రికలకు సంపాదకులుగా ఉంటూ అనేక కథలను వ్రాసినారు. ఇందు 26 లఘు కథలు భాష, భావముల దృష్ట్యా గొప్పనైనవి. రాజస్థాన్, ఝాలావాడ్, జిల్లా నివాసీ శ్రీ గణేశ్ రామశర్మ 'భారతీ' సంస్కృత రత్నాకర' పత్రికలలో అనేక కథలను వ్రాసినారు. రాజస్థానీ సాహిత్య అకాదమీ ఈతని 20 కథల సంపుటిని ప్రచురించినది. కలకత్తా నివాసి శ్రీనివాస శాస్త్రి 'చంద్రమహీపతి'. 'సూర్యప్రభా' అను రెండు గద్య కావ్యముల రచించినారు. బహుభాషా కోవిదుడు, విశ్రాంత రాజ్యసభా అనువాదకుడు, కర్నాటక దేశవాసి శ్రీ రత్నపారఖీ 'కుసుమలక్ష్మీ' అను గద్య కావ్యమును రచించినారు. కావ్య శిల్ప దృష్ట్యా ఈ గద్యకావ్యము గొప్పనైనది. ప్రసిద్ధ వైయాకరణి చారుదేవ శాస్త్రి గాంధీజీ చరిత్రను 'గాంధీ చరితము" అను గద్యకావ్యమున చక్కగా వర్ణించినారు. 'ప్రస్తావ తరంగిణీ',అనునది ఇంకొక గద్యకావ్యము - విభిన్న విషయ నిబంధముల సంకలనమిది. ప్రసిద్ధ భాషాశాస్త్రజ్ఞుడైన డా. మంగళదేవ శాస్త్రి విభిన్న విషయక లలిత నిబంధముల సంగ్రహాత్మకమైన 'ప్రబంధ ప్రకాశము'ను రచించినాడు విశ్వసంస్కృత నివృత్త ప్రధాన సంపాకుడు. ఉత్తరాంచల నివాసి డా. శివప్రసాద భారద్వాజ నిబంధముల సంగ్రహాత్మకములైన 'నిబంధ మణిమాల' 'నిబంధ రత్నాకరము'లను వ్రాసినాడు నెహ్రూ చరితము, గాంధీ చరితము మొదలగు మహాకావ్య గ్రంథకర్త ఆచార్య బ్రహ్మానంద శుక్ల 'భారత సుషమ' అను గద్యకావ్యమును వ్రాసినాడు . డా. రమేశచంద్రశుక్ల 'ప్రబంధ

రత్నాకరము'ను వ్రాసినాడు ఇందలి శైలి సరసమైనది. సరళమైనది.వ్యాకరణ శాస్త్రమును కావ్యముద్వారా బోధింప తలచి రావణవధమును రచించినట్లుగా డా. రామశరణత్రిపాఠీ 'కౌముదీ కథాకల్లోలినీ' అను గద్యకావ్యమును రచించినాడు. ఉదయనపుత్రుడైన నరవాహనదత్తుని జన్మ ప్రభృతి గంధర్వరాజ్యాభిషేకము వరకు గల కథ వర్ణింపబడినది. మధ్య మధ్యలో కాదంబరిలోలాగా పెద్ద పెద్ద వర్ణనలు కలవు. ఇందు సిద్ధాంతకౌముది యందలి వ్యాకరణ ప్రయోగముల యొక్క విశేష క్రమ సన్నివేశము దీని ప్రత్యేకత. ఈతని భాష, శైలిల దర్శింప ఈ ఉదాహరణము - విష్ప్రయోగః మాండూకేయేషు, శాపేయతా శాపేయేషు, గుణవిచ్ఛేదః తంతువాయ్యేషు, తీక్ష్ణతా తక్షణేషు నాన్యేషు దృశ్యతేస్మ - డా. కపిలదేవ ద్వివేది నిబంధ సంగ్రహాత్మకములైన 'నిబంధాంజలి' మరియు 'నిబంధ శతకము'లను వ్రాసినాడు. సాగరికా, పత్రిక వ్రాంత సంపాదకులు, సాగర్ విశ్వవిద్యాలయ వ్రాంత, సంస్కృత విభాగాధ్యక్షులైన రామజీ ఉపాధ్యాయగారు 'ద్వాసువర్ణా' అను ఆలోచనా ప్రధానమైన గద్యకావ్యమును, సంస్కృత సాహిత్య వివేచనాత్మకములగు నిబంధములెన్నియో వ్రాసినారు - ఉస్మానియా విశ్వవిద్యాలయ వ్రాంత సంస్కృత విభాగాధ్యక్షులు ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు చక్కని శైలితో, సరసమైన భాషలో నిబంధ సంగ్రహాత్మకమైన నిబంధ భాస్కరమును వ్రాసినారు.

మరికొన్ని గద్య కావ్యములు క్రింది పట్టికలో పేర్కొనబడుచున్నవి.

| | | | |
|---|---|---|---|
| అగస్త్యుడు | 1320 | కృష్ణచరితము | కృష్ణకథ |
| విద్యావతి | 15 శతాబ్ది | భూపరిక్రమా | భూగోళవర్ణన |
| దేవవిజయగణి | 1596 | రామచరితము | రామకథ |
| వరదదేశికుడు | 1650 | గద్యరామాయణం | ,, |
| అహోబిలనృసింహ | ,, | అభినవకాదంబరి | కృష్ణరాజకథ |
| కవీంద్రాచార్య | ,, | కవీంద్ర చంద్రోదయం<br>కవీంద్ర కల్పద్రుమం | |
| జగన్మోహనుడు | ,, | దేశావలీవివృతి | 56 రాజ్యములవర్ణన |
| మహేశఠాకూర్ | ,, | సర్వదేశ వృత్తాంత సంగ్రహము | |

| | | | |
|---|---|---|---|
| హరకవి (భానుభట్టు) | ,, | శంభురాజ చరితము | |
| శైలదీక్షితులు | 180? | భారతీవిలాసము | అనువాదము |
| (తిరుమలాచార్య) | | కావేరిగద్యము | కావేరీనది |
| | | శ్రీకృష్ణాభ్యుదయము | కృష్ణకథ |
| తిమ్మకవి | 19 శతాబ్ది | సుజనమనః కుముదచంద్రికా | |
| అప్పాశాస్త్రి | 1873 | సంస్కృత చంద్రికా | పత్రికా |
| | | సూనృతవాదీ | ,, |
| కృష్ణమాచార్య | 19 శతాబ్ది | పాతివ్రత్యము<br>పాణిగ్రహణము<br>వరరుచి, సుశీలా | |
| అనంతాచార్య | 1874 | మంజుభాషిణీ<br>సంసారచక్రము | పత్రికా |
| చక్రవర్తి రాజగోపాల | 1874 | శైవాలినీ, కుముదినీ<br>విలాసకుమారీ, సంగరము | కథలు |
| రాజమ్మ | 1887 | చంద్రమౌళి | ,, |
| కల్యాణరామశాస్త్రి | 19 శతాబ్ది | కనకలత | ,, |
| జగ్గు అలవార్ అయ్యంగార్ | 20 శతాబ్ది | జయంతికా | ,, |
| ఆచార్య శేషశాయి | ,, | అష్టావక్రీయమ్ | |
| శైలతాతాచార్య | ,, | దుర్గేశనందినీ<br>క్షత్రియరమణీ | బెంగాల్ నవలల<br>అనువాదములు |
| హరిచరణభట్టాచార్య | ,, | కపాలకుండలి | అనువాదము |
| ఆచార్య శ్రీశైల | ,, | మేనకా | కథ |
| మేధావ్రత ఆచార్య | ,, | కుముదినీచంద్రము | ,, |
| వామన కృష్ణచిత్రలే | ,, | లోకమాన్యతిలక చరితం | తిలక్ కథ |
| భగీరథ ప్రసాద త్రిపాఠి | ,, | కథాసంవర్తిక | 13 కథలు |
| దిలీపదత్తశర్మ | , | మునిచరితామృతం | దయానందుడు |

| | | | |
|---|---|---|---|
| రంగనాథుడు | ,, | వాక్యరత్నావళి | రామకథ |
| సుబ్రహ్మణ్యసూరి | ,, | ఆసేచనక రామాయణం | ,, |
| వేంకటేశ వామనసోవాని | ,, | శివావతార ప్రబంధం | శివాజీకథ |
| డి యస్ శర్మ | , | గాంధీసూత్రములు | 108 సూత్రములు |
| శ్రీపాదశాస్త్రి హసూర్కర్ | ,, | జీవన చరితములు | |
| స్వామి భాగవతాచార్య | ,, | గాంధీచరితము | గాంధిజీవనము |
| చారుదేవశాస్త్రి | ,, | ,, | ,, |
| వ్యాసరాయశాస్త్రి | ,, | కాళిదాస నాటక కథామంజరి | కాళిదాస నాటకములు |
| మహాలింగశాస్త్రి | ,, | భాసనాటకకథా | భాసనాటకములు |
| టి కె. గణపతిశాస్త్రి | ,, | సేతుయాత్రానువర్ణనం | యాత్రాగ్రంథము |
| మంగళదేవశాస్త్రి | ,, | ప్రబంధ ప్రకాశః | నిబంధములు |
| రామావతారశర్మ | | సాహిత్య రత్నావళి | |
| మహామహోపాధ్యాయ | ,, | కళాకౌముదీ<br>భారతీయ మితివృత్తం<br>దేశాంతరీయేతిహాస తరంగః | విదేశేతిహాసము 18 |
| రామస్వరూపశాస్త్రి | ,, | త్రిపురదాహః | |
| రమేశచంద్రశుక్ల | , | ప్రబంధ రత్నాకరః | నిబంధములు |
| గిరిధరశర్మ చతుర్వేది | ,, | చతుర్వేది గ్రంథమాల | ,, |
| శివప్రసాదశాస్త్రి | ,, | నిబంధ మణిమాలా | ,, |
| హరిదత్తశాస్త్రి | ,, | ఏకాదశతీర్థ | నదీవర్ణన |
| రామకృష్ణాచార్య | ,, | నిబంధాంజలి | నిబంధములు |
| రాజకిశోరసింహ | ,, | నిబంధ రత్నాకరః | ,, |
| బాబూరాంత్రిపాఠీ | ,, | నిబంధ కౌముదీ | ,, |
| పారసనాథద్వివేదీ | ,, | నిబంధనవనీతం | ,, |
| ఎ. వరదాచార్యులు | ,, | కథాకుసుమాంజలి | కథాసంపుటి |

| | | | |
|---|---|---|---|
| సన్నిధానం సూర్య నారాయణశాస్త్రి | ,, | ఆంధ్రదేశ హాస్యకథాః, వేంకటేశ్వర వచన శతకమ్ | ఆంధ్రకావ్య కథాః, కళా పూర్ణోదయమ్ |
| బి లక్ష్మీకాంతయ్య | ,, | సంస్కృతకావ్యకథాః | కథలు |

## చంపూ కావ్యములు :

చురాదిగణ గత్యర్థక చపి ధాతువునకు ఔణాదికమగు ఉన్ ప్రత్యయము చేర్చగా చంపూ శబ్దము నిష్పన్నమైనది. 'చంపయతి సహైవ గమయతి గద్య పద్యే ఇతిచంపూః' గద్య పద్యములను సమాన భావముచే, కలిపి ప్రయోగింప బడు రచన చంపూకావ్యము. 'చమత్కృత్యపునాతి, సహృదయాన్ విస్మయీ కృత్య ప్రసాదయతి ఇతిచంపూః' శబ్ద చమత్కారము. అర్థ ప్రాసద్యము కలిగి పాఠకుల ఆనంద డోలికల ఉర్రూతలూగించునది చంపూ కావ్యము. 'గద్య పద్యమయం కావ్యం చంపూరిత్యభిధీయతే' అని సాహిత్య దర్పణ కర్త నిర్వచించినాడు.

ఈ చంపూ పరంపర ప్రారంభము కృష్ణ యజుర్వేద తైత్తిరీయ మైత్రాయణీయ కాఠక సంహితలందు అథర్వ వేదమునందును గద్య పద్య మిశ్రిత రూప ప్రయోగమున కానవచ్చుచున్నది. బ్రాహ్మణ గ్రంథముల ఉపాఖ్యానము లందు గద్య పద్య మిశ్రితరూపము విశేషముగా ఐతరేయ బ్రాహ్మణ హరి శ్చంద్రోపాఖ్యానమునందు గాంచవచ్చును. కఠ ప్రశ్నాద్యుపనిషత్తులందు ఈ గద్య పద్య మిశ్రితరూపము ప్రయోగింపబడినది. ఇక లౌకిక సాహిత్యమున భారత - భాగవత - విష్ణు పురాణాదులందు - బౌద్ధ జాతక కథలందును చూడ వచ్చును - నాల్గవ శతాబ్దినుండి ఆవిర్భవించిన శిలా శాసనములందు చంపూ పద్ధతి కడుస్పష్టము. ఈ చంపూ పద్ధతిని ఏకధారగా, స్వతంత్ర రచనా పద్ధతిగా కల్పించినవాడు త్రివిక్రమభట్టు, కాన అతడే ప్రథమ చంపూ కావ్యకర్తగా గ్రహింపబడుచున్నాడు.

త్రివిక్రమభట్టు శాండిల్యగోత్ర బ్రాహ్మణుడు. ఇతని తాత శ్రీధరుడు. తండ్రి దేవాదిత్యుడు. ఈ త్రివిక్రమభట్టు మాన్యఖేటమును రాజధానిగా చేసుకొని పాలించిన రాష్ట్రకూట రాజవంశీయుడగు మూడవ ఇంద్రుని ఆస్థాన పండితుడు. క్రీ॥శ॥915నాటి శిలాశాసనమునందలి మూడవ ఇంద్రరాజు త్రివిక్రమభట్టు నామ

ములు పై విషయమును దృఢీకరించుచున్నవి. ఈ శాసనము నవసారియందు దొరికినది. ఇతని తండ్రి నేమాదిత్యుడనియు, అతనుకూడా ఇంద్రరాజును ఆశ్రయించినాడని ఇందు కలదు కాన క్రీ॥శ॥ 915 నాటివాడనుట నిర్వివాదము.

ఈ కవి రచించిన గ్రంథములు రెండు. నలచంపూ - మదాలసచంపూ- నలచంపూకావ్యము 7 ఉచ్ఛ్వాసములు కలది. నలదమయంతుల ప్రణయ కథ వర్ణింపబడినది, కథ పూర్తినొందలేదు - కావుననే దేవతల సందేశమును తీసుకొని నలుడు, దమయంతీ భవనాన్ని చేరుకొని, దమయంతిని దర్శించుట, పరస్పర మిద్దరు ప్రేమాసక్తులగు కథ మాత్రమే వర్ణింపబడినది. ఈ విషయమున ఒక ఐతిహ్యముకలదు త్రివిక్రముని తండ్రి నేమాదిత్యుడు ఆనాటి విద్వాంసులలో మూర్ధన్యుడు, రాజసభా పండితుడు. అతను కార్యవశమున పరదేశము వెళ్ళినాడు. ఇంతలోనే ఒక పండితుడు రాజదర్బారుని ప్రవేశించి, సభాపండితుని శాస్త్రార్థమునకై పిలచినాడట! అంత రాజు నేమాదిత్యుని పిలుచుటకై ఒక సేవకుని ఇంటికి పంపగా, త్రివిక్రముడా వృత్తాంతమును విని, తాను విద్యనభ్యసించక కాలమంతా వ్యర్థముగా గడపి, మందమతి నయ్యాయని క్షోభపడి, తండ్రి గౌరవమును నిలుపలేనందుకు సిగ్గుపడినాడు. తరువాత సరస్వతీదేవికై తపస్సుచేసి దేవీసాక్షాత్కారమునొంది తండ్రి వచ్చేంతవరకు విద్యనిమ్మని యాచించి, దేవీ అనుగ్రహము పొంది రాజాస్థానమును ప్రవేశించి, ఆ పండితుని సునాయాసముగా జయించినాడు. తరువాత ఆలోచించి సరస్వతీ సాక్షాత్కారమును వ్యర్థము కానివ్వకూడదని తలంచి నలచంపువును వ్రాయసమకట్టి 7ఉచ్ఛ్వాసములువ్రాయగానే నేమాదిత్యుడు (తండ్రి) రాగానే సరస్వతీ వరదానము సమాప్తినొందుటచే జ్ఞానహీనుడై నాడు కావుననే నలచంపును పూర్తిగావించలేదని ఈ ఐతిహ్యసారాంశము. ఈ కథ కపోల కల్పితము కాని వాస్తవికము కాదు. 'జానాతి పునస్స్వమ్యక్ కవిరేవకవేః శ్రమం' అని స్పష్టముగా తన పరిశ్రమవలన గ్రంథము రచించినట్టుల పేర్కొన్నాడు. గ్రంథము పూర్తికాకపోవడానికి జాజాది కృతులకు వచ్చిన ఏ విఘ్నమో కావచ్చును.

ఇతని రచన శ్లేష ప్రధానమైనది."ప్రసాద మాధుర్య గుణ గుంఫితమైన కవిత్వము అమృత రసాస్వాదము నందజేయాలి. కవితయందు రస చమత్కారముండాలి. దానివలన విద్వాంసుల హృదయములు ఆనందాన్ని పొందాలి. కవిత ప్రసాద గుణయుక్తమై, శ్లేషాలంకార మధురశోభతో యుక్తమై వినువారి వీనుల

వింద చేయాలి". అని కవితా లక్షణముల పేర్కొటూ వాటిని ఆచరించి చూపించి నాడు - నలచంపూనందలి శ్లేషము సుబోధము సరళము - శ్లేషతోబాటు అను ప్రాసము యమకము, అతిశయోక్తి ఉత్ప్రేక్ష, పరిసంఖ్యాద్యలంకారముల కాంతి ఇందు స్పష్టము కవి వాల్మీకిని నమస్కరిస్తూ పలికిన ఈ శ్లోకమున విరోధాభాస శ్లేషాలంకారముల విన్యాసము విద్వద్బృంద ప్రశంసనీయము.

సదూషణాపి నిర్దోషా సఖరాపి సుకోమలా।
నమస్తస్మై కృతాయేన రమ్యారామాయణీ కథా॥

రామాయణ కథలో ఖరదూషణ రాక్షసులున్నారు కథ మాత్రము కోమలము, దోషరహితము-వస్తుతః కథయందు ఎలాంటి తీక్ష్ణత్వము దోషములు కానిలేవు. ఈ విధముగానే సుందరమైన కావ్యమును మామిడిపండుతో పోల్చినాడు -

కావ్యస్యామ్రఫలస్యేవ కోమలస్యేతరస్య చ ।
బంధచ్ఛాయావిశేషేణ రసోఽప్యన్యాదృశో భవేత్ ॥

మామిడికాయ పాకానికి రాగా కఠినము పండిన తరువాత కోమలమైనట్లుగా, కావ్యము కూడా కవి యొక్క పాకమును బట్టి కావ్యము కఠోరము, కోమల మౌతూంది -

అప్రగల్భా పదన్యాసే జననీరాగహేతవః ।
సంత్యేకే బహులాలాపాః కవయో బాలకా ఇవ॥ అని కుకవులను చిన్న పిల్లలతో పోల్చినాడు - ఆర్యావర్త క్షేత్రాన్ని వర్ణిస్తూ - 'సారః సకల సంసార చక్రస్య, శరణ్యః పుణ్యకారిణాం, ధామ ధర్మస్య, ఆస్పదం సంపదాం, ఆశ్రయః శ్రేయసాం, ఆకరః సాధువ్యవహారరత్నానాం, ఆర్యావర్తోదేశః" అని సరళ, సరస పదములు కల్గిన భాషయందు సౌష్ఠవ మాధుర్య గుణముల సమన్వయు పరచినాడు "స్ఫోట ప్రతవో వైయాకరణేషు, గ్రహసంక్రాంతిః జ్యోతిః శాస్త్రేషు, భూతవికారవాదః సాంఖ్యేషు, క్షయ స్థితిషు దృశ్యతేనప్రజాసు" అని విభిన్న దుర్గుణములు అన్యస్థానములందున్నవి . ఆర్యావర్త ప్రజలలో లేవని పరి సంఖ్యను చమత్కారముగా ప్రయోగించినాడు

భవంతి ఫాల్గునేమాసి వృక్షశాఖా వివల్లవాః ।
కాయంతేన త్రిలోకస్య కదాపిచ వివల్లవాః ॥

ఫాల్గునమాసమున చెట్టుకొమ్మలు పల్లవరహితములు - భారత వర్షమున ఫిన్నత్తు యొక్క లవముకూడా లేవని 'వివల్లవాః' అని సభంగ శ్లేషను ప్రదర్శించినాడు.

బ్రహ్మణ్యోఽపి బ్రహ్మవిత్తాపహారీ స్త్రీయుక్తోఽపి ప్రాయశో విప్రయుక్తః ।
సద్వేశోపి ద్వేషనిర్ముక్తచేతాః కో వా తాదృగ్ దృశ్యతే భూయతేవా ॥

నలరాజు మహామంత్రి శ్రుతశీలుని వర్ణిస్తూ విరోధాభాసాన్ని ప్రయోగించినాడు.

ఘనకదంబ - కదంబక - నిష్పతన్ - నవ - పరాగ - పరాగము ఖా
మంథరాః ।

హృత - తుషార - తుషా రతిరాగిణాం ప్రియతమా - మరుతా-
మరుతోవవుః ॥

ఇత్యాది యమకములు కవి ప్రతిభకు ద్యోతకములు - క్రీ॥శ॥ 950-న సిద్ధరాయుడు శైవ ధర్మ ప్రబోధకమైన రేణుకవిజయ చంపువును వ్రాసినాడు.

**హరిశ్చంద్రకవి :** జైనమునియైన జీవంధరుని జీవిత గాథ ఉత్తరపురాణమైనదాని నాధారముగా చేసుకొని ఈ పదవ శతాబ్దినందే హరిశ్చంద్ర కవి జీవంధర చంపూ కావ్యాన్ని రచించినాడు. బాణుని మరియు వాక్పతి రాజుల అనుకరించినాడీ కవి. నేమి దేవుని శిష్యుడు ఇతడు.

**సోమదేవసూరి :** క్రీ॥ శ॥ 956 న జైన కవి యగు సోమదేవసూరి యశస్తిలక చంపూ గ్రంథమును రచించినాడు - రాష్ట్రకూట రాజగు కృష్ణుని సమకాలికుడు. రాష్ట్రకూటుల సామంతుడగు చాళుక్య ప్రభువగు మూడవ అరికేసరిని ఆశ్రయించిన కవి ఇతడు - ఈ చంపూ గ్రంథమునందు 8 ఉచ్ఛ్వాసములు కలవు - చివరి 3 ఉచ్ఛ్వాసములు ఉపదేశాత్మకములై, ధార్మిక గ్రంథ తుల్యములు. ఇక మిగులు 5 ఉచ్ఛ్వాసములందు కాదంబరి వలె జన్మ జన్మాంతర కథలు గలవు ఈ గ్రంథము జైన ధర్మ ప్రచారమునకై వ్రాయబడినది. మారిదత్తుడను రాజు యజ్ఞమున నరబలి నివ్వ సమకట్టగా సుదత్తుడను జైన ముని అట్టి యజ్ఞము నిరర్థకమని బోధించి, రాజుని జైనమతస్థుడిని చేస్తాడు. ఇందలి ఉపదేశములు కడురమ్యములు. ఉదాహరణకు నదీస్నాన విమర్శనాత్మకమైన ఈ శ్లోకము -

సరిత్సరోవారిధివాపికాసు నిమజ్జనోన్మజ్జనమాత్రమేవ ।
పుణ్యాయ చేత్తర్హి జలేచరాణాం స్వర్గః పురాస్త్వాదిత రేఖశకాన్ ॥

**భోజుడు :** రామాయణ చంపూ గ్రంథమును రచించినవాడు ధారానగరాధీశుడైన భోజరాజు. క్రీ॥ శ॥ 1005.1054 కాలమువాడు. గ్రంథాంతమున విదర్భ రాజుగా పేర్కొన్నాడు. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి భోజుడు శ్రీరామచరితమును కిష్కింధాకాండము వరకు వ్రాసినాడు. యుద్ధకాండమును లక్ష్మణ పండితుడు వ్రాయగా. వేంకటరాజు ఉత్తరాకాండమును వ్రాసి గ్రంథపూర్తి గావించినారు. ఈ గ్రంథము వైదర్భీరీతిలో వ్రాయబడినది. ఇది అన్ని చంపూ గ్రంథములలో ఉత్తమమని ప్రసిద్ధి గాంచినది. ఇందలి గద్యము సరళమయినది చిన్నని పదములతో కూడుకొన్నది

చంపూ వైశిష్ట్యమును బోధిస్తూ భోజరాజు పద్యముతో కూడుకొన్న గద్యము, వాద్యములతో కూడుకొన్న గానము వలె అందరిని ఆహ్లాదపరుస్తుందని నుడివినాడు.

గద్యానుబంధరసమిశ్రిత పద్యసూక్తిః హృద్యాహివాద్యకలయాకలితేవ గీతిః
తస్మాద్దధాతుకవిమార్గజుషాంసుఖాయ చంపూ ప్రబంధరచనాం రసనామదీయా।

**అభినవ కాళిదాసు :** 11 వ శతాబ్దినందు అభినవ కాళిదాసుచే భాగవత చంపూ వ్రాయబడినది. 6 అధ్యాయములలో భాగవత కథ వ్రాయబడినది. దీని కర్తృ విషయము వివాదాస్పదము. ఈ శతాబ్దినందే సోడ్ఢలుడు 'ఉదయ సుందరీ కథ' అను గద్య పద్యమయాత్మకమగు గ్రంథమును రచించినాడు. ఈతను గుజరాత్ కాయస్థకులజుడు. 8 ఉచ్ఛ్వాసములు కలిగిన చంపూ కావ్యమిది. ఇందు నాగరాజ కుమార్తెయగు ఉదయసుందరితో ప్రతిష్ఠాన నగరాధీశుడగు మలయవాహనుని వివాహము వర్ణింపబడినది. మహాకవి బాణుని హర్షచరితనాదర్శముగా గొని ఈ కావ్యమును రచించినటుల 'బాణస్య హర్షచరితే నిశితాముదీక్ష్య శక్తింనకేఽత్ర కవితాస్త్రమదంత్యజంతి' అని పేర్కొన్నాడు. ఈతని చంపూ గ్రంథము ప్రసాద మాధుర్య గుణములకు, సుందర కల్పనలకు నిలయము. స్థాలీపులాకా న్యాయముగా ఒక్క ఉదాహరణమును పరిశీలింతము.

కమలినీ భువనాంతరితే రవౌ వ్యపగతాలి కలాప శిరోరుహా।
పరిదధే విధవేవ సుధాకర - ద్యుతివితాన మిషేణ సితాంశుకం॥

రాత్రియందు పద్మిని తీగ సూర్యుడను పతి అస్తమించగా విధవవలె తుమ్మెదలను కేశముల తీసివేసి వెన్నెల అను తెల్ల చీరను ధరిస్తుంది.

అనంతభట్టుకవి భారత-భాగవత చంపూ గ్రంథముల రచించినాడు. కాని భాగవతచంపువు లభించుటలేదు. చంపూ భారతము 12 స్తబకములు కలిగిన విశాల గ్రంథము. భారతకథ సంక్షిప్తముగా ఇందు వర్ణింపబడినది. గద్యములతో పాటు 1000 పద్యములు కలవు. ఇది వైదర్భి రీతిలో వ్రాయబడినది. వీరరస ప్రధానమైనది. ఈతను క్రీ॥శ॥ 1500 కాలమువాడు. ఈతని కల్పనలు కడు మనోరమ్యములు. కర్ణుడు మరణించిన తరువాత సూర్యాస్తమయము కాగా కవి తన కుమారుడు కర్ణుడు యుద్ధమున మరణించినాడన్న దుఃఖముతో తండ్రియగు సూర్యుడు కాంతివిహీనుడై, పశ్చిమ సముద్రమున స్నానమాడుటకు వెళ్లుచున్నాడని వర్ణించినాడు.

తతః స్వకీయస్య తనూద్భవస్య వధాజ్జలే స్నాతుమనా ఇవద్రాక్।
మందాయ మాన ద్యుతిమాలభారీ మరీచి మాలో నిమమజ్జసింధౌ॥

**తిరుమలాంబ :** క్రీ॥శ॥ 1526 న తంజావూర్ రాజ్యాభిషిక్తుడైన అచ్యుతరాయల పట్టపురాణియైన తిరుమలాంబ వరదాంబికా పరిణయ చంపూ గ్రంథమును రచించినది. ఇందు వరదాంబిక మరియు అచ్యుతరాయల యొక్క వివాహ కథ మనోహర శైలిలో వర్ణింపబడినది. ఇందు కవయిత్రి వరదాంబికా అన్న పేరుతో తన వివాహ కథనే వర్ణించినది. రచయిత్రి కళాభిజ్ఞత్వము శృంగార రస ప్రియత్వమును చాటి చెప్పినది. క్లిష్టపదములు. దీర్ఘ సమాస పదములున్నను, గ్రంథములో అపూర్వమైన ఆకర్షణ ఉన్నది. ఇతర కవులు వనితను నఖశిఖ పర్యంతము వర్ణించినటుల పురుషుని కూడా నఖశిఖ పర్యంతము రమ్యముగా మార్మికముగా వర్ణించినది.

**ఆశాధరసూరి :** 13వ శతాబ్దినందు దిగంబర జైన పండితుడగు ఆశాధరసూరి (క్రీ॥శ॥1243) భారతేశ్వరాభ్యుదయ చంపూ గ్రంథమును రచించినాడు. ఇందు జైన తీర్థంకరుడగు ఆదినాథుని పుత్రుడగు భరత చక్రవర్తి జీవితము చిత్రించబడినది అర్హద్దాసుడు జైన తీర్థంకరుడగు పురుదేవుని జీవితగాథను 'పురుదేవచంపూ' అను పేర రచించినాడు. దివాకరుడు (క్రీ॥శ॥1266) వాల్మీక రామాయణాధారముగా గైకొని అమోఘ రాఘవచంపూ వ్రాసినాడు.

**అహోబిలసూరి :** 14వ శతాబ్దిన అహోబిలసూరి యతిరాజ విజయము, విరూపాక్ష వసంతోత్సవము అను రెండు చంపూ గ్రంథముల రచించినారు: మొదటి దానియందు 16 ఉల్లాసములతో విశిష్టాద్వైత మత ప్రవర్తకులగు రామానుజాచార్యుల జీవిత చరిత్రమును, రెండవదానియందు వసంతోత్సవ వర్ణనముతోపాటు దరిద్ర బ్రాహ్మణుని కథను జోడిస్తూ, మరికొన్ని ఐతిహాసిక కథలను వర్ణించినాడు అమ్మలాచార్యులు రుక్మిణీ పరిణయ చంపూ గ్రంథమును రచించినారు - భాగవత హరివంశ పురాణాల్లోని రుక్మిణీ వివాహ కథలే దీనికాధారములు. 15వ శతాబ్దిన కవితార్కికసింహ వేదాంత దేశికులు వేదాంతాచార్య విజయ చంపూ గ్రంథమును వ్రాసినారు. క్రీ॥శ॥ 1500 తంజాపూరు రాజైన శరభోజి మహారాజు కుమారసంభవ చంపువును రచించినాడు.

క్రీ॥శ॥ 1524 న కర్ణపూరకవి ఆనంద బృందావనచంపూ వ్రాసినాడు. ఇతని మూలనామము పరమానందదాసు చైతన్య మహాప్రభుపీఠనికి కర్ణపూరోపాధి నొసంగినాడు. భాగవత దశమ స్కంధమునాధారముగాగొని శ్రీకృష్ణ జననము మొదలుకొని యౌవ్వనావస్థవరకు గల లలితక్రీడల వర్ణించినాడు. ఇది 22 స్తబకములతో కలిగిఉన్నది. 20వ స్తబకమునందు నృత్యము వివిధ స్వర రాగతాళముల వర్ణనము కలదు క్రీ॥శ॥1536నందు ఆచార్య శంకరుల దిగ్విజయమును వర్ణిస్తూ బల్లీసహాయకవి సరళమైన ప్రసాద గుణయుక్తశైలిలో 'ఆచార్య దిగ్విజయ చంపూ గ్రంథమును రచించినాడు. ఇదేకాక కాకుస్థ విజయ చంపువును కూడా వ్రాసినాడు - క్రీ॥శ॥ 1600న చిదంబరుడు రాఘవ-పాండవ-యాదవీయమను కావ్యమును వ్రాసినాడు. భాగవత చంపూ - పంచకళ్యాణ చంపువుల కూడా వ్రాసినాడు - మొదటి దానియందు మూడు స్తబకములలో భాగవత కథ వ్రాయబడినది - రెండవ దానియందు శ్లేష నాధారముగా గొని రామ - కృష్ణ - విష్ణు - శివ - సుబ్రహ్మణ్యుల వివాహ కథలను వర్ణించినాడు. ఒక్కొక్క పద్యమునకు ఐదు విషయములగు అర్థములుండుట దీని ప్రత్యేకత శేష కృష్ణుడు ఐదు అధ్యాయములతో పారిజాతాహరణ చంపువును వ్రాసినాడు. ఇందు సవతులైన రుక్మిణీ సత్యభామల మాత్సర్యము కడు విస్తృతంగా వర్ణింపబడినది. నారదుడిచ్చిన పారిజాత సుమమును శ్రీకృష్ణుడు రుక్మిణికివ్వగా, సత్యభామ కోపించగా, కృష్ణుడు స్వర్గమునుండి పారిజాత వృక్షమునే తెచ్చి

సత్యభామకిచ్చును - శృంగార రసాలవాల మీ గ్రంథము క్రీ॥ శ॥ 1541 న దైవజ్ఞసూరి నృసింహచంపూ కావ్యమును వ్రాసినాడు. ఇందు నరసింహావతార కథ వర్ణించబడినది. ఐదు ఉచ్ఛ్వాసములు గల దీనియందు వీరము ప్రధానము కాగా నవరసములు కూడా చక్కగా చిత్రింపబడినవి. కృష్ణకవి మందార మక రంద చంపూ అను లక్షణ గ్రంథమును వ్రాసినాడు. గంధర్వ దంపతుల కథ నాధారముగాగొని ఈ కవి నాయక-గుణ - దోష - అలంకార - ఛందస్సుల లక్ష ణముల వివరించినాడు - చిరంజీవ భట్టాచార్య శతావధాని విద్వన్మోద తరంగిణి చంపూ - మాధవచంపూ గ్రంథముల వ్రాసినాడు. మొదటిదానియందు శైవ- వైష్ణవ - మతముల వివరిస్తూ చివరన సమన్వయ విధానమును ప్రదర్శించినాడు. రెండవదానియందు మాధవ కళావతుల ప్రణయకథను శృంగార పరిపూర్ణముగా చిత్రించినాడు. క్రీ॥శ॥ 1577 న పద్మనాభమిశ్రుడు వీరభద్ర దేవ చంపువును వ్రాసినాడు. వీరభద్రరాజు కందర్ప చూడామణిని రచించినాడు.

నారాయణభట్టకవి (క్రీ॥ శ॥ 1580-1666) 15 చంపూ గ్రంథముల రచించినాడు. ఇందు స్వాహాసుధాకరచంపూ - మత్స్యావతార చంపూ ప్రధానము లైనవి. ప్రథమ ప్రబంధమున అగ్ని పత్నియగు స్వాహాదేవి మరియు చంద్రుల ప్రణయము గ్రామ గీతముల పద్ధతిన వర్ణింపబడినది. ద్వితీయమున శతపథ బ్రాహ్మణాదులందు ఉల్లేఖింపబడిన మత్స్యావతార కథ వర్ణింపబడినది. పాంచాలీ స్వయంవరము - నృగమోక్షము - రాజసూయ ప్రబంధము మొదలగు చంపూ కావ్యములు పౌరాణిక కథాధారములు - ఆశుకవితా పద్ధతిన ఇవి రచింపబడిన వని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని బాలక్రీడలను మనోహరంగా వర్ణిస్తూ జీవ గోస్వామి గోపాలచంపువును రచించినాడు

ఈ 16వ శతాబ్దినే భోజరాజు చంపూ రామాయణంలోని యుద్ధకాండను రచించి పూరించిన లక్ష్మణసూరి 'భారత చంపూతిలకం' అను చంపువును రచించినాడు. మహాభారతంలోని ప్రధాన సంఘటనలను తీసుకొని పాండవ జన నము మొదలుకొని ధర్మరాజ పట్టాభిషేకం వరకు వర్ణించినాడు ఇది మొదట రచించి, తరువాత యుద్ధకాండ రచించి యుండవచ్చును. ఈతని తండ్రి గంగా ధరుడు మద్రకన్యా పరిణయ చంపువుని వ్రాసినాడు. ఈతని తాత దత్తాత్రేయుడు దత్తాత్రేయ చంపువును రచించినాడు. ఈ కవి శనగర గ్రామవాసి అను చెప్పి నందున, ఆంధ్రప్రదేశ్ కరీంనగర్ జిల్లా శనగర గ్రామవాసీ అయి ఉండవచ్చును.

మిత్రమిశ్రుడు క్రీ॥శ॥ 1605-1627 శ్రీకృష్ణుని బాల్య క్రీడలనాధార ముగాగొని ఆనందకంద చంపువును వ్రాసినాడు - భాగవత దశమ స్కంధ కథయే గాడీకీతిన ఓజోగుణ ప్రధానముగా రమ్యముగా చిత్రింపబడినది. క్రీ॥శ॥ 1637న నీలకంఠ దీక్షితులు 5 ఆశ్వాసములతో నీలకంఠ విజయచంపు వును రచించినాడు. క్షీరసాగర మథనము - హాలాహలోద్భవము - విషపానము ముచ్చటిస్తూ ఆనాటి విలాస జీవనమును వ్యంగ్యముగా ఎత్తి పొడచినాడు - వక్రోక్తి అలంకారముపై సంపూర్ణ అధికారముకలిగిన ఈకవి భావముల అత్యంత సూక్ష్మముగా వెల్లడించినాడు. క్రీ॥శ॥ 1650న చక్రికవి ద్రౌపదీ పరిణయ చంపువునుల్లేఖించినాడు. పాండవులు ఏకచక్రపురమున నివసించినది మొదలు, ఇంద్రప్రస్థమున ధర్మరాజు రాజ్యపాలన చేయు పర్యంత కథను తెలిపినాడు. క్రీ॥శ॥ 1600న రత్నఖేట శ్రీనివాస దీక్షితులు, భైష్మీ పరిణయ చంపువును రచించినాడు. క్రీ॥శ॥ 1614న కాళహస్తీశ్వరకవి వసుచరిత్రమును రచించినాడు- క్రీ॥శ॥ 1650న వేంకటాధ్వరి విశ్వగుణాదర్శ చంపూ- వరదాభ్యుదయ చంపూ. ఉత్తరచంపూ - శ్రీనివాసచంపూ అను నాల్గు చంపూకావ్యముల వ్రాసినాడు.

'సంగః కస్యహి న స్వదేత మనసే మాద్వీక మృద్వీకయోః' అని మాద్వీక మృద్వీక ఫలముల మిశ్రమముతో గద్య పద్య మిశ్రితమైన చంపువును పోల్చినాడు.

సీతాంబరా మరియు రఘునాధులు ఈతని జననీ జనకులు. కాంచీపురమీతని గ్రామము. విశ్వగుణాదర్శ చంపువునందు - విశ్వావసు - కృశానులను ఇద్దరు గంధర్వులు. తీర్థయాత్రలు చేస్తూవుంటారు - ఇందు విశ్వావసువు ప్రతి వస్తువుయొక్క గుణముల వర్ణించగా, కృశాను దోషముల నుగ్గడిస్తాడు. ఈ విధముగా సంవాదాత్మక రూపముగు దీనియందు భారతదేశ భౌగోళిక వర్ణనము- తీర్థముల గుణదోష చింతనలను చేస్తూ ఆ కాలమునాటి రీతి రివాజులను మూఢ నమ్మకములను విస్తారముగా వర్ణించినాడు. పురోహిత - జ్యోతిష - వైద్య - పారిశ్రామికుల దురలవాట్లను బట్టబయలు చేసినాడు. వరదాభ్యుదయ చంపువు నందు కాంచీ వరదరాజస్వామి మాహాత్మ్యము కలదు శ్రీనివాస చంపువునందు వేంకటేశ్వరుని మాహాత్మ్యమును 10 అధ్యాయములలో రమ్యముగా వర్ణించి నాడు ఉత్తర చంపువునందు రామాయణోత్తర కాండ గాథను వర్ణించినాడు. ఇదేకాక యతిరాజుచే, శంకరాచార్యులచే, హరిహరానందులచే, గరళపురి శాస్త్రిచే, రాఘవాచార్యులచే, ఉత్తర చంపువులు రచింపబడినవి.

ఈ కాలముననే రాజచూడామణి దీక్షితులు భారత చంపువును శేషభట్టు నృసింహచంపువును, ధర్మరాజ వండితుడు వేంకటేశ్వర చంపువును,నల్లాన్‌దీక్షితులు ధర్మవిజయ చంపువును రచించినారు. క్రీ॥ శ॥ 1770 న శంకరకవి శంకర చేతోవిలాస చంపువును వ్రాసినాడు. ఇందు WARAN HASTINGS (వారన్ హేస్టింగ్స్) మకాలికుడైన కాశీరాజు చేతోసింహునిచరితము వర్ణింపబడినది. గంగావతరణ చంపువు కూడా ఈతనిదే. రేవారాజు విశ్వనాథసింహుడు రామచంద్ర చంపువును 8 ఉచ్ఛ్వాసములతో వ్రాసినాడు వారన్ హేస్టింగ్స్ సమకాలికుడైన బాణేశ్వర విద్యాలంకార భట్టాచార్య క్రీ॥ శ॥ 1774 నందు చిత్ర చంపువును వ్రాసినాడు. క్రీ॥శ॥ 1752 న,శ్రీనివాసకవితమిళ దేశమున ప్రసిద్ధుడు, రాజనీతిజ్ఞుడగు అనందపిళ్ళెను ప్రశంసిస్తూ ఆనంద చంపువును వ్రాసినాడు. ఇందు మద్రాసు అసలు పేరు చెన్నకేశవపురమని పేర్కొనబడినది క్రీ॥ శ॥ 1783 న కృష్ణానంద కవీంద్రులు సుదర్శన చంపువును వ్రాసినారు. ఇందు సుదర్శన రాజుయొక్క కథ వర్ణింపబడినది. క్రీ॥ శ॥ 1929 న సదాశివశాస్త్రి ముసలగావ్‌కర్ సిందే విజయ విలాస చంపువును రచించినాడు ఈ ఐతిహాసిక చంపూ కావ్యమున సింధియారాజు బహుథా ప్రశంసింపబడినాడు. ఈ ఇరువయ్యో శతాబ్దపు దిలీపద త్తశర్మ మహారాజా ప్రతాపసింహుని చరిత్రను వర్ణిస్తూ, ప్రతాపచంపువును రచించినాడు.

మరికొన్ని చంపూ గ్రంథములు క్రింద పేర్కొనబడుచున్నవి.

| | | | |
|---|---|---|---|
| జీవరాజు | 1550 | గోపాలచంపూ | కృష్ణకథ |
| రామానుజదాసు | 1550 | నాథమునివిజయచంపూ | నాథమునికథ |
| రామానుజాచార్య | 1550 | శ్రీరామానుజచంపూ | రామానుజులకథ |
| రామానుజదేశికులు | 1550 | కళ్యాణవల్లీ కళ్యాణము | వల్లీకళ్యాణము |
| రాజనాథకవి | 1550 | భాగవతచంపూ | భాగవతకథ |
| సమరపుంగదీక్షితులు | 1550 | తీర్థయాత్రాప్రబంధము | తీర్థయాత్రావర్ణన |
| కూచిమంచి తిమ్మకవి | 1700 | సుజనమనః చంద్రిక | |
| వేంకటార్య | 1700 | రుక్మిణీకళ్యాణచంపూ | రుక్మిణీకళ్యాణం |
| ధర్మరాజు | 1700 | వేంకటేశచంపూ | తిరుపతికథ |
| వేంకటకవి | 1700 | బాణాసురవిజయం | |

| | | | |
|---|---|---|---|
| అన్నయార్యుడు | 1725 | తత్త్వగుణాదర్శచంపూ | |
| రాఘవాచార్య | 1750 | భద్రాచలచంపూ | భద్రాచలకథ |
| భానుదత్తుడు | 1750 | కుమార భార్గవీయచంపూ | కుమారస్వామి 12 |
| పద్మరాజు | 1800 | బాల భాగవతచంపూ | కృష్ణకథ |
| కవికుంజరుడు | | రాజశేఖర చరితము | |
| దత్తాత్రేయశాస్త్రి | 1863 | గంగాగుణాదర్శచంపూ | హాహాహూహూ సంవాదము |
| రాఘవాచార్య | | వైకుంఠచంపూ | జయవిజయ సంవాదం |
| నీలకంఠుడు | | కాశీకాతిలకం | కాశీవర్ణన |
| వేంకటకవి | | విబుధానందప్రబంధః | తీర్థయాత్రావర్ణన |
| సూర్యనారాయణ | | శ్రుతకీర్తివిలాసచంపూ | ,, |
| కొంతి భద్రాద్రిరామశాస్త్రి | 1856 | శంబరాసురవిజయః | |
| జయరాముడు | | రాధామాధవ విలాసచంపూ | కృష్ణకథ |

## కథాసాహిత్యము :

భారతీయ కథా సాహిత్యమునకు ప్రపంచ సాహిత్యమునందు అత్యంతా దరము కలదు. ఈ సాహిత్యమే ఆ విశ్వ కథా సాహిత్యమునకు మాతృక అని చెప్పవచ్చును. ఈ సాహిత్యమునందలి రోచకత్వము - సరళత - మాధుర్యము - భావాభివ్యక్తి - ఉపదేశాత్మకత యావత్ప్రపంచ విద్వాంసుల ప్రశంసల నందు కొన్నది ఇందు భారతీయ జీవనము - వారి విచారధార - వారి కార్య కలాపము - నైతిక నియమములు కనిపించుచున్నవి. ఈ సాహిత్యమును అద్భుత కథలు (FAIRY TALES) లోక కథలు (MARCHEN) కల్పిత కథలు (MYTHS) పశుపక్ష్యాది కథలు (FABLES) అని విభజించ వచ్చును. వ్యావహారిక దృష్టి కోణమున పరిశీలించి నీతి కథలు (DIDACTIC FABLES) (2) లోక కథలు (POPULAR TALES) అని విభజించ వచ్చును.

ఈ కథా సాహిత్యమునకు ఋగ్వేదమే పుట్టినిల్లని చెప్పవచ్చును. సంవాద సూక్తములు - మానవేతర ప్రాణులందును మానవ ప్రతినిథిత్వ కథనము - ఇందుకుదాహరణముగా పేర్కొనవచ్చును. సరమాపణి సంవాదము - సరమా అను కుక్క-పణి అను నిమ్నజాతివారి కుపదేశిస్తూంది వారు సరమను మిత్రురాలనియు, సోదరి అనియు పిలుస్తారు. ఈ విధముగా జీవులతో జంతువులకు ఆత్మీయ సంబంధము ప్రకటింపబడిన ఋగ్వేదముననే'ద్వాసుపర్ణా' అని జీవాత్మ పరమాత్మలు పక్షులుగా వర్ణింపబడినారు మహాభారతమున ఈ కథా సాహిత్యము వికసించినది. ఆది పర్వమున శునక కథ - గజకచ్ఛప కథ - వనపర్వమున మనుమత్స్య కథ - శాంతిపర్వము నందలి నీతి కథలును పేర్కొనవచ్చును. క్రీ పూ. 3 వ శతాబ్ది బార్హత్ స్థూపమున పశుపక్షుల నామములు కనిపించు చున్నవి. క్రీ॥ పూ॥ 2 వ శతాబ్ది పతంజలి కాకతాలీయం, అజాకృపాణీయం - అహినకులమ్, కాకోలుకీయమ్ మొదలగు వాటిని పేర్కొన్నారు.

## నీతికథల ప్రత్యేకతలు :

'కథాచ్ఛలేన బాలానాం నీతి స్తదిహ కథ్యతే' అన్నటుల నీతిరహస్యముల బోధించునవి బాలోపయోగి కథలు.ఇందలి పాత్రలు మానవులే కాక, పశుపక్ష్యాదులుండును. దైనిక జీవనము - దైనిక వ్యవహారము-సమాజ వ్యక్తి సంబంధము కర్తవ్యా కర్తవ్యోపదేశాదులు జీవన వ్యవహారములు వర్ణింపబడును. ధర్మశాస్త్ర సంబంధములైన నీతి ఉపదేశింపబడును జీవితముయొక్క మంచి చెడు రెండు పక్షములు వర్ణింపబడును. పవిత్ర జీవనము, కర్తవ్య పాలనము - మిత్రరక్షణము - సత్యపాలనాది గుణములతో పాటు మానవుల కపటప్రవృత్తి, దంభము-అంతఃపుర కపట వ్యవహారములు స్త్రీల దుశ్చరితాది దోషములు కూడా వర్ణింపబడును. జీవన లక్ష్యముగా ఆదర్శ వాదమును బోధింపక, లోక వ్యవహార జ్ఞానమును - నీతి నైపుణ్యములను బోధించును. ఇందలి పాత్రలగు పశుపక్ష్యాదులు మానవులవలె ప్రేమ - వివాద - లోభ - ఛల - విశ్వాసఘాత - సంధి - విగ్రహములందు చతురములై యుండును అవికూడా రాజు - మంత్రి, దూత మొదలగు పదవుల నధిష్ఠించి ఉండును నీత్యుపదేశము శ్లోక రూపముగాను, కథా భాగము గద్యరూపముగాను ఉండును సుభాషితములు నీతి గ్రంథములనుండి ఉద్ధరించబడును. జీవిత సాఫల్యమున కవసరములగు అన్ని గుణములు ఉపదేశించబడును. ఒక ముఖ్య కథననుసరించి ఎన్నియో పిల్లకథలు కనిపించును. శైలిసరళమైనది సుబోధమైనది. పాండిత్య ప్రదర్శనమునకు స్థానముండదు.

**విష్ణుశర్మ :** క్రీ॥ పూ॥ 300 కాలమున విష్ణుశర్మ రచించిన పంచ తంత్రము సమగ్ర కథా నియమములతో కూడుకొనిన మొదటి గ్రంథమని చెప్ప వచ్చును. ఈ విష్ణుశర్మ మౌర్య సామ్రాజ్య స్థాపకుడగు చాణక్యుడని విమర్శకుల అభిప్రాయము. ఈ గ్రంథము మూలగ్రంథము కాదని క్రమముగా మార్పు చెందుతూ పంచతంత్రముగా లభించుచున్నదని ప్రొ. ఎడగర్టన్ (Prof. Edgerton) (1) తంత్రాఖ్యాయికా (2) సరళ పంచతంత్రము ((Textus Simplicion) (3) పూర్ణభద్ర కృతసంస్కరణము (4) దక్షిణదేశపు పంచ తంత్రము (5) నేపాళీ పంచతంత్రము (6) హితోపదేశము (7) ఉత్తర పశ్చిమ సంస్కరణము (8) పహ్లవ సంస్కరణము ఈ ఎనిమిదింటి సాహచర్యమున పరి వర్తనమున పంచతంత్రము సిద్ధించినదని పేర్కొన్నాడు. ఈ గ్రంథము పేరు క్రీ॥శ॥570సిరియన్ అనువాదమునకు 'కలిలగవదమనగ' అనియు క్రీ॥శ॥750అరబీ అనువాదమునకు 'కలిలవ దమన' అనియు కనిపించుచున్నందున 'కరటక దమనకము' అని మూలగ్రంథము పేరు. మొదటి తంత్రమునందలి కథాధారమున ఉండవచ్చునని అభిప్రాయపడినాడు - కాని "పంచతంత్రాత్ తథాన్యస్మాత్ గ్రంథాదాకృష్య లిఖ్యతే" అని హితోపదేశ ప్రస్తావనయందు, పంచతంత్ర కథా ముఖమునందు 'ఏతత్ పంచతంత్రకం నామ నీతిశాస్త్రం' అని కవిచే చెప్ప బడినందున పంచతంత్రమనియె దీని పేరు అనుట సమంజసము.

కథాసారము : అమరశక్తి రాజుకు ముగ్గురు మూర్ఖులైన పుత్రులు కలరు. వారిని ఆరు నెలలలో రాజనీతి పారంగతుల చేసెదనని ప్రతిజ్ఞచేసి విష్ణుశర్మ పంచతంత్రమును వారికి బోధించి ప్రతిజ్ఞ పూర్తిచేస్తాడు. ఈ పంచతంత్రమున 5 ప్రధానకథలు కలవు. ఒక్కొక్క కథయందు మరికొన్ని ఉపకథలు కలవు.

| ప్రధానకథ | ఉపకథలు | శ్లోకములు | కథాసారాంశము |
|---|---|---|---|
| మిత్రభేదము | 22 | 461 | సింహము, ఎద్దు స్నేహమును కోల్పోవుట |
| మిత్రలాభము | 6 | 166 | కాకి, తాబేలు-మృగము-ఎలుకల స్నేహము |
| కాకోలూకీయము | 16 | 255 | కాగి గుడ్లగూబ కథ |
| లబ్ధప్రణాశము | 11 | 80 | కోతి మొసలి కథ |
| అపరీక్షితకారకము | 14 | 98 | బ్రాహ్మణి-ముంగిస కథ |

మిత్రభేదమున ఇద్దరు మిత్రులను ఎలా విడదీయవచ్చునన్న నీతి శిక్ష వర్ణింపబడినది పింగళకమను సింహము సంజీవకమను ఎద్దు మంచి స్నేహముతో ఉండెడివి. వీటిమధ్యన కరటక దమనకములను రెండు నక్కలు చేరి వాని స్నేహమును తొలగించి ఎద్దును చంపివేస్తాయి. మిత్రలాభమునందు మిత్రులను ఎలా పొందవచ్చును, స్నేహంవలన కలుగు లాభములు వర్ణింపబడినవి. కాకి, తాబేలు - లేడి - ఎలుక - ఇవి ఎట్టి సాధనములు లేకుండానే కేవలం స్నేహముచే అపాయములనుండి తప్పించుకొని 'కలసి ఉంటే కలదు సుఖము' అన్న భావాన్ని బోధించుచున్నవి. కాకోలూకీయమునందు స్వార్థసిద్ధికై శత్రువులతోను స్నేహముచేసి, కార్యసిద్ధ్యనంతరం మోసముచేసి వారిని హతమార్చవలెనన్న సంధి, తదుపరి విగ్రహము అను నీతులు బోధింపబడినవి. కాకి గుడ్లగూబతో స్నేహముచేసి తన పని సిద్ధించినతరువాత గుడ్లగూబ గూటికే నిప్పంటు పెడ్తుంది. లబ్ధ్రప్రణాశమునందు - బుద్ధిమంతుడు తన బుద్ధిబలముచేత దేనినైనను అవలీలగా సిద్ధింపజేసుకొంటాడు. మూర్ఖుడు తన చేతికి చిక్కినదానిని కూడా పొందలేకపోతాడన్న నీతి బోధింపబడినది. కోతి మొసళ్ళకు స్నేహమేర్పడుతుంది. ఆడమొసలి ఈ కోతిని భక్షించాలని అనుకొంటుంది. ఇది తెలుసుకొన్న కోతి నా జీవితమును తీరమునందలి చెట్టుపై ఉంచి వచ్చాను అది తెచ్చి నీకు ఇస్తాననిచెప్పి తీరాన్ని చేరుకొని పరుగెత్తుతూంది. మూర్ఖురాలగు మొసలి నోరు కఱచుకొని చిక్కిన ఆహారాన్నికూడా పొందలేకపోతూంది. ఇక అపరీక్షిత కారకమున విచారించకపోతే, తొందరపాటువలన ఎంతో అనర్థము జరిగిపోతూంది, దాన్ని తిరిగి పొందలేమన్న నీతి నిండియున్నది. బ్రాహ్మణస్త్రీ తన శిశువును రక్షించ ముంగిసను నియమించి, గ్రామమునుండి తిరిగి వచ్చి ముంగిస నోటిన రక్తము చూసి తన పిల్లవాడిని పొట్టన పెట్టుకొన్నదని ముంగిసను చంపి, తరువాత ఎంతయో బాధపడ్తుంది. 'అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసాం, ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం' ఇత్యాది సూక్తులు పంచతంత్రంలో కోకొల్లలు. ఈ పంచతంత్రముయొక్క శైలి సరళమై,సరసమై, ప్రసాద మాధుర్య గుణములకు నిలయమై బాలురనెంతో ఆకర్షించుచున్నది.

**నారాయణ పండితుడు :** పంచతంత్రము నాధారముగాగొని నారాయణ పండితుడు పదవ శతాబ్దినందు బెంగాల్ రాజు ధవళచంద్రుని

ప్రభువుయొక్క ఆజ్ఞపై హితోపదేశమును వ్రాసినాడు. ఇందు 4 పరిచ్ఛేదములు 43 కథలు కలవు

| | |
|---|---|
| ప్రస్తావికా | సుదర్శన రాజుయొక్క మూర్ఖపుత్రుల కథ |
| మిత్రలాభము | కాకి, తాబేలు, లేడి, ఎలుకల కథ |
| మిత్రభేదము | సింహ వృషభకథ |
| విగ్రహము | హంస నెమలుల యుద్ధము |
| సంధి | హంస నెమలుల సంధి |

పంచ తంత్రమునందలి మొదటి రెండు తంత్రముల క్రమమును మార్చి మిత్రలాభ, మిత్ర భేదముల చూపినాడు. మూడవదగు కాకోలుకీయమును విభజించి, విగ్రహసంధుల గావించినాడు. మిగతా రెండు నీతి జ్ఞానమున కవసరములు కావని వదలిపెట్టినాడు. ఆ రెండు ప్రకరణములలోని కథలను వదలిపెట్టక, ఈ నాలుగు ప్రకరణములందే సమయోచితంగా జోడించినాడు. ఈ గ్రంథపు శైలి సరళము సరసము. పద్యములత్యంత సరళములై ఉపదేశాత్మకములైనవి. అక్కడక్కడ పద్యములే ఎక్కువ ఉన్నను, విసుగురాదు సరళ సంస్కృత భాషయైనందుననే పంచతంత్రమునకంటెను మిన్నగా హితోపదేశము ఆదరణ నొందుచున్నది.

## లోక కథలు :

**గుణాఢ్యుడు :** నీతికథలు ఉపదేశమే ఉద్దేశ్యముగలవై పశుపక్ష్యాది పాత్రలు కలవి లోకకథలు మనోరంజనమే ఉద్దేశ్యముగలవై, మానవ పాత్రలు కలవి.వీటియందు శృంగారాది రసములు, ప్రౌఢమైన భాష,కావ్యసౌందర్యమును గాంచవచ్చును.శాతవాహన రాజు రాణితో జలక్రీడ సలుపుచూ రాణిపై నీళ్లుచల్లగా 'రాజన్ మోదకైః స్తాడయ' అని రాణి పలికినది. లడ్డూలతో కొట్టవలయునని రాణి పలుకుతున్నదని తలంచి రాజు లడ్డూలను తెప్పిస్తాడు. అంత రాణి పరిహసించగా, మా+ఉదకైః అని నీళ్ళతో కొట్టవద్దన్న అర్థమును తెలుసుకొని, తన అజ్ఞానమునకు బాధనొంది ఆరు నెలలలో సంస్కృతము నేర్చుకోవలెనని పట్టుపట్టి,గుణాఢ్యుని మరియు మంత్రియగు శర్వవర్మను కూడా ప్రార్థిస్తాడు. గుణాఢ్యుడు ఆరు నెలలలో సంస్కృత పాండిత్యము దుష్కరమని, ఎవరైనా అలా నేర్పినచో తాను సంస్కృత భాషను, ప్రాకృత భాషను

వదలిపెడ్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. శర్వవర్మ రాజును 6 నెలలలో సంస్కృత భాషాకోవిదుని జేస్తాడు. అప్పుడు గుణాఢ్యుడు సంస్కృత, ప్రాకృత భాషలను వదలిపెట్టి, పైశాచీ భాషలో బృహత్కథను వ్రాసినాడు. ఆ శాతవాహన రాజు క్రీ॥పూ॥ 78 వాడు కావున గుణాఢ్యుడు. క్రీ॥ పూ॥ 78 వాడనుట నమ్మదగినది.

7 లక్షల శ్లోకములతో బృహత్కథను రచించి శాతవాహన రాజు కంకితమివ్వగా, రాజు స్వీకరించకపోగా, అంత గుణాఢ్యుడు దుఃఖితుడై అగ్ని కుండమును సిద్ధపరచి, అందు ఒక్కొక్క శ్లోకాన్ని చదువుతూ ఏడుస్తూ అగ్ని కాహుతిచేస్తూ, ఆరులక్షల శ్లోకాల్ని అగ్నికి ఆహుతిచేయగా 1 లక్ష శ్లోకములు మాత్రము మిగిలినవి. ఇందు కౌశాంబీ నగరాధిపతి ఉదయన రాజుయొక్క పుత్రుడగు నరవాహన దత్తుని పరాక్రమము వర్ణింపబడినది. నరవాహనదత్తుడు తన మిత్రుడగు గోముఖుడితోపాటు వనమునకు వెళ్ళుతాడు. అక్కడ విద్యాధర రాజకుమారియగు మదన మంజూకను పెళ్ళిచేసుకొంటాడు ఆ మదన మంజూకను మానసవేగుడను గంధర్వుడు ఎత్తుకొనిపోతాడు. చివరికి మానసవేగుని సోదరి వేగవతీ సహాయమున మదనమంజూకను పొంది విద్యాధరాధిపత్యమును పొందుతాడు. ఈ ముఖ్య కథనందు ఎన్నియో ఉపకథలు కలవు.

ఈ బృహత్కథనాధారముగాగొని నవమ శతాబ్దమున నేపాల దేశీయుడగు బుధస్వామి బృహత్కథా శ్లోక సంగ్రహమును వ్రాసినాడు. ఇందు 28 సర్గలు 4539 శ్లోకములు కలవు. గ్రంథము పూర్తిగా లభించుటలేదు క్రీ॥శ॥ 1037న కాశ్మీరకవి క్షేమేంద్రుడు బృహత్కథా మంజరిని వ్రాసినాడు. ఇందు 19 సర్గలును 7500 శ్లోకములు కలవు. ఇందు కవి కొన్ని కాశ్మీరీ కథలను జోడించినాడు. కావున మూలకథ సంక్షిప్తమై దుర్బోధమైనది కాశ్మీరీ బ్రాహ్మణ పండితుడు సోమదేవుడు క్రీ॥శ॥ 1063 న కథా సరిత్సాగరమును రచించినాడు. కథలకు సముద్రమై సార్థక నామమైన కథా గ్రంథమిది. 18 లంబకములు - వాటియందు 1204 తరంగములు కలవు. 22000 శ్లోకములు కలవు. ఇందు కథాయోజనము, రస పరిపోషణము సుందరము. ఈ మూడు గ్రంథములు పైశాచీ భాషలో ఉన్న బృహత్కథకు సంస్కృతానువాదములై బృహత్కథామృతమును అందజేయుచున్నవి.

**వేతాళ పంచవింశతి:** ఈ గ్రంథము నాలుగు సంస్కరణములలో లభించుచున్నది. 1. క్రీ॥శ॥ 1200 శివదాస రచితము చంపూరూపము, ఈ శివదాసుడే శాలివాహన కథనుకూడా రచించినాడు. 2 జంభలదాసకృతము కేవలం గద్యమయము, 3. వల్లభదాస కృతము, 4. అజ్ఞాత కర్తృకము ఈ గ్రంథము భారతీయ భాషలన్నింటిలోకి అనువదింపబడినది. సిద్ధికర్ మంగోలు భాషలోకి అనువదించినాడు.

కథాసారము : ఒక భిక్షుకుడు విక్రమాదిత్య రాజునకు ప్రతి సంవత్సరమొక రత్న సహితమైన ఫలాన్ని ఇస్తూంటాడు. ఆ భిక్షుకునకు నరబలి ఇవ్వదానికి శవముకావాల్సి ఉంటూంది. అందుకై రాజు శ్మశానానికి వెళ్ళి భుజమున శవాన్ని వేసుకొని తీసుకొని పోతూండగా ఆ శవంలోని బేతాళుడు రాజు మౌనముగా, శవాన్ని తీసుకువెళ్ళాలని శరతు విధిస్తాడు. ఆ బేతాళుడు రాజుకు పలు రకములైన కథలను వినిపిస్తూ అందుకు సంబంధించిన ప్రశ్నలనడుగుతూ, సమాధానము తెలిసి చెప్పకపోతే తల పగులుతూందని శపిస్తాడు. రాజు సమాధానముల చెప్ప యత్నించి మౌనభంగము కాగా శవము తిరిగి శ్మశానాన్ని చేరుకుంటూంది. ఇందలి కథలు మనోహరములు. అనాటి సమాజమునందలి కట్టుబాట్లు, ఆచార వ్యవహారములు, సభ్యత, సంస్కృతి ఇందు ప్రతిబింబించినవి.

**సింహాసన ద్వాత్రింశికా :** బేతాళ పంచవింశతిలో సమానమగు ఆదరణ పొందినది సింహాసన ద్వాత్రింశికా దీని కర్త ఎవరనునది వివాదాస్పదము. 11వ శతాబ్దిన ధారా నగరమును పరిపాలించిన భోజమహారాజు విక్రమాదిత్యుడధిష్ఠించిన సింహాసనము నధిష్ఠింపబోగా ఆ సింహాసనమునందలి 32 పుత్తడి బొమ్మలు చెప్పు 32 కథలు రమ్యముగా వర్ణింపబడినవి. ఈ కథలు తెలుగువారికి సుపరిచితములు. తెలుగులో కొరవి గోపరాజు దీనిని అనువదించినాడు.

**శుక సప్తతి :** ఈ శుకసప్తతి 14వ శతాబ్దినందు పారసీక భాషలోనికి అనువదించబడినది. మనోరంజకములగు 70 కథలతో కూడుకొన్నది. కథాసారము : హరదత్తుడను వ్యాపారికి మదనసేనుడను మూర్ఖుడైన పుత్రుడు కలడు. ఎల్లప్పుడూ భార్యతో ప్రేమాలాపాల్ని చేస్తూ తృతీయ పురుషార్థమే పరమావధిగా కలవాడై వృధా కాలయాపన చేసేవాడు.

అతని తండ్రి పక్షిరూపాల్ని ధరించిన ఇద్దరు గంధర్వుల్ని ఉపహారాకరించి నాడు. ఆ పక్షులు అతనిని దారికి తెచ్చినవి. ఆ పక్షులలో మొదటిది రామ చిలుక, రెండవది కాకి. ఒకసారి మదన సేనుడు వ్యాపారార్థియై దేశాంతరము పోగా, అతని భార్య పరపురుషునితో అభిసరణము చేయతలంచగా, రామచిలుక 70 రోజులు రోజుకొక్క సుందరమైన కథను వినిపిస్తూ అభిసరణమునుండి విరమింపచేస్తూంది చివరికి మదనసేనుడు దేశాంతరమునుండి తిరిగి వస్తాడు. ఈ విధముగా కథలతో స్త్రీ శీలాన్ని కాపాడుతూంది చిలుక. ఈ కథల శైలి ఆకర్షణీయమైనది, ప్రియమైనది. చిలుక పలుకులలో స్త్రీ దురాచారము, పరపురుష గమనము, స్త్రీ నైతిక పతనము, వైవాహిక సంబంధ విచ్ఛేదము మొదలగు విషయములు, మనోరంజకములైన ఉదాహరణములతో సంస్కృత, ప్రాకృత శ్లోకములతో రమ్యముగా వర్ణింపబడినవి.

ఇవియేకాక శివదాసుని కథార్ణవము, విద్యాధిపతి పురుషపరీక్ష, శ్రీ వీర కవియొక్క కథా కౌతుకము, బల్లాలసేనుని భోజప్రబంధము ఆనందుని మాధవానల కామకందళ కథ, అనంతుని వీర చరిత్ర, విద్యాపతియొక్క పురుష పరీక్ష, వీరవరుని కథాకౌతుకము, భరటక ద్వాత్రింశికా, విక్రమోదయము ప్రసిద్ధములైనవి. ఇవియేకాక జైన, బౌద్ధ కథాగ్రంథము లెన్నియో సంస్కృత ప్రాకృత కథాసాహిత్యమున ప్రఖ్యాతి గాంచినవి.

## గీతికావ్యములు :

భావుకుడు తన ప్రేమ ప్రవృత్తిని కొద్ది వాక్యాల్లో వెళ్ళడిస్తే, మధురమైన ఆ అభివ్యక్తి గీతిరూపమున వెల్వడుతూంది. కోమల భావములను మధురమైన శబ్దములలో ప్రకటించడమే గీతికావ్యము. భావుకుని మనస్సు ఏదో ఒక అపురూప కాంతిచే ఉద్దీప్తమై, తన మార్మిక భావములను శబ్దములలో ప్రకటింపచేస్తే అది గీతికావ్యమని చెప్పబడుతూంది ఈ భావాలు శృంగార విషయములపైన, ధార్మిక విషయములపైన, నైతిక విషయములపైన, కోమలములైన మధురములైన పదాల్లో ముక్తకములుగా వెల్వడినవి. రసానంద తన్మయతలో సాంగో పాంగంగా ఛందస్సులో ఇమిడిపోతాయి.

గానముచేయ సమర్థములగు సంగీత లయబద్ధములగు పద్యములు గీతి కావ్యములు. వాద్య సహకారమునకు వీటిని ఆలాపింపవచ్చును. వీటిలో మహా కావ్య విషయములన్ని యుండ అక్కరలేదు కావుననే ఖండకావ్యం తవేళ్ళ

వ్యస్యైకదేశానుసారిచ" అని పలికినారు. ఖండ కావ్యములని లఘు కావ్యము లనియు వీటిని అలంకారికులు వ్యవహరించినారు. ఇవి పూర్వాపర సందర్భ నిరపేక్షములై స్వతంత్రముగా సంపూర్ణ భావాన్ని బోధిస్తుంటాయి, కావున ఈ పద్యములను ముక్తకములని చెప్పినారు. వీటియందు చమత్కారము, రసపరిపాకము ఎంతేని ఇమిడి ఉంటుంది. మహాకావ్యమున సమగ్ర జీవనము వర్ణింపబడగా ఇందు జీవనములోని కొంత భాగము మాత్రమే రమ్య సన్నివేశములతో వర్ణింపబడ్తుంది. మహాకావ్యమున విస్తార వర్ణనము, శైథిల్యము కనిపింప గీతి కావ్యమున సాంద్ర వర్ణనము ఏకాగ్రత, తన్మయతలు కనిపిస్తాయి.

ఈ గీతి కావ్యములు వైదిక కాలముననే అవతరించినవని చెప్పవచ్చును. ఇందులకు ఋగ్వేదమున ఇంద్ర, విష్ణు, వరుణ స్తుతిపరక సూక్తములను పేర్కొనవచ్చును పురాణములలో ఇలాంటి గీతి కావ్యములు కోకొల్లలు. గీతయందు ఏకాదశాధ్యాయమున శ్రీకృష్ణుని విరాట్పురుషునిగా వర్ణించిన స్తుతి, అధ్యాత్మ రామాయణమున శ్రీరాముని పరబ్రహ్మగా వర్ణించిన స్తుతులను పేర్కొనవచ్చును లౌకిక వాఙ్మయమున కాళిదాసునే ఆది గీతి కావ్యకర్తగా పేర్కొనవచ్చును. ఈ కావ్యములు సంగీతాత్మకములు, కవి సహృదయుల మార్మికానుభూతి ద్యోతకములు, సుకుమార పదభూయిష్ఠములు, కోమలభాష, భావ భూషితములు, ప్రసాద మాధుర్య గుణ విరాజితములు, తరుణీ లావణ్య వర్ణనా ప్రధానములు, ప్రకృతి చిత్రకములునై సహృదయుల నెంతేని రంజింపజేయుచున్నవి. గీతికావ్యాధ్యయన సౌలభ్యంకోసం వీటిని (1) సందేశకావ్యములు, (2) స్తోత్రకావ్యములు, (3) సప్తశతి సాహిత్యము (4) శతకసాహిత్యము, (5) సుభాషిత సాహిత్యము, (6) శుద్ధ గీతికావ్యములని విభజించవచ్చును. సందేశకావ్యములు లేక దూతకావ్యములు గీత్యాత్మక ఖండకావ్యములందే పరిగణింపబడుచున్నవి.

ఈ సందేశ కావ్యములందు విరహము ప్రాధాన్యంగా ఉంటోంది. ప్రసాద మాధుర్య గుణయుక్తమైన వైదర్భీరీతిన రచింపబడుతాయి. సుకుమార భావాల కనుకూలంగా తాళ లయబద్ధమైన సంగీతాని కనుకూలంగా పాడుటకు యోగ్యమైన మందాక్రాంతా ఛందస్సు ప్రయోగింపబడ్తుంది. విప్రలంభ శృంగార రస భరితమైన సందేశాన్ని నాయకుడు దూతద్వారా ప్రేయసికి పంపించుట వీటిలో ముఖ్య విషయంగా ఉంటుంది.

'సందేశస్తు ప్రేషితస్య స్వకార్యా ప్రేరణం భవేత్' మరియు 'ప్రాణ్ సందేశ హారోదూతః' అను కోశవాక్యముల ననుసరించయు అర్థము స్పష్టమగు సందేశ కావ్యావిర్భావము ఋగ్వేదమునందు గాంచవచ్చును. బలాసురుని సైనికు లగు పణికాతివారలు బృహస్పతియొక్క గోవులను దొంగిలించి, గుహలో దాచిపెడ్తారు అప్పుడు ఇంద్రుడు సరమయను ఆడకుక్కను గోవులను వెదక డమునకై దూతగా పంపిస్తాడు. అప్పుడు సరమ బలాసురుని నగరమును ప్రవేశించి గోవులను కనుగొంటూంది. అప్పుడు పణికాతివారలు సరమను అక్కా అని సంబోధించి మంచి చేసుకోవడమునకై యత్నిస్తారు. సరమ వారి తీపిమాట లకు లొంగక, గోవులను ఇంద్రునకివ్వమని సలహాయిస్తూంది.

శ్రీమద్రామాయణ కిష్కింధాకాండలో సీతాన్వేషణకై సుగ్రీవుడు హనుమ దాది వానరుల పంపిస్తాడు. శ్రీరామ సందేశాన్ని సీతకందిస్తూ హనుమంతుడు 'అహంరామస్య సందేశాత్ దేవి దూత స్తవాగతః' అని పలుకుతూ రామ నామాంకితమైన ఉంగరాన్ని ప్రసాదిస్తాడు 'రామానామాంకితం చేదం పశ్య దేవ్యంగుళీయకమ్'. మహాభారతమున దూత ప్రసంగములు అనేకములు కలవు. పాండవ రాయబారిగా శ్రీకృష్ణుడు హస్తినాపుర దుర్యోధన సభాస్థలి కేగెంచుట సర్వవిదితము. వనపర్వము నలోపాఖ్యానమునందలి దమయంతీ హంస దౌత్యము సందేశ కావ్యత త్తులకు మార్గదర్శకమైనది. దూతగా వెళ్ళిన హంస నలునితో దమయంతికి తప్పనిసరిగా సందేశము వినిపిస్తానని ప్రతిజ్ఞచేస్తుంది. 'దమయంతీ సకాశేత్వాం కథయిష్యామి నైషధ! యథాత్వదన్యం పురుషం నసా మంస్యతి కర్హిచిత్॥"

శ్రీమద్భాగవతమున దౌత్య సంఘటనలు కోకొల్లలు. పరవర్తి సందేశ కవులకు ఈ సంఘటనలే ఆధారములైనవి. దశమస్కంధ 30 వ అధ్యాయ మున రాసక్రీడా ప్రసంగమున శ్రీకృష్ణుని పొందిన గోపికలు అహంకార యుక్తులుకాగా, వారల అభిమానమును తీసివేయుటకై శ్రీకృష్ణుడు అంతర్ధాన మౌతాడు-విరహవ్యాకులురైన గోపికలు చెట్లను, పశుపక్ష్యాదులను కృష్ణుని జాడ గురించి అడుగుతారు. శ్రీకృష్ణుని పదచిహ్నముల దర్శిస్తారు. ఈ సంఘటన నాధారముగా తీసుకొని శ్రీకృష్ణ సార్వభౌమ కవి పదాంకదూతమును రచించినాడు ఈ భాగవత దశమస్కంధ అధ్యాయమునందు సందేశ

కావ్యముల స్వరూపము లక్ష్యమగుచున్నది. గోకులము నుండి మధురకు వెళ్ళిన శ్రీకృష్ణుడు గోపికల యొక్క విరహవేదనను శమింపజేయ తన ప్రియమిత్రుడైన ఉద్ధవుని దూతగా గోకులానికి పంపిస్తాడు. గోకులమున యశోదానందుల ఓదార్చిన ఉద్ధవుణ్ణి చూసిన గోపికలు, అక్కడే సంచరిస్తున్న తుమ్మెదను శ్రీకృష్ణుని దూతగా సంబోధిస్తూ వ్యాజంగా కృష్ణుని ఎత్తిపొడుస్తారు - తమ బాధను తెలుపుతారు. అప్పుడు ఉద్ధవుడు శ్రీకృష్ణ సందేశాన్ని వారలకు వినిపిస్తాడు : 'శ్రూయతాం ప్రియ సందేశో భవతీనాం సుఖావహః' - ఈ సంఘటన నాధారముగా తీసుకొనియే రూపగోస్వామి ఉద్ధవ సందేశమును, మాధవకవీంద్రులు ఉద్ధవదూతమును రచించినారు.

ఈ స్కంధముననే రుక్మిణీ వివాహము శిశుపాలునితో నిశ్చయము కాగా, అది ఇష్టములేని రుక్మిణి అగ్నిద్యోతనుడను బ్రాహ్మణుని ద్వారా తాను వలచిన శ్రీకృష్ణునికి సందేశాన్ని పంపిస్తుంది. శ్రీకృష్ణుడు విదర్భకు వచ్చి అమ్మవారి దేవాలయము నుండి రుక్మిణిని హరించి పెళ్ళి చేసుకొంటాడు - ఈ ప్రసంగమునే ఆధారముగా తీసుకొని లక్ష్మణసూరి 'విప్రసందేశ' కావ్యాన్ని రచించినాడు. ఈ స్కంధాంతమున 90 వ అధ్యాయమున ద్వారకా స్త్రీలు శ్రీకృష్ణుని గురించి చక్రవాకమును, చంద్రుని, మలయమారుతమును, కోకిలను, మేఘమును, హంసను, నదిని, పర్వతాదులను అడుగుతారు - ఇదే సందేశ కవులకు మార్గప్రదర్శకమైనది. రూపగోస్వామి హంసదూతము ఈ సంఘటనపైననే ఆధారపడినది.

బౌద్ధజాతక కథలలోను పక్షుల సందేశవాహకములుగా పంపినటుల కనిపించుచున్నది. కాశీలోని ఒక వర్తకుడు తన సేవకుని వెతకుటకై చిలుకను పంపిస్తాడు - ఆ చిలుక సేవకుని కనుగొని, వర్తకునికి జాడ తెలుపుతుంది. 'మహ ఉమ్మగ' మొదలగు జాతకములలో పక్షుల ద్వారా సందేశము పంపించుట రమ్యముగా వర్ణింపబడినది.

**కాళిదాసు** : ఈ గీతి కావ్య సాహిత్యమునకు శ్రీకారము చుట్టిన ధాతు మహాకవి కాళిదాసు. ఋతుసంహార, మేఘసందేశము లీతని గీతి కావ్య

ములు - ఇందు ఒకటి బాహ్య ప్రకృతిని వర్ణించ, మరొకటి అంతః ప్రకృతిని వర్ణించినది - మొదటిది యౌవనోన్మాదాన్ని ద్యోతింప, రెండవది యౌవ్వన విషాదాన్ని తెలుపుతూంది. మొదటి కావ్యమగు ఋతుసంహారమున గ్రీష్మ - వర్ష - శరత్ - హేమంత - శిశిర - వసంత ఋతువులు క్రమముగా ఆరు సర్గ లందు వర్ణింపబడినవి - ఈ కావ్యమున మేఘసందేశాది కావ్యములందు గల భాషా శుద్ధి, సౌందర్యము లేనందున, మల్లినాథసూరి దీనిని వ్యాఖ్యానించ నందు వలన, ఇందలి శ్లోకములు ఆలంకారికులచే ఉదాహరింపబడనందున, ప్రేమ విషయకములైన కాళిదాసుయొక్క ఆదర్శములు కనిపించనందున ఇది కాళిదాస కృతము కాదని కొందరు తలంతురు. కాని ఇది మహాకవి ప్రథమ కృతి ఐనం దున భాషాశుద్ధి సౌందర్యములు లేకపోయినను, సులభముగా అర్థమౌతుందన్న ఉద్దేశ్యముతో మల్లినాథసూరి దీనిపై వ్యాఖ్య వ్రాయనప్పటికి, రఘువంశాది శ్లోక ములకంటే రమణీయములగు శ్లోకములు ఇందు కనిపించనందున ఆలంకారికులు ఉదాహరించనప్పటికి, కాళిదాసు యౌవనారంభమున రచించుట వలన ఆదర్శ ప్రేమ కానరానప్పటికిని కాళిదాసకృతమనుటయే, సమంజసము -

మహాకవి యొక్క ప్రౌఢ కల్పనలకు, ఉదాత్త భావనలకు, పరిష్కృత శైలీ సౌష్ఠవమునకు, కోమల కాంత పదావలీ రచనకు నిలయమై విశ్వ సాహితీ వేత్తలందరి ప్రశంసల నందుకొన్నది మేఘసందేశము - ఇందు విరహాతురు డైన యక్షుని కథ కలదు - ఇందు యక్షుడు మేఘుని ద్వారా తన ప్రియురాలికి సందేశాన్ని పంపించుట కడు రమ్యము - ఇందు పూర్వ మేఘము, ఉత్తర మేఘము అని రెండు భాగములు కలవు - (పూర్వమేఘము) అలకాపురీశ్వరు డగు కుబేరుని వద్ద ఒక యక్షుడు సపర్యలు చేస్తూ, అతని ఆగ్రహమునకు గురియై ఒక సంవత్సర కాలము భార్యా వియోగరూపమగు శాపాన్ని పొంది రామగిర్యాశ్రమాన్ని చేరుకొంటాడు - అక్కడ ఎనిమిది నెలలు గడిపి, వర్ష ఋతువున ఆషాఢమాసాన మొదటి రోజున ఆకాశాన మేఘాన్ని చూసి ప్రియా వియోగాన్ని భరించలేక వ్యాకులుడౌతాడు - ఆ మేఘము చేతనమా? అచే తనమా? అని యోచించక తన ప్రియురాలికి మేఘుని ద్వారా సందేశాన్ని పంప సమకట్టి మొదట అలకాపురి మార్గాన్ని బోధిస్తాడు. కొన్ని విశేష స్థలములందు విశ్రమించుమని మరీ మరీ వేడుకొంటాడు - (ఉత్తర మేఘము) ఓ మేఘుడా! నీవు అలకా నగరాన్ని చేరుకొని ఆకాశాన్నందుకొను ఎత్తుగల భవనాల్ని తిల

కిస్తావు. అందు అత్యున్నతమైనది మా ప్రభువగు కుబేరుని భవనము - ఆ భవనము ప్రక్కన మా నివాస భవనముంటుంది అందు నాప్రియురాలు నావియోగ దుఃఖాన్ని భరించలేనిదై భిన్నగాత్రయై. మలినవస్త్రాల్ని ధరించినదై, జీవిత మందు విరక్తి చెందినదై నీకు కనిపిస్తుంది - ఆమెకు నా సందేశాన్ని విని పించి ఆమెను ఓదార్చాలి కేవలము నాలుగు నెలలలోనే వియోగబాధ నశిస్తుం దని, సుఖదుఃఖములు చక్రనేమిక్రమముగా ప్రాప్తించుననియు, వియోగ దిన ములుగడచినంతనే శీఘ్రముగా నేను రాగలనని ఆమెను ఓదార్చుమని యక్షుడు మేఘుని ప్రార్థిస్తాడు

ఈ కథకు మూలము రామాయణమునందలి శ్రీరామ వియోగము, హనుమత్సందేశము కావచ్చునని "సీతాంప్రతిరామస్య హనుమత్సందేశం మనసి నిధాయ మేఘసందేశం కవిఃకృతవానిత్యాహుః" అని మల్లినాథసూరి పలికినాడు. కవి జీవితమే ఈ కావ్య రచనకు మూలమని మరికొందరి అభిప్రాయము. ఇందు విప్రలంభ శృంగారరసము వర్ణింపబడినది ఇందలి మేఘుడు సాధారణ ప్రాణి దూతలకంటే సక్రియుడు, రసికుడు, స్నేహశీలి, ఆజ్ఞాకారి, ప్రత్యుత్పన్నమతిగా కనపడతాడు - అతడు సమయానుకూలముగా గర్జిస్తాడు - వర్షిస్తాడు - దావాగ్నిని చల్లారుస్తాడు - జలాన్ని త్రాగుతాడు, నదులతో ఆడుకొంటాడు, శ్రమ బిందువుల నివారిస్తాడు - వనితలతో ప్రేమకేళి సలుపుతాడు - విరహముచే కృశించిన నదులను స్నేహముచే వర్షించి పుష్టిగావిస్తాడు - మహాకాలుని మంగళ హారతి సమయమున గర్జించి మంగళహారతి పాడుతాడు - శివపార్వతీ విహార సమయమున గడ్డకట్టినవాడై సోపానమౌతాడు. ఈ విధముగా మేఘుని మలచిన కవి ప్రతిభ కడు రమ్యము.

మేఘదూతమునందు పేర్కొనబడిన ప్రదేశములు (శ్లోక క్రమమున) రామగిరి - (1) మహారాష్ట్ర నాగపూర్‌కు 24 మైళ్ళ దూరమున ఉన్న రామ్ టేక్ పర్వతము, (2) మాల - మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌ఘడ్‌లోని ప్రధాన నగరమైన రతనపుర్ సమీపస్థమైన మాలవా, (3) ఆమ్రకూటము - అమర కంటక్, (4) రేవా - వింధ్యపర్వతమునందు వెల్వడిన నర్మదానదీ, (5) దశార్ణ - ఛత్తీసగఢ్ జిల్లా పుర్వ దశార్ణము ఇక్కడ దశన్ అను చిన్న నది ప్రవహిస్తూంది. భూపాల్‌తో కూడుకొన్న పూర్వమాళవము పశ్చిమ దశార్ణము. దీని రాజధాని విదిశా (భిల్సా), (6) విదిశ మరియు వేత్రవతీ - బేతవా

నది వేత్రవతి ఇది వింధ్యోత్తర భాగమునుండి అవిర్భవించినదై, మాళవదేశము ద్వారా ప్రవహిస్తూ కాల్పిదగ్గర కలుస్తూంది బేతవా నదీ తీరస్థమైన భిల్సాయే విదిశ. (1) నీచగిరి - భిల్సా సమీపస్థమైన చిన్నని గుట్ట కావచ్చును. భోజ పూర్‌గిరి నీచగిరని కొందరు అందురు, (6) వననదీ, నవనదీ, మగనదీ బేతవా నదిని దాటగా పార్వతి యను చిన్ననది, (9) ఉజ్జయినీ మరియు శిప్రానదీ, శిప్రానదీతటమున ఉన్న ఉజ్జయినీ క్షేత్రము మహాకాళేశ్వరుని జ్యోతిర్లింగము కలదు, (10) సింధు - చంబలులో ప్రవహించు కాళీనది, (11) నిర్వింధ్య - బేతవా మరియు కాళీనదుల మధ్యను బెంబల్ లోయలో ప్రవహించు చిన్న నది. బహుశః నివుజనది కావచ్చును జినసేనుని ఆదిపురాణమునందును ఈ నది పేర్కొనబడినది, (12) గంధవతీ - మహాకాల దేవాలయ సమీపమున ప్రవహించు శిప్రానదీపాయ కావచ్చును. (13) గంభీరా - శిప్రానదీపాయ - మేహిపూర్‌కు దక్షిణమున శిప్రలో కలుస్తూంది జినసేనుడు దీనిని కూడా పేర్కొన్నాడు. (14) దేవగిరి - ఉజ్జయనీ మందసార్ మధ్యవర్తియైన దేవగఢ్ ప్రదేశము - (15) చర్మణ్వతీ - చంబల్‌నది. (16) దశపురము - మందసార్. (17) బ్రహ్మావర్తము - సరస్వతి మరియు దృషద్వతి నదుల మధ్య భాగమని మనువు పేర్కొన్నాడు సోనీపత్, కర్నాల్, పానీపత్ ప్రదేశములు. (18) కురుక్షేత్రము - స్థానేశ్వరపు దక్షిణ - పూర్వ దిశగా బ్రహ్మావర్తమును అనుకొని యున్న ప్రసిద్ధ తీర్థయాత్ర క్షేత్రము (19) సరస్వతి - అంతర్వాహినీ నది. (20) కనఖల్ - గంగ యొక్క పశ్చిమ తీరమున హరిద్వార్ సమీపస్థమైన చిన్న నగరము - (21) చరణన్యాసము - శివుని చరణాంకితమైన హిమవత్పర్వతము యొక్క ఒక ప్రాంతము. (22) క్రౌంచరంధ్రము - పరశురాముని బాణముచే క్రౌంచపర్వతమునకు చేయబడిన రంధ్రము - హంసలు మానస సరోవరమునకు ఈ రంధ్రముద్వారానే పోతాయని పురాణ ప్రసిద్ధము (23) కైలాసము - శివపార్వతుల నివాసస్థలము 22025 ఫూట్ ఉన్నతమైనది. (24) మానస సరోవరము - కైలాస పర్వతమున ప్రవహించునది. (25) అలకాపురి - యక్షుల నివాస స్థలము పౌరాణికము ఈ మేఘ దూతమునే ఆదర్శముగా గొని అనేక దూతకావ్యము లావిర్భవించినవి - దూతకావ్యములను పరిశీలింతము.

**పవనదూతము :** కవినరపతి, కవిక్ష్మాభృతాం చక్రవర్తి అని ప్రశస్తి నొందినవాడు, బెంగాల్ ప్రభువగు లక్ష్మణసేనుని ఆస్థానకవి అయిన ధోయీకవి 12వ శతాబ్దమున పవన దూతమును రచించినాడు. ఇందులో కనక నగర వాసియైన కువలయవతి యను గంధర్వకన్య దిగ్విజయ యాత్రలో లక్ష్మణసేన ప్రభువును చూసి ప్రేమిస్తుంది. వసంత వాయువును దూతగావించి, తన వ్యథను రాజుకు చెప్పమని ప్రార్థిస్తుంది. మలయాచలమునుండి బెంగాలు వరకు గల త్రోవ రమ్యంగా వర్ణింపబడినది

**హంసనందేశములు :** 12వ శతాబ్దినందే పూర్ణ సారస్వతకవి హంససందేశాన్ని రచించినాడు. ఇందు 102 శ్లోకములు కలవు ఇందులో కాంచీ నగర వాసియైన ఒక తరుణి దిగ్విజయ యాత్రలో శ్రీకృష్ణుని చూసి ప్రేమి స్తుంది శ్రీకృష్ణుని వియోగాన్ని తట్టుకోలేక పుష్పవాటికకు పోగా, ఒక రాజ హంస కనిపిస్తుంది. స్వాగతాన్ని పలికి, స్తుతించి శ్రీకృష్ణుని వద్దకు సందే శము తీసుకపొమ్మని రాజహంసను ప్రార్థిస్తుంది. కాంచీనుండి బృందావన మార్గ వర్ణనము రమ్యము. మేఘదూతమున నాయకుడు సందేశాన్ని పంపగా, ఇందు నాయిక సందేశాన్ని పంపుతూంది. 13 వ శతాబ్దినందు ఇంకొక హంస సందేశము వేదాంత దేశికులచే రచింపబడినది ఇందలి ప్రథమాశ్వా సమున మార్గ వర్ణనాత్మకములగు 60 శ్లోకములు, రెండవ ఆశ్వాసమున లంకా పురీ వర్ణనాత్మకములగు 51 శ్లోకములు కలవు. ఇది రామాయణ కథాశ్రిత మైనది హనుమంతుడు సీత జాడ తెలుపగా, శ్రీరాముడు సీతను ఓదార్చుటకై రాజహంసను దూతగా పంపిస్తాడు మాల్యవత్పర్వతమునుండి లంకానగరము వెళ్ళుటకు రెండు మార్గములు నిర్దేశింపబడినవి. 1) సహ్యాపర్వతాన్ని దాటి పశ్చిమ దిశగా వెళ్లుట, 2) మద్రాసు పూర్వ తీర ప్రాంతమునుండి వెళ్లుట ఇందు మొద టిది ఎల్లప్పుడు వర్షయుక్తము కావున హంసను రెండవ మార్గముననే వెళ్ళవలసి నదిగా తెలుపబడినది. మందాక్రాంతా వృత్తము, ప్రసాద మాధుర్య గుణయుక్త మైన సరస శైలి ఇందులో ప్రయోగింపబడినది. 14వ శతాబ్దినందు ఇంకొక హంస సందేశము రచింపబడినది. దీని కర్త ఎవరో తెలియదు. ఇందు ప్రతీ కాత్మకముగా వేదాంతము బోధింపబడినది ఒక శివభక్తుడు శివభక్తియను ప్రియు రాలి సంగమముతో అద్వైతానందమున మగ్నుడౌతాడు సంచిత కర్మల ప్రభా

వము చే మాయాబంధమున బంధింపబడినవాడై శివశక్తినుండి వియోగాన్ని పొందుతాడు. ఆ వియోగాన్ని తట్టుకోలేక మనస్సునే హంసగా చేసి దూతగా కైలాసమున ఉన్న శివశక్తియను తన ప్రియురాలికి తన ప్రేమ సందేశాన్ని పంపుతాడు. ఇందు భూలోకంనుండి కైలాసము వరకు గల త్రోవ వర్ణనము, మధ్యలో ఉన్న దేవతల వర్ణనము రమ్యంగా వర్ణింపబడినవి. నీరసమైన అధ్యాత్మ విషయము, ప్రతీకాత్మముగా సరసంగా సరళంగా వర్ణింపబడినది. మేఘదూతము నకు చక్కని అనుకరణము ఇది.

ఆదౌ తావచ్ఛృణు కథయతో మార్గ మవ్యాహతంమే
సందేశంతే శ్రవణ సుభగం సౌమ్య వక్ష్యామి శశ్వత్।
పీత్వా పీత్వా శశిగలితాం శుభ్రపీయూషధారాం
పద్మే పద్మే విహితవసతిః ప్రత్యహం యాస్యసిత్వం॥

**శుకసందేశము :** 13వ శతాబ్దినందు దాక్షిణాత్యుడైన శ్రీ లక్ష్మీదాసుడు శుక సందేశమును రచించినాడు. ఇందులో శరత్కాలపు వెన్నెల రాత్రిలో ఇద్దరు ప్రేమికులు ఒక భవనంలో విహరిస్తూ నిద్రపోతారు. నిద్రలో స్వప్నంలో నాయకుడు చిలుకద్వారా తన ప్రియురాలికి రాయబారాన్ని పంపుతాడు. రామేశ్వరంనుండి గుణపురి వరకు గల మార్గవర్ణన రమ్యము. రామేశ్వర పూజతో ఆరంభించి సముద్రతటము, సేతుబంధము, తామ్రపర్ణినదీ, పాండ్య రాజధాని మణలూరు మరియు సహ్యపర్వత పరవర్తియగు కేరళ దేశము, కేరళనుండి కన్యాకుమారి క్షేత్రమును దర్శించి, మళ్ళీ సహ్యపర్వతమువచ్చి, శివమందిరమును దర్శించి, తీయ మామిడిచెట్టునందు విశ్రమించి, ఉషోదయమున తిరిగి ప్రయాణించుమని చిలుకను ప్రార్థిస్తాడు. ఈ విధంగా అనేక నదులు పర్వతములు, రాజభవనములు కల్గిన అందమైన మార్గమున వెళ్లుతూ సంధ్యవేళ గుణపురి ప్రవేశించి విరహాకులమైన తన ప్రేయసికి సందేశమును వినిపించవలయునని ప్రార్థిస్తూ శుభాకాంక్షలతో కావ్యమును ముగిస్తాడు.

**భృంగసందేశము :** 14 వ శతాబ్దినందు దాక్షిణాత్యుడైన వాసుదేవకవి భృంగ సందేశమును రచించినాడు. ఇందలి కథ. తిరువనంతపుర నగరములోని శ్వేత దుర్గమున ఒక ప్రేమికుల జంట ఆనందంగా విహరిస్తుంది. ఒక యక్షిణి ఆ జంటను చూసి అందులోనుండి ప్రియుణ్ణి మలయ పర్వతము.

పైకి ఎత్తుకొని పోతుంది. మార్గమధ్యంలో యతుడురాగా ఆ ప్రియుణ్ణి తిరు వసంతపురం అనంత పద్మనాభస్వామి దేవాలయ సమీపమున ఉన్న పూల తోటలో వదలివేస్తుంది. అంత ప్రియుడు తన ప్రియురాలు లేనందులకు వ్యాకులతనొంది, దగ్గరగా ఒక తుమ్మెదను చూస్తాడు శ్వేతదుర్గమున ఉన్న తన ప్రియురాలికి సందేశాన్ని వినుపించమని తుమ్మెదను ప్రార్థిస్తాడు ఇందు పూర్వ భాగమున మార్గవర్ణనము,ఉత్తర భాగమున ప్రియురాలి స్థానము మరియు ఆమె విరహావస్థావర్ణనము కలదు మందాక్రాంతా వృత్తములో వ్రాయబడినది.

**కోకిల సందేశము :** ఈ శతాబ్దినందే దాక్షిణాత్యుడైన ఉద్దండ కవి కోకిల సందేశమును రచించినాడు. 10 అంకములు కల్గిన మల్లికా భారతమను ప్రకరణ మితనిదే వివిధ విద్యా కేంద్రములలో తన సాహిత్య జీవనయాత్రను కొన సాగిస్తూ మాలావర్ రాజాస్థానమున అనేకమంది కవి పండితులపై విజయమును పొందినాడు. వాసుదేవుని భృంగ సందేశముచే ప్రేరేపితుడై కోకిల సందేశమును వ్రాసినాడని ప్రతీతి. ఇందలి కథ - ఒక ప్రేమికుల జంట నిదురిస్తూ ఉంటారు. తెల్లవారు చూసేసరికి ప్రియుడు కంచి కామాక్షి దేవాలయ సమీపమున తేలు తాడు. ఇంతలో ఆకాశవాణి "అప్సరసలు అతనిని తెచ్చినటుల ఐదు నెలలు కంచిలో ఉంటే ప్రియురాలి వియోగమెప్పుడు కలుగదని" బోధిస్తుంది మూడు నెలలు గడుస్తాయి.వసంతము రాగా కోకిల పాటలను విని విహ్వలుడౌతాడు. తన ప్రియురాలికి సందేశాన్ని వినిపించమని కోకిలని ప్రార్థిస్తాడు. కంచి నుండి చూర్ణినదీ తీరమునందలి జయంతమంగళ గ్రామము వరకు గల మార్గము రమ్యముగా వర్ణింపబడినది. ఇందు ప్రసాదగుణయుక్తమైన శైలి, మందాక్రాంతా వృత్తము ప్రయోగింపబడినవి.

**మయూర సందేశము :** 14వ శతాబ్దిన ఉదయకవి మయూర సందేశమును రచించినాడు. ఇందలి కథ - మాలవార ప్రభువగు శ్రీకంఠ వంశజుడగు రాజకుమారుడు మారదేవమంతికా రాణితో భవనాగ్రమున విహరిస్తూండగా, ఒక విద్యాధరుడు వీరలను శివపార్వతులని అనుకొంటాడు ఆ రాజకుమారుడు విద్యాధరుణ్ణి పరిహసించగా, ఒక నెల కాలము రాణితో వియోగాన్ని పొందునటుల శపిస్తాడు. ఈ శాపకాలమును తిరువసంతపురమున గడుపుతుం

దగా వర్షాకాలము రాగా నెమలి పురివిప్పి నాట్యం చేయడం ప్రారంభిస్తుంది ఆ నెమలిని తన ప్రేయసికి సందేశాన్ని వినిపించమని రాజు ప్రార్థిస్తాడు. మార్గ వర్ణనము మనోహరము - అలంకానగరము, తద్భాపీఠమును తన భవనము సమీపస్థమైన తీయ మామిడిచెట్టు, దిగుడుబావి, ఉద్యానము, లతలు, మొదలగు నవి మంచి భావుకుని శైలిలో వర్ణించబడినవి. ఒక్క నెల రోజుల వియోగాన్ని అధికంగా వర్ణించడముచేత కృత్రిమంత కనిపిస్తుంది.

**హంసదూతము** : వామన భట్టబాణుడు (14 వ శతాబ్ది) హంస దూతమును రచించినాడు . ఇందు మేఘదూతానుకరణము కడు స్పష్టము. ఇందలి కథ. అలకాపురి నుండి వెడలగొట్టబడిన యక్షుడు హంస ద్వారా తన విరహ సందేశాన్ని పంపిస్తాడు మేఘదూతమునందలి రామగిరికి బదులుగా ఇందు దక్షిణ భారతమునందలి కైలాసగిరి తీసుకోబడినది పూర్వ భాగమున మార్గ వర్ణనము, ఉత్తర భాగమున అలకాపురీ వర్ణనము, నాయికా వర్ణనము సందేశము కలవు మలయ పర్వతము నుండి హిమాలయ పర్వతము వరకు గల మార్గము మనోహరంగా వర్ణింపబడినది. అనేక నదులను, నగరములను. ప్రదేశములను, పర్వతములను, దాటుతూ, కాశీ, అయోధ్య నుండి కురుక్షేత్రము, హిమాలయము, క్రౌంచరంధ్రము, కైలాస పర్వతము మీదుగా అలకా నగరాన్ని చేరుకొమ్మని హంసకు ప్రబోధిస్తాడు.

**మనోదూతము** : చైతన్య మహాప్రభువుయొక్క మేనమామ యగు విష్ణుదాసు (15వ శతాబ్ది) శాంతరసభరితమైన మనోదూతమును రచించి నాడు. సర్వప్రాణుల దుఃఖముల చూస్తూ వ్యాకులుడైన ఈకవిభక్తుడు శ్రీకృష్ణుని శరణు వేడుకొంటూ, మనస్సును దూతగాచేసి ప్రభువుకు తన సందేశాన్ని పంపి స్తాడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదుల వదిలిపెట్టి, శమము, దమము, దయ, క్షమాది సద్గుణముల పెంపొందించుకొని, బృందావనము చేరు కొని సరియైన సమయమున శ్రీకృష్ణునకు సర్వప్రాణుల దుఃఖముల నివేదించు మని దూతయగు మనస్సును వేడుకొంటాడు ఇందు 201 వసంత తిలకా శ్లోకములున్నవి. మార్గవర్ణనలేదు. పూర్వోత్తర విభాగము లేదు.

**కోకసందేశము** : విష్ణుగుప్తుడు (16వ శతాబ్ది) కోక సందేశమును రచించినాడు. ఇందు ఒక రాజకుమారుడు విహారపురమునుండి కామరామ పురమునందలి తన ప్రేయసికి చక్రవాక పక్షిద్వారా సందేశాన్ని పంపిస్తాడు. ఇందులోని కథ : రాజకుమారుడు తన ప్రియురాలితో హాయిగా ఉండగా, ఒక యాత్రికుడు వచ్చి ఒక యంత్రమును ఇస్తాడు. యంత్రములోని సీసమును తాకినట్లయితే, చాలాదూరం వెళ్ళిపోతావని తెల్పగా, రాజకుమారుడు తాకి దూరంగా వెళ్ళిపోతాడు. ప్రియావియోగముచే వ్యాకులుడై ఒక చక్రవాక పక్షిని చూసి తన విరహ వృత్తాంతమును వినిపిస్తాడు. తన ప్రియురాలికి సందేశాన్నందజేయుమని అభ్యర్థిస్తాడు. మార్గవర్ణనము రమ్యము. తెల్లవారగానే విహార పురమునందు విష్ణుదేవుని దర్శించి బయలుదేరి, వారాణవ్యస్థలమున గణేశుని పూజించి, అక్కడే సమీపమున ఉన్న పర్వతముపైది ఉద్యాన వనమునందలి అమ్మవారి దేవాలయమును దర్శించి, అక్కడే మాయా సరోవర సమీపమున నున్న మామిడిచెట్టుపై మధ్యాహ్న సమయమున విశ్రమించి దగ్గరలోని శివాలయమును దర్శించుము. సచంద్రా అను రాజధానిని ప్రవేశించి ఉద్యాన, నదీ, వనముల దాటి శివ మందిరమున రాత్రిని గడుపుము. తెల్లవారగానే పూర్ణానందమను శివక్షేత్రమును దర్శించి ఉత్తర పూర్వదిశగా వెళ్ళగా కామరామ నగరము వస్తుంది. అక్కడ తన భవనము. అందు వియోగాన్ననుభవిస్తున్న ప్రేయసికి సందేశాన్ని వినిపించుమన్న ప్రార్థనతో, శుభాకాంక్షలతో కావ్యము ముగుస్తుంది. మేఘదూతమువలె ఇందు రెండు భాగములు కలవు పూర్వభాగమున 120, ఉత్తరభాగమున 186 మందాక్రాంతా శ్లోకములు కలవు.

**హంస సందేశము** : శ్రీ చైతన్యప్రభువు శిష్యుడు, ఉజ్జ్వల నీలమణి గ్రంథకర్తయైన రూపగోస్వామి (క్రీ॥శ॥ 1490-1563) హంస సందేశము, ఉద్ధవ సందేశములను రచించినాడు. హంస సందేశములో రాధ విరహావస్థను తెలుపుతూ, ఆమె సఖి లలిత శ్రీకృష్ణునకు హంసద్వారా సందేశాన్ని పంపుతుంది. రాధాకృష్ణ విహారములను కరుణ రసస్ఫూర్తితో వర్ణించాడు కవి. మార్గ వర్ణనము, శ్రీకృష్ణ వర్ణనము మనోహరములు. అనుకూలమైన సమయాన్ని జూసి సందేశాన్ని వినిపించమంటాడు.

విలోకేథాః కృష్ణం మదకల మరాళీ రతికళా
విదగ్ధ వ్యాముగ్ధం యది పురవధూ విభ్రమభరై॥
తదా నాస్మాన్ గ్రామ్యాన్ శ్రవణ పదవీం తస్య గమయేః
సుధాపూర్ణం చేతః కథమపి న తక్రం మృగయతే॥

ఇందు శిఖరిణీ ఛందస్సులో 140 శ్లోకాలున్నవి. ఉద్ధవ సందేశము శ్రీమద్భాగవత దశమ స్కంధమునందలి ఉద్ధవ సందేశముపై ఆధారపడినది. మార్గవర్ణనలో అనేక కాల్పనిక రమ్య ప్రదేశములను వర్ణిస్తూ, గోపికల సచ్చరిత్రమును కీర్తిస్తూ, మనోహర ప్రసంగముల జోడించి కావ్యశోభను ఇమ్మడింప జేసినాడు. మేఘదూతానుకరణము స్పష్టము. ఇందు 139 మందాక్రాంతా శ్లోకములు కలవు. మాధవ కవీంద్రులు (క్రీ॥ శ॥ 16వ శతాబ్ది) ఉద్ధవదూతమును రచించినాడు ఇందు శ్రీకృష్ణుడు రాధాది గోపికలకు ఉద్ధవునితో సందేశాన్ని పంపిస్తాడు. రఘునాథకవి (క్రీ॥శ॥ 16వ శతాబ్ది) హంస సందేశాన్ని రచింపగా, నరసింహదాసు (క్రీ॥శ॥ 17వ శతాబ్ది) బెంగాలీ భాషలోకి అనువదించినాడు.

**భ్రమరదూతము :** సుప్రసిద్ధ నైయాయికుడు, 29 గ్రంథములు రచించిన బెంగాల్ నివాసి రుద్రన్యాయ ప్రంచాననుడు (17వ శతాబ్ది) భ్రమరదూతమును రచించినాడు రామాయణాశ్రితమిది మాల్యవత్పర్వతము నుండి శ్రీరాముడు సీతాన్వేషణకై హనుమదాదులను లంకకు పంపిస్తాడు. హనుమంతుడు చూడామణిని తీసుకొనిరాగా, శ్రీరాముడు సీతను స్మరిస్తూ విహ్వలుడౌతాడు. అక్కడే సరస్సులో తుమ్మెదను చూస్తాడు. అశోకవనములోని సీతకు తుమ్మెద ద్వారా సందేశాన్ని పంపిస్తాడు మొదట తన పరిచయాన్ని, దయనీయ స్థితిని నివేదించి లంకామార్గమును బోధిస్తాడు. చిత్రకూటము, నర్మద, వింధ్యపర్వతము, కర్నాటకమునందలి కావేరీనది, కంచిలోని శివకంచి విష్ణుకంచులు, నదములు, నదులు, సముద్రము దాటిన తరువాత లంకానగరము. అందు అశోకవనిలో దుఃఖమగ్నయైన సీతకు సందేశమును వినిపించుమని తుమ్మెదను ప్రార్థిస్తాడు. 128 మందాక్రాంతా శ్లోకములు కల్గిన దీనిలో చివరి రెండు శ్లోకములు కవి పరిచయమును చేయుచున్నవి.పికదూతముకూడా బహుశః ఈ కవిచేతనే రచింపబడి యుండవచ్చును ఇందలి కథ- బృందావనములో రాధ కృష్ణవియోగముచే వ్యాకులురాలై, శ్రీకృష్ణునకు కోకిల ద్వారా సందేశాన్ని

పంపిస్తుంది. బృందావనము మథురకు దగ్గరగా ఉన్నందున మార్గమును వర్ణించక, కేవలము 31 శార్దూల విక్రీడిత శ్లోకాల్లో సందేశము మాత్రం వర్ణించబడినది.

**సుందరగణి :** (క్రీ॥శ॥ 1484) మేఘదూతము యొక్క చివరి పాదముల తీసుకొని 132 శ్లోకములతో శీలదూతమును రచించినాడు ఈ విధము గానే మేఘదూతముయొక్క అంతిమ చరణముల నాధారముగా తీసుకొని చేతో దూతము వ్రాయబడినది. దీని కర్త ఎవరో తెలియదు. ఇందులో శిష్యుడు గురు చరణముల దయాదృష్టిని ప్రేయసిగాచేసి, తన చిత్తమును దూతగా పంపిస్తాడు ఇందు 129 శ్లోకములు కలవు.

**పవనదూతము :** వాదిచంద్రసూరి (17వ శతాబ్ది) మేఘదూతాన్ని అనుక రిస్తూ 101 మందాక్రాంతా శ్లోకాలతో పవన దూతమును రచించినాడు ఉజ్జయినీ ప్రభువగు విజయ నరేశుని రాణి తారను అశనివేగుడను విద్యాధరుడు హరిస్తాడు. వియోగాన్ననుభవిస్తున్న నరేశుడు వాయువుని దూతగావించి సందేశాన్ని పంపి స్తాడు. మార్గవర్ణనము మేఘదూతమువలె ఉన్నది మొదట అశనివేగుడు యుద్ధా నికై బెదిరిస్తాడు, కాని చివరికి తారను వాయువుద్వారా రాజుకు పంపిస్తాడు కాల్ప నికమైన కథ, సరళ, ప్రవాహశీలియైన భాషలో, ప్రసాద గుణపూర్ణమైన వైదర్భి రీతిలో రచింపబడినది.

**పదాంకదూతము :** మహామహోపాధ్యాయ శ్రీకృష్ణ సార్వ భౌముడు (క్రీ॥శ॥ 17వ శతాబ్ది) పదాంకదూతమును రచించినాడు. శ్రీకృష్ణుని వియోగముచే వ్యాకులురాలైన గోపిక, యమునాతటమున, లతాకుంజ సమీప మున కమల, కులిశ, రథాది చిహ్నములు కల్గిన శ్రీకృష్ణుని అడుగులను చూస్తుంది. మేఘముల గర్జనలను విన్నదై, శాశలేనిదై, ఆ శ్రీకృష్ణుని పాదచిహ్నమునే దూతగావించి మధురకు పంపుతుంది. ఇందు బృందావనము నుండి మధురవరకు గల మార్గము రమ్యంగా వర్ణింపబడినది. పాదచిహ్నమునకు పాదచారిగా వెళ్ళా లంటే కష్టమౌతుంది కావున, తన మనస్సను గుర్రము నధిరోహించి వెళ్ళ మంటుంది శ్రీమద్భాగవత దశమస్కంధ 30వ అధ్యాయమున 24, 25, 26 శ్లోకములు శ్రీకృష్ణుని పాదచిహ్నములను వర్ణించుచున్నవి.

**భృంగధూతము :** శతావధాని కృష్ణదేవుడు(క్రీ॥శ॥18వ శతాబ్ది) భృంగదూతమును రచించినాడు. ఇందలి కథ- శ్రీకృష్ణ వియోగముచే వ్యాకులురాలైన గోపికకు వెన్నెలరాత్రి ఒక కల్పముకాగా, తెల్లవారగానే కనిపించిన తుమ్మెదను దూతగాచేసి బృందావనానికి వెళ్ళమని ప్రార్థిస్తుంది. బృందావనము, నందబాబా గృహము, ఉద్యానవనములు, వీధులు, గోపికల విలాసములు రమ్యంగా వర్ణింపబడినవి యమునా మార్గమున శివమందిరము, సరస్వతీ మందిరము. కదంబవృక్షము - యమున దాటిన తరువాత బృందావనము - అందు శ్రీకృష్ణుడు. అతనితో సందేశాన్ని వివరిస్తూ 'వెన్నెల అగ్నితుల్యము, వస్త్రముల శయ్య అగ్నికణముల శయ్యాసమానము, పద్మపురేకులు బాణతుల్యములు, మదిర విష సమానము, మురళీనాదము మూర్ఛను కలిగిస్తున్నది .. ఓ మాధవా! నీ కమలచరణములందు నా హృదయము సదా ఉండని, మనసా, వాచా, కర్మణా నిన్నే నమ్ముకొన్నదానిని, నేను ఏదైనా తప్పు చేస్తే క్షమించు ప్రభూ' అని సందేశాన్ని తెలుపుమని, శ్రీకృష్ణుని మెడలోని వైజయంతీ మాలలోనే వసింపుమని తుమ్మెదను ప్రార్థిస్తూ సందేశాన్ని ముగిస్తుంది గోపిక. ఇందు 106 మందాక్రాంతా శ్లోకములు కలవు. చక్కని భాష, రమ్యములైన భావములు, మేఘదూతమును తలపింపజేయు పదావళులు కలవు

**మనోదూతము :** పంజాబ్ నివాసియగు తైలంగవ్రజనాథుడు (క్రీ॥ శ॥ 1750) మనోదూతమును రచించినాడు - ద్రౌపదీ వస్త్రాపహరణ కథకు సంబంధించినదిది. మయసభయందు దుర్యోధనుని చూసి భీముడు నవ్వగా 'గ్రుడ్డివాడు కొడుకు కూడా గ్రుడ్డివాడే' అని ద్రౌపది అవహేళన చేస్తుంది : రారాజు ఈ అవమానమును శకునికి విన్నవిస్తాడు. ద్యూతక్రీడకై ధర్మజుని పిలువుమని శకుని సలహా ఇస్తాడు. ధృతరాష్ట్రుడు విదురునిద్వారా ఆహ్వానాన్ని పంపుతాడు ధర్మరాజు ద్యూతమున ద్రౌపదితో సహా సర్వస్వాన్ని ఓడిపోతాడు. ద్రౌపదిని దూతద్వారా పిలిపిస్తాడు రారాజు. ద్రౌపది నిరాకరించ దుశ్శాసనుడు వెంట్రుకలుపట్టిలాక్కొస్తాడు. అసహాయురాలైన ద్రౌపది శ్రీకృష్ణుని స్మరించినదై తన మనస్సునే దూతగా జేసినదై, ద్వారకలోని శ్రీకృష్ణుని వద్దకు పంపిస్తుంది. మనస్సును ప్రశంసిస్తూ, ద్వారకను వర్ణిస్తూ, శ్రీకృష్ణునకు నమస్కరించి, సందేశాన్ని వినిపించమని ప్రార్థిస్తుంది. అక్కడ శ్రీకృష్ణుడు కూడా చింతాకులుడై,

గరుడునిపై అధిష్ఠించి హస్తినాపురానికి వచ్చి, అక్షయ వస్త్రముల ప్రసాదించి, ద్రౌపది శీల రక్షణ చేస్తాడు - సహృదయహృదయాహ్లాదనమని నామాంతరము కల్గిన ఈ కావ్యములో 202 శిఖరిణీ శ్లోకములున్నవి.

**వాతదూతము :** మహామహోపాధ్యాయ శ్రీకృష్ణనాథ భట్టాచార్య న్యాయపంచాననుడు (క్రీ॥శ॥ 1866) వాతదూతమును రచించినాడు రామాయణ కథాశ్రితమిది. లంకలో అశోకవనిలో శ్రీరామ విరహముచే సీతమ్మ బాధనొందుతూండగా, దక్షిణ దిక్కునుండి శీతలవాయువు వీస్తూంది. ఆ వాయువునే దూతగా చేసినదై, శ్రీరామునకు తన విరహ సందేశాన్ని పంపిస్తుంది. మార్గ వర్ణనము కడు రమ్యము - సముద్రము, వనములు, ఋష్యమూక పర్వతము, ఉత్తర దిక్కుగా పంపాసరోవరము, దండకారణ్యము, పూర్వ దిక్కున జన స్థానము, సమీపమున పంచవటి, గోదావరీ నదీతీరమునందలి ఆశ్రమమున శ్రీరాముడు లభిస్తాడని సీత వాయువునకు బోధిస్తుంది. ఆశ్రమమున లభించక పోతే, అక్కడే వెదకుమనియు, వనదేవతలతో తన సమాచారము తెలుపుమనియు, జీమూత పర్వతము సమీపమున, లక్ష్మణసహితుడైన శ్రీరాముడు లభ్యమౌతాడని సీత వాయువుకు బోధిస్తూంది తన సందేశమును వినిపించుమని వాయువును ప్రార్థిస్తూ, శుభాకాంక్షల జ్ఞాపనముచే కావ్యము ముగుస్తూంది. ఇందు 100 మందాక్రాంతా శ్లోకములు కలవు

**పాంథదూతము :** బెంగాల్ నివాసియగు భోలానాథుడు శ్రీమద్భాగవత గోపీకృష్ణ ప్రేమనాధారముగాగొని పాంథదూతమును రచించినాడు. యమునాతటమున గోపికలు శ్రీకృష్ణవియోగముచే వ్యథనొందుతూండగా, మధుర వైపువెళ్తున్న ఒక బాటసారి కనిపిస్తాడు. తులసీమాలను ధరించి, సదాచారతత్పరుడైన ఆ బాటసారితో శ్రీకృష్ణునికి తమ సందేశాన్ని వినిపించుమని ప్రార్థిస్తారు. సందేశముతో కావ్యము ముగుస్తుంది.

**హనుమద్దూతము :** నిత్యానందశాస్త్రి (క్రీ॥శ॥ 1929) రామాయణ కథాశ్రితమైన హనుమద్దూతమును రచించినాడు. లంకలోని సీతకు హనుమంతుని ద్వారా, సీతా విరహాకులుడైన శ్రీరాముడు సందేశాన్ని పంపించుట ఇందు వర్ణి

తము. 68 మందాక్రాంతా శ్లోకములు కల్గిన పూర్వ భాగమున మార్గ వర్ణనము కలదు. ప్రశ్రవణ గిరినుండి వింధ్యపర్వతము, నర్మద, గోదావరి, ఉత్కలము, దశార్ణము, వేగవతీనది, అశ్వవంతి నగరము, అవంతినగరము, విదర్భదేశము, మహిషపురి, మత్స్య, కళింగ, కౌశిక దేశములు, మహేంద్రపర్వతము, సముద్రము, లంకానగరము, ఉద్యానవనమున అశోక, మందార, శింశుపా వృక్షముల క్రింద సీత లభించగలదని పేర్కొన్నాడు. 58 మందాక్రాంతా శ్లోకములు కల్గిన ఉత్తర భాగమున సందేశము ముద్రాప్రదానము, సీతకు సందేశము వినిపించి చూడామణితో హనుమంతుడి రాకతో కావ్యము ముగుస్తూంది ఇది మేఘసందేశ శ్లోకముల నాల్గవ పాదములను తీసుకొని సమస్యాపూరణ పద్ధతిన రచింపబడినది. శృంగార రసము చక్కగా పోషించబడినది.

ఇవియేకాక అనిలదూతము, కీర దూతము, కృష్ణదూతము, చంద్ర దూతము, అమరసందేశము గరుడసందేశము, చిలుకసందేశము, చకోరసందేశాది కావ్యములు లభ్యములగుచున్నవి ఇక ఆధునిక సందేశ కావ్య విషయాని కొస్తే - మహాలింగశాస్త్రియొక్క భృంగసందేశము, సుధాకర శుక్లయొక్క దేవ దూతము, డా. పరమానందశాస్త్రియొక్క గంధదూతము, డా. రుద్రదేవత్రిపాఠి యొక్క వ్రతదూతము, శివప్రసాదశాస్త్రి భరద్వాజయొక్క భారత సందేశము, వాశిష్ఠ గణపతిమునియొక్క భృంగదూతము, ద్విజేంద్రనాథశర్మయొక్క అలకామిలనము, గరికెపాటి లక్ష్మీకాంతయ్యయొక్క కీరసందేశము, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారియొక్క కీరసందేశము మొదలగునవి ప్రసిద్ధములు. ఈ సందేశ కావ్యములన్నింటిపైనను మేఘసందేశ ప్రభావము కడుస్పష్టము విషయ వర్ణనలోననేకాక చివరికి మందాక్రాంత ఛందస్సును కూడా ఆశ్రయించారు మేఘసందేశము వారికి MODEL ఆదర్శమైనది. తూచా తప్పకుండా అనుసరించారు, కృతకృత్యులైనారు.

మేఘదూతమునకంటె పూర్వము ఘటకర్పరవిరచితమైన ఘటకర్పర దూతకావ్యమున్నప్పటికి, ఇందు భావాత్మకత సరిగా పర్ణింపబడలేదు. మేఘ దూతమున భావాత్మకత వికాసమునొందినది. ఘటకర్పరుడు ఉజ్జయినీ ప్రభు వగు విక్రమాదిత్యుని నవరత్నములలో ఒకడు క్రీ॥పూ॥ ప్రథమ శతాబ్దికి చెందిన వాడు. జీయేయ యేన కవినా యమకైః పరేణ తస్మై వహేయముదకం ఘట కర్పరేణ అను ప్రతిజ్ఞచేతనే ఈ కవికి ఘటకర్పర నామము కావచ్చును. ఈతని

కావ్యమున ప్రోషిత భర్తృకయైన నాయిక మేఘుని ద్వారా తన భర్తకు సందే శాన్ని పంపిస్తూంది. హంస మానస సరోవరం వైపు ఎగురుతూంటే, చాతకపక్షి నీటికై మేఘముల యాచిస్తుంటే విరహిణీ హృదయము వ్యాకులత నొందుతూంది, 'మేఘశబ్దముదితాః కలాపినః ప్రోషితా హృదయ శోక లాపినః, తోయదాగమ కృశాంచ సాద్యతే దుర్దరేణ మదనేన సాద్యతే. ఘటకర్పర కావ్యంలోని యమకం చాలా సుందరమైనది. అప్రయత్నంగా వచ్చినట్లు సహజశోభ కలిగి వున్నది కాని ప్రయత్నంతో సాధించి వ్రాసినట్లుగా కృత్రిమతలేదు ఉదాహరణకి శ్లోకము-

శీఘ్రం ప్రసాదయతి సంప్రతి కోపి తాని
కాంతాముఖాని రతి విగ్రహకోపితాని
ఉత్కంఠయంతి పథికాన్జలదాః స్వనంతః
శోకోఽభివర్ధయతి తద్వనితాస్వనంతః

ఘటకర్పర కావ్య ప్రభావము సందేశ కావ్యములపై ఏమి కనిపించదు. కాని కవి మదనుడు (క్రీ॥శ॥ 16వ శతాబ్ది) ఘటకర్పర కావ్యంలోని 21 శ్లోకములలోని 84 పాదాల్ని వున్నవున్నట్లుగా తీసుకొని మిగిలిన మూడు పాదాలను తాను చేరుస్తూ 84 శ్లోకాలతో కృష్ణలీల కావ్యాన్ని రచించినాడు. ఇది సందేశకావ్యము కాదు కావున సందేశ కావ్యాలపై ఘటకర్పరుని ప్రభావమేమియు లేదు.

**స్తోత్రకావ్యములు :** ఆరాధ్య దేవుని భక్తి పురస్సరముగా స్తుతి గావించు గీతి కావ్యములు స్తోత్రములని చెప్పబడుతాయి. ఈ స్తోత్ర సాహిత్యావిర్భావమును ఋగ్వేదముననే గాంచవచ్చును ఇంద్ర, అగ్ని, వరుణాది దేవతల స్తుతి పరకములగు సూక్తములే ఇందుకు నిదర్శనములు - రామాయణ, భారత, భాగవత, పురాణాదులందు స్తోత్రములు కోకొల్లలు ఋషులు, కవులు తమ అభీష్టసిద్ధికై దేవతల స్తుతిస్తూ ఈ సాహిత్యమును వృద్ధిబరచినారు- ఇందు

జటాకటాహ సంభ్రమ భ్రమన్నిలింపనిర్ఝరీ
విలోల వీచి వల్లరీ విరాజమాన మూర్ధని।
ధగద్ధగజ్జ్వలల్లలాట పట్టపావకే
కిశోర చంద్రశేఖరే రతిః ప్రతిక్షణం మమ॥

ఇత్యాది 14 శ్లోకములతో కూడుకొనిన రావణకృత శివతాండవ స్తోత్రము. వ్యాసకృత విశ్వనాథాష్టకము బిల్వాష్టకము. కాళిదాసుయొక్క ఆశ్వాటీవృత్తమున రచింపబడిన "చేటీ భవన్నిఖిలఖేటీ .. కాళీ స్తవము శ్యామలాదండకము

బాణభట్టుయొక్క చండీ శతకము, మయూర కవియొక్క సూర్యశతకము శంకరాచార్యులయొక్క స్తోత్రగ్రంథములెన్నో ప్రసిద్ధములు.

అశ్వఘోషకవి (ప్రథమ శతాబ్ది) బౌద్ధమత దేవతయగు గండీ మాతను స్తుతిస్తూ గండీస్తోత్ర గాథను రచించినాడు. ఆచార్య నాగార్జునుడు (3వ శతాబ్ది) చతుః స్తవమను స్తోత్ర గ్రంథమును రచించినాడు. సిద్ధసేన దివాకరుడు (క్రీ॥శ॥ 500) జైన తీర్థంకరులను స్తుతిస్తూ 44 శ్లోకములతో కళ్యాణ మందిర స్తోత్రమును రచించినాడు. పుష్యభూతి వంశజుడు, ప్రభాకరవర్ధనుని తనయుడు, నాటక త్రయకర్త హర్షవర్ధనరాజు (క్రీ॥శ॥ 600 648) అష్టమహాశ్రీ చైత్య స్తోత్రము, సుప్రభాత స్తోత్రములను రచించినాడు ఇవి బౌద్ధదేవత స్తుతిపరములు. చంద్రకాంత భిక్షుణి బౌద్ధ దేవుడగు అవలోకితేశ్వరుని వర్ణిస్తూ, స్తుతిస్తూ 8 శ్లోకాలతో అష్టకాన్ని రచించినది. బాణకవి సమకాలికుడైన మాన తుంగాచార్యులు (6వ శతాబ్ది) జైన తీర్థంకరుల స్తుతిస్తూ భక్తామర స్తోత్రమును రచించినాడు ఇది పూజాసమయమున జైనులచే పఠింపబడుచున్నది. దీనిపై శ్వేతాంబర, దిగంబర పరంగా రెండు వ్యాఖ్యలు రచింపబడినాయి. సర్వజ్ఞ మిత్రుడను బౌద్ధభిక్షువు,బౌద్ధదేవతయగు తారాదేవిని స్తుతిస్తూ స్రగ్ధరావృత్తంతో స్రగ్ధరాస్తోత్రమును రచించినాడు.

అద్వైత మత స్థాపకులైన శంకరాచార్యులు (క్రీ॥శ॥ 788) ప్రస్థాన త్రయముపై భాష్యముల రచించడమే కాకుండా, అనేక స్తోత్రముల రచించినాడు. వీటియందు "శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి, అతస్త్వామారాధ్యాం హరిహర విరించ్యాది భిరపి ప్రణంతు స్తోతుంవా కథమకృతపుణ్యః ప్రభవతి" అను శ్లోకముతో ఆరంభింపబడిన సౌందర్య లహరి, "కలాభ్యాం చూడాలంకృత శశి కలాభ్యాం నిజతపః ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతుమే। శివాభ్యామస్తోక త్రిభువన శివాభ్యాం హృదిపునః భవాభ్యామానంద స్ఫురదను భవాభ్యాం నతిరయం" అను శ్లోకముతో ఆరంభించబడిన శివానందలహరి, భజ గోవిందం భజగోవిందంగోవిందం భజ మూఢమతే అని ఆరంభించబడిన చర్పట పంజరికాస్తోత్రము, 18 శ్లోకములుకలిగిన మోహముద్గర స్తోత్రము, 101 స్రగ్ధరా శ్లోకములు కలిగిన శతశ్లోకి,కృష్ణాష్టకము,'పరబ్రహ్మలింగంభజే పాండురంగ'o అను మకుటంతో వ్రాయబడిన పాండురంగాష్టకము, భవాన్యష్టకము,

దక్షిణామూర్త్యష్టకము, లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం అను మకుటము కలిగిన లక్ష్మీనరసింహ కరావలంబ స్తోత్రము, శివభుజంగస్తోత్రము, అంబాష్టకము మొదలగునవి ప్రధానములైనవి.

శంకరాచార్యులకు సమకాలికుడైన, మూకకవి 500 శ్లోకములు కలిగిన కామాక్షి దేవీ స్తుతిపరమగు మూకపంచశతిని రచించినాడు. వైష్ణవాళ్వారులలో ప్రసిద్ధుడు, కేరళ రాజైన కులశేఖరాళ్వార్ (క్రీ॥శ॥ 700) భక్తిప్రధానమైన ముకుందమాలను రచించినాడు. వైష్ణవులకిది అత్యంత ప్రియమైనది. సాహిత్య దర్పణ కారునిచే భక్తిరసమున కుదాహరణంగా ఇచ్చిన ఈ శ్లోకమును చూస్తాము

దివివా భువివా మమాస్తు వాసో నరకేవా నరకాంతక ప్రకామం
అవధీరిత శారదారవిందౌ చరణౌతే మరణేపి చింతయామి

పుష్పదంతుడు (క్రీ॥శ॥ 900) శివుని మహిమలను కొనియాడుతూ శివమహిమ్నః స్తోత్రమును రచించినాడు. న్యాయమంజరీకారుడైన జయంతభట్టు ఈ స్తోత్రముచే పరిచితుడిగా కనిపిస్తాడు. అభినవగుప్తుని గురువగు ఉత్పలదేవుడు (క్రీ॥శ॥ 925) శివస్తుతి పరములగు 21 స్తోత్రములు కల్గిన స్తోత్రావళిని రచించినాడు. రామానుజాచార్యుల గురువగు యామునాచార్యులు (10వ శతాబ్ది) భక్తిభావ భరితమైన, విష్ణుస్తుతిపరమైన (65 శ్లోకములతో) ఆళ్వందార స్తోత్రమును, నాల్గు శ్లోకములతో లక్ష్మీమాతను స్తుతిస్తూ చతుః శ్లోకిని, మరికొన్ని స్తోత్రములను రచించినాడు. విశిష్టాద్వైత స్థాపకుడైన రామానుజాచార్యులు(క్రీ॥శ॥ 1017-1125) భక్తిభావ పూర్ణములైన శరణాగత గద్యము, వైకుంఠగద్యము, శ్రీరంగ గద్యములను రచించినాడు. రామానుజాచార్యుల శిష్యుడు, సమకాలికుడైన శ్రీవత్సాంకుడు (11వ శతాబ్ది) లక్ష్మీస్తుతి మొదలగు ఐదు స్తుతులు కల్గిన పంచస్తవ స్తుతికావ్యమును రచించినాడు. పారాశరభట్టు (క్రీ॥శ॥ 1100) శ్రీరంగ రాజస్తవము, శ్రీగుణ రత్నకోశములను రచించినాడు. ఈ సమయమునందే జయదేవుడు గంగానదిని వర్ణిస్తూ గంగాస్తవమును రచించినాడు.

లీలాశుకుడని నామాంతరము కలిగిన బిల్వమంగళుడు (11వ శతాబ్ది) భక్తిరస భరితములైన 310 శ్లోకాలు కలిగిన శ్రీకృష్ణ కర్ణామృతమును రచించినాడు. ఇతని కవిత్వము మధురము, సరసము, సరళము, మంజులము, కృష్ణ

భక్తి భరితము ఈతడు పూర్వాశ్రమమున చింతామణియను వేశ్యయందు ఆసక్తుడు. శ్రీకృష్ణ జన్మాష్టమి దినమున పొంగి పొరలి వస్తూన్న కృష్ణానదిని సైతం దాటి, పామును త్రాడుగావించి, దాని నాధారముగా చేసుకొని వేశ్య ఇంటి లోకి ప్రవేశించగా, ఆ చింతామణి వేశ్య బిల్వమంగళుని కాముకత్వమును నిందించి కళ్ళు తెరిపించగా, శ్రీకృష్ణ భక్తుడిగా మారినాడన్న కథ బహుళ వ్యాప్తిలో ఉన్నది. దీనికి ప్రమాణంగా

చింతామణిర్జయతి సోమగిరిర్గురుర్మే
శిక్షాగురుశ్చ భగవాన్ శిఖిపింఛమౌళిః।
యత్పాద కల్పతరు పల్లవశేఖరేషు
లీలా స్వయంవరరసం లభతే జయశ్రీః॥

అని మొదటి శ్లోకమున చింతామణి నామము కనిపించుచున్నది రూపగోస్వామి శిష్యుడైన కృష్ణదాసుడు వ్యాఖ్యానంలో

"కవిర్దక్షిణాపథే దాక్షిణాత్యః కృష్ణవేణ్యాః
పశ్చిమ తీరవాసీ బిల్వమంగళః పూర్వ కర్మవాసనయా
చింతామణి నామక వేశ్యాయామాసక్తః" అనియు పేర్కొన్నాడు.

ఈతని ద్రాక్షాపాక రచనకొక ఉదాహరణము.

రాధా పునాతు జగదచ్యుత దత్తచిత్తా
మంథాన మాకలయతీ దధి రిక్తపాత్రే।
తస్యాః స్తన స్తబక చంచలలోల దృష్టిః
దేవోపి దోహనధియా వృషభం నిరుంధన్॥
ఏకేతు కామాకిల గోపకన్యా మురారి పాదార్పిత చిత్తవృత్తిః।
దధ్యాధికం మోహ వశాదవో చద్గోవింద దామోదరమాధవేతి॥

రాజతరంగిణిని రచించిన కల్హణుడు క్రీ॥ శ॥ (1050) 18 శ్లోకాలతో శివుని అర్ధనారీశ్వర స్వరూపాన్ని వర్ణిస్తూ అర్ధనారీశ్వర స్తోత్రాన్ని రచించినాడు. ద్వైతమతాన్ని స్థాపించిన మధ్వాచార్యులు (క్రీ॥ శ॥ 1250) ద్వాదశ స్తోత్రమును రచించినాడు. ఆనందతీర్థులనునది ఈతని పూర్వాశ్రమ నామము - లక్ష్మణాచార్యుడు 50 శ్లోకాలతో చండీమాతను స్తుతిస్తూ చండీకుచపంచాశిక స్తోత్రమును రచించినాడు.హరియుధునిచే రచింపబడిన శివస్తోత్రము అమరేశ్వర దేవాలయ రాతి పలకపైచెక్కబడినది కవితార్కిక కేసరి వేంకటనాథుడు (వేదాంత దేశికులు) (క్రీ॥శ॥

1280) శ్రీరాముని పాదుకలను 1000 శ్లోకాలతో స్తుతిస్తూ పాదుకాసహస్రమ ను, గరుత్మంతుని స్తుతిస్తూ గరుడదండకమును, శ్రీరాముని స్తుతిస్తూ గద్య రూప మున రఘువీర గద్యమును రచించినాడు - జగద్ధరభట్టు (క్రీ॥ శ॥ 1350) శివుణ్ణి స్తుతిస్తూ 1415 శ్లోకములతో సుతి కుసుమాంజలిని వ్రాసినాడు. ప్రసిద్ధ అలంకారికుడు దాక్షిణాత్యుడు అప్పయ్యదీక్షితుడు (క్రీ॥ శ॥ 1580) 100 శ్లోకాలతో కంచివరదరాజస్వామిని స్తుతిస్తూ వరదరాజ స్తవమును రచించినాడు స్వయంగా దీనిపై వ్యాఖ్యానమును కూడా వ్రాసినాడు. మధుసూదన సరస్వతి (క్రీ॥ శ॥ 1600) శ్రీకృష్ణుని యొక్క నఖశిఖ పర్యంత వర్ణన చేస్తూ 102 శ్లోకములతో ఆనందమందాకినీ స్తుతి కావ్యాన్ని వ్రాసినాడు - శుద్ధాద్వైతమత ప్రవర్తకుడగు వల్లభాచార్యులు మధురాష్టకమును రచించినాడు - నీలకంఠ దీక్షితులు (క్రీ॥ శ॥ 1650) పార్వతీదేవిని స్తుతిస్తూ ఆనందసాగర స్తవమును, శివుణ్ణి సుతిస్తూ శివోత్కర్షమంజరిని రచించినాడు - రూపగోస్వామి (క్రీ॥ శ॥ 1490.1563) శ్రీకృష్ణుని సుతిపరమైన ముకుంద ముక్తావళిని, గంధర్వ ప్రార్థనాష్టకమును రచించినాడు వేంకటాధ్వరి (క్రీ॥శ॥ 1560) లక్ష్మీ మాతను స్తుతిస్తూ 1000 శ్లోకాలతో లక్ష్మీసహస్రమును రచించినాడు జగన్నాథ పండితరాయలు (17వ శతాబ్ది) గంగాలహరి, అమృతలహరి కరుణాలహరి, లక్ష్మీలహరి, సుధాలహరులను రచించినాడు రామభద్ర దీక్షితుడు (18వ శతాబ్ది) శ్రీరామబాణమును సుతిస్తూ రామబాణ స్తవమును, సీతారాములను సుతిస్తూ అద్భుత సీతారామ స్తోత్రమును రచించినాడు, బెల్లంకొండ రామరాయకవి (క్రీ॥శ॥ 1875) అనేక స్తోత్రములను రచించినాడు.

**సప్తశతి :** అవినాశిన మగ్రామ్య మకరోత్సాత వాహనః।

విశుద్ధ జాతిభిః కోశం రత్నైరివ సుభాషితైః॥ అని బాణకవిచే ప్రశంసింపబడిన హాలుని (క్రీ॥శ॥ ప్రథమ శతాబ్ది) గాథా సప్తశతితో సప్తశతీ సాహిత్యమారంభమౌతుంది, కవి వత్సలుడైన హాల చక్రవర్తి శాతవాహన వంశీయుడైన రాజు, అమరావతిని రాజధానిగా చేసుకొని దక్షిణ భారతదేశమునేకాక ఉత్తర భారతములోని కొన్ని భాగములను కూడా పరిపాలించినవాడు. సప్తశతాని కవివత్సలేన కోటేర్మధ్యే। హాలేన విరచితాని సాలంకారాణాం గాథానాం॥ శృంగార రస పరిపూర్ణములైన కోట్లకొలది రమణీయములైన రసభావ వేగములైన ఏడువందల గాథలను తాను సంగ్రహపరిచినట్లుగా చెప్పుకొన్నాడు.

ఇందలి ఒక్కొక్క గాథ తనంతట తానే పరిపూర్ణమైనది,స్వతంత్రమైనది. గాథ అనునది ప్రాకృత ఛందస్సు. స ప్తశతి అనగా ఏడువందలు. ఈ గాథాఛందస్సు సంస్కృతంలోని ఆర్యాఛందస్సుకు దగ్గరగా ఉంటుంది అందుకే గోవర్ధనుడు గాథాస్థానములో ఆర్యాఛందస్సును గ్రహించాడు. ఈ గాథలలో సరళమైన గ్రామీణ జీవనము వర్ణించబడినది ఇందలి నాయికలు సాధారణంగా గ్రామీణులైన ముగ్ధయువతులు స్త్రీల అమాయకత్వము, ప్రేమ, కోపము, అభిమానము, చాతుర్యము సహజంగా వర్ణింపబడినవి. శృంగార వర్ణనలతోబాటు ప్రకృతి చిత్రణము, నీతి బోధనము కూడా చోటుచేసుకొన్నవి సంస్కృత ము క్తక కావ్యములమీద దీని ప్రభావమెంతైనా ఉన్నది అమరుక శతకము, ఆర్యా స ప్తశతి, శృంగార శతాది ము క్తక కావ్యాలు దీనిని ఆదర్శంగా తీసుకొని వ్రాయబడినవి.

**అమరుకకవి :** "అమరుకస్య కవేర్ము క్తకాః శృంగార రసస్యందినః ప్రబంధాయమానాః ప్రసిద్ధాఏవ" శృంగార రసాన్ని వర్షించునట్టి, గొప్ప ప్రబంధములవలె రసనిర్భరములైన అమరుక కవియొక్క ము క్తక పద్యములు ప్రసిద్ధములైనవి అని ధ్వన్యాలోక కారుడిచే ప్రశంస నొందినవాడు అమరుక కవి వామనాద్యాలంకారికులందరిచేతను ఈతని పద్యము లుదాహరింపబడుట చేత క్రీ॥శ॥ 750 ఈతని కాలమని చెప్పవచ్చును. ఈతని పద్యముల సంకలనమే అమరుక శతకమని చెప్పబడుచున్నది. శంకరాచార్యులు మండనమిశ్రుని పత్నియగు శారదాదేవిని కామశాస్త్రమున ఓడించ, పరకాయ విద్యచే కాశ్మీర ప్రభువగు అమరుకరాజు శరీరాన్ని ప్రవేశించి ఈ అమరుక శతకాన్ని రచించినాడని ప్రతీతి కలదు. ఈ కవి రసికుడు, సహృదయుడు, భావుకుడు. ఈతననుసరించిన రీతి వైదర్భీ. ఈతని శతకమున రసరాజము శృంగారము రంజిల్లుచున్నది. ప్రసాద మాదుర్య గుణగుంఫితములై కోమల కల్పనా కల్పితములైన పదములు సరస పరిహాసమును బోధించుచున్నవి. ప్రేమికుల మానసిక వృత్తులు సూక్ష్మముగా వివేచింపబడినవి. హర్షశోకములు, ఆమోద వివాదములు, కోపానునయములు, ప్రణయకలహ-మేళనములు మార్మికముగా చిత్రింపబడినవి. ఈతని ము క్తకములన్నియు ప్రణయ చిత్ర సంకలితములు. ప్రేమికా విరహవేదనలు-అనునయ ప్రసాదనములు - స్త్రీ స్వభావము - రోదనము - హర్షము - సంకో

చము-త్యాగము - ఆర్ద్రత్వము - అసక్తి- నైశ్చల్యము మొదలగు దృశ్యములు ఈ శ్లోకములు చదివినంతసేపు కంటికి కనిపింతును. ఆలంకారికు లందరూ ఈతని పద్యములలోని ధ్వనిని ఎత్తి చూపినారు- 'నిశ్శేషచ్యుత చందనం స్తనతటం' అను పద్యాన్ని ఉదాహరించని ఆలంకారికులు లేరు-కావు ననే 'అమరుక కవేరేకః శ్లోకః ప్రబంధ శతాయతే' అని ప్రశంసలందుకొన్నాడు.

**ఆర్యాసప్తశతి :** గోవర్ధనశ్చ శరణో జయదేవ ఉమాపతిః।
కవిరాజశ్చ రత్నాని సమితౌ లక్ష్మణస్య చ॥

బెంగాల్ ప్రభువగు లక్ష్మణసేనుని (క్రీ॥శ॥ 1116) ఆస్థాన కవులలో అగ్ర గణ్యుడైన గోవర్ధనాచార్యులు ఆర్యావృత్తముతో సప్తశతిని రచించినాడు. ఇది కథాకావ్యము కాదు ఇందు అనేక నాయికల, నాయకుల శీల, స్వభావ, సంభా షణాద్యనేక విషయములు వర్ణింపబడినవి. గ్రంథ రచనను ప్రస్తావిస్తూ-

కవి సమరసింహనాద స్వరానువాదః సుధైక సంవాదః।
విద్వద్వినోదకందః సందర్భోఽయం మయాసృష్టః॥
ఉదయన బలభద్రాభ్యాం సప్తశతీ శిష్య సోదరాభ్యాంమే।
ద్యౌరివ రవి చంద్రాభ్యాం ప్రకాశితా నిర్మలీకృత్య
అకృతార్యా సప్తశతీ మేతాం గోవర్ధనాచార్యః॥

ఆర్యాసప్తశతి శ్లోకములను వ్రాసి తన శిష్యుడైన ఉదయనునకు సోదరుడైన బలభద్రునకు చెప్పగా, వారు తమ శిష్య పరంపర ద్వారా వ్యాప్తిని చేకూర్చి నారు. కవి కొద్దిగా అలంకారాలను ప్రయోగిస్తూ రసవంతంగా దీనిని రచించి నాడు. కవి రసవాదిగా కన్పిస్తాడు. నాయికాదృష్టిని జైన సిద్ధాంతముతో పోలుస్తూ వర్ణించిన ఈ శ్లోకమును పరిశీలింతము-

అతిపూజితతారేయం దృష్టిః శ్రుతి లంఘన క్షమా సుతను।
జన సిద్ధాంత స్థితిరివ సవాసనా కం నమోహయతి॥
ఇతరుల భార్యలను కోరుకొను హృదయ దౌర్బల్యమును వర్ణిస్తూ
'అన్యాస్వపి గృహిణీతి ధ్యాయన్నభిలషిత మాప్నోతి।
పశ్చాత్పాషాణమయీః ప్రతిమా ఇవ దేవతాత్వేన॥

ఈ ఆర్యాసప్తశతి అందరి హృదయముల నాకర్షించినది. దీనిపై గోకుల చంద్రాదులచే రచింపబడిన పది వ్యాఖ్యానములు కలవు శృంగార రసవర్ణ

నమున గోవర్ధనునితో సమానుడెవ్వరు లేరని జయదేవుడు ముక్తకంఠముగా పలికినాడు.

వాచః పల్లవయత్యుమాపతిధరః సందర్భ శుద్ధింగిరాం
జానీతే జయదేవ ఏవ శరణః శ్లాఘ్యో దురూహద్యుతేః।
శృంగారోత్తర సత్ప్రమేయ వచనైరాచార్య గోవర్ధన-
స్పర్ధీ కోపి న విశ్రుతః శ్రుతధరో ధోయీకవిక్ష్మాపతిః॥

శృంగార ప్రధానమైన మరికొన్ని శ్లోకములు ఈతని పేర సంకలన గ్రంథములలో పేర్కొనబడినవి ఉదాహరణకిది.

వపుస్తిమ్యచ్ఛీనాంశుక నిబిడపీనోరు జఘన
స్తనానాం నిశ్చోత చ్చికురవయ హాం వక్ష్మలదృశాం
నిమగ్నోత్తీర్ణానాం ప్రమదవన వాపీతటజుషాం
దిదృక్షాభిర్దేవో రవి రథ రథం మంథరయతి॥

**శతకములు :** శతకమన్న పేరుతో పేర్కొనబడిన ఖండ కావ్యములను పరిశీలింతము. మొట్టమొదటిగా లభ్యమగుచున్నది చాణక్య శతకము. 340 శ్లోకములతో నీతిని ప్రబోధించు చాణక్య శతకము చాణక్యునిచే రచింపబడినదిగా పేర్కొనబడుచున్నది ఈ శతకము. ప్రసిద్ధ నీతివేత్త, అర్థశాస్త్ర కర్తయైన చాణక్యుని పేరుతో తర్వాత వందితులెవరో దీనిని రచించి వుంటారు. ఇది కావ్యశైలిలో వున్న నీతి శతకము.

**చండీశతకము :** హర్షవర్ధనుని (క్రీ॥శ॥ 606-648) ఆస్థానంలో ఉన్న బాణభట్టు చండీశతకమును రచించినాడు. 48 స్రగ్ధరా శ్లోకములతో లభించుచున్న ఈ శతకమున దుర్గామాత స్తుతింపబడినది ఓజోగుణ ప్రధానమైన ఈ రచనలో శబ్దాలంకారములు విరివిగా ప్రయోగించబడినవి.

**మయూర శతకము :** బాణకవి బంధువైన మయూరభట్టు 100 స్రగ్ధరాశ్లోకములు కల్గిన సూర్య స్తుతిపరమైన సూర్య శతకమును రచించినాడు. బాణమయూరులు శ్రీ హర్షవర్ధనుని (క్రీ॥శ॥ 606-648) ఆస్థానకవులు.

అహో ప్రభావో వాగ్దేవ్యా యన్మాతంగ దివాకరః।
శ్రీహర్షస్యా భవద్ సభ్యః సమోబాణమయూరయోః॥

నవసాహసాంక చరిత్రానుసారము బాణమయూరులకు కవితాస్పర్ధ వుండేదని తెలుస్తున్నది. వీరి బంధుత్వంగూర్చి ఒక కథ వ్యాప్తిలో ఉంది. బాణుని భార్య మయూరుని సోదరట ఒకరోజు భార్య ప్రణయకోపంతో ఉండగా, ఆమెను సాంత్వనపరుస్తూ "గతప్రాయా రాత్రిః కృశతను శశీ శీర్యత ఇవ

ప్రదీపోఽయం నిద్రావశ ముపగతో ఘూర్ణత ఇవ।

ప్రణామాంతో మాన స్త్యజసి నతథాపి క్రుధమహో"

అని మూడు పాదాల్ని చెప్పి బాణభట్టు ఆగిపోయాడట అప్పుడు అక్కడే ఉన్న మయూరకవి 'కుచ ప్రత్యాసత్యా హృదయమపి తే చండి కఠినమ్' అని పూరించాడట. దానికి బాణుని భార్య కోపించి మయూరుని కుష్ఠరోగ పీడితుడవు కమ్మని శపించెనట. సూర్యశతకాన్ని వ్రాసి శాపవిముక్తిని పొందినాడని కథా సారాంశము మమ్మటాచార్యుడు కావ్యప్రకాశంలో మయూరుడు సూర్యశతకాన్ని రచించి దుఃఖ నివృత్తిని పొందాడని పేర్కొన్నాడు సూర్యశతకంలో 100 స్రగ్ధరా శ్లోకములున్నవి. ఓజోగుణ ప్రధానమైన గౌడీరీతిలో రచింపబడిన ఈ శతకంలో యమకాలు విరివిగా ప్రయోగించబడినాయి. సూర్యకిరణములు, సూర్యస్తుతి, సూర్యుని రథము, అశ్వములు, సారథి అరుణుడు, సూర్యబింబము, త్రిమూర్త్యాత్మక సూర్యుడు, సర్వదేవతాశ్రేష్ఠుడైన సూర్యుడు. ఈ విధంగా సూర్యుడు అన్ని కోణములనుండి రమ్యంగా వర్ణింపబడినాడు.

**భర్తృహరి :** నీతిశతక, శృంగార శతక, వైరాగ్య శతకముల మూడింటిని రచించినాడు ఈతడు విక్రమశక సంస్థాపకుడగు విక్రమాదిత్యుని సోదరుడనియు క్రీ॥పూ॥ 57 ఈతని కాలమనియు కొందరి అభిప్రాయము. చైనా బౌద్ధ యాత్రికుడు ఇత్సింగ్ క్రీ॥శ॥ 651 వ సంవత్సరమున భర్తృహరి అను వైయాకరణి మరణించినటుల పేర్కొన్నాడు ఈ భర్తహరి వాక్యపదీయాన్ని రచించినాడు కీథ్ విమర్శకుడు ఈతడే శతక త్రయకర్త అని అభిప్రాయ పడ్డాడు కావున క్రీ॥శ॥ 575 నుండి 650 ఈతని కాలమనుటయే సమంజసము. క్రీ॥శ॥544 ప్రాంతమున హూణులను చంపిన విక్రమాదిత్యుని సోదరునిగా ఈతనిని చెప్పవచ్చును. విక్రమాదిత్యుని సోదరుడైన భర్తృహరి తన భార్యయగు పింగళ దుశ్చరిత్రమును చూసి విరక్తినొందినటుల తెలుపుతూంది శ్లోకం.

విప్రేణాభూత పూత్యం ఫలమతి తపసాలంబి మూర్త్యప్రసాదాత్
లబ్ధ్వా తస్మాత్స్వయం తత్ప్రదురతర జరావంచతా కుంచనార్థం।
హిత్వా మోహం స్వకాంతాన్వతి విమలధియా తం నిషేవ్యాత్త తపో్య
యోగీంద్రో భర్తృహర్యాహ్వయ ఇహకురుతే౽ద్యాపి విద్యావిలాసం॥

సూర్యునివలన ఒక బ్రాహ్మణుడు ఫలమును పొంది భర్తృహరికిచ్చెను. భర్తృహరి తన భార్యకిచ్చెను భార్య తన విటునకిచ్చెను. విటుడు తన ప్రియురాలికిచ్చెను అది తెలుసుకొన్న భర్తృహరి విరక్తినొందెను ఈ అభిప్రాయముచే.

యాంచింతయామి సతతం మయిసా విరక్తా
సాప్యన్యమిచ్ఛతి జనం స జనో౽న్యసక్తః।
అస్మత్కృతేచ పరితుష్యతి కాచిదన్యా
ధిక్తాంచ తంచ మదనంచ ఇమాంచమాంచ॥అను నీతిశతకశ్లోకముకూడా దీనిని బలపరుస్తూంది. ఈతని శైలి ప్రసాద మాధుర్య గుణభూయిష్ఠము. పద్యములు అత్యంత సరళములు, సుబోధకములు, మనోహరములు. వినినంతనే ఆహ్లాదమును కలిగించునవి. ఈ పద్యములన్నియు వాస్తవములు. జీవితమున అన్ని విధములగు అనుభవాల్ని పొందినవాడగుటచే భర్తృహరి పద్యములు అనుభవాల మూటలని చెప్పవచ్చును. కావుననే ఇవి సుభాషితములని ప్రసిద్ధి గాంచినవి. వీటిలో ఆచారశిక్ష, నీతిశిక్ష, కర్తవ్యాకర్తవ్య వర్ణనము, పరోప కారము-సజ్జనప్రశంస, దుర్జననింద, అదృష్టము - స్త్రీరామణీయకత - శృంగార రస ప్రియత్వము - సంసారనశ్వరత్వము-జీవన క్షణభంగురత్వము-భక్త్యు పాదేయత్వము సుందరముగా వర్ణింపబడినవి.

"కామినీ కాయ కాంతారే కుచపర్వత దుర్గమే-
మా సంచర మనఃపాంథ తత్రాస్తి స్మరతస్కరః"

ఓ మనస్సను బాటసారీ! స్తనములను పర్వతములచే దుర్గమమైన స్త్రీ శరీరమను అడవిలోకి ప్రవేశించకు అక్కడ మన్మథుడను అడవిదొంగ ఉన్నాడు జాగ్రత్త! ఇటువంటివెన్నో రమణీయ వేదాంత బోధనలు కలవు మూడు శతకాల్లో మొద టిది 103 శ్లోకములు కల్గిన నీతి శతకము. శృంగార వైరాగ్య శతకములలో నూరేసి శ్లోకములు కలవు నీతి శతకంలో కవియొక్క జీవితపరిశీలనాశక్తిని చూడవచ్చును. దీనిలో పండిత ప్రశంస, మూర్ఖనింద, సద్గాభాళము, మహాపురు

షుల, సత్పురుషుల ప్రవర్తన, ధనమువలన కలుగు అనర్థములు, పరోపకారము, సేవాధర్మము మొదలగునవి రమ్యంగా వర్ణించబడినవి. శృంగార శతకములో స్త్రీ సౌందర్యము, సంయోగ శృంగారము: స్త్రీ ప్రశంస, వేశ్యానింద, ఋతువుల్లో కలుగు కామాసక్తి మొదలగునవి వర్ణించబడినవి. వైరాగ్య శతకములో జ్ఞానము, ప్రపంచ మిథ్యాత్వము, భ్రమ, పుణ్యక్షేత్ర సందర్శనము సద్గుణాభ్యాసములు వర్ణించబడినవి. సత్పురుషులను వర్ణించు మనోహరమైన శ్లోకమిది.

మనసి వచసి కాయే పుణ్యపీయూష పూర్ణాః
త్రిభువన ముపకార శ్రేణిభిః ప్రీణయంతః ।
పరగుణపరమాణూన్ పర్వతీకృత్య నిత్యం
నిజహృది వికసంతః సంతి సంతః కియంతః ॥ (నీతి 79)

సాంసారిక సుఖములపై ఆశ చావదని బోధిస్తున్న శ్లోకమిది.

భోగానభుక్తావయమేవభుక్తాః తపోనతప్తం వయమేవతప్తాః ।
కాలోనయాతో వయమేవయాతాః తృష్ణానజీర్ణావయమేవజీర్ణాః ॥

ఈతని శతకములలో సుభాషితములు కోకొల్లలు. నీతి శతకంలోని సుభాషితములు: విభూషణం మౌనమపండితానాం (7), వివేక భ్రష్టానాం భవతి వినిపాతః శతముఖః (10), మూర్ఖస్యనాస్త్యౌషధం (11), సాహిత్య సంగీత కళావిహీనః సాక్షాత్పశుః పుచ్ఛవిషాణహీనః (12), వాగ్భూషణం భూషణం (19), విద్యావిహీనః పశుః (20), సత్సంగతిఃకథయ కింనకరోతి పుంసాం (22), ప్రారబ్ధముత్తమజనా నపరిత్యజంతి (27), నఖలు వయస్తేజసో హేతుః (38), సర్వే గుణాః కాంచనమాశ్రయంతి (41), వారాంగనేవ నృపనీతి రనేకరూపా (47), సేవాధర్మః పరమగహనోయోగినామప్యగమ్యః (58) స్వభావ ఏవైష పరోపకారిణాం (71), ననిశ్చితార్థాద్విరమంతిధీరాః (81), మనస్వీ కార్యార్థీ గణయతి నదుఃఖం నచ సుఖం (82), శీలం పరం భూషణం (83), న్యాయాత్పథః ప్రవిచలంతి పదం నధీరాః (84), విధిరహో బలవానితిమేమతిః (92), నమస్తత్కర్మభ్యోవిధిరపి నయేభ్యః ప్రభవతి (95), శృంగార శతకంలోని సుభాషితముల పరిశీలింతము: కందర్పదర్పదలనే విరళామనుష్యాః (7), విపదిహంత సుధాపి విషాయతే (47), ప్రియః కోనామయోషితాం (55), పుణ్యైర్వినా నహి భవంతి సమీహితార్థాః (76), కింనామవామనయనా న సమాచరంతి (92), వైరాగ్య శతకంలోని సుభాషితములు: పీత్వామోహమయీం ప్రమాద మదిరా మున్మత్త

భూతం జగత్ (9), అహహ గహనా మోహమహిమా (17), శంభోః పదం నిర్భయం (22), మనసిచ పరితుష్టే కోఽర్థవాన్కో దరిద్రః(40),సందీప్తే భవ నేతు కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః (72), భోగేగతింమాకృథాః (92), సర్వం యస్యవశాదగాత్స్మృతి పథం కాలాయతస్మై నమః (93).

**భల్లట శతకము :** కాశ్మీర ప్రభువగు శంకరవర్మ (క్రీ॥ శ॥ 884-902) ఆస్థాన కవి యగు భల్లటుడు వివిధఛందస్సులతో 108 శ్లోకములు కల్గిన శత కాన్ని రచించినాడు. ప్రపంచ జ్ఞానము, నీతి, ధర్మముల ప్రబోధిస్తూ శృంగా రాది రసములను కూడా చక్కగా జోడించినాడు. రాజతరంగిణి భల్లట శత కాన్ని పేర్కొన్నది. అభినవగుప్తుడు క్షేమేంద్రుడు మొదలగు అలంకారికులు ఈతని శ్లోకములను పేర్కొన్నారు - ప్రసాద మాధుర్య గుణయుక్తమైన వైదర్భీ రీతిలో సాగిన ఈ శతకంలో అలంకారములు అద్భుతంగా ప్రయోగించ బడినవి. మృదు మధుర పద విలసితమైనదీ శతకము. ధ్వన్యాలోకంలో ప్రథమ తృతీయోద్యోతములలో రెండుసార్లుదాహరించబడిన ఈ శ్లోకమును పరిశీ లిస్తాము -

> పరార్థేయః పీడామనుభవతి భంగేపిమధురో
> యదీయః సర్వేషామిహఖలు వికారోఽప్యభిమతః।
> ననంప్రాప్తో వృద్ధిం యదిసభృశమక్షేత్రపతితః
> కిమిక్షోర్దోషోఽసౌ నపునరగుణాయామరుభువః ॥

ఇంకొక అర్వాచీనమైన భల్లట శతకము కంచి పేరుందేవిని స్తుతిస్తూ వ్రాయ బడినది. దీని హస్తప్రతి నావిల్పాకమ్ గ్రామములో లభించుచున్నది - ఇందలి ఒక శ్లోకము -

> ఇతికిలదర్శనరీతిః కార్యముపాదాయకారణంభిన్నం।
> దేవి తవస్తనకలశౌ చక్రాభిన్నౌ కథంను దృశ్యేతే॥

ధ్వన్యాలోకకారుడైన ఆనందవర్ధనాచార్యులు (క్రీ॥ శ॥ 850) పార్వతిమాతను సుతిసూ 100 శ్లోకములతో దేవీ శతకమును రచించినాడు.

**శాంతిశతకము :** కాశ్మీరి కవి శిల్హణుడు (క్రీ॥ శ॥ 1206) భర్తృహరి వైరాగ్య శతకాన్ని అనుకరిస్తూ శాంతి శతకాన్ని వ్రాసినాడు - ఈతని శ్లోక ములు కొన్ని భర్తృహరి శతకాలలో చేంపోయాయి. హర్షవర్ధనుని నాగానందం

లోను ఒక శ్లోకం చేరిపోయింది - ఈతని శతకమే కాక, సుబ్రహ్మణ్యుడుచే, హరిదాసుచే, నీలకంఠదీక్షితునిచేతను మూడు శాంతి శతకములు రచింపబడినవి.

**అచ్యుత శతకము :** కవితార్కిక కేసరి వేంకటనాధుడు (13వ శతాబ్ది) (వేదాంత దేశికులు) 100 శ్లోకములతో విష్ణువును స్తుతిస్తూ అచ్యుత శతకమును రచించినాడు - ఈ శతాబ్దినందే కీర్తికౌముది, సురథోత్సవ మహా కావ్యమును, ఉల్లాఘరాఘవనాటకమును రచించిన సోమేశ్వరుడు 100 స్రగ్ధరా శ్లోకములతో శ్రీరాముణ్ణి స్తుతిస్తూ రామ శతకమును రచించినాడు కుసుమదేవుడు (క్రీ॥ శ॥ 1400) నీతి సుభాషితములను బోధిస్తూ, ప్రతిదానికొక దృష్టాంతమునిస్తూ 100 శ్లోకములతో దృష్టాంత శతకమును రచించినాడు ధనరాజు (క్రీ॥ శ॥ 1434) సరస కవిత్వం కల్గిన 100 శ్లోకములతో శృంగార శతకాన్ని రచించినాడు. ఇతదే కాక జనార్దనభట్టు, నరహరి, వ్రజరాజు, వ్రజలాల్ శృంగార శతకములను రచించినారు నరహరి తన శృంగార శతకములో శ్రీహర్షుని పేర్కొన్నాడు. పొడుపు కథల వలె కూర్చబడిన భావ శతకము నాగరాజుచే రచింపబడినది.

**గుమానీ శతకము :** గుమానీ కవి (17 వ శతాబ్ది) 100 శ్లోకములతో ఉపదేశ శతకమును రచించినాడు. ఇందు మొదటి మూడు పాదములు చిన్నని కథను బోధించగా నాల్గవ పాదము నీతిని ఉపదేశిస్తుంది ఉదాహరణకు - రావణాసురుడు తన తమ్ముడగు విభీషణుణ్ణి వెడల గొట్టి, ద్వేషమును పెంచుకొని నశించాడు కావున 'నిజబంధుర్న హివిరోద్ధవ్యః' అనునది ఉపదేశము-దుష్టుడైన రావణుని సమీపమున ఉండి సాగరుడు రామునిచే బంధింపబడినాడు కావున 'నహిదుర్జనస్యాంతికే వసేత్' అనునది ఉపదేశము.

**అప్పయ్యదీక్షితుడు :** ప్రసిద్ధ ఆలంకారికుడు. దాక్షిణాత్యుడైన అప్పయ్య దీక్షితుడు (16 వ వ శతాబ్ది) వైరాగ్యాన్ని ప్రబోధిస్తూ వైరాగ్య శతకమును రచించినాడు. ఇదే కాక శంకరాచార్యులచే, సోమనాథునిచే, పద్మానందునిచే వైరాగ్య శతకములు రచింపబడినవి,

**నీలకంఠదీక్షితుడు :** అప్పయ్యదీక్షితుని సోదరుడైన అచ్చాదీక్షితుని మనుమడు, నారాయణ, భూమిదేవిల పుత్రుడైన నీలకంఠ దీక్షితుడు (క్రీ॥ శ॥ 1650) నూరేసి శ్లోకములు కల్గిన వైరాగ్య, కలివిడంబన, సభారంజన, శతకములను రచించినాడు కలివిడంబన శతకములలో సమాజములో పెద్దమనుషులుగా చెలామణీ అవుతూన్న వైద్యుల, జ్యోతిషుల, ఉపాధ్యాయుల, తాంత్రికుల రహస్యాల్ని నిశితంగా హాస్య ప్రధానంగా విమర్శించాడు .

పాత్యతాం సమయోఽతీతః స్పష్టమగ్రే భవిష్యతి ।
ఇతిపారయతాంపాదే కాఠిన్యంకుత్రవర్తతే ॥
దైవజ్ఞత్వం మాంత్రికతా భైషజ్యం చాటు కౌశలం ।
ఏకైకమర్థలాభాయ ద్విత్రియోగస్తు దుర్లభః ॥
యత్రభార్యాగిరో వేదాఃయత్ర ధర్మోఽర్థసాధనం ।
యత్రస్వప్రతిభామానం తస్మైశ్రీకలయేనమః ॥

అవతార కవి (17 వ శతాబ్ది) శ్లేషయమక భూయిష్ఠమయిన శైలితో శివుణ్ణి స్తుతిస్తూ ఈశ్వర శతకమును రచించినాడు దీనిలో ఏకాక్షర, ద్వ్యక్షర, ముసలబంధాది చిత్ర కవిత్వం కూడా ఉన్నది. రత్నకంఠుడు దీనిపై వ్యాఖ్యానము వ్రాసినాడు

అల్మొరానివాసియైన విశ్వేశ్వరపాండేయ (18 వ శతాబ్ది) శృంగార ప్రధానమయి, చమత్కార భావాలతో నిండియున్న రోమావళీ శతకమును రచించినాడు గోకులనాథుడు 100 శ్లోకములతో శివుణ్ణి స్తుతిస్తూ శివశతకమును రచించినాడు జనార్దనభట్టగోస్వామి శృంగార రసపూర్ణమయిన 100 శ్లోకములతో శృంగార శతకమును రచించినాడు హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసు (క్రీ॥ శ॥ 1854-1945) కాశీ శతకము, రామచంద్ర శతకములను రచించినాడు ఈ విధంగా ఇంకా ఇప్పటికిని కవులు పండితులు శతకములను రచిస్తూనే ఉన్నారు. ఇందు కుదాహరణంగా భాస్కరరాయరావు యొక్క శ్రీ కుమార శతకము, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి యొక్క వేంకటేశ్వర వచన శతకము, తిగు వరదాచార్యుల యొక్క సుమతి, వేమన, దాశరథి శతకములు, హైదరాబాద్ నగర వాస్తవ్యులైన విరలదేవుని సుందర శర్మగారి శంభు శతకము, ఆంజనేయ శతకము, శ్రీనివాస శతకము, దాయాపతి శతకములను పేర్కొనవచ్చును.

**సుభాషిత సాహిత్యము :** సుభాషిత సంగ్రహాత్మకములైన గ్రంథములు ఈ ప్రకరణమున వివేచింపబడుచున్నవి. నీతిని బోధించునని సుభా

షితములు. ఈ గ్రంథములు ఒకే కవిచే రచింపబడినవి కావచ్చును. లేదా ఇతర కవుల సుభాషితముల నొక్క కావ్యమున కూర్చబడిన గ్రంథములునూ కావచ్చును ఘటకర్పరకవి 21 శ్లోకములతో నీతిని బోధిస్తూ నీతి సారమును రచించినాడు.

**నీతిద్విషష్టిక :** పాండ్యదేశాన్ని మదురై రాజధానిగా చేసుకొని పాలించిన సుందరపాండ్యుడు (క్రీ॥ శ॥ 500) నీతిద్విషష్టికను రచించాడు. అన్ని శ్లోకములు ఆర్యా ఛందస్సులో ఉండడము వలన దీనికి ఆర్య అనియు పేరు. ఇందలి శ్లోకములు విష్ణుశర్మచే పంచతంత్రమున ఉద్ధరించబడినవి. ఇది సుకవిస్తుతిపాత్రమైనదిగా -

ఇమాం కాంచనపీఠస్థాం సమేత్య కవయోబుధి ।
ఆర్యాం సుందరపాండ్యస్య స్నాపయంతివదూమివ ॥ అని పేర్కొన్నాడు. ఈ శ్లోకములు లోకజ్ఞాన బోధకములు, నీతిదాయకములై వున్నవి. ఉదాహరణకొక శ్లోకము -

సహ వసతామప్యసతాం జలరుహజలవద్భవత్యసంశ్లేషః ।
దూరేఽపి సతాంవసతాం ప్రీతిః కుముదేందువద్భవతి ॥

ఆరవ శతాబ్దమున శాంతిదేవుడు బౌద్ధధర్మములను, నీతిని ప్రబోధిస్తూ బోధిచర్యావతారమును రచించినాడు.

**విద్యాకరపండితుడు :** బెంగాలీ పండితుడగు విద్యాకరుడు, ఇతర కవుల కావ్యములనుండి నీతిబోధకములైన 1739 సుభాషిత శ్లోకముల తీసుకొని, వ్రజ్యములను వివిధ ప్రకరణములందు విభజించి సుభాషిత రత్నకోశమును వ్రాసినాడు. వల్లణుడు, బుద్ధాకరభట్టు మొదలగు అజ్ఞాత కవుల శ్లోకములను కూడా ఇందులో పదిలపరచినాడు. మయూరినియొక్క వాక్పతిరాజు యొక్క, రాజశేఖరుని యొక్క శ్లోకములను కూడా ఉద్ధరించుటచే క్రీ॥ శ॥ 10 వ శతాబ్ది వాడని చెప్పవచ్చును. మొదట కవుల యొక్క కావ్యముల యొక్క పేర్లు లేనట్టి అసంపూర్ణమైన తాళపత్రాధారముగా సంస్కరించి, ప్రచురింపబడినది "నానాకవీంద్రవచనాని" అను మొదటి శ్లోకము నాధారముగా గొని కవీంద్ర వచన సముచ్చయమను పేరు ఇవ్వబడినది.

**సుభాషిత రత్నసందోహము :** ధారాధీశుడైన ముంజరాజు రాజ్యపాలన చేయుచుండగా, మాధవసేనుని శిష్యుడైన, దిగంబర జైనమతస్థుడైన అమితగతి క్రీ॥ శ॥ 994న సుభాషిత రత్నసందోహమును వ్రాసినాడు క్రీ॥శ॥ 1014 న ధర్మపరీక్షను రచించినాడు

**సదుక్తి కర్ణామృతము :** శ్రీధరదాసుడు (క్రీ॥శ॥ 1205) సూక్తికర్ణామృతమను నామాంతరము కలిగిన సదుక్తి కర్ణామృతమునందు 500 కవులయొక్క 2,380 శ్లోకములను సంగ్రహపరచినాడు దీనియందు అమర ప్రవాహము, శృంగారప్రవాహము, చాటుప్రవాహము, అపదేశ ప్రవాహము, ఉచ్చావ్రస ప్రవాహము అను ఐదు అధ్యాయములు కలవు. ఈ అధ్యాయములు ఐదేసి శ్లోకములు కలిగిన వీచికలయందు విభజింపబడినవి.

**సూక్తి ముక్తావళి :** యాదవ రాజు కృష్ణరాజుయొక్క మంత్రి శ్రీ లక్ష్మీధరుడు. లక్ష్మీధరుని పుత్రుడు జల్హణుడు. ఆరోహక భాగదత్త జల్హణ దేవుడని ఈతని పేరు ఈతడుకూడా కృష్ణరాజువద్ద మంత్రిగానుండెను

"సాహిత్య విద్యా హృదయం జ్ఞాతుమిచ్ఛసి చేత్సుఖం।
తత్పశ్య జల్హణకృతాం సూక్తిముక్తావళీమిమాం॥"

అని ప్రశంసిగాంచిన సూక్తి ముక్తావళి ఈతనిచే నిర్మింపబడినది.

'శాకేంకాద్రీశ్వర (1179) పరిమితే వత్సరే పింగళాఖ్యే
చైత్రేమాసే ప్రతిపది తిథౌ వత్సరే సప్త సప్తేః।
పృథ్వీం శాసత్యతుల మహసా యాదవే కృష్ణరాజే
జల్హాస్యార్థే వ్యరచి భిషజా భానునా సేయమిష్టా॥

అను శ్లోకాన్ననుసరించి శకసంవత్సరములు 1179 క్రీ॥శ॥ 1257 సంవత్సరమున కృష్ణరాజుయొక్క ఆస్థాన వైద్యుడు భానుకవి దీనిని వ్రాసెనని తెలియుచున్నది. ఇందలి 133 పద్ధతులలో 240 మంది కవులయొక్క 2790 శ్లోకములున్నవి. ఈ 13వ శతాబ్దముననే సిద్ధచంద్రమణి సూక్తిరత్నాకరమును నిర్మించినాడు. 15వ శతాబ్దినందు సోమప్రభాచార్యులు కూడా సూక్తి ముక్తావళిని వ్రాసినాడు.

**సుభాషిత సుధానిధి :** వేదభాష్యకర్తయైన సాయణాచార్యులు (క్రీ॥శ॥ 1350) 84 పద్ధతులు కలిగిన సుభాషిత సుధానిధిని రచించి, విజయ నగర సంస్థాపకుడైన మొదటి బుక్కరాయల రెండవ కుమారుడైన వీరకంప రాజుకు వినిపించినాడు.

భారద్వాజాన్వయభువా తేనసాయణమంత్రిణా।
వ్యరచ్యత విశిష్టార్థః సుభాషిత సుధానిధిః॥
సకదాదిత్సమాజేఽత కంపభూపం కళానిధిః।
అశ్రావయదనూనశ్రీః నిశ్రేయసకరం వరం॥

అలంకార సుధానిధి, యజ్ఞతంత్ర సుధానిధులును ఇతనిచే రచింపబడినవి

**శార్ఙ్గధరపద్ధతి :** శాకంబరీ దేశ పాలకుడైన హమ్మీర ప్రభువు యొక్క ప్రపౌత్రుడు. రాఘవపండితుని పౌత్రుడు, దామోదర పండితుని తనయుడగు శార్ఙ్గధరుడు (క్రీ॥శ॥ 1363) 292 కవులయొక్క శ్లోకములను తీసుకొని కొన్ని శ్లోకముల రచించి శార్ఙ్గధర పద్ధతిని వ్రాసెను. ఈ విధముగా పలికెను:

ఆనందాయ సతాం భూయాత్ సుభాషిత మిదంమమ।
ఆద్యైర్మదుదితైః పద్యైః కియద్భిరపరైరపి॥
సశార్ఙ్గధర పద్ధతిః ఖలజనస్య యోగ్యాతవేత్
సుభాషిత మహోర్మయ స్సుకృతలోకపేయా యతః॥

ఈ 14వ శతాబ్దినందే కలింగరాయలు సూక్తిరత్నాకరమును రచించినాడు.

**సుభాషితావళి :** కాశ్మీరీయుడైన వల్లభదేవుడు (క్రీ॥శ॥ 1450) 360 కవుల సుభాషితముల నుట్టంకిస్తూ, 101 పద్ధతులతో 3,527 శ్లోకములు కల్గిన సుభాషితావళిని వ్రాసినాడు ఇందులో శృంగారము, జీవనపద్ధతి, ఋతు సౌందర్యము, వాక్చాతుర్యము, పరిహాసమునకు సంబంధించిన సుభాషితములు కలవు కాశ్మీరీయుడు, జోనరాజు శిష్యుడైన సకలకీర్తి (క్రీ॥శ॥ 1450) కూడా సుభాషితావళిని వ్రాసినాడు. శ్రీవరుడు (క్రీ॥ శ॥ 1480) కూడా 380 కవుల యొక్క సుభాషితముల నుట్టంకిస్తూ, సుభాషితావళిని వ్రాసినాడు పోతయార్యుడు (క్రీ॥శ॥ 1466) ప్రసంగ రత్నావళిని వ్రాసినాడు.

**ప్రసన్న సాహిత్యరత్నాకరము :** నందన పండితుడు (క్రీ॥శ॥ 15వ శతాబ్ది) 1428 శ్లోకములు కలిగిన ప్రసన్న సాహిత్య రత్నాకరము వ్రాసినాడు కవి వచన సముచ్చయమునమకరిస్తూ వ్రాసిన సుభాషిత గ్రంథమిది ఇందువ్రజ్య (పరిచ్ఛేద) విభాగము కలదు కవి తన వ్యాకరణ సాహిత్య జ్ఞానమును పొగడినాడు ఈ 15వ శతాబ్దివాడే వేదాంత దేశికులు సుభాషితనీవి విద్యాకరమిశ్రుడు 130 కవుల యొక్క 1030 సుభాషితములతో విద్యాధర సహస్రకమును. పెద్దిభట్టు సూక్తి వారిధిని రచించినారు.

**పద్యావళి :** రూపగోస్వామి (16వ శతాబ్ది) కృష్ణభక్తి పరములైన 125 కవులయొక్క శ్లోకముల నుట్టంకిస్తూ కృష్ణభక్తిని ప్రబోధించు శ్లోకముల రచిస్తూ 380 సుభాషిత శ్లోకములతో పద్యావళిని వ్రాసినాడు భక్తిని రసముగా నిరూపించు విధమున సుభాషితములు పేర్కొనబడినవి. అన్యోక్తులతో పాటు, కృష్ణలీలలను, కృష్ణభక్తిని రమ్యంగా నిరూపించినాడు.

**ప్రస్తావ రత్నాకరము :** పురుషోత్తముని తనయుడైన హరిదాసుడు విక్రమసంవత్ 1614న, వరవీరషాహి రాజ్యాన్ని పాలిస్తూండగా, జటాపట్టణమునందు, 21 అధ్యాయములు కలిగిన ప్రస్తావరత్నాకరమును వ్రాసినాడు. కృష్ణదాసుడు, దామోదరుడు, నారాయణుడీతని అన్నలు. శాస్త్రములందును, సాహిత్యమునందు నీతడు నిష్ణాతుడు, (క్రీ॥ శ॥ 1679 న) హంసవిజయగణి అన్యోక్తిముక్తావళిని (క్రీ॥ శ॥ 1680 న) హరిభాస్కరుడు పద్యామృత తరంగిణిని వ్రాసినారు.

**సుభాషితహారావళి :** దాక్షిణాత్యుడైన, చక్రపాణి సోదరుడైన, హరికవి కాశ్మీరంనుండి కన్యాకుమారి వరకు గల కవుల కావ్యాల్లోని సుభాషితముల నుట్టంకిస్తూ సుభాషిత హారావళిని కూర్చినాడు. అక్బర్‌యొక్క ఆస్థానకవియైన అక్బరీయకాళిదాసునియొక్క. జగన్నాథ పండిత రాయలయొక్క సుభాషితములను పేర్కొనుటచే 17వ శతాబ్దుత్తరార్థంవాడిగా నిర్ధారించవచ్చును హరిహర కవి హరిహర సుభాషితమును, ధర్మదాససూరి విదగ్ధముఖమండనమును, కృష్ణదాసు ప్రస్తావసింధును వ్రాసినారు.

**పద్యతరంగిణి :** మాధవరాజు యొక్క ఆస్థానకవియైన వ్రజనాథుడు 12 తరంగములు కల్గిన పద్యతరంగిణిని వ్రాసినాడు. మాధవరాజు జయసింహుని పుత్రుడు, పృథ్వీరాజ వంశస్థుడు, క్రీ॥శ॥ 1753 కాలమువాడు. నేటి

దత్తుడు 114 మహాకవుల సుభాషితముల నుట్టంకిస్తూ పద్యవేణిని కూర్చి నాడు హరిభాస్కరుడు (17వ శతాబ్ది) యోగేశ్వరుడు, లక్ష్మీధరుడు, శ్రీధర స్వామి, శుకాంగుడు మొదలగు వైష్ణవకవుల కావ్యములనుండి 880 సుభాషిత ముల సంగ్రహించి 5 తరంగములు కల్గిన పద్యామృత తరంగిణిని కూర్చినాడు.

**సూక్తి సుందరము :** సుందరదేవుడు (17 వ శతాబ్ది పూర్వా ర్ధము) 16, 17 వ శతాబ్దపు అక్బర్, ముద్దఫరషాహ, నిజాంషాహ, షాజహాన్ మొదలగు ముస్లిం ప్రభువుల స్తుతిస్తూ వ్రాయబడిన సూక్తులను సంగ్రహించి సూక్తి సుందరమును కూర్చినాడు. ఈ కవి ఆ రాజదర్బారులతో పరిచయము కలిగియుండవచ్చును ఈతనిచే సంగృహీతమైన సూక్తులలో ఉర్దూ పదయుక్త ములు విరివిగా లభించుచున్నవి. ఉదాహరణ కీ శ్లోకము -

> జీమీకంపతి బిశ్యతిప్రతివనం బిబిగనీమ్నప్రజా
> సోప్యగస్య ప్రతనోతి చ స్ఖలనతామార్యాత్ప్రభుర్యారతః ।
> దర్యావాః ప్రచలంతి పీదినివహైర్దూలీభిరాప్తాబభా
> అస్తానేప్రతిహన్యతీ తవ చమూయానేభిజానే ప్రభో ॥

భట్టగోవిందజిత్తు (17 వ శతాబ్ది) సభ్యాభరణమును వ్రాసినాడు. నారోజిపండి తుడు ఒక వేయి శ్లోకములతో సూక్తి మాలికను కూర్చినాడు. లక్ష్మణభట్ట అంకోల్కర్ 15 పరిచ్ఛేదములతో అన్యోక్తులను కూడా సంగ్రహించి పద్య రచనను కూర్చినాడు. శంభు కవి (క్రీ॥ శ॥ 1690) 883 సుభాషిత శ్లోకము లను 3 భాగములలో విభజిస్తూ బుధభూషణమును వ్రాసినాడు - ఈ శతాబ్దా రంభమున శివదత్తుడు నారాయణరామ ఆచార్యులు ఇద్దరు కలిసి 1600 లోకో క్తులు, 1100 శ్లోకములు కలిగిన సుభాషిత రత్న భాండాగారమును కూర్చి నారు - నరేంద్రదేవశాస్త్రి సూక్తిముక్తావళిని, డా. రామజీ ఉపాధ్యాయ సంస్కృత సూక్తి రత్నాకరమును, ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు పార్సీ లోకోక్తు లను సంస్కృతంలోకి అనువదిస్తూ పారసీక లోకోక్తిని వ్రాసినారు. సంస్కృత అకాడెమి ప్రచురించిన Gems from Sanskrit Literature, సురభారతి ప్రచురించిన సంస్కృత సూక్తిముక్తావళి, ఈ సుభాషిత సాహిత్య సౌందర్య మును పాఠకుల ముందుంచుచున్నవి. ఇంకా ఇప్పటికిని ఎవరో ఒకరు శ్లోకాలను సంకలనం చేస్తూ గ్రంథాలను ప్రచురిస్తూనే వున్నారు పాఠకులు ఆదరాభిమానా లతో వాటిని కంఠస్థీకరిస్తూనే వున్నారు.

సందేశ, స్తోత్ర, సప్తశతీ, సుభాషిత సాహిత్యములలో పేర్కొనని లఘు కావ్యములను పరిశీలింతము. మహాకవి కాళిదాసు గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిర వసంతములను ఆరు ఋతువులను వర్ణిస్తూ 153 శ్లోకములతో, ఆరు సర్గలతో ఋతుసంహారమును రచించినాడు. శృంగార ప్రధానములైన 23 శ్లోకములతో కూడియున్న శృంగార తిలకము కాళిదాసు రచనగా చెప్పబడుచున్నది. ఇది ప్రసాదగుణయుక్తమైన శైలిలో, అనుప్రాసయుక్తమైన సరళ భాషలో వ్రాయబడినది. శృంగార సన్నివేశములు కన్నులకు కనిపించునటుల చిత్రింపబడినవి. ఇందు కవి ప్రియురాలి అందాల్ని స్తుతిస్తూ ఆమె పాషాణ హృదయాన్ని విమర్శించినాడు. అరణ్యంలో ప్రియురాలితో సంచరిస్తూ ప్రకృతిని 20 శ్లోకములతో శృంగార భరితంగా, అందమైన శైలితో వర్ణించిన రాక్షస కావ్యము కూడా కాళిదాసకృతముగా పేర్కొనబడుచున్నది

**కుట్టనీమతము :** కాశ్మీరాధిపతి జయాపీడుని (క్రీ॥శ॥779-813) మంత్రిగా, ఆస్థానకవిగా కల్హణునిచే పేర్కొనబడిన దామోదర గుప్తుడు కుట్టనీమతమును రచించినాడు ఇందు కాశీనగరంలోని మాలతియను వేశ్య భవనాగ్రమున సంచరిస్తూండగా ఒక గాయకుడు-

యౌవన సౌందర్య మదం దూరేణాపాస్య వారవనితాభిః।
యత్నేన వేదితవ్యాః కాముక హృదయార్థనోపాయాః॥ అను శ్లోకాన్ని పాడుతాడు. అది విన్న మాలతి వికరాళయను అనుభవశాలియైన వేశ్యనుండి యువకులనెలా ఆకర్షించాలి. వారి హృదయములను, సంపదలనెలా వశపరచుకోవాలి, కపటప్రేమ నెలా ప్రదర్శించాలి మొదలగు విషయములను తెలుసుకొంటోంది. శృంగార రసబంధురమైన కొన్ని కథలు కూడా వివరించబడినవి. ఈ కావ్యాన్ని చదివి పాఠకులు వేశ్యల కపట ప్రేమల తెలుసుకొని తమ శీలమును రక్షించుకోవలయునని కవి ఉద్దేశ్యమై యుండవచ్చును. ఇందలి భాష సుందరము, ప్రసాద గుణయుక్తము.భావములు కల్పనలు రమ్యములు.ఎటొచ్చి శృంగారము మితిమీరినట్లుగా కనిపించుచున్నది హరవిజయ కర్తయైన రత్నాకరుడు(క్రీ॥శ॥ 850-894) 50 వక్రోక్తి శ్లోకములు కలిగిన వక్రోక్తి పంచాశిక యను ముక్తక కావ్యాన్ని రచించినాడు.

**చౌరపంచాశిక :** 50 శృంగార శ్లోకములు కల్గిన ఈ ఖండ కావ్యము, విక్రమాంక దేవ చరిత్రను వ్రాసిన బిల్హణుని కృతిగా చెప్పబడు చున్నది. రహస్యప్రేమ, ప్రేయసియొక్క శృంగార క్రీడలు ఇందు వర్ణింపబడినవి. ప్రియుడు తన ప్రేయసియొక్క శృంగార క్రీడలను స్మరించుకొనుట ఇందు వర్ణితము. కొన్ని వ్రాతప్రతులయందు దీనికి ఉపోద్ఘాతం కూడా ఇవ్వబడినది. అదేమనగా గుజరాత్ ప్రభువైన వైరిసింహుని ప్రార్థనచే బిల్హణకవి శశికళ రాజకుమార్తెకు కావ్య - నాటక - అలంకారములను బోధించుచుండెను. ఆ రాజకన్య బిల్హణుని మనోహర రూపమున కాకర్షితురాలై ప్రేమలో పడెను. రహస్యంగా ఇద్దరు కలుసుకొనెడి వారు కొన్ని నెలలు గడచిపోగా, రాజునకీవిషయము తెలియగా బిల్హణునకు ఉరిశిక్షను విధించినాడు. వధ్యశిలకు తీసుకపోబడిన బిల్హణుడు 'అద్యాపితాం కనక చంపకదామ గౌరీం' ఇత్యాది 50 శ్లోకములతో తాను రాజకన్యతో అనుభవించిన శృంగార క్రీడలను స్మరించగా, అది విన్న రాజు బిల్హణునకు రాజకుమార్తెనిచ్చి పెళ్ళిచేసినాడని ఈ కథ తెలుపుతూంది. బెంగాలీ ప్రతులలో ఇలాంటి కథనే చౌరసుందరునితో పేర్కొనబడినది. గ్రంథ మాతని కర్తృకంగా పేర్కొనబడినది. విమర్శకులు చౌరకవి, బిల్హణుడు ఒకే వ్యక్తిగా భావించారు. కాని జక్కన (15వ శతాబ్ది) యను తెలుగుకవి తన విక్రమార్క చరిత్రలో ఇద్దరిని వేరువేరుగా పేర్కొన్నాడు. బిల్హణుడు విక్రమార్క దేవచరిత్రంలో తన జీవిత చరిత్రను వర్ణిస్తూ కూడా ఈ గుప్తప్రేమను, శిరచ్ఛేద దండనమును పేర్కొనలేదు. మరియు గుజరాత్ ప్రభువగు వైరిసింహుని (క్రీ॥శ॥ 920) కాలంనాటికి బిల్హణుడు జన్మించికూడా ఉండలేదు. విభిన్న వ్రాతప్రతులలో రాజకుమార్తెయొక్క పేర్లు యామిని, పూర్ణతిలక రాజుయొక్క పేర్లు మదనాభిరాముడు, లక్ష్మీమందిరుడనియు, పాంచాలదేశమనియు పేర్కొనబడినవి. కావున ఈ కావ్యము బిల్హణకృతమనుట యుక్తముకాదు - ఏదియేమైనా అక్కడక్కడ అశ్లీలమనిపించే భావాలున్నా మరణదండనకై ఎదురు చూస్తున్న వ్యక్తి, తన గుప్తప్రేమను, ప్రియురాలి అందాల అనుభవాల్ని స్పర్శిస్తూ, నిస్సంకోచంగా వర్ణించిన కవి భావాలు సహృదయ రంజకాలనుటలో అతిశయోక్తిలేదు. కరుణా విప్రలంభమిందలి ప్రధానరసము.

**క్షేమేంద్రుడు :** కాశ్మీరీయుడు, సుప్రసిద్ధ అలంకారికుడు, వ్యాసదాసుడని నామాంతరము కల్గిన క్షేమేంద్రుడు (క్రీ॥శ॥ 1050) అలంకార శాస్త్రమున ఔచిత్యవిచార చర్చ, కవి కంఠాభరణములను, ఛందస్సునందు సువృత్త తిలకమును, రామాయణమంజరి, భారతమంజరి, బృహత్కథా మంజరులనేకాక, అనేక లఘు కావ్యములను రచించినాడు. కల్హణునికంటే పూర్వమే కాశ్మీరరాజుల చరిత్రను వర్ణిస్తూ రాజావళిని రచించినాడు 'అంశోపినాస్తి నిర్దోషో క్షేమేంద్రస్య నృపావళౌ' అని కల్హణునిచే ఈ ఐతిహాసిక కావ్యము ఖండించబడినది అమృత తరంగము కనకజానకి, దశావతారచరితము, దేశోపదేశము, నీతి కల్పతరువు, పద్య కాదంబరి, శశివంశ మహాకావ్యము, చిత్ర భారత నాటకము ఈతనిచే రచింపబడినట్లుగా పరవర్తులైన కవులు పేర్కొన్నారు 10 సర్గలు కల్గిన కళా విలాసమున సాంఘిక జీవనమున సంభవించు మోహ, దంభ, కామాదుల దుర్లక్షణములను, దుష్ఫలితములను రమ్యంగా వర్ణించినాడు. నాల్గవసర్గనందు అరువై నాలుగు కళలకు నిలయము వేశ్యాహృదయము "హారిణ్యః చటులతరా బహుళ తరంగాశ్చ నిమ్నగామిన్యః। నద్య ఇవ జలధిమధ్యే వేశ్యాహృదయే కలాశ్చతుష్షష్టిః॥" అని పేర్కొంటూ, వేశ్యల చరిత్రమును వర్ణించినాడు. సేవ్య సేవకోపదేశమునందు 61 శ్లోకములతో కర్తవ్యములను, నీతిని బోధించినాడు. ధర్మ, అర్థ, కామ మోక్షములు విశదంగా చతుర్వర్గ సంగ్రహమునందు నిరూపించబడినవి భర్తృహరియొక్క 'భోగేరోగభయం' అను శ్లోకాన్ననుకరిస్తూ భోగేరోగభయం సుఖేక్షయభయం విత్తేఽగ్ని భూభృద్భయందాస్యే స్వామిభయం గుణే ఖలభయం వంశేకుయోషిద్భయం। మానే మ్లానిభయం జయే రిపుభయం కాయే కృతాంతాద్భయం సర్వం నామ భవే భవేద్భయమహో వైరాగ్యమేవాభయం॥ అని వైరాగ్యాన్ని బోధించినాడు. శృంగార రసప్రధానంగా లావణ్యవతిని రచించినాడు. ఇందలి అపహ్నవాలంకార భూషితమైన శ్లోకమిది :

> అదయ దశసి కింత్వం బింబ బుద్ధ్యాఽధరం మే
> భవ చపల నిరాశః పక్వజంబూఫలానాం।
> ఇతి దయిత మవేత్య ద్వారదేశాత్తమన్యా
> నిగదతి శుకముచ్చైః కాంత దంత క్షతోష్ఠీ॥

మునిమత మీమాంసయందు దర్శనకారులయొక్క, ఋషులయొక్క అభిప్రాయములు చక్కగా నిరూపించబడినవి వ్యాసుని గొప్పతనాన్ని బోధిస్తున్న

శ్లోకమిది: విపిన గహనగర్భ గ్రంథ సంచారశాంతైః మునిభిరభినిష్ఠై స్తత్వ ముక్తం నకించిత్। కృతరుచిరవిచారం సారమేతన్మహర్షేః అహమితి భవతామి ర్నాహ మిత్యేవమోక్షః॥ ఆచారములను బోధిస్తూ 7 అధ్యాయములు కల దర్ప దలనమును, వ్యంగ్య ప్రధానములైన దేశోపదేశ, నర్మమాలలను రచించినాడు. నీతిని నైతిక ప్రవర్తనమును, సదాఖ్యానములను, సద్గుణములను 100 శ్లోకములతో బోధిస్తూ చారుచర్యను రచించినాడు.

**శంభుకవి :** కాశ్మీర రాజగు హర్షదేవుని (క్రీ॥శ॥ 1089-1101) ఆస్థానకవి, రాజేంద్రకర్ణ పూరకర్త, శంభుకవి 108 ముక్తక శ్లోకములతో అన్యోక్తి ముక్తాలతను రచించినాడు.

**జయదేవుడు :** సంస్కృత వాఙ్మయమున గీతిసాహిత్య ప్రాశస్త్యాన్ని తెలిపినవాడు జయదేవుడు ఈతని అష్టపదిని కంఠస్థీకరించనివాడుండ డనుట అతిశయోక్తికాదు. నేటి భావ కవితకు మూలమీతని అష్టపదులని చెప్ప వచ్చును. బెంగాల్ రాష్ట్రమునందలి కింద్రబిల్వ గ్రామమున రాధాదేవి భోజదేవు లకు జన్మించినవాడు. సంగీత విదుషి, భర్తృగీతికల కనుగుణంగా నాట్యము చేయు నర్తకి పద్మావతి ఈతని అర్ధాంగి (పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ). క్రీ॥శ॥ 1116 లక్ష్మణసేన ప్రభువువి ఆశ్రయించినవాడగుటచే క్రీ॥శ॥ 1100 ఈతని కాలమని చెప్పవచ్చును. ఈతని కావ్యము గీత గోవిందము పన్నెండు సర్గలతో కూడుకొన్నది. ఇందు రాసక్రీడా - రాధావిషాదవర్ణనము - కృష్ణుని గూర్చి వ్యాకులత - ఉపాలంభవచనము - రాధగూర్చి కృష్ణుని వ్యాకులత - రాధా విరహవర్ణనము - కృష్ణాగమనము - రాధాక్రోధ ప్రదర్శనము - రాధా కృష్ణుల సంయోగము వర్ణింపబడినవి.

కోమల కాంతపదావళి, సరస సుకుమార భావావళి, ప్రాంజలపదవి న్యాసము - సంగీతాత్మక రచనము ఇందలి ప్రత్యేకతలు-దీని స్వరమాధుర్యము గీతిలయ తాళబద్ధమై గీతముల విను పాఠకులను మంత్రముగ్ధుల గావించును. ఈతని పదములందు సంయోగ వియోగావస్థలు, హర్షశోకములు, ప్రణయ కోప ములు, మాన ఉపాలంభములు, ప్రస్ఫుటముగా భావోద్బోధకములై ధ్వనించును. ఇందులో కేవలం సంగీతమేకాక అభినయము కూడా కూర్చబడినది కావున నే

తెలితె నాట్యమున ఈ అష్టపదులకు అగ్రతాంబూలము. ఇందు అభిసారికము గోపికలకు వర్ణాంత వర్ణనము, వియోగ వర్ణనము - సంయోగ వర్ణనాదులున్న ప్రవృత్తి ఈ గోపికలు జీవాత్మలని శ్రీకృష్ణుడు పరబ్రహ్మమని భావించుటచే శృంగార భక్తిరసములు చక్కగా పోషింపబడినవి. కావుననే

"యది హరిస్మరణే సరసం మనో యది విలాస కలాసు కుతూహలమ్

మధుర కోమల కాంత పదావళీం శృణు తదా జయదేవ సరస్వతీమ్"

హరి స్మరణయందే అష్టపదుల పర్యవసానాన్ని బోధించినారు. ఇందు ఒక్కొక్క అష్టపదికి ఒక్కొక్క రాగము నియతమైనది - ఇందు గూర్జరి రాగమున ఏక తాళమున పాడబడు

'రతిసుఖసారే గతమభిసారే మదనమనోహరవేశం

'నకురు నితంబిని గమనవిలంబన మనుసరతం హృదయేశం॥

ధీర సమీరే యమునా తీరే వసతి వనే వనమాలీ

గోపీపీన పయోధర మర్దన చంచల కరయుగశాలీ"

ఈ గీతమున రాధతో అమె చెలికత్తె 'శ్రీకృష్ణుడు' ప్రణయ క్రీడాదక్షుడు. యమునా తటమున అతనితో కామక్రీడా విహారమును సల్పుమని పల్కుట ఎంతో రమ్యమైనది

రాసక్రీడలో శ్రీకృష్ణుడు మునిగినాడు . ఒకరిని కౌగిలించుకొనుచున్నాడు. ఒక్కరిని ముద్దిడుకొంటున్నాడు . ఒక్కరితో విహారము సల్పుచున్నాడు. ఒక్కరితో కళ్ళతో మాట్లాడుచున్నాడు. ఒక్కరిని వెంబడించుచున్నాడు అను భావాన్ని తెలుపు రామకరీ రాగమున యతితాళముతో గానము చేయబడు

'చందన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ

కేళిచలన్మణి కుండల మండిత గండ యుగస్మితశాలీ॥

శ్లిష్యతి కామపి చుంబతి కామపి రమయతి కామపిరామాం

పశ్యతి సస్మిత చారుతరామపరామనుగచ్ఛతి వామాం'

అను గీతిక జీవాత్మ తాదాత్మ్యాన్ని వ్యంగ్యముగా బోధిస్తూంది. "వేదానుద్ధరతే జగన్నివహతే" అను గీతం దశావతారాల్ని బోధిస్తూంది. ఈ విధముగా సంగీతాభినయాత్మకమగు ఈ గీత కావ్యము సంస్కృత సాహిత్యమునకే మకుటాయమానమైనది. నాటకకర్త జయదేవుడు గీతగోవింద కర్త యైనట్లు, జయదేవుని [illegible]. నాటకకర్త మురారి మహాదేవుడు; గీతగోవిందకర్త తర్వాత

జయదేవుడు నాటకకర్త గాన్ప నైయాయికుడు, గీతగోవిందకర్త నైయాయి కుడుకాడు. నాటకకర్త కృష్ణభక్తుడిగా కనుపించడు. గీతగోవిందకర్త గొప్ప కృష్ణభక్తుడు. కావున ఇద్దరు భిన్నులనుట నిర్వివాదము రామగీత గోవిందము, రాధాకృష్ణ విలాసము ఈతని కృతులుగా ఆరోపించబడినవి. గంగాష్టకము అర్వాచీనుడైన ధీరజయదేవునిచే రచింపబడినది. నామసామ్యముచే నిర్ణయ సాగర సంస్కరణముయందు, గీతగోవిందంతోపాటు అచ్చువేయబడినది. ఈ గీతగోవిందాన్ని ఆదర్శం MODELగా తీసుకొని అనేక అనుకరణలు ఆవిర్భ వించినవి. నీలాచలం రాజాయొక్క గీతగోవిందము, భానుదత్తుని గీతగౌరీపతము ఘోమనాథుని కృష్ణగీతము, హరిశంకరుని గీతరాఘవము, ప్రభాకరుని గీతరాఘ వము, రామకవి గీతరాఘవము, రాముని గీతగిరీశము, గోవిందదాసుని సంగీత మాధవము, అభినవ చారుకీర్తి గీతవీతరాగము, కళ్యాణుని - రాజశేఖరుని - చంద్రశేఖర సరస్వతులయొక్క గీత గంగాధరములు, చంద్రశిఖామణియొక్క శివగీతిమాలిక, రామోదాహరణ గీతికావ్యము, మైసూర్ వేంకట నాయకుని యొక్క శివాష్టపది, సుందరాచార్యుని గీతశతకము, విశ్వనాథుని సంగీత రఘు నందనము, సదాశివదీక్షితుని సంగీత సుందరము, చెరుకూరి వెంకటుని గీత గిరీ శము మొదలగు 139 గీతగోవిందానుకరణ గీతికావ్యములు కలవు.

**జల్హణుడు :** సోమపాలవిలాస కావ్యకర్త, సోమపాల రాజా యొక్క మంత్రి, కాశ్మీరీయుడైన జల్హణుడు (క్రీ॥శ॥ 1150) 66 శ్లోకములతో వేశ్యల మాయలను, మోసాలను వర్ణిస్తూ ముగ్ధోపదేశమును వ్రాసినాడు. వేశ్యలను వర్ణించు శ్లోకమిది.

> ఆజీవః కపటానురాగ కలయాదోషోను దుశ్శీలతా
> వైధవ్యంచ నబాధతే సదసతోస్పంభావనావ్యత్యయాత్।
> యత్కించిత్కరణే పరస్వహరణే వ్రీడా న పీడాకరీ
> నోవా రాజ భయంచహే బత సుఖం జీవంతి వారస్త్రియః

సూక్తిముక్తావళీకారుడైన జల్హణుడు (క్రీ॥ శ॥ 1257) ఇతనికంటే భిన్నుడు.

**నృసింహకవి :** కాళిదాసుయొక్క మేఘసందేశాన్ని అనుక రిస్తూ నృసింహకవి (సిద్ధోద్వాహ) కావ్యాన్ని రచించినాడు. ఈ నృసింహకవి

కాకతీయ ప్రతాపరుద్రుని (క్రీ॥శ॥ 1296-'326) ఆస్థానకవి. ఇతని తండ్రి విశ్వేశ్వర శివాచార్యులు, కాకతీయ రాణి రుద్రమాంబకు రాజగురువుగా ఉండెను. సిద్ధోద్వాహ కావ్యమునందు 62 మందాక్రాంతా శ్లోకములు కలవు కథను పరిశీలింతము : ఒక సిద్ధుడు తన ప్రియురాలితో విహరిస్తూండగా, ఈర్ష్యచెందిన యక్షుడు మాయచేత సిద్ధుణ్ణి దూరంచేస్తాడు. ప్రియావియుక్తుడైన సిద్ధుడు తన ప్రణయ . వివాహ గాథను స్మరించుకొంటాడు

కశ్చిత్సిద్ధయువా సమం దయితయా శ్రీస్రోతసేస్సైకతే
రాగాందోలమమాణ ఏవ లిఖితే కారండవానాం పదైః॥
దృష్టం దుర్విషహం మనోభవ కృతాం తాం తామవస్థాం తయా
విశ్లేషం గమితః కుతూహలవతా యక్షేణ మాయావినా॥

ఒక విందు పార్టీలో అందమైన యువతి కనిపిస్తుంది మొదటి చూపులోనే ఆ యువతి, ఈ సిద్ధయువకుడు ప్రేమలో పడ్తారు. ఆమె వెళ్ళిపోగా సిద్ధుడు వియోగాన్ననుభవిస్తూ ఉంటాడు. ఆ యువతికూడా సిద్ధునియందు అసక్తురాలై వియోగాన్ననుభవిస్తూ, ఒక దూతికను ప్రేమసందేశంతో సిద్ధునివద్దకు పంపిస్తుంది. ఆ దూతిక, నాయికయొక్క విరహాన్ని వర్ణిస్తూ, సిద్ధుడు కలవకపోతే ప్రాణత్యాగం చేస్తుందని బోధిస్తుంది.

ద్రష్టవ్యః కథమేష దృష్టిసుభగః సంభాషణీయః కథం
శ్రోతృ స్వాదువచాః సుసంహతవపుః సంశ్లేషణీయః కథం।
సాన్నిధ్యావిదితాన్య వస్తువిషయః సంసేవితవ్యః కథం
నేత్థం త్వాం ప్రతిచింతయత్యహరహః పర్యాకులా వర్తతే॥

దూతిక ద్వారా నాయిక మనస్సు నెరిగిన సిద్ధుడు ఆమెనివసించు రాజభవనాన్ని చేరుకొంటాడు రాత్రిపూట ఎత్తయిన ప్రహరీగోడల దాటి ఆమెను చేరపోగా రాజభటులు పట్టుకొంటారు ఆమెతండ్రి కనకాంగదరాజు ఇతనిని కారాగారంలో వేస్తాడు కారాగారంలోను మాటిమాటికి ఆమెనే స్మరిస్తూండగా, రాజు దయార్ద్రహృదయుడై సిద్ధునికి ఆమెతో వివాహంచేస్తాడు హాయిగా భార్యతో కలిసి ఉండగా, ఈ యక్షుడు నాకెందుకు ఈ వియోగాన్ని కలిగించాడని బాధపడ్తూండగా, యక్షుడు దయతలంచి, సిద్ధుణ్ణి తన ప్రేయసితో కలుపుతాడు. సుఖాంతంగా ముగుస్తుంది గీతకావ్యము ఈ కావ్యాన్నేకాక, 'ఆంధ్రాస్సంతి గరీయాంసః ...' అని ఆరంభిస్తూ ఓష్ఠ్యవర్ణముల నుపయోగించక నిరోష్ఠ్య కావ్యాన్ని

కావ్యాన్ని రచించినాడు. ఈ రెండు కావ్యములు, వరంగల్ ఉరుసుకొండ [illegible] చెక్కబడినవి. కవి [illegible] శ్లేషగా వర్ణించిన ఒక ప్రాకృత పద్యం [illegible] దశరూపకము [illegible] శ్లోకము వరంగల్ కోట ద్వార తోరణముపై చెక్కబడినది.

ద్వివేది : 15వ శతాబ్ది ఉత్తరార్ధంలో దారుచర్యను అనుకరిస్తూ, పౌరాణిక గాథలకు బదులు ఋగ్వేద కథలను తీసుకుంటూ 200 శ్లోకాలు గల నీతిమంజరిని రచించినాడు. ప్రతి శ్లోకంలో ఋగ్వేదంనుండి ఉదాహరణలను తీసుకొని నీతిని ఉపదేశించినాడు. సాయణ భాష్యంలోని కథలను, కొన్నిచోట్ల ఋగ్వేద మంత్రాలను కూడా ఉట్టంకించినాడు. వాగ్గేయకారుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు (1409 - 1503) భక్తిరసపూర్ణములైన పదాలను రచించి, తిరుపతి వేంకటేశ్వరస్వామి సాన్నిధ్యంలో గానం చేసేవారు. ఈ పదాలన్నియు తామ్రశాసనములపై ఉట్టంకించబడినవి. ఈ అన్నమయ్య పదాలలో సంస్కృత పదాలు కూడా కలవు. వర్షాధార పక్షి చాతకము. వర్షించునప్పుడు మేఘములనుండి కురియు జలాన్ని గ్రాగుతుంది. మేఘజలాలు దొరకకపోతే దప్పితోనే ఉంటుంది, కాని వేరే నీరును తాకదు. అట్టి చాతకపక్షిని ఉదాహరణంగా తీసుకొని నీతిబోధను చేస్తూ రచింపబడినది చాతకాష్టకం. దీని కవి ఎవరో తెలియదు. రామచంద్రకవి : (క్రీ.శ. 1524) శృంగారము, వైరాగ్యము రెండు అర్థాలను బోధించు 'రసికరంజన' మను శ్లేష కావ్యమును రచించినాడు. శ్రీకంఠమూర్తి నిత్యబ్రహ్మచారి, అతన్ముసన్యాసి, ఒకడు అద్భుతకాంతి, అప్పరస ఒకడు వైరాగ్యమూర్తి, మరొకడు శృంగారమూర్తి. వీరిద్దరి సంవాదములో చివరకు శృంగారాలకు పూర్ణముగా వైరాగ్యమే విజయాన్ని పొందినట్లు వర్ణిస్తూ సర్గల ముప్పైలో శృంగార జ్ఞాన నిర్ణయం రచింపబడినది. దీని కర్త ఎవరో తెలియదు. రుద్రకవి : (16వ శతాబ్ది) తన ఆశ్రయదాతయగు జగన్నాథుని పేరుమీద 133 శ్లోకములు కల్గిన భావవిలాసమను ఖండకావ్యమును రచించినాడు. నారాయణభట్టు : (క్రీ.శ. 1609) శ్రీమద్భాగవత దశమస్కంధంలోని శ్రీకృష్ణుని చరిత్రను ఆధారముగా చేసి 1036 శ్లోకాలతో, 10 దశకాలుగా, 13 స్కంధాలుగా విభజించి నారాయణీయమును రచించినాడు. [illegible] వాదనలు [illegible] నారాయణీయమును రచించి [illegible]

పొందినాడంటారు. కేరళ రాష్ట్రంలో దీన్ని నిత్యపారాయణం- చేస్తూవుంటారు. నారాయణీయంలోని చివరి శ్లోకమిది

అజ్ఞాత్వా తెమహత్వం యదిహ నిగదితం విశ్వనాథ క్షమేథాః
స్తోత్రం చై తత్సహస్రోత్తర మధికతరం త్వత్ప్రసాదాయ భూయాత్।
ద్వేథా నారాయణీయం శృతిసు చ జనుషాం స్తుత్యతా వర్ణనేన
స్ఫీతం లీలావతారై రిద మిహ కురుతా మాయురారోగ్య సౌఖ్యం॥

అనేక స్తుతి కావ్యములు, శృంగార కావ్యములు ఇతనిచే రచింపబడినవి. స్వాహా సుధాకర మను లఘు కావ్యములోని పద్యమిది.

రవి రయ మస్తం యాతః సమాశమో హంత హంత చంద్రోదయం।
యాతి వికాసమపీయం కుముద్వతీ కిం విలంబసే భృంగ॥

శృంగారలీలా, సంగీత కేతువుల కథను కల్పిస్తూ సరసంగా, శృంగార ప్రధానంగా, సరళంగా కోటివరహాన్ని రచించినాడు ఇందలి.

కామినీ కాముకం ప్రాహ యామినీ కాముకాననా॥ .
యాత ప్రాయ మిదం దినం కమలినీ దీనేయమాలోకతాం
నిరంధ్రశ్చ పయోధరః న చ శశీ దూరేఽధునా వర్తతే।
విప్రాగార మిదం తటాకసవిధే స్వేయత్ర మేతద్భృతే
గేహం తత్తపయ క్షపామిహ మహాన్ కార్యాతిపాతో న చేత్॥

భాగవత కథాంశమును ప్రధానంగా చేసుకొని నారాయణ స్తవ సహస్రమును రచించినాడు ఇందు అర్జున విషాదపూర్వకమైన విశ్వరూపాన్ని వర్ణిస్తూన్న శ్లోకమిది.

జిష్ణోత్వం కృష్ణ సూతః ఖలు సమరముఖే బంధుమాతే దయాలుం
ఖిన్నంతం వీక్ష్య వీరం కిమిదమయి సఖే నిత్య ఏకోఽయమాత్మా।
కో వధ్యః కోఽత్ర హంతా తదిహ వధభయం ప్రోజ్ఝ్య మయ్యర్పితాత్మా
ధర్మ్యం యుద్ధం చరేతి ప్రకృతి మనయద్దర్శయన్ విశ్వరూపం॥

భారత ప్రబంధము, దూతకావ్యము, మత్స్యావతార ప్రబంధము, శ్రీపాద సప్తశత్యాదులు నీతని కృతులే ఈ కవి చరిత్రము కేరళీయుడైన కటకధనద ప్రభువైన ఉదయవర్మచే వ్రాయబడినది నారాయణభట్టు తనయుడగు శ్రీకృష్ణకవిచే (క్రీ॥శ॥ 1630) శృంగార రస ప్రధానమైన తారాశశాంకుల ప్రేమనాధారముగా గొని, తారాసుధాకర కావ్యము వ్రాయబడినది.

**వేంకటాధ్వరి :** కాంచీపురవాసి సీతాంబారఘునాథుల పుత్రుడు విశ్వగుణాదర్శ చంపూకర్తయైన వేంకటాధ్వరి (క్రీ శ॥ 1550) రామాయణ, భాగవత కథలను బోధిస్తూ 30 శ్లోకములతో రాఘవ యాదవీయమను శ్లేష మయమైన విలోమ కావ్యమును రచించినాడు. అనులోమ క్రమంలో చదివితే భాగవత కథ, విలోమక్రమంలో చదివితే రామాయణ కథ వస్తుంది కవియొక్క పాండిత్య ప్రకర్షను వెల్లడిచేస్తున్నది. శ్రవణానందము కూడా ఈతనిచే రచింప బడినది.

**చిదంబరకవి :** దాక్షిణాత్యుడు, కౌశికగోత్రుడు, సూర్యనారాయణ యజ్వపౌత్రుడు, అనంతనారాయణ వేంకటాంబల తనయుడు, శ్రీనివాసుని సోదరుడగు చిదంబరకవి (క్రీ॰శ॥ 1600) రామాయణ,భారత,భాగవత (దశమస్కంధ) త్ర్యర్థముల బోధించు కథాత్రయి అను త్ర్యాశ్రయ చిత్రకావ్యమును 3 సర్గలతో రచించినాడు. ఉత్తరార్కాట్ జిల్లా విరించిపుర గ్రామవాసి, వాధూలసగోత్రుడు, మార్గసహాయ చరిత కావ్యకర్తయైన వేదపురీశ్వరాధ్వరి ఈతని మాతామహుడు (తాత). తంజావూర్ జిల్లా పాలయూర్ ఈతని గ్రామమని కొందరి అభిప్రాయము కథాత్రయి, చిదంబర విలాసము, నటరాజ స్తవము, శబ్దార్థ చింతామణి పంచకల్యాణచంపువు, రామకృష్ణచంపువు, భాగవత చంపువు లీతనిరచనలు. కథాత్రయిలోని మొదటి శ్లోకమిది.

అస్తి ప్రస్తుత హృద్య దుర్గవితతా హస్తిశ్రితా భారతైః
పూర్ణార్థే ప్రతి మానవైః రుచిభృతైః పూర్వాహినీశేక్షయా।
ప్రాకారైః స్ఫరితోజ్వలా వరిఘయాభాస్వజ్జలోల్లాసిభిః
భూభృద్భిర్మధురేహ మానసభువా తుల్యై రయోధ్యావరైః ॥

చిదంబర విలాసమునకు తానే వ్యాఖ్యానమును కూడా వ్రాసినాడని తెలుపు శ్లోకమిది.

ప్రబంధకర్తాఽపి చిదంబరేశ్వరః తదర్థహారోఽపి చిదంబరేశ్వరః।
ప్రవర్తకోఽప్యస్య చిదంబరేశ్వరః ముదేత దేత్త్రితయం విపశ్చితాం॥

**దైవజ్ఞసూర్యకవి :** (క్రీ॥శ॥ 16వ శతాబ్ది) 36 శ్లోకాలుకల రామకృష్ణ విలోమకావ్యాన్ని రచించినాడు పైనుండి క్రిందికి అనులోమ పద్ధతిన చదివినప్పుడు రామకథ, క్రిందినుండి పైకి చదివినప్పుడు కృష్ణకథ వస్తుంది.

**మేఘవిజయగణి :** (క్రీ॥శ॥ 1670) మాఘకావ్యం దేవగురోః మేఘదూతం ప్రతప్రభోః॥ సమస్యార్థం సమస్యార్థం నిర్మమే మేఘపండితః॥ మాఘ్యకావ్య శ్లోకపాదాలను తీసుకొని సమస్యాపూరణ పద్ధతిగా దేవాభ్యుదయము అను పేరుతో విజయదేవసూరి చరితమును, మేఘసందేశంలోని శ్లోకపాదాలను తీసుకొని సమస్యాపూరణ పద్ధతిగా దిగ్విజయము అను పేరుతో విజయప్రభ సూరి చరితమును నైషధమునుండి ఒక్కొక్క శ్లోకమును గ్రహించి, మిగతా మూడు పాదముల పూరిస్తూ సమస్యాపూరణ పద్ధతిగా శాంతినాథ చరితమును, వృషభనాథ, శాంతినాథ, పార్శ్వనాథ, నేమినాథ, మహావీర, కృష్ణనాథ, బలదేవుల చరితముల బోధిస్తూ సప్తసంధానమును సప్తాశ్రయ కావ్యమును రచించినాడు. నైషధశ్లోకపాద సమస్యాపూరణమైన శాంతినాథ చరితములోనివి ఈ శ్లోకములు.

నిపీయయస్య క్షితిరక్షిణః కథాః సురాస్సురాజ్యాది సుఖం బహిర్ముఖం,
ప్రవేదిరేంతః స్థిరతస్మ యాశయాః సదా సదానంద భృతః ప్రశంసయా॥
యథాశుతస్యేహ నిపీత తత్కథాః తథాదియంతే నబుధాస్సుధామపి।
సుధాభుజాం జన్మన తన్మనః ప్రియం భవేద్భవేయ్యత న తత్కథాప్రథా॥

**జగన్నాథ పండితరాయలు :** ఆంధ్రప్రదేశ్, కోనసీమ, ముంగండ అగ్రహార వాసులగు లక్ష్మి పేరుభట్టు లీతని జననీ జనకులు. తండ్రి కాశీవాసము చేస్తుండగా కాశీలో జన్మించాడు తండ్రివద్ద సమస్త విద్యలనభ్యసించినాడు మొగలుచక్రవర్తి షాజహాన్ (క్రీ॥శ॥ 1608-1658) రాజాస్థానమున పండితుడిగా ఉంటూ, 'పండితరాయల'ను బిరుదునొందినాడు ఐదు లహరులు, జగదాభరణ-ప్రాణాభరణములు. ఆసఫ్ విలాసము, భామినీవిలాసము, అన్యోక్తు లీతని రచనలు. రసగంగాధరము, చిత్రమీమాంసాఖండనము, మనోరమాకుచమర్దనములీతని శాస్త్ర గ్రంథములు రసగంగాధరమునందుదాహరించిన శ్లోకముల సంగ్రహమే భామినీవిలాసము."దుర్వృత్తాజార జన్మానో హరిష్యంతీతి శంకయా। మదీయ పద్య రత్నానాం మంజూషైవ కృతామయా" అని స్వయంగా పేర్కొన్నాడు. 55 శ్లోకములతో గంగను స్తుతిస్తూ వ్రాసినది గంగాలహరి అను

నామాంతరము కలిగిన పీయుషలహరి 11 శ్లోకములతో యమునను స్తుతించునది అమృతలహరి. 50 శ్లోకములతో విష్ణువుని స్తుతించునది కరుణాలహరి 41 శ్లోకములతో లక్ష్మీమాతను స్తుతించునది లక్ష్మీలహరి 30 శ్లోకములతో సూర్యుని స్తుతించునది సుధాలహరి ఈ ఐదు లహరులందు కవియొక్క భక్తి భావము ప్రకటించబడినది. 'మన్నిర్మితాః పంచలహర్యో భావస్య' అని కవియే పేర్కొన్నాడు. భామినీవిలాసము ప్రాస్తావిక, శృంగార, కరుణ, శాంత విలాసములని నాల్గు భాగములుగా విభజింపబడినవి ఇందలి శ్లోకములన్నియు ముక్తకములే 122 అన్యోక్తి,నీతి ప్రధానములైన శ్లోకములతో కూడుకొన్నది ప్రాస్తావిక విలాసము. 180 శృంగార రసస్యందకములైన శ్లోకములచే కూడుకొన్నది శృంగారవిలాసము. ఇందలి శ్లోకములు మర్మస్పర్శకములైన భావములచే రసానందాన్ని అందిస్తాయి ఉదాహరణకి శ్లోకము-

నీలాంచలేన సంవృత మాననమాభాతి నళినయనాయాః।
ప్రతిబింబిత ఇవ యమునా గభీర నీరాంతరేణాంకాః॥

19 కరుణరస స్ఫోరకములైన శ్లోకములతో నున్నది కరుణవిలాసము. అర్ధాంగి అసువులు బాపగా కవిశోకమే శ్లోకరూపాల్ని దాల్చింది.

భూమౌస్థితా రమణనాథ మనోహరేతి సంబోధనైర్య మధిరోపితవత్యసి ద్యాం।
స్వర్గం గతా కథమివక్షిపసిత్వమేణ శాబాక్షి తం ధరణిధూళిసు మామిదానీం॥

ఈ శ్లోకాల్ని చదువుతూంటే కన్నీరు రాక మానదు హృదయం ద్రవించక ఉండదు. శ్రీకృష్ణ స్తుతి ప్రచురములైన, శాంతభావపూర్ణములైన 44 శ్లోకములతో యున్నది శాంతవిలాసము శ్రీకృష్ణాశ్రయము సంసార విషయముల నిర్మూలించుటయందు సమర్థమైనదని బోధించు శ్లోకమిది

రేచేతః కథయామి తే హితమిదం బృందావనే చారయన్
వృందం కోఽపి గవాం నవాంబుద నిభో బంధుర్న కార్యస్త్వయా।
సౌందర్యామృత ముద్గిరద్భిరభితః సమ్మోహ్య మందస్మితైః
ఏషత్వాం తవ వల్లభాంశ్చ విషయం నాశు క్షయంనేష్యతి-

ఆసఫ్ విలాసము గద్యమయము, నవాబ్ ఆసఫ్ జాహి స్తుతిపరకమని కావ్యనామమే బోధిస్తూంది ఇందు షాజహాన్ చక్రవర్తిని స్తుతిస్తూ మొదట నల్గు శ్లోకములు కలవు జగదాభరణము ఉదయపుర ప్రభువగు జగత్సింహ స్తుతిపరమైనది. అస్సాం ప్రభువగు ప్రాణనారాయణుని స్తుతించునది ప్రాణాభర

ణము. జగదాభరణము, ప్రాణాభరణము పేర్ల విషయముననే భేదము. వీని యందు 53 శ్లోకములున్నవి అన్ని అంశములందును రెంటియందు సమానమైన ఈ శ్లోకమును పరిశీలింతము-

ఆస్వాదనేన రసో, రసేన కవితా, కావ్యేన వాణీ, తయా
లోకాంతః కరణానురాగ రసికః సభ్యః, సభా ధామునా।
దారిద్ర్యానల దహ్యమాన జగతీ పీయూష ధారాధర!
క్షోణీనాథ! తయా భవాంశ్చ భవతా భూమండలం భాసతే।

588 అన్యోక్తి శ్లోకములు లభించుచున్నవి ఒక ఉదాహరణమును పరిశీలింతము-

కోటిద్వయస్య లాభేఽపి నతం సద్వంశజం ధనుః।
అసంద్వంశ్యః శర స్తబ్ధో లక్షలాభాభి కాంక్షయా॥

ఉత్తములకు సంపత్తు గర్వకారణంకాదు, అధములకు మాత్రమే అనునది ధ్వని

**ఓరుగంటి లక్ష్మణాధ్వరి :** (క్రీ॥ శ॥ 1675) వరంగల్లు శంకరసోమయాజి తనయుడైన ఈ కవి గీతరామము, చమత్కారలహరి, గీత మహేశ్వరములను మూడు ఖండ కావ్యములను రచించినటుల సీతారామ విహార కావ్య సర్గాంత పుష్పికలవలన తెలియుచున్నది సంగతిలహరి, కైయట వివరణముల రచించినటులను తెలియుచున్నది సీతారామ విహారమొక్కటే లభ్యమగుచున్నది ఈ మహాకావ్యమున రాముని జన్మ మొదలుకొని యౌవరాజ్యాభిషేకమువరకు గల కథ 716 శ్లోకములతో 12 సర్గలందు క్రమంగా అయోధ్యా, వర్షఋతువు, శరదృతువు, శాంతాఋష్యశృంగుల వివాహము, వారాణసీ, బిందు మాధవ సాక్షాత్కారము, విశ్వామిత్ర యాగసంరక్షణము, సీతాబాల్యము, సీతా కళ్యాణము, సీతారాముల ఉద్యాన విహారములు, పుష్పావచయము, శ్రీరామ యౌవరాజ్యాభిషేకము వర్ణింపబడినది

**శ్రీకృష్ణభట్టు :** (క్రీ॥ శ॥ 1680-1760) గౌతమ సగోత్రుడు, వెలనాటి తెలుగు బ్రాహ్మణుడు, లక్ష్మణభట్టు తనయుడు, కవి కళానిధి, రామ రసాచార్య బిరుదాంకితుడు జయపుర రాజగు సవాయీ జయసింహరాజు (క్రీ॥శ॥ 1688-1744) జయసింహుని తనయుడగు ఈశ్వరసింహరాజు (క్రీ॥శ॥ 1710-1751) ల ఆస్థానకవియైన శ్రీకృష్ణభట్టు దుర్గాభక్తితరంగిణీ, శిఖరిణీ ఛందో

బద్ధమైన సుందరీ స్తవరాజము, శ్రీరాముని రాసక్రీడను ప్రబోధిస్తూ, జయదేవుని గీత గోవిందాన్ననుకరిస్తూ రామగీతమును, ముక్తకములైన శ్లోకముల సంగ్రహ రూపమైన పద్యముక్తావళిని రచించినాడు తన కాశ్రయదాతలైన జయపుర ప్రభువుల చరితములను బోధిస్తూ ఈశ్వరవిలాస ఐతిహాసిక కావ్యమును కూడా రచించినాడు.

**హరిదత్తసూరి :** (క్రీ॥ శ॥ 1700) రామకథ, నలకథలను బోధిస్తూ రామపనైషధీయ ద్వ్యాశ్రయ కావ్యాన్ని రచించినాడు నివృత్తి శేషాచలపతి (17వ శతాబ్ది) రామకథ, శాహజీరాజ చరిత్రను బోధిస్తూ 'కోసలకోసలీయ' ద్వ్యాశ్రయ కావ్యాన్ని రచించినాడు.

**మాధకకవి :** కర్ణాటక, దారిగ్రామవాస, కవిచక్రవర్తి లక్ష్మణ పండితుని తనయుడగు మాధవకవి (క్రీ॥శ॥ 1700) దానలీలా లఘుకావ్యమును రచించినాడు గోపికలు శ్రీకృష్ణునకు వెన్ననొసంగుట ఇందు వర్ణితము గోపికల శృంగార లీలలు మధురంగా వర్ణింపబడినవి. ప్రపంచములోని సృష్టికి సారము రాధ యను వర్ణించిన ఈ శ్లోకాన్ని చూస్తాము

ధన్యేయం ధరణీ తతోఽపి మధురా తత్రాపి బృందావనం
తత్రాపి వ్రజవాసినీ యువతయ స్తత్రాపి గోపాంగనాః।
తత్రాచింత్య గుణైక ధామ పరమానందాత్మికా రాధికా
లావణ్యాంబునిధి స్త్రిలోక రమణీ చూడామణిః కాచన॥

**నారాయణతీర్థులు :** ఆంధ్రప్రదేశ్, గోదావరీజిల్లా అమలాపుర గ్రామమున జన్మించిన శివరామానంద తీర్థ శిష్యుడైన, నారాయణతీర్థులు (క్రీ॥శ॥ 1700) కృష్ణలీలా తరంగిణిని రచించినాడు గేయములు, శ్లోకములు కల్గిన ఈ గీతికావ్యము ప్రసాద గుణయుక్తమైన సరస, సరళ, మంజులమైన శైలిలో రచింపబడినది. ఇందు 12 తరంగములు కలవు. తరంగానుసారికథను పరిశీలింతము. శ్రీకృష్ణజననము, శ్రీకృష్ణబాల్యలీలలు, వత్సపాలనము, గోపాలనము, గోపీవస్త్రాపహరణము, గోవర్ధనోద్ధరణము, గోపీకృష్ణ సమాగమము, రాసక్రీడా, అక్రూరాగమనము, కంసవధ, ద్వారకాప్రవేశము, రుక్మిణీ కళ్యాణము ఈ భక్తి కావ్యముపై ద్వైతపరమైన, విశిష్టాద్వైతపరమైన

ఒక్కొక్క వ్యాఖ్యానము ముద్రించబడినది కాని అద్వైతపరమైన వ్యాఖ్యానములు అనేకములు కలవు కవి అభిప్రాయము కూడా అద్వైతమే. శ్రీకృష్ణుని వెదకుతూన్న గోపికల వర్ణించు పద్యమిది

కదాచిద్ గోవిందే గతవతి పరమానంద సదనం
నిరాకారం ధామ స్వకమితిచ విజ్ఞాపయతితా॥
తదాకారం సాక్షాత్పర వధిగతాః కృష్ణరసికాః
పునస్తం గాయంత్యో రహసి మృగయంతి ప్రియతమం॥

హరిభక్తి సుధార్ణవమీతని ఇంకొక కృతి ఇంకొక కృష్ణలీలాతరంగిణిని బెల్లంకొండ రామరాయకవి రచించినాడు ఈతడు ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాలోని పమిడిపాడు అగ్రహారమున, మోహన నారాయణ హనుమాయమ్మ దంపతులకు క్రీ॥శ॥ 1875 న తనయుడిగా జన్మించినాడు. శంకరాచార్యులవలె చిన్నవయసులోనే క్రీ॥శ॥ 1914 న ముక్తినొందినాడు మొత్తం 143 కృతులను రచించినాడు ఇందులో వేదాంత గ్రంథములే ఎక్కువ సముద్రమథనము, రుక్మిణీ పరిణయము, రామాపరిణయము చంపూకావ్యములు గరుడసందేశము, కృష్ణలీలా తరంగిణి, సమస్యా రత్నాకరము, సమనో మనోరంజనము. హయగ్రీవ శతకము, రామవల్లభరాయ శతకము, కవిభూషణమీతని ఖండకావ్యములు

**గంగాధరశాస్త్రి మంగరుల్కర్** : మహారాష్ట్ర విదర్భమున జన్మించినాడు రఘూజీభోంస్లే ప్రభువునకు పురాణ పండితునిగానున్నాడు. ఈకవి భామావిలాసము, రామప్రయోగము, అపరాధమార్జనము రాధావినోదము, గణేశలీల, విలాసగుచ్ఛము, రతికుతూహలము, ప్రసన్నమాధవము, చిత్రమంజూష గంగాష్టపది, సంగీతరాఘవములను రచించినాడు.

**వేంకటాచార్య** : శ్రీమత్తిరుమల బుక్కపట్ట మహావంశాబ్ధి రాకాసుధాకరుడు, తర్కాలంకార వాగీశుడు, అన్నయార్య దీక్షిత తనయుడు, శ్రీనివాసాచార్య శిష్యుడు నైజాం రాజ్యమందలి శూరవరగ్రామవాసి, నిజాం సామంత ప్రభువు యొక్క ఆస్థాన కవి అయిన వేంకటాచార్యులు (క్రీ॥ శ॥ 1778) అచలాత్మజాపరిణయమును ద్వ్యర్థి కావ్యమును రచించినాడు. 100 అర్థాలంకారములను, 6 శబ్దాలంకారములను వివరిస్తూ అలంకార కౌస్తుభమును రచించినాడు. రత్నఖేట శ్రీనివాస దీక్షితులు (క్రీ॥ శ॥ 1530-1600)

చంపూ పద్ధతిన భైష్మీపరిణయమను ప్రౌఢశ్లేష కావ్యమును రచించినాడని చంపూ ప్రకరణంలో వివరించబడినది. అలాంటి భైష్మీ పరిణయ ప్రౌఢ శ్లేష చంపూ కావ్యము వేంకటాచార్యుల చేతను రచింపబడినది.

భ్రమరహితా సాకచపత్స్త్రీణాం కుచవచ్చసరసహితా ।
లసదక్షర పీయూషాఽదరవత్కవితామహత్మనాఽజీయాత్ ॥ ఇత్యాది శ్లోకములు రెంటిలోను లక్ష్యములగుచున్నవి.

**రామచంద్రకవి :** పురుషోత్తముని పౌత్రుడు, జనార్దనుని పుత్రుడు ఆంధ్రదేశీయుడైన శంకరపురీ రామచంద్ర కవి (క్రీ॥ శ॥ 1800) రాధా వినోదమను శ్లేషయమకచిత్ర కావ్యమును రచించినాడు. కావ్యము నారికేళ పాకానికంటే కఠినమైన శైలిలో వ్రాసినాడు కావున, స్వయంగా వ్యాఖ్యానాన్ని కూడా వ్రాసినాడు ఉదాహరణ కొక శ్లోకము.

మాలీనోద్యతమాలీ మాలినో బలమాలీ ।
మాలీనో వనమాలీ మాలీనోఽవతుమాలీ ॥

**శంభు కాళిదాసు :** రామాయణాధారంగా,సరసంగా నాలుసర్గలు కల్గిన రామచంద్ర కావ్యమును రచించినాడు. గ్రంథాదిన శ్రీరాముని స్తుతించు శ్లోకమిది

సానందం పరిపూరితాఖిలజగత్కామాయ నీలోత్పల -
శ్యామాయ ప్రథవే ప్రకీర్తితగుణగ్రామాయ రామాయణే ।
ఆ రామాయ సతాం మనోమధులిహాం కామాభిరామాయచ
ప్రోద్దామాయ పరాక్రమైరనుదినం రామాయ తస్మై నమః ॥

**శిష్టుకృష్ణమూర్తిశాస్త్రి :** (క్రీ॥ శ॥ 1790-1870) గోదావరిమండల కాకినాడ సమీపవర్తి గొల్లపాలెంలో గౌరాంబా సర్వశాస్త్రి దంపతులకు జన్మించినాడు. శబ్దశాస్త్ర పారీణుడు, తార్కాలంకార మీమాంసా నిష్ణాతుడు. అశుచిత్రబంధ - శ్లేష - యమక కవితాఖ్యాతుడు. కంకణబంధము, యక్షోల్లాసము, వల్లీపల్లవోల్లాసము, సీలశైలనాథీయ మీతని రచనలు. శ్రీరామకథను బోధించు కంకణబంధము, విద్యున్మాలావృత్తమున రచింపబడినదై 64 అర్థములను బోధించుచున్నది.

నేతా దేవాలీవామాళా ధానా పేనా నేకాలీకీ
మాస్థానా బాఖ్యాయోగీశం హేయాదేతం రామేరాణా

ఈ శ్లోకమును క్రమముగా ఒక్కొక్క అక్షరమును వదిలిపెట్టి మీదినుండి క్రిందికి, క్రిందినుండి మీదికి, చదివిన చో ఈ నాల్గు పాదములు 64 శ్లోకములుగా మారును. ఈ కంకణబంధ శ్లోకమునకు కవియే స్వయంగా వ్యాఖ్యానము వ్రాసినాడు 64 శ్లోకార్థములలో మొదటి 12 బాలకాండ కథను, 13 అయోధ్యాకాండకథను, 6 అరణ్యకాండ కథను, 11 కిష్కింధాకాండ కథను, 10 సుందరకాండ కథను, 12 యుద్ధకాండ కథను బోధించునని కవి పేర్కొన్నాడు. కాళిదాసు మేఘసందేశముయొక్క ఉత్తరకథ యక్షోల్లాసమున వర్ణింపబడినది. ఇందు మేఘుడు దౌత్యమునెరపి యక్షునకు సంతోషాన్ని కలిగిస్తాడు ఈ కావ్యమే శాస్త్రిగారికి అభినవ కాళిదాస బిరుదును ప్రసాదింపజేసినది. 'సవిద్వత్కోటీరో భువి జయతి కృష్ణాభిధ బుధః.

**రామచంద్రశాస్త్రి** : (క్రీ॥శ॥ 1816) శిష్ట కృష్ణమూర్తిశాస్త్రి గారి శిష్యుడు, గోదావరీమండల అమలాపుర సమీపస్థమైన నడవపల్లి గ్రామవాసులైన సుబ్బమాంబా లక్ష్మణశాస్త్రుల తనయుడు, బందరులోని నోబుల్ కళాశాలావిశ్రాంత సంస్కృతాధ్యాపకుడు గురువుగారి యక్షోల్లాసాన్ని అనుసరిస్తూ, అనుకరిస్తూ మేఘసందేశముయొక్క ఉత్తరకథను వర్ణించు ఘనవృత్తమును రచించినాడు ఇందలి మొదటి శ్లోకమిది.

'ఇత్యుక్తోఽసౌ నవది జలదస్తేన దీనాత్మనాలం
కృత్వా కామం సరసహృదయ ప్రాగజీత్వా త్రపహృష్టః।
లోకే దీనావన మనుపమం పుణ్య మాదత్త ఏవం
సంతః ప్రోచు స్తదిహ హి మయా శోషణీయ స్సఖా మే॥

పరదేవతా గుణగణముల వర్ణిస్తూ దేవీ విజయ ప్రబంధమును, రామాయణ కథాశ్రితమైన రామచంద్ర విజయమును, శివమత ప్రతిపాదకమైన మృత్యుంజయ విజయము మొదలగు 26 కృతులను రచించినాడు.

**రామవర్మ, స్వాతితిరునాళ్** : (క్రీ॥ శ॥ 1813.1846) కేరళ ట్రావంకోర్ మహారాజా శ్రీమద్భాగవతమునుండి కుచేలుని, అజామిళుని కథలను తీసుకొని కుచేలోపాఖ్యానమ్, అజామిళోపాఖ్యానమ్ అను రెండు ఖండ

కావ్యముల రచించినాడు. స్యానందూర పురవర్ణన ప్రబంధమను చంపూ కావ్యము కూడా ఈతనిచే రచింపబడినది ఇందు తిరువనంతపుర పద్మనాభస్వామి చరిత్ర వర్ణించబడినది.

**శ్రీనివాసకవి :** వాజసనేయ శాఖీయుడు, లక్ష్మీ వేంకటబుధుల తనయుడగు శ్రీనివాసకవి శ్రీకృష్ణుని రాసక్రీడను వర్ణిస్తూ 8 సర్గలు కల్గిన సుమనోరంజన కావ్యాన్ని వ్రాసినాడు సుందరమైన కవిత్వము ఉదాహరణకి శ్లోకము- కాచన సుమనోహారం నిదధే సుమనోహారం హరేః కంఠే।
తస్యై సంతుష్టోఽయం హృత్స్థం నవరత్నహార మేవ దదౌ॥

**పాయ్యూర్ పరమేశ్వరభట్టు :** శ్రీకృష్ణుని చరితమును 254 శ్లోకములతో వర్ణిస్తూ హరిచరితమును రచించినాడు

**రామఘోషి :** (18వ శతాబ్ది)లావణియను దేశ ఛందస్సునుపయోగిస్తూ సంగీతాత్మకంగా, మధుర కాంత పదావళులతో, నాయికానాయకుల రిరంసను లావణీ గీతములద్వారా రచించినాడు ఉదాహరణికి లావణి-
తరుణీ తవేయం కుచతటమతి గురుకులం మమహృది సాదరం మనో మేతవతి మనోభవదరం-అధర మధుర మదురస రసికం మాముజ్జీవయ తావకం.
ప్రియేమే శమయ విరహపావకం। ముంచతి మదనః స్వీకృతకదనోమయి విషమం సాయకం నివారయతం సఖి రతినాయకం। జహిజహిమానం
స్వామిమలై నివాసియగు భృంగిరాజు శాతవిలాసగీతమును రచించినాడు.

**దాసోపంత్ :** (క్రీ॥శ॥18వ శతాబ్ది)దత్తాత్రేయ మాహాత్మ్యమును దత్తాత్రేయ స్తోత్రములను రచించినాడు.ప్రజ్ఞాచక్షువైన గులాబ్ రావ్ మహరాజు ముక్తతత్వానుశాసనము, తత్త్వబోధాదులను రచించినాడు.

**మహామహోపాధ్యాయ కృష్ణశాస్త్రిధులే :**

(18వ శతాబ్ది) హరిహరీయమను శ్లేష స్తోత్రమును రచించినాడు. పాండిత్య స్ఫోరకమైనను లయానుసారియైన మధురమైన శైలిలో శివకేశవ స్తుతిపరములైన రెండు అర్థములు కల్గిన పదములతో కూడుకొన్నదిది. ఉదాహరణకొక శ్లోకము-

మంధాసం లింగమగ్నిం హృతపునరరణిం వేదికా వాతయోనిం
తుండై ర్మేషాజవాజి మనడుహిగతైః వంచలిః వంచతుండం
చిత్యం తస్మా వలిప్తం హాతపతు యజనస్థానరూపే శ్మశానే
వాష్టవ్యం తే కపాలాన్ ధరం శకల కృతాం స్త్వాంచ జానేఽగ్నిమేవ॥

**వాసుదేవానందుడు** : (18వ శతాబ్ది) దత్తాత్రేయ మహిమను బోధించు శ్రీగురుచరిత్ర త్రిశతిని, శ్రీకృష్ణ స్తుతిపరమైన శ్రీకృష్ణలహరిని రచించినాడు. ఈతనిచే శ్రీ దత్తచంపువు, టీకా యుక్తంగా దత్తపురాణమును రచింపబడినవి మరాఠీ భాషనుండి సంస్కృతంలోకి 2000 శ్లోకాలతో గురిచరిత్రము కూడా అనువదింపబడినది ఈ 18వ శతాబ్దినందే వాగ్గేయకార త్రియమ్, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామాశాస్త్రి తెలుగు కీర్తనలతో పాటు సంస్కృత కీర్తనలను కూడా వ్రాసినారు.

**మండపాక పార్వతీశ్వరశాస్త్రి**: (క్రీ॥శ॥ 1833-1897) బొబ్బిలి సంస్థాన ఆస్థానకవి చిత్ర అశుకవిత్వంలో ప్రవేశమున్నవాడు. గుణశ్లోకాది చిత్రరచన, కవితావినోదకోశం, కాశీశ్వరశతకం, మంగళాష్టక చతుష్టయి, శ్రీ వేంకటగిరి ప్రభుద్వ్యర్థి శ్లోక కదంబమీతని లఘు కావ్యములు.

**భాస్కరుడు** : శివమోహినీ విలాసమను పేరుతో 12 సర్గలు కల లఘుకావ్యాన్ని వ్రాసినాడు విష్ణువు అవతారమైన జగన్మోహినితో శివుని ప్రేమలీలలు వర్ణింపబడినవి జయదేవునివలె శివమోహినుల ప్రేమలీలలను అష్టపదుల్లో రచించినాడు

**కేరళ వర్మావలియ కోయి తంపూరన్** :

(క్రీ॥శ॥ 1845-1914) కేరళవాసి అయిన ఈ కవి ట్రావంకోర్ మహారాజు శ్రీ మూలం తిరుణాల్ రామవర్మను ప్రశంసిస్తూ పదిపద్మ శతకమును రచించినాడు. శ్రీ విశాఖవిజయ కావ్యమను చారిత్రక కావ్యమును, కంసవధ చంపూకావ్యమును కూడా వ్రాసినాడు.

**పంత విఠలకవి** : (క్రీ॥శ॥1853) మహారాష్ట్ర కరహాటక క్షేత్ర నివాసి, గీతామహాదేవుల తనయుడు, 552 ముక్తక శ్లోకాలతో సుశ్లోకలాఘవమను శ్లేషకావ్యాన్ని రచించినాడు సుశ్లోకాలు రచించడంలో కవికి ఉన్న లాఘవాన్ని లేదా మంచి శ్లోకాన్ని చదవగా కలిగిన ఆనందంచేత గుండె తేలికవడుతుంది కాబట్టి ఈ పేరు అయితే దీనికి 'రలయోరభేదః' అను న్యాయాన్ననుసరించి సుశ్లోక రాఘవమనియు చెప్పవచ్చును. ఇందలి 60 శాతం శ్లోకాల్లో

రామునిగూర్చి వేదాంతపరంగా చెప్పడం జరిగింది కూడా. నరసింహస్వామి శ్రీకృష్ణుడు, శివుడు మొదలగు దేవతలు కూడా స్తుతింపబడినారు. ఒకవైపు శ్రీరాముణ్ణి స్తుతిస్తూ శ్లేషతో శృంగార, వేదాంత, వ్యాకరణ, ఆయుర్వేద, ఖగోళ, శకునశాస్త్ర, భాగవత పురాణాదులకు సంబంధించిన విషయాలెన్నో సరళంగా వివరింపబడినాయి. ఇందులో నవవిధ భక్తులు, అరిషడ్వర్గాలు, శమాది షడ్గుణాలు, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు సందర్భోచితమైన ఉదాహరణలతో నిరూపించబడినవి. సరళమైన కవితకొక ఉదాహరణమిది.

యో రామభజనే సక్తః స రామాం దూరత స్త్యజేత్।
రామారతి ర్యతోవ క్తి భ క్త్యభావం రఘూ త్తమే॥

## పరవస్తు వేంకట రంగనాథాచార్యులు :

(క్రీ॥శ॥ 1822 1900) విక్టోరియా రాణినుండి మహామహోపాధ్యాయ బిరుదును పొందినవారలు, శ్రీనివాస గురుపుత్రులు, బహుభాషా పరిశీలకులు విశాఖపట్టణం ఆర్షపుస్తకాలయ సంస్థాపకులు, ముద్రితాముద్రిత బహుగ్రంథ సంగ్రాహకులు, సంరక్షకులునైన ఆచార్యులుగారు శబ్దార్థ తత్త్వమును తెలుసుకొనువారల కత్యంతోపయోగియైన లఘుశబ్దార్థ సర్వస్వమను కోశగ్రంథమును (ENCYCLOPAEDIA) రచించినారు 1 ఆచార్యులవారు వేదాంత శాస్త్రమున, వ్యాకరణమున చిన్న చిన్న గ్రంథములను రచించడమేకాకుండ, కుంభకర్ణ విజయమను కావ్యమును, ఏడు అంకములు కల్గిన మంజులనైషధ నాటకమును, అనర్ఘ్య రాఘవముపై నైషధముపైనను (అసంపూర్ణంగా) వ్యాఖ్యానములనుకూడా రచించినారు.

---

1. 150 సంవత్సరముల క్రింద వ్రాయబడిన ఈ కాగితపు వ్రత గ్రంథమునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఓరియంటల్ మ్యాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ మరియు రీసెర్చి సెంటర్, హైదరాబాద్ వారలు శుద్ధప్రతిని తయారుచేస్తున్నారు కాని చాలా ఆలస్యంగా చేస్తున్నారు. ఇప్పటికే ఈ కాగితపు వ్రతగ్రంథము ముట్టుకుంటే చినిగిపోయేటట్లుగావుంది. ఇంకా కొన్ని సంవత్సరములుకనుక ఇలాగే వదిలివేస్తే అటు ఓరియంటల్ మ్యాన్యుస్క్రిప్ట్‌వారలు, ఇటు యావద్భారత సంస్కృత పండితులు బాధపడాల్సి ఉంటుంది. ఆచార్యులవారు నిద్రా ఆహారాదులు మానుకొని, రాత్రింబగళ్ళు తపస్సులాగా ముద్రితాముద్రిత గ్రంథముల పరిశీలించి, తయారుచేసిన తపోఫలితరూపమైన లఘుశబ్దార్థ సర్వస్వాన్ని మనము కోల్పోవలసి వస్తుంది.

## ముడుంబై వేంకటనరసింహాచార్యులు :

(క్రీ॥శ॥ 18[illegible]2-1020) విజయనగరవాసి, రంగమాంబా వీరరాఘవాచార్యుల పుత్రుడు. విజయనగరరాజుల ఆస్థాన విద్వత్కవి, శతాధిక గ్రంథకర్త వరవస్తు వేంకట రంగనాథాచార్యుల ప్రతిస్పర్ధి. ఇతడు వరవస్తు కవిని శ్రీరంగంతోను, తనను సింహాచలంతోను పోలుస్తూ శ్రీరంగ సింహాచల వర్ణన మిషచేత తన గొప్పతనమును ప్రకటిస్తూ రచించిన చాటు శ్లోకమిది. "రంగేంద్ర సింహశైలేంద్రౌ న సజాతీయ వైభవౌ, ప్రాకారోన్నతి రేకత్ర చాన్యత్ర స్వచ లోన్నతిః॥ [illegible] నీతిరహస్యము, కావ్యాలంకార సంగ్రహము, ఉజ్వలానందము, రామచంద్ర కథామృతము మొదలగున వీతని రచనలు.

**నారాయణశాస్త్రి :** (క్రీ॥శ॥ 1860-1911) భట్టశ్రీ బాల సరస్వతీ బిరుదాంకితుడు, తంజావూర్ మండలములందలి నడుకావేరి గ్రామవాసి. బ్రహ్మవిద్యాప్రతిష్ఠా సంస్థాపకులైన శ్రీనివాసశాస్త్రి అనుజుడైన నారాయణశాస్త్రి సుందర విజయము, గౌరీవిలాసము, చింతామణి, జగద్గురు శంకరాచార్య జీవితము మొదలగు కావ్యములను రచించినాడు

## హొసదుర్గం కృష్ణమాచార్యులు :

(క్రీ॥శ॥ 1[illegible]50-1883) జటప్రోలు సంస్థానమున విద్వత్కవిగా నున్నవాడై సురభి వేంకట జగన్నాథరాయల కోరికచే లక్ష్మీనృసింహ విలాస చంపువును మదనగోపాల మాహాత్మ్యమును రచించినాడు. చంపువునందలి అవతారికయందు నిరూపించిన జటప్రోలు రాజావళి జటప్రోలు రాజచరితమును తెలుసుకొనుటకు సాహాయ్యకారి కాగలదు.

**హేమచంద్రరాయ్ :** (క్రీ॥శ॥1850-19[illegible]0)సత్యభామ వివాహమును వర్ణిస్తూ 'సత్యభామా పరిగ్రహము', సత్యభామయొక్క పతి దానవ్రతాన్ని వర్ణిస్తూ 'పతి దానవ్రతము' అను రెండు ఖండకావ్యములను రచించినాడు. 12 సర్గలతో మహాభారత కురుక్షేత్ర సంగ్రామమునందలి ప్రధాన ఘట్టములను వర్ణిస్తూ 'పాండవ విజయము', 12 సర్గలతో రుక్మిణీహరణము అను రెండు మహాకావ్యములను కూడా రచించినాడు.

**టి.యస్. సుందరేశశర్మ :** (క్రీ॥శ॥ 1890) శ్రీరామ ప్రసాద స్తవము - మనోరథశ్రేణి-ఆర్యావందాళిక, [illegible] చరితములను, కవితం

సంగ్రహాత్మకమైన కావ్యక్షద్గంభకమును, కవితల సంగ్రహాత్మకమైన రామామృత తరంగిణిని రచించినాడు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడైన త్యాగరాజుయొక్క చరిత్రను 15 సర్గలతో వర్ణిస్తూ శ్రీ త్యాగరాజ చరిత్ర కావ్యమును కూడా వ్రాసినాడు.

**రవీంద్రనాథ్ ఠాగూర్ :** (క్రీ॥శ॥ 1861-1941) యొక్క గీతాంజలిని చాలామంది సంస్కృత పండితులు శ్లోకానువాదములుచేసారు. వీరిలో ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు, అమరేంద్ర మోహన భట్టాచార్య తర్కతీర్థులు ప్రసిద్ధులు

**కె. యస్. కృష్ణమూర్తిశాస్త్రి :** ప్రకృతియొక్క రామణీయకతను వర్ణిస్తూ ప్రకృతి విలాసమును రచించినాడు డుంగర్‌పూర్ (రాజస్థాన్) మహారాజుయొక్క రాజ్యపాలన రజతోత్సవాన్ని వర్ణిస్తూ భారత సుప్రభాత చంపువును, సావిత్రీ సత్యవంతుల కథను 11 సర్గలతో వర్ణిస్తూ సతీచరితమను మహాకావ్యమును కూడా వ్రాసినాడు.

**ఎ. ఆర్. రాజరాజవర్మ :** (క్రీ॥ శ॥ 1863-1918) రాధామాధవమను నామాంతరము కలిగిన విటవిభావరిని రచించినాడు. విక్టోరియా రాణి వజ్రోత్సవ సందర్భమున, కాళిదాసు రఘువంశాన్ని అనుకరిస్తూ, భారత దేశంలోని బ్రిటిషు ప్రభుత్వాన్ని వర్ణిస్తూ ఆంగ్ల సామ్రాజ్యమను మహాకావ్యమును కూడా రచించినాడు.

**ఆదిభట్ల నారాయణదాసు :** (క్రీ॥ శ॥ 1864-1945) హరికథా పితామహుడని ఖ్యాతినొందిన ఈ కవి 'శ్రీకృష్ణ కథామృత'మను పేర సంస్కృత హరికథను, ఐదు సర్గలు కలిగిన తారకమనే కృతిలో పాణిని సూత్రాలకు లక్ష్యోదాహరణ శ్లోకాలను రచించినాడు. ఉమర్‌ఖయ్యాం రుబాయీలను సంస్కృతంలోకి అనువదించినాడు. యం రాజగోపాలన్ కూడా ఉమర్ ఖయ్యాం రుబాయీలను సంస్కృతంలో అనువదించినాడు.

**సిద్ధాంత వాగీశ హరిదాస భట్టాచార్య :**
(క్రీ॥శ॥ 1876) బెంగాల్ నివాసియైన ఈ కవి ధనము, విద్య ఈ రెంటి వివాదమును రమ్యంగా వర్ణిస్తూ రెండు సర్గలు కలిగిన విద్యావిత్తవినోదమును,

వియోగమునందలి బాధను కరుణరస భరితంగా రెండు సర్గలు కలిగిన వియోగ వైభవమును రచించినారు. శ్రీమద్భాగవత రుక్మిణీ కళ్యాణ కథ నాధారముగా గొని, 15 సర్గలతో రుక్మిణీహరణ మహాకావ్యాన్ని కూడా రచించినారు.

**అరవింద ఘోష్** : (క్రీ॥శ॥ 1872-1950) మూడు ఆంగ్ల కవితలను (Who, In the Moonlight A Constant Prayer) సంస్కృతంలోకి అనువదించి కవితాంజలిని వ్రాసినారు

**పరీక్షిత్ రాజవర్మ** : (క్రీ॥శ॥ 1876-1964) కేరళ, కొచ్చిన్ మహారాజు, సూక్తాచరిత సంగ్రహము, అంబరీష చరితము, రాధామాధవము అను మూడు ఖండకావ్యముల ప్రబంధ త్రయమను పేర రచించినారు.

ఇంకా కొన్ని లఘుకావ్యములు క్రింద పేర్కొనబడుచున్నది.

| | | |
|---|---|---|
| అప్పయామాత్యులు | దశకుమార కథాసారము | శ్లోకాలలో దశకుమారకథ |
| భానుదత్తమిశ్ర | రసపరిజాతము | 12 వల్లవాలలో శ్లోకాల సంగ్రహము |
| వరవూర్ కృష్ణమీనన్ | గీతకాదంబరి | శ్లోకాలల్లో కాదంబరీకథ |
| సి వెంకటరమణ | కావ్యసముదాయః | హరిశ్చంద్రము భానాభానేదిష్టము, విశ్వామిత్రోదంతము, ఉమాదర్శము. |

## 19వ శతాబ్ది

| | | |
|---|---|---|
| కపాలిశాస్త్రి (1880-1930) | | వాశిష్టవైభవము, భారతీ స్తవః |
| అప్పాశాస్త్రి 1873-1913 | లావణ్యమయీ | బంకించంద్రచటర్జీ కావ్యానికి అనువాదం |
| ఎన్ కుమారన్ ఆశన్ 1873-1924 | సీతా విచారలహరి | మలయాళ కావ్యానువాదము |
| సి కుంజన్‌రాజ 1895- 963 | భారత ప్రశస్తి | స్వాతంత్ర్యప్రకటనసందర్భము |
| ఎ ఎం. శ్రీనివాసకవి | ఉపాఖ్యానమాల | సంగ్రహపురాణేతిహాసకథలు |
| భట్ట మదురానాథశాస్త్రి | సాహిత్య వైభవము | సంస్కృతమహత్వము |

## 20వ శతాబ్ది

| | | |
|---|---|---|
| దీన కృష్ణదాసు | ప్రస్తావసింధు | నైతిక నియమ్మప్రబోధకము |

| | | |
|---|---|---|
| బహద్దూర్ చంద్రద్వారా | స్వతంత్ర జనపదకోశా | నెదర్లాండ్స్ దేశవర్ణనము |
| | సువర్ణబిందు | Cowpers కవితకనువాదము |
| సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి | త్రివేణీ త్రికం భర్తృదానం, పూర్ణపాత్రం వివేకానందం, రామదాసం, కచదేవయానీయం, సంయుక్తా స్వయంవరం, నందచరితం ఆ౦ | భాగవతానువాదము |
| గంకెపాటి లక్ష్మీకాంతయ్య | హరస్తుతి | |
| వి రామన్ | దేవబందీవరదరాజః, గోవహంవన్నః, మహాపోమనునీతిచోరః | |
| గోపాలయ్యంగార్ | యదువృద్ధసౌహార్దం | ఎడ్వర్డ్ 7 ప్రేమకై రాజ్యత్యాగము |
| యస్ టి జి వరదాచార్య | సుషుప్తివృత్తం, సత్యవిజయము, ప్రాస్తావికకదంబః, నచేల్ వాల్మీకి రతవిష్యత్, నారసింహ-సుమతి. వేమన-దాశరథశతకానువాదములు | |
| జగన్నాథపాఠక్ | కాపిశాయనీ | శలభదీపశిఖం, ఇత్యాదులు |
| భోలానాథ్ | శ్రీకృష్ణలీలామృతం, కర్ణకుతూహలము | |
| సుబ్రహ్మణ్యఅయ్యర్ | పద్యపుష్పాంజలి | పద్యసంగ్రహము |
| విష్ణుహరి బాలచంద్రదేవ | దీపదానం | మహాదేవివర్మ దీపశిఖ కనువాదము |
| చంద్రధరశర్మ | శ్రద్ధావిజయము | శ్రద్ధా, తాత్త్వికవిచారములు |
| ఎస్ బి. వేలంకర్ | కాళిందీ | కాళిందీ వివాహము |
| శ్రీధర భాస్కరవార్ణేకర్ | వాఙ్మయీ కృష్ణమూర్తి ఇత్యాది 12ఖండకావ్యములు | |
| పుల్లెల శ్రీరామచంద్రుడు, | గీతాంజలి, లఘు కావ్యసంగ్రహము, స్తుతిమంజరి, రాగరోచి, | |
| ఓగేటి పరీక్షిత్‌శర్మ | అక్షయగీతరామాయణం, లలితగీతలహరి, యశోధర ప్రతాపరాణాయనం | |
| నళినీపాఠలే | నళినీమానసము | తులసీ బాలకాండకు అనువాదము |
| శ్రీభాష్యం విజయసారథి | మందాకినీ | భారతభారతీ ఇత్యాదులు |
| గౌరీభట్ల రామకృష్ణశాస్త్రి | యమకభారతము | 100 యమకాలల్లో భారతకథ |
| బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు | గోపురసందేశః | కవితాసంగ్రహము |

# నాటకములు

దృశ్యశ్రవ్యత్వభేదేన పునః కావ్యం ద్విధామతం ।
దృశ్యం తత్రాభినేయం తద్రూపారోపాత్తు రూపకం ॥

దృశ్య శ్రవ్య భేదముచే కావ్యములు రెండు విధములు. ఇంత వరకు శ్రవ్య కావ్యకర్తల గూర్చి తెలుసుకొన్నాము. ఇక పైన దృశ్య కావ్యకర్తల గురించి తెలుసుకొందాము అభినయాత్మకములైన రూపకములు, ఉపరూపకములు దృశ్యకావ్యములనబడును ఇవి ప్రేక్షకులచే దర్శించబడును - నటులు నాటకీయ పాత్రల స్వరూపాదులను తమపై ఆరోపించుకొందురు కావున రూపకము లని పేరు (తద్రూపారోపాత్తు రూపకం) ఈ రూపకములు నాటకము, ప్రకరణము, భాణము, వ్యాయోగము, సమవకారము, డిమము ఈహామృగము, అంకము, వీధి, ప్రహసములని పది విధములు

నాటక మథ ప్రకరణం భాణ వ్యాయోగ సమవకార డిమాః ।
ఈహామృగాంక వీథ్యః ప్రహసన మితి రూపకాణి దశ ॥ నాటకములందు కావ్యములకంటే ఎక్కువ ఆకర్షణ, భావాభివ్యక్తి, మనోరంజకత, విషయ వైవిధ్యముంటాయి కావున నాటకములు జనుల నాకర్షిస్తాయి, కావుననే 'కావ్యేషు నాటకం రమ్యం' అని పేర్కొనబడినది.

దుఃఖార్తానాం సుఖార్తానాం శోకార్తానాం తపస్వినాం ।
విశ్రాంతి జననం లోకే నాట్యమేతద్భవిష్యతి ॥ అనియు మానసిక వ్యథచే కుమిలిపోతూన్న వారిని, కాయిక బాధచే కృశించి పోతూన్న వారిని సైతము, కొంత కాలము ఈ ప్రాపంచిక దుఃఖముల మరపింపజేసి ఆనంద లోకాల్లో ఓలలాడింపజేయునది నాటకము - ఋగ్వేదమునుండి ఇతివృత్తము, సామవేదమునుండి గానము, యజుర్వేదమునుండి అభినయము, అధర్వ వేదము నుండి రసము గ్రహింపబడి, నిర్మింపబడిన నాటకము - సర్వవేదసారము.

జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్ సామభ్యో గీతిమేవచ ।
యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదపి ॥

నాటకోత్పత్తి విషయమున అనేక మతములు కలవు. Max Muller, Sylvan Levi, Von Schroeder, Herlal మొదలగు పాశ్చాత్య విద్వాంసులు మరియు భారతీయ విద్వాంసులందరును వేదములే నాటకోత్పత్తి కాధారములుగా

ము క్తకంఠముగా నుద్ఘోషించినారు. ఋగ్వేదంలోని ఇంద్ర - మరుత్సంవాదము, అగస్త్య - లోపాముద్రాసంవాదము, విశ్వామిత్ర - నదీ సంవాదము, వశిష్ఠ - సుదాస సంవాదము, యమా - యమీ సంవాదము, ఇంద్రాణీ - వృషాకపి సంవాదము, ఊర్వశీ - పురూరవ సంవాదము, సరమా - పణి సంవాదము మొదలగు సంవాద సూక్తములు అభినయముతో కూడుకొన్నవై నాటకారంభ దశను సూచిస్తున్నవి (2) ప్రొ. రిజవే (Ridgeway) మృతాత్మ శ్రాద్ధవాద మును పేర్కొన్నాడు. ప్రపంచము నందలి సంస్కృతు లన్నియు మృతాత్మల గూర్చి శ్రద్ధను ప్రకటించు ఆచారములను కలిగియున్నవి. మృతాత్మలను ప్రసన్నుల చేసుకొనుటకై అనేక విధములైన అభినయములు ఆచరణలో నున్నవి. ఇవే నాటక పూర్వ రూపములని ఆతని అభిప్రాయము. (3) వసంత పంచమి, హోళీ మొదలగు పండుగలు అభినయ ప్రధానములు. పూర్వకాల మందలి ఇంద్రధ్వజోత్సవము, ప్రాచ్యదేశములనందలి May - Pole పండుగ యును ఇందు కుదాహరణములు. ఇలాంటి పండుగలయందు ఒళ్ళు తెలియ కుండ మధువు సేవించి చిందులు తొక్కగా ఆ చిందులే నాటకాలుగా మారిన వని ఉత్సవవాదమును కొందరు పాశ్చాత్య విద్వాంసులు పేర్కొన్నారు. (4) డా. పిశేల్ (Pischel) తోలుబొమ్మలాటలే వికాసము నొంది నాటక ములుగా మారినవని పేర్కొన్నాడు. తోలుబొమ్మలను సూత్రముల (దారముల) పట్టుకొని ఆడించుటచే సూత్రధార పదమును దీనిని బలపరచుచున్నది. (5) ప్రొ. ల్యూడర్స్, స్టెన్‌కోనో మొదలగు వారలు ఛాయా నాటకములయందు ప్రయో గించబడు ఛాయాచిత్ర ప్రదర్శనమే నాటకోత్పత్తి కారణంగా భావించినారు, (6) ప్రొ. వేబర్ (Waber) మొదలగు పాశ్చాత్య విద్వాంసులు, 'యవనికా' (తెర) పదాన్నాధారంగా గొని, భారతీయ నాటకములు యూనానీ నాటకముల నుండావిర్భవించినవని పేర్కొన్నారు.

వస్తుతః నాటకమునకు అంగములు నాలుగు, (1) కథావస్తు. (2) సంగీ తము, (3) అభినయము, (4) రసము. ఈ నాల్గింటిలో ఋగ్వేదంలో సంవాద సూక్తాదులందు కథావస్తు పుష్కలంగా లభిస్తుంది. సామవేదము సంగీత మయము. యజుర్వేదము బోధించు కర్మకాండలయందు వాచికము, హస్తాది చాలనరూపమైన ఆంగికాభినయనమును ఉన్నవి - అథర్వవేదమునందు వశీకర ణము, మన్మథాస్త్రము మొదలగు శృంగారరసము, శత్రు నాశనము, సేనా నిరీ

క్షణము, శత్రుసేనా సంమోహనము, సేనా సంయోజనాది వీరరసమును ఉన్నవి. భారతీయ నాటకములలో శృంగారము లేదా వీరరసము ముఖ్యమై యుండును కావున అథర్వవేదము రస విషయమున ఆధారమైనది 'చతుర్వేదాంగ సంభవం' అను భరతుని వాక్యము ఈ విషయమునే బోధించుచున్నది - ఈ నాటకము లెప్పుడు ఆవిర్భవించినవను ప్రశ్నకు బదులుగా ఋగ్వేద సంవాద సూక్తములను పేర్కొనవచ్చును వీటియందు సంవాదములతో పాటు కొంత అభినయము కూడా ఉంది. భారతీయ నాటకములన్ని సుఖాంతములు కావున భూతాత్మ శ్రాద్ధవాదమును గ్రహించరాదు. ఊరుభంగాది నాటకములు దుఃఖాంతములుగా కనిపించినను, దుష్టనాశమున్నది కావున సుఖాంతములే. ఇక తోలుబొమ్మలాటల విషయానికొస్తే ఇవి నాటకముల వికృతులే కాని, ప్రకృతులు కావు. ఒకవైపు శిష్ట సమాజమున నాటకములుండగా, అశిక్షితులైన గ్రామ్య సమాజమున తోలు బొమ్మలాటలు ప్రదర్శించబడుచుండెడివి కావున ఇవి నాటక వికృతులే ఛాయా నాటక వాదము, పర్వవాదము వాదానికి నిలిచేవి కావు. ఇక గ్రీకువాదాన్ని పరిశీలిసాము

| భారతీయ నాటకములు | గ్రీకు నాటకములు |
| --- | --- |
| అన్ని సుఖాంతములే | దుఃఖాంతములునున్నవి |
| అన్వితిత్రయ (Unity of Time, Place, Plot) నియమ రహితములు | అన్వితిత్రయ (Unity of Time, Place,Plot) నియమ సహితములు |
| సహగానము (Chorus) ఉండదు | సహగానము (Chorus) ఉంటుంది |
| రూపక, ఉపరూపకాది భేదములున్నవి | రూపక, ఉపరూపక భేదములు లేవు |
| సంస్కృత ప్రాకృతభాషలుకలవి | ఏకభాషా రచితములు |
| కథాప్రవాహమున శీఘ్రత లేదు | కథాప్రవాహమున శీఘ్రతఉన్నది |
| విదూషకుడు హాస్యానికే పరిమితం కాకుండా, కథతో సంబంధం కలవాడు | Clown లేదా Fool (విదూషక తుల్యులు) కేవలం హాస్యానికే పరిమితులు |
| ఆకారమున చాలా పెద్దవైనవి | ఆకారమున చాలా చిన్నవైనవి |
| అనియతములైన, లౌకిక, దివ్య, అదివ్య, మిశ్రపాత్రలు కలవి | నియతములై, ఒకేతరగతికి చెందిన పాత్రలు కలవి |

| | |
|---|---|
| చుంబన, ఆలింగన, యుద్ధ, మృత్యు, భోజనాది అశ్లీల దృశ్యరహితములు | అశ్లీలములన్న వివేచనలేనివి |
| ఆదర్శములను, నైతిక నియమములను బోధించునవి | నైతిక నియమ ప్రబోధకములుకావు. |

ఏ విషయమునైనను ఈ రెంటికి సామ్యములు కనిపించవు కావున, గ్రీకు నాటకములు భారతీయ నాటకములకు ప్రకృతులనుట యుక్తంకాదు. కావున ఋగ్వేద సంవాదసూక్తములే నాటకములకు మాతృకలనుట సమంజసము. వైదిక కాలమున కాని రామాయణ, మహాభారత కాలమున కాని నాటకములు అంతగా వికాసాన్నొందలేదు కాని రామాయణ, భారతములలో నాటకపదము స్పష్టంగా పేర్కొనబడినది రామాయణమున నాటక, నట, నర్తక, రంగ మంచ, కుశీలవ శబ్దములు కనిపించుచున్నవి. భారత విరాటపర్వంలో 'రంగ శాలా' 'నట' శబ్దములు కనిపించుచున్నవి. హరివంశమున నాటకము ప్రదర్శించ బడినటుల పేర్కొనబడినది ధార్మికోత్సవ సందర్భములందు, జాతర సందర్భ ములందును రామకృష్ణాది లీలలు ఆడబడుచుండెడివి.

**పాణిని :** (క్రీ॥ పూ॥ 500) అష్టాధ్యాయినందు - పారాశర్య శిలాలిభ్యాం భిక్షు - నట సూత్రయోః' (4-3-120)అని నటసూత్ర లక్షణ గ్రంథ మును పేర్కొన్నాడు. లక్షణగ్రంథముల తరువాతనే లక్ష్యగ్రంథము లావిర్భ విస్తాయి కావున, పాణిని కాలమునాటికి నాటకములున్నటుల సిద్ధమగుచున్నది. మహాభాష్యకారుడైన పతంజలి కంసవధ, వాలివధ నాటకముల పేర్కొన్నాడు. ఛోటానాగపూర్ పర్వత ప్రాంతములలో క్రీ॥పూ॥ 2వ శతాబ్దికి చెందిన ప్రాచీన నాట్యశాల లభించినది.

**భాసుడు :** క్రీ॥ శ॥ 1919 వరకు మహాకవి కాళిదాసునే ఆది నాటకకర్తగా భావించేవారు. కాని క్రీ॥శ॥ 1913 న మహామహోపాధ్యాయ కావ్య కంఠ టి గణపతిశాస్త్రిగారు ట్రావంకోరు రాజ్యమున 13 నాటకములను కను గొన్నాడు. వీటిని భాసకర్తృకంగా పేర్కొన్నాడు. కాళిదాసు భాసుని పేర్కొని నందున భాసుడే ఆదినాటకకర్తగా అంగీకరించబడినాడు. ఈ 13 నాటకము లందు కవిపేరు లేదు కాని,ఏకకవి కర్తృకములనుటకు ఈ సామ్యములు కలవు.

సూత్రధార కృతారంభైః నాటకైః బహుభూమికైః॥
సపతాకైర్యశోలేభే భాసో దేవకులైరివ॥ అని బాణుడు పేర్కొన్న

అన్ని లక్షణములు కలిగియుండుట. (2) భాసే జ్వలనమిత్రే. అను వాక్పతి రాజు వచనానుసారము అగ్నిదాహముండుట (3) లింపతీవ తమోంగాని వర్షతీ వాంజనం నభః అని కావ్యాదర్శము నందుదాహరింపబడిన శ్లోకము ఈతని నాటకములలో లభించుట. (4) 'నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః' అని నాటకములన్ని నాందీతో ఆరంభింపబడగా, ఈ 13 నాటకములు సూత్రధార ప్రవేశముచే ఆరంభింపబడుట (5) ఐదు నాటకములయొక్క మొదటి శ్లోకములందు ముద్రాలంకారముండుట (6) నాటకము. నాటకకర్తల పరిచయముచే మిగతా నాటకములన్నియు ప్రరోచన కలిగియుండగా, వీటియందు ప్రరోచనము లేకుండుట. (7) మిగతా నాటకములందు భూమికకై ప్రస్తావనాశబ్దముండగా, వీటిలో స్థాపనాశబ్దము ప్రయోగించబడుట సంక్షిప్తంగా ఉండుట. (8) ఇమామపి జగత్కృత్స్నాం రాజసింహః ప్రశాస్తునః అను భరతవాక్యము కొద్ది మార్పులతో అన్నిటిలో నుండుట (9) కంచుకిపేరు బాదరాయణుడు, ప్రతీహారిపేరు విజయ అని నామైక్యముండుట (10) భాషా, శైలీసమానత్వము, పదముల శ్లోకముల పునరావర్తనము, ఉపమా - ఉత్ప్రేక్షాదుల సామ్యములుండుట. (11) కవికల్పనా సామ్యము ఉదాహరణకు - ఇద్దరు ప్రతిస్పర్ధులలో ఒకరిని సింహంతో మరొకరిని ఏనుగతో పోల్చుట. శక్తిమంతుని మందరపర్వంతో పోల్చుట, కోపమును అగ్నితో పోల్చుట. కార్తికేయుని పరాక్రమమును వర్ణించుట. (12) శపామి సత్యేన భయంనజానే, కిమేతద్భో భయంనామ భవతోऽద్య మయాశ్రుతం, అథవా సర్వమలంకారోభవతి సురూపాణాం ఇత్యాది విచారములు పునరావృతములగుట. (13) పద-భావాభివ్యక్తి సామ్యత - తెరకై యవనికాపదము, దుఃఖాభివ్యక్తికై - అహో అకరుణాః ఖలు ఈశ్వరాః' అనియు. (14) అన్నింటిలోను మృత్యుసమయమునందలి కరుణాపూర్ణ దృశ్యము సమానము 6 నాటకములలో మరణాసన్న వ్యక్తి 'అవస్తావత్' అని నీరును యాచించుట. (15) సువదనా, దండకము మొదలగు అప్రసిద్ధ ఛందస్సుల ప్రయోగము. (16) నాటకములు పరస్పర సంబంధములు కలిగియుండుట, ఉదా - ప్రతిజ్ఞాయౌగంధరాయణమునకు ఉత్తరభాగంగా స్వప్నవాసవదత్తము, అభిషేక నాటకమునకు ఉత్తరభాగంగా ప్రతిమ భాసించుట. (17) అపాణినీయ, ఆర్ష ప్రయోగములుండుట-ఉదా - ప్రచ్ఛధాతువు, పరస్మైపదమున ప్రయోగించబడుట. సమాసాంతమున రాజశబ్దము రాజన్ ప్రయోగించబడుట - కాశీరాజ్ఞః, సర్వరాజ్ఞః ఇత్యాదులు

(18) మాతృనామముతో పుత్రనామ నిర్దేశము - ఉదా - కౌసల్యమాతా (రామః) సుమిత్రమాతా (లక్ష్మణః). (19) అన్ని నాటకములందు రాజసింహుడు ఆశ్రయ దాతగా అభివర్ణింపబడుట.

పదమూడు నాటకములను ఏకధాటిగా వ్రాసి సంస్కృత భారతికి ప్రప్రథమంగా నాటక పారితోషక మందించినవాడు భాసకవి అర్వాచీన కవులు ఈ కవిని స్మరించనిదే నాటకము వ్రాయ కలము పట్టెడివారు కారు అనుటకు 'ప్రథితయశసాంభాస అను మహాకవి కాళిదాసు వాక్యమే ప్రమాణము. ఈతని నాటకములను (1) ఉదయన కథామూలకములు . ప్రతిజ్ఞా యౌగంధరాయణము, స్వప్న వాసవదత్తము (2) భారత మూలకములు - ఊరుభంగము, దూత వాక్యము, పంచరాత్రము, దూత ఘటోత్కచము, కర్ణభారము,మధ్యమ వ్యాయోగము, 3) భాగవత మూలకము - బాలచరితము 4) రామాయణ మూలకములు - ప్రతిమా, అభిషేకము, 5) కాల్పనికములు - అవిమారకము, చారుదత్తము, అని ఐదు విధములుగా విభజించవచ్చును.

**నాటకముల సంక్షిప్త పరిచయము :** 1) ప్రతిజ్ఞాయౌగంధరాయణము - ఇందు 4 అంకములున్నవి. వాసవదత్తా -ఉదయనుల ప్రేమ, వివాహములు వర్ణింపబడినవి ఉదయనుడు సచివాయత్త సిద్ధియైన ధీర లలిత నాయకుడు కాగా, ప్రధానమంత్రి యౌగంధరాయణుడే వాస్తవ నాయకుడిగా రాజకీయ నీతి విశారదుడిగా కనిపిస్తాడు 2) స్వప్నవాసవదత్తము - ఇందు 6 అంకములున్నవి. యౌగంధరాయణుడు 'వాసవదత్త అగ్ని దాహములో మరణించినది' అను వదంతిని వ్యాపింపచేసి ఉదయనునకు పద్మావతితో వివాహము చేయిస్తాడు ఈ వివాహము ద్వారా ప్రద్యోత రాజు యొక్క సహాయమును పొంది, శత్రువుల సంహరించి రాజ్యాన్ని రక్షిస్తాడు - సవతులకు సహజంగా కలుగు ఈర్ష్యను నివారించుటకై వాసవదత్తను పద్మావతి వద్ద న్యాసముగా ఉంచుతాడు. 3)ఊరు భంగము - ఏకాంకికనాటకం నిందు సభలో పాంచాలికి జరిగిన పరాభవానికి ప్రతీకారంగా భీముడు ప్రతిజ్ఞ చేసి, దుర్యోధనుని తొడలు విరగ్గొట్టుతాడు. 4) దూతవాక్యము - ఏకాంకికనాటిక. భారతయుద్ధాత్పూర్వము శ్రీకృష్ణుడు పాండవ రాయబారిగా, దుర్యోధనుని చేరి, సంధి గావింప ప్రయత్నించి విఫలుడౌతాడు. 5) పంచరాత్రము - ఇందు 3 అంకములున్నవి -

దుర్యోధనుని గురువగు ద్రోణాచార్యులు గురుదక్షిణగా అర్ధ రాజ్యము పాండవుల కిమ్మని అడుగుతాడు. అందుకు దుర్యోధనుడు ఐదురోజులలో పాండవులు దొరికి నట్లయితే అలాగే ఇస్తానని అంగీకరిస్తాడు. ద్రోణాచార్యులు అతి ప్రయత్నముచే పాండవులను పొంది అర్ధరాజ్యాన్నిప్పిస్తాడు 6) దూత ఘటోత్కచము - ఏకాంకికనాటిక - భారత యుద్ధమున అభిమన్యుడు వీరస్వర్గ మలంకరింపగా, శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని వద్దకు ఘటోత్కచుని దూతగా సంధికై పంపిస్తాడు. దుర్యోధనుడు ఘటోత్కచుని అవమానిస్తాడు 7) కర్ణభారము - ఏకాంకిక నాటిక - కర్ణుడు బ్రాహ్మణ వేషమున వచ్చి కవచకుండలములను యాచించిన ఇంద్రునకు దానమొసంగుతాడు 8) మధ్యమవ్యాయోగము - ఏకాంకిక వ్యాయోగము - పాండవమధ్యముడైన భీముడు బ్రాహ్మణుని యొక్క మధ్యమ పుత్రుని ఘటోత్కచునినుండి రక్షిస్తాడు - 9) బాలచరితము - ఇందు 5 అంకము లున్నవి. శ్రీకృష్ణుని జననమునుండి కంసవధ పర్యంత కథ వర్ణింపబడినది 10) ప్రతిమా - ఇందు 7 అం ములున్నవి. రామాయణ కథ సంక్షిప్తంగా వర్ణింపబడినది. శ్రీరామ యౌవరాజ్యాభిషేక నిరోధము, 14 సంవత్సరముల అరణ్యవాసము, దశరథుని ప్రతిమను చూసి భరతుడు తండ్రి యొక్క మరణ మును తెలుసుకొనుట, శ్రీరాముని సమీపమునకు భరతుడు వెళ్ళుట, పాదుకలతో మరలుట, సీతాహరణము, రావణవధము, శ్రీరామ పట్టాభిషేకము ఇందు రమ్యంగా వర్ణింపబడినవి. 11) అభిషేకము - ఇందు ఆరు అంకములున్నవి. రామాయణ కిష్కింధాకాండమునుండి యుద్ధకాండము వరకు గల కథ సంక్షేప ముగా వర్ణింపబడినది - రావణవధానంతరం శ్రీరామ పట్టాభిషేకము రమ్యంగా చిత్రింపబడినది, 12) అవిమారకము - ఇందు 6 అంకములున్నవి. అవిమారక రాజు కుంతిభోజుని కూతురగు కురంగిని ప్రేమించి పెళ్ళాడుతాడు. 13) చారు దత్తము - ఇందు 4 అంకములున్నవి. నిర్ధనుడైన, ఉదార బుద్ధి కల్గిన చారు దత్తుని వసంతసేనయను వేశ్య ప్రేమిస్తూంది. ఇందు భరత వాక్యము లేదు - కథ అసంపూర్ణంగానే ఉంది చారుదత్తునికై వసంతసేనా అభిసరణ ముతో నాటకము ముగుస్తూంది, బహుశః దీనిని వ్రాస్తూండగానే కవికీ దివి నుండి పిలుపు వచ్చియుండవచ్చును.

"ప్రథితయశసాంభాస సౌమిల్ల కవిపుత్రాదీనాం ప్రబంధానాతిక్రమ్య వర్త మానకవేః కాళిదాసస్య క్రియాయాం కథం పరిషదో బహుమానః" అని కాళి

దాసుచే ప్రశంసయశస్కుడనిగా భాసుడు పేర్కొనబడుటచే కనీసం 100 సంవత్సరముల వ్యవధి, భాస కాళిదాసుల మధ్య ఉండవచ్చును. కాళిదాసు క్రీ॥ పూ॥ ప్రథమ శతాబ్ది అన్నచో భాసుడు క్రీ॥ పూ॥ ద్వితీయ శతాబ్ది అయి ఉండవచ్చును. మరియుశూద్రకుని మృచ్ఛకటికము భాసుని చారుదత్తమునకు విస్తృత రూపము - భాసునిచే అసంపూర్ణంగా వదలిన చారుదత్త కథ శూద్రకునిచే పరిపూర్తి గావింపబడినది విన్సెంట్, స్మిథ్ పాశ్చాత్య విమర్శకుల ప్రకారము శూద్రకుడు క్రీ॥ పూ॥ 220 న సింహాసన మధిష్ఠించి క్రీ॥ పూ॥ 197 న మరణించినాడు మృచ్ఛకటికము క్రీ॥ పూ॥ 3 వ శతాబ్ది అయితే భాసుడు క్రీ॥పూ॥ 3 వ శతాబ్ది కంటే పూర్వుడని సిద్ధించుచున్నది. కౌటిల్యుడు తన అర్థశాస్త్రమునందు -

నవం శరావం సలిలైః సుపూర్ణం సుసంస్కృతందర్భకృతోత్తరీయం ।
తత్తస్యమాభూన్నరకంసగచ్ఛేత్ యోభర్తృపిండస్య కృతేనయుధ్యేత్ ॥

అను భాసుని ప్రతిజ్ఞాయౌగంధరాయణ శ్లోకమును "అపిహ శ్లోకౌభవతః" అని ఉద్ధరించినాడు - కౌటిల్యుడు మౌర్య చంద్రగుప్తుని మంత్రి. చంద్రగుప్తుడు క్రీ॥ పూ॥ 321న రాజ్యసింహాసన మధిష్ఠించినాడు. కౌటిల్యునికంటే కనీసం 50 సంవత్సరముల పూర్వుడని భాసుని భావిస్తే క్రీ॥ పూ॥ 370 వాడిగా భాసుని అంగీకరించవచ్చును స్వప్నవాసవదత్తమున 'బార్హస్పత్యమర్థశాస్త్రం' అని బృహస్పతి అర్థశాస్త్రమును పేర్కొన్నాడు - కౌటిల్యుడు కూడా అర్థశాస్త్ర గ్రంథారంభమున "ఓం నమః శుక్రబృహస్పతిభ్యాం" అని బృహస్పతిని అర్థశాస్త్రకారునిగా పేర్కొన్నాడు. కౌటిల్య అర్థశాస్త్రమును భాసుడు పేర్కొననందున భాసకవి కౌటిల్యునికంటే పూర్వవర్తియని సిద్ధించుచున్నది. ప్రతిజ్ఞా యౌగంధరాయణ, స్వప్నవాసవదత్త నాటకములలోని సంఘటనల వర్ణనలు భాసుని ఉదయనరాజు (క్రీ॥ పూ॥ 4?0) సమకాలీనునిగా తెలుపుచున్నవి, కావున భాసకవి క్రీ॥ పూ॥ 450 నుండి 310 మధ్య కాలవర్తిగా పేర్కొనవచ్చును.

భాసుడు నాటకములలో పతాకాస్థానము (నాటకీయ వ్యంగ్యము)లను రమ్యంగా శోభించినాడు. ఉదాహరణకు ప్రతిజ్ఞా - 2 వ అంకములో వాసవదత్త తల్లిదండ్రులు 'వాసవదత్తకు భర్తగా కాగల యోగ్యుడెవరు' అని అనుకొంటూండగానే, హఠాత్తుగా కంచుకి వచ్చి 'వత్సరాజు' అని పలుకుతాడు. వత్సరాజు ఉదయనుడు బంధీగా తేబడి నాడని అతని పూర్తి వాక్యము. ఈ విధంగానే

అభిషేక నాటకంలో సీతతో రావణుడు 'ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారు ?' అని అంటూండగానే, ఒక రాక్షసుడు వచ్చి 'రాముడు' అని పలుకుతాడు. ఈ విధంగా పతాకాస్థానముల ద్వారా నాటకములందు ఒక రకమైన అందము తేబడి నది ఈతని నాటకము లన్నియు కృత్రిమత లేక అభినయము చేయ వీలగుటచే ప్రదర్శించ యోగ్యములైనవి.

భాసుని నాటకములలో సుభాషితములు కోకొల్లలు ఉదాహరణకు భర్తృ నాథాహినార్యః (ప్రతిమా 1.25), స్వఃపుత్రఃకురుతే పితుర్యదివచః కస్తత్ర భోవి స్మయః (ప్రతిమా 1.5), కుతఃక్రోధోవినీతానాం లజ్జావాకృతచేతసాం (ప్రతిమా 6.9), అయుక్తం పరపురుష సంకీర్తనం శ్రోతుం (స్వప్న 3), నహిసిద్ధవాక్యా న్యుత్క్రమ్యగచ్ఛతి విధిః సువరీక్షితాని (స్వప్న 1.11), సర్వంహిసైన్య మను రాగమృతే కళత్రం (ప్రతిజ్ఞా 1.4), సోత్సాహానాం నాస్త్య సాధ్యం నరాణాం (ప్రతిజ్ఞా 1.18) అచ్ఛలోహి స్నేహోనామ (అవిమారక), ప్రాజ్ఞస్య మూర్ఖస్యచ కార్యయోగే, సమత్వమభ్యేతి తనుర్న బుద్ధిః (అవి 5.5), అకారణం రూపమ కారణం కులం, అపత్సునీచేషుచ కర్మశోభతే (పంచరాత్ర 2.33), సతిచ కుల విరోధేనాపరాధ్యంతి బాలాః (పంచ 3.4), అనతిక్రమణీయోహివిధిః (స్వప్న) కాలక్రమేణజగతః పరివర్తమానా చక్రారపంక్తిరివగచ్ఛతి భాగ్యపంక్తిః (స్వప్న 1.4), సర్వజనమనోభిరామం ఖలు సౌభాగ్యంనామ (స్వప్న 2), స్త్రీ స్వభావస్తు కాతరః (స్వప్న) నిర్దోషదృశ్యాహి భవంతినార్యో యజ్ఞే వివాహేవ్యసనేవనేచ (ప్రతిమా 1.29), హస్తస్పర్శోహి మాతౄణామజలస్య జలాంజలిః (ప్రతిమా 3.13), నవ్యాఘ్రంమృగశిశవః ప్రఘర్షయంతి (ప్రతిమా 5.18). భాసమహా కవి సూక్తులు అనేక విద్వాంసులచే ఉద్ధరించబడినవి. భాస మహా కవి ప్రయోగించిన భాష సరళమైనది. ఈ సారళ్యమే కవి యొక్క ప్రాచీనత్వాన్ని తెలుపుతూ, భాషపై అతనికి ఉన్న అధికారాన్ని కూడా ద్యోతింపజేస్తూంది.

**శూద్రకుడు:** భాసుడుచారుదత్తమునునాల్గుఅంకములలోపూర్తిగావించకపోగా దానిని గ్రహించి ఆ నాల్గంకములకు తన కలముతో మెఱుగులు దిద్ది 10 అంక ములలో కథను పూర్తి గావించినవాడు శూద్రకుడు. ఈతని కృతియే పాశ్చాత్య

దేశములందు సైతం ప్రదర్శించబడుతూ ప్రశంసలనందుకొన్న మృచ్ఛకటికము. "శూద్రకోనామ వీరాణామధిపః" అని స్కాంధపురాణము శూద్రకుని విక్రమాదిత్యునికంటే 27 సంవత్సరముల పూర్వుడని పేర్కొనుచున్నది.

'హత్వా కాణ్వం సుశర్మాణం తద్భృత్యో వృషలీ బలీ
గాంభోక్ష్యత్యాంధ్రజాతీయః కంచిత్కాలమసత్తమః'

అని భాగవతము చెప్పినటుల కణ్వవంశరాజగు సుశర్మను హతమార్చి శిముకుడు సింహాసనాన్ని అధిష్ఠించి ఆంధ్ర భృత్య వంశాన్ని స్థాపించినాడు - ఆశిముకుడే ఈ శూద్రకుడు క్రీ॥ పూ॥ 83 నాటివాడని విమర్శకుల అభిప్రాయము - విన్సెంట్, స్మిత్ చారిత్రకులు శూద్రకుడు క్రీ॥ పూ॥ 220 న సింహాసనము నధిష్ఠించినాడని క్రీ॥ పూ॥ 197 న మరణించినాడని పేర్కొన్నారు.

ఈ నాటకము 10 అంకములు కలది ప్రకరణమను రూపకభేదమునకుదాహరణము. అంకానుసారముగా కథను పరిశీలింతము - ఉజ్జయినీ నగరానికే ఉజ్జ్వలాభరణము వసంతసేనయను వేశ్య - ఆ నగరములోని వారందరికి దానము లిచ్చి కర్పూరములా సంపదనంతా సద్వినియోగము చేసి దరిద్రతతో కాలము గడుపుతూన్న గుణసముద్రుడు చారుదత్తుడు ఒక నాటి రాత్రి వసంతసేన తిరిగి వస్తూండగా రాజు యొక్క బావమరది శకారుడు ఆమెను వెంబడిస్తూ, ప్రేమించుమని బలవంతం చేస్తాడు - నిరాశ్రయయైన వసంతసేన దగ్గరలో ఉన్న చారుదత్తుని గృహం చేరుకొని, తన ఆభరణములందు మోజుపడి శకారాదులు వెంబడిస్తూన్నారు కావున, ఈ ఆభరణములను న్యాసముగా రక్షించుమని ఆభరణముల నిచ్చి వసంతసేన తన ఇంటికి వెళుతూంది. (2 - ) సంవాహకుడు ద్యూతమున ఓడిపోయి, చారుదత్తుని పాత సేవకుసని చెప్పకొని ఆమె సానుభూతిని పొందుతాడు ఋణగ్రస్తుడై వసంతసేనను ఆశ్రయిస్తాడు. ఆమె ఋణముక్తుని చేయగా చారుదత్త నామ మహిమను తెలుసుకొని విరక్తుడై బౌద్ధభిక్షువౌతాడు. (3) వసంతసేన నుండి మదనికను విడిపించుటకై శర్విలకుడు చారుదత్తు నింటికి కన్నము కొట్టి, వసంతసేనన్యాసధనాన్ని దొంగిలిస్తాడు - చారుదత్తుని అర్ధాంగి ధూతాదేవి భూషణములకు బదులుగా రత్నమాలను విదూషకుని ద్వారా వసంతసేనకు పంపుతూంది.

(4) శర్విలకుడు చారుదత్తునింటిలో దొంగిలించిన భూషణములను వసంతసేన కిచ్చి మదనికను పొందుతాడు - ఆర్యకుడు బందీ అయినాడని విని రక్షించ నెంచుకట్టుతాడు - విదూషకుడు రత్నమాలను సమర్పిస్తాడు. ఆ రాత్రే వసంతసేన చారుదత్తునితో కలుస్తానని సందేశాన్ని పంపుతూంది. (5) వర్షఋతు వర్ణనము వసంతసేన ఆ రాత్రి చారుదత్తుని ఇంటిలోనే గడుపుతూంది. (6) ప్రాతఃకాల మునసే వసంతసేన రత్నమాలను దూతాదేవికివ్వగా ఆమె నిరాకరిస్తూంది. చారుదత్తుని కొడుకు రోహసేనుడు మట్టిబండితో ఆడుకొంటూ తనకు బంగారుబండి కావాలని పట్టుబడుతాడు - అందులకై వసంతసేన తన ఆభరణములతో మట్టి బండిని అలంకరించి బంగారుబండి చేస్తుంది. తరువాత జీర్ణోద్యానమునందు చారుదత్తుని కలుసుకొనుటకు, అక్కడ ఉన్న శకారుని బండిని తన బండి అనుకొని ఎక్కుతుంది. ఆర్యకుడు జైలునుండి తప్పించుకొని వసంతసేనకై ఉన్న బండిని అధిరోహిస్తాడు. (7) ఆర్యకుడు చారుదత్తుని కలుసుకొంటాడు - చారుదత్తుడు ఆర్యకుని బేడీల ఛేదించి అదే బండిపైన అతనిని అధిష్ఠింపజేస్తాడు (8) వసంతసేన శకారుని చేరుకొంటూంది. శకారుడు తనను అంగీకరించనందున వసంతసేన మెడను నులిమి చనిపోయినదని తలచి ఎండుటాకులతో ఆమె శరీరాన్ని కప్పివేస్తాడు - ఈ హత్యా అభియోగమును చారుదత్తునిపై మోపుటకు న్యాయాలయానికి వెళ్ళుతాడు. ఇంతలో బౌద్ధభిక్షువు మృతప్రాయమైన ఆమెకు సపర్యలచేస్తూ బ్రతికిస్తాడు. (9) న్యాయాలయమున వసంతసేనయొక్క ఆభరణములు విదూషకునివద్ద లభించుటచే చారుదత్తుడు హంతకుడిగా ఋజువుకాగా, చారుదత్తునకు శిరశ్ఛేదన విధించబడుతూంది. (10) పాలకరాజును సంహరించి ఆర్యకుడు ప్రభువౌతాడు. వసంతసేన వచ్చి చారుదత్తుని నిరపరాధతను వెల్లడిచేస్తూంది. శకారుని చారుదత్తుడు క్షమిస్తాడు. చారుదత్త వసంతసేనా కలయికతో శుభాంతంగా నాటకము ముగుస్తుంది.

నాటక కథ కల్పితము. నిర్ధన బ్రాహ్మణుడు నాయకుడు, నాయిక వేశ్య. సమాజమునందలి మధ్యతరగతి వారలిందలి పాత్రలు - నాటకీయతతోపాటు కావ్యత్వము కూడా ఉంది. ఇందు రెండు ప్రణయకథలు (వసంతసేనా అగ్నిమిత్రులు, మదనికాశర్విలకులు) ఒక రాజనీతి కథ ముచ్చటగా మూడు కలసి వర్తింపబడినవి. ఇందలి కథ ఆదర్శవాదముకాక యథార్థవాదమైనది. కథాగమనమునందు గతిశీలత్వమున్నది - పురుషుడు స్త్రీని ప్రేమించుటయేకాక,

స్త్రీయే పురుషుని ప్రేమించుట ఇందు వర్ణితము. 5వ అంకమునందలి వసంత సేనా చారుదత్తుల ప్రణయము మనోహరము. ఇందు అన్నిరకముల పాత్రలున్నవి. నిమ్న శ్రేణి పాత్రలు అధికంగా ఉన్నవి గౌణపాత్రల చరిత్ర చిత్రణమునందును కవి జాగరూకతను ప్రదర్శించినాడు ప్రతి పాత్రకున్ను గుర్తింపు, స్వాతంత్ర్యము ఉన్నది అన్ని రకములైన పాత్రల సృష్టించి ఆ కాలమందలి సమాజమును యధార్థంగా సజీవంగా చిత్రించినాడు ఇందు దొంగ, ద్యూదరి, దూర్తుడు, విప్లవవీరుడు, వేశ్య, పోలీస్, న్యాయవాది, జడ్జి, రాజు, బ్రాహ్మణుడు మొదలగు అన్ని రకములైన పాత్రలు తమ తమ పనులను సక్రమంగా నిర్వహిస్తూ నాటకానికి మంచి అందమును తెచ్చినారు ఈ నాటక శైలి సరళమైనది. సరసమైనది, స్పష్టమైనది, సహజమైనది ఇందలి సంవాదములు సజీవములు దీర్ఘ కథోపకథనములు లేవు ఉత్తర ప్రత్యుత్తరములు చిన్నవి, స్వాభావికమైనవి. సంవాదములందు వ్యంగ్యము స్పష్టము ప్రసంగానుకూలంగా భాష ప్రయోగించబడినది. హాస్యరసము చక్కగా పోషించబడినది

భారతదేశ జాతీయ కవియైన మహాకవి కాళిదాసు (క్రీ॥పూ॥1వ శతాబ్ది) ప్రపంచ వాఙ్మయంలోనే సర్వశ్రేష్ఠ నాటకకర్తగా సుప్రసిద్ధుడు. కథావస్తు సంవిధానమునందు రమణీయత్వము, పాత్రల చరిత్ర చిత్రణమునందు స్వాభావికత సంవాదములందు ఆహ్లాదకత, వర్ణనలందు భావాత్మకత, ఏ దృష్టికోణమునుండి చూసినను ఈతని నాటకములు అద్వితీయములని ప్రసిద్ధినొందినవి. ఈతని అలౌకిక ప్రతిభ సర్వతోముఖియైనది. భారతీయ నాట్య కళయొక్క పూర్ణవికాసము ఈతని నాటకములందు కనబడుతూంది అద్భుతమైన కల్పనలు, విలక్షణమైన నాటకీయత, సరళమైన హృదయంగమమైన భాష ఈతని నాటకములలో కడుస్పష్టములు. ఈ కవి మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము అభిజ్ఞాన శాకుంతలము మూడు నాటకములను వ్రాసినాడు. రచనాక్రమమున మాళవికాగ్నిమిత్రము మొదటిది 5 అంకములు కల్గిన ఈ నాటకంలో శుంగవంశపు రాజైన అగ్నిమిత్రుని, మాళవికల ప్రణయకథ చిత్రింపబడినది. పట్టపురాణి పరిచారికయైన మాళవికయొక్క సౌందర్యమును చూసి రాజు ఆకర్షితుడౌతాడు. రాణి ఇందుకు ఈర్ష్యచెందుతుంది, చివరికి మాళవిక కూడా రాజకుమార్తె అని తెలియగా రాజుతో పెళ్ళిచేస్తుంది కథను పరిశీలింతము. విదర్భరాజగు, మాధవసేనునియొక్క సోదరి మాళవిక. దాయాదులు రాజ్యమునాక్రమింప సుమతి

యైన మంత్రి మాళవికను అరణ్యమున పోషిస్తూంటాడు. సుమతి శత్రువులచే సంహరింపబడగా ఏకాకియైన మాళవిక అగ్నిమిత్రుని బావమరది యగు వీర సేనునికి లభిస్తూంది. అతడు ఆమెను తన అక్క యగు ధారిణీదేవివద్ద పరిచారికగా నుంచుతాడు. మాళవికకు గణదాసుడు నాట్యాన్ని నేర్పుతుంటాడు. రాణి, మాళవికను రాజు కంటిలో పడకుండ తగు జాగ్రత్త వహిస్తూంది చిత్ర ఫలకమున మాళవికారూపాన్ని చూసి రాజు ముగ్ధుడౌతాడు ఆమెను ప్రత్యక్షముగా చూడకోరి గణదాస హరదత్తులకు నాట్యప్రదర్శన పోటీ ఏర్పాటుచేస్తాడు. అందు తమ శిష్యురాండ్రతో నాట్యాచార్యులు ప్రదర్శన నివ్వ సమకట్టుతారు. రాణి నిరోధించవే విఫలమౌతూంది (2) మాళవిక నృత్య ప్రదర్శన ద్వారా గణదాసు విజయాన్నొందుతాడు. మాళవికా సౌందర్యాన్ని గాంచిన రాజు వియోగాన్ని భరించలేకపోతాడు. విదూషకుని ఆమె కలయికకై ప్రార్థిస్తాడు (3) అగ్నిమిత్ర మాళవికల ప్రణయం బహిర్గతమౌతూంది చిన్న రాణి ఇరావతి ప్రార్థన పై రాజు ప్రమదవనాన్ని చేరుకుంటాడు ధారిణీదేవి అస్వస్థతతో రాలేక, అశోకవృక్ష దోహదమునకై మాళవికను ప్రమదవనానికి పంపుతుంది నాయికా నాయకులు కారణాంతరములచే ఇక్కడ కలుసుకొని ఆనందామృతాన్నాస్వాదిస్తూంటే ఇరావతి రాక వారికి భయాన్ని కలిగిస్తూంది (4) మాళవిక కారాగారమున బంధింపబడుతూంది విదూషకుడు పాము కరచినట్టుల నటించి, పాము చిహ్నముగల, ధారిణీదేవి ఉంగరమును పొందుతాడు. దానిని కారాగార రక్షకులకు చూపించి మాళవికను విడిపిస్తాడు. (5) విదర్భ దేశ పరిచారికలు మాళవికను వెతుకుతూ ఇక్కడికి వస్తారు మాళవికను గుర్తిస్తారు. పట్టపురాణి అనుమతితో అగ్నిమిత్రుడు మాళవికను వివాహమాడుతాడు.

ఇది కాళిదాసు మొదటి కృతి తన ప్రతిభకు గుర్తింపు రాలేదని మహాకవి పురాణమిత్యేవ నసాధు సర్వం నచాపి కావ్యం నవమిత్యవద్యం। సంతః పరీక్ష్యాన్యతరద్భజంతే మూఢః పరప్రత్యయనేయబుద్ధిః॥ అని సంఘాన్ని దుయ్యబట్టిన వాడిలా, చిలిపిగా గోచరిస్తాడు. ఇందలి ప్రసాద గుణయుక్తమైన శైలి, మనోహరమైన భాష, సరళములైన, చమత్కార జనకములైన ఉత్తర ప్రత్యుత్తరములు, నాటకానికి వన్నె తెచ్చినవి వర్ణనలలో కావ్య సౌందర్యము, శ్లేషోక్తులు, చక్కని సంభాషణములున్నప్పటికి భావగాంభీర్యము, చరిత్ర చిత్రణమునందు నైపుణ్యము లేదు. కథాకథనము అదిలంగా ఉంది, పాత్రల మనోవికార విశ్లేషణము

కూడా సరిగ్గాలేదు. కవియొక్క ప్రకృతి పర్యవేక్షణ శక్తికూడా పూర్తిగా వికసించినట్లు కనిపించదు. ఉదాహరణకి గ్రీష్మఋతువర్ణనము.

పత్రచ్ఛాయాసు హంసా ముకుళితనయనా దీర్ఘికా పద్మినీనాం
సౌధాన్యత్యర్థతాపాద్వలభి పరిచయాఽద్విన పారావతాని।
బిందూత్క్షేపాన్పిపాసుః పరిపతతి శిఖీ భ్రాంతిమద్వారియంత్రం
సర్వైరుస్రైః సమగ్రస్త్వమివ నృపగుణైర్దీప్యతే సప్తసప్తిః॥

రెండవది విక్రమోర్వశీయము - త్రోటకమను రూపక భేదమిది 5 అంకములు కలది. ఊర్వశీ పురూరవుల ప్రేమగాథ శృంగార రస పరిప్లుతముగా వర్ణించబడినది. వేద - పురాణ - భారతాదులందు ఈ గాథ వర్ణితము-భారతమే దీని కాధారమైనను ఊర్వశీ భూలోక గమనము-భరతముని శాపము-కార్తికేయ వనప్రవేశముచే లతారూప ప్రాప్తి - ఇత్యాదులెన్నో ఈతని రమణీయ కల్పన లున్నవి, అంకానుసారిగా కథను పరిశీలిస్తాము

కేశియను రాక్షసుడు ఊర్వశిని ఎత్తుకొనిపోగా, పురూరవుడు రక్షిస్తాడు. సౌందర్యానికి మోహితుడై రాజు ఊర్వశిని ప్రేమింప, రాజుయొక్క శౌర్య పరాక్రమ గుణముల విని ఊర్వశి రాజుయందు మనసుపడుతుంది. ఊర్వశి స్వర్గము వెళ్ళిపోగా రాజు రాజధానిని చేరుకుంటాడు. (2) వియోగాగ్ని తప్త - రాజు మదన బాణపీడితుడు కాగా, తిరస్కరిణీ విద్యా ప్రచ్ఛన్నయై వచ్చి, ఊర్వశి రాజుకు ప్రేమలేఖ వ్రాస్తుంది. ఆ ప్రేమలేఖను రాణి చూస్తుంది. (3) భరత ముని క్షీరసాగర నృత్య నాటకమును ప్రదర్శిస్తుండగా, అందు లక్ష్మి పాత్ర ధారిణియైన ఊర్వశి 'పురుషోత్తముని ప్రేమిస్తున్నాను' అనుటకు బదులుగా 'పురూరవుని ప్రేమిస్తున్నాను' అని పలుకుతుంది. అంత భరతముని భూలోకమునకు వెళ్ళుమని ఊర్వశిని శపిస్తాడు -ఆ శాపమే ఊర్వశి పాలిట వరముకాగా ఊర్వశీ పురూరవులు ఆనందంగా విహరిస్తూంటారు. (4) విహరిస్తూ ఒక్కచోట రాజు విద్యాధర కన్యను చూడగా, ఊర్వశి కోపించి రాజును వదలిపెట్టి, వెళ్తూ వెళ్తూ, స్త్రీలు ప్రవేశించకూడని కార్తికేయ వనాన్ని ప్రవేశించి,లతగామారుతుంది. రాజు ఊర్వశికై తపిస్తూ, విలపిస్తూ ఆకాశవాణి కరుణవలన సంగమ మణిని పొంది, కార్తికేయ వనము ప్రవేశించి, లతను కౌగిలించుకొని ఊర్వశిని పొందుతాడు. (5) మణిని గ్రద్ధ మాంసపుముద్ద అని తన్నుకొనిపోగా, ఊర్వశీ పురూరవుల తనయుడు ఆయువు ఆ గ్రద్ధను సంహరించి మణినొసంగుతాడు. అక్కడ

మూగామున్న పుత్రవార్త తెలిసినందున, ఊర్వశి తిరిగి స్వర్గము వెళ్ళవలయునని బాధపడుతుండగా, నారదుడువచ్చి, ఊర్వశి ఎల్లప్పుడు రాజుతో నుండునటుల ఇంద్రుని సందేశమును వినిపించగా సుఖాంతముగా ముగుస్తుంది నాటకము.

భారతీయులనేకాక, విదేశీయులనుసైత మానందింపజేసి, వారి ప్రశంసల నంది,విదేశీభాషలందు అనువదింపబడి,ప్రపంచ సాహిత్యమునకే మకుటాయమాన మైనది అభిజ్ఞాన శాకుంతలము. 7 అంకములు కలది. ఉత్తమ ప్రేమకు నిలయమై శృంగార రసానికాలవాలమైనది. శాకుంతల కథను పరిశీలిస్తాము : (1) దుష్యంత మహారాజు వేటకై బయల్వెడలి, మృగముననుసరిస్తూ, తాపసుల అభ్యర్థనచే కణ్వాశ్రమాన్ని చేరుతాడు. చెట్లకు నీళ్ళుపోస్తున్న శకుంతలను ఒక తుమ్మెద బాధింపగా నివారిస్తాడు. ఆమె సౌందర్యమును చూసి, తాను పెళ్ళియాడ యోగ్యురాలు కాదని బాధపడతాడు. మేనకావిశ్వామిత్రుల తనయ, కణ్వపరిపోషిత అని తెలుసుకొని తన ప్రేమ సఫలమౌతుందని సంతోషిస్తాడు శకుంతల కూడా రాజుయందు మనసుపడుతుంది. (2) రాజు శకుంతలా విరహతప్తుడై వ్యథనొందుతూ, తన ప్రేమ (కలాపము)ను విదూషకునకు చెప్పుతాడు. (3) శకుంతల రాజు వియోగాన్ని భరించలేక చెలులకు తెలుపుతుంది. వారి సహాయముతో రాజుకు ప్రేమలేఖ వ్రాస్తుంది. రాజు చూసి, సంతోషించి, గాంధర్వవిధిగా పెళ్ళిచేసుకుంటాడు. తరువాత ఉంగరమునిచ్చి, త్వరలో అంతఃపురమునకు తీసుకపోతానని చెప్పి వెళ్ళిపోతాడు. శకుంతల రాజుయందే మనసు నిలిపి, అతనినే స్మరిస్తూ అతిథిగా వచ్చిన దుర్వాసుని గుర్తించక శాపగ్రస్తురాలౌతుంది. (4) కణ్వమహర్షి శకుంతలా పరిణయమును తెలుసుకొని, అత్తవారింటికి పంపుతాడు. (5) రాజు నిరాకరింపగా, శకుంతలను మేనక ఆకాశములోకి తీసుకుపోతుంది (6) శచీతీర్థమున పడిపోయిన శకుంతల ఉంగరమును చేప మ్రింగగా, బెస్తవాడిద్వారా రాజు పొందుతాడు. దానిద్వారా శకుంతలా వృత్తాంతాన్ని స్మరిస్తూ, గడచినదానికి బాధపడుతాడు. ఇంద్రుడి పిలుపుపై స్వర్గానికి వెళ్ళుతాడు. (7) స్వర్గమునుండి తిరిగివస్తూ, మరీచి ఆశ్రమాన్ని చేరుకొని పుత్రుడగు భరతుని, శకుంతలను కలుసుకొని, మరీచ ఋషి ఆశీర్వాదాన్ని పొంది శకుంతలా సహితుడై రాజధానికి తిరిగి వస్తాడు.

భారతము నందలి ఆదిపర్వమునందు 67 నుండి 74 అధ్యాయములందు వర్ణింపబడిన కథను ఇతివృత్తముగా గ్రహించి, అందలి లోపములు పూరించి, తన్మూలక కల్పనలు జోడించి. కనులకింపగు సన్నివేశములు కూర్పించి. శాకుంతలాన్ని సృష్టించాడు కాళిదాసు కణ్వమహర్షి సోమతీర్థయాత్ర, ఒంటరిగా రాజు ఆశ్రమాన్ని ప్రవేశించుట, భ్రమర వృత్తాంతము. శకుంతలా జన్మ వృత్తాంతమును చెలులు చెప్పుట. నిర్భీకయైన ప్రగల్భ తరుణివలె పలుకు వివాహ శర్తులను తొలగించి ముగ్ధగా శకుంతలను చిత్రించుట. అభిజ్ఞానమగు అంగుళీయ కల్పనము. దుర్వాస శాపము మొదలగునవెన్నో ఈతని నవీన కల్పనలు. శకుంతలను వర్ణిస్తూ-

అధరః కిసలయరాగః కోమల విటపానుకారిణౌ బాహూ।
కుసుమమివ లోభనీయం యౌవనమంగేషు సన్నద్ధం॥

పెదవిని చిగురుటాకుతో, బాహువులను లేత కొమ్మలతో, యౌవ్వనమును కుసుమముతో పోలుస్తూ ప్రకృతి చిత్రణావైశద్యాన్ని - ఉపమాలంకార ప్రియత్వాన్ని వెల్లడిచేసాడు. ఉత్తమ గృహిణి కర్తవ్యోపదేశమైన శ్లోకమిది-

శుశ్రూషస్వ గురూన్కురు ప్రియ సఖీవృత్తిం సపత్నీజనే
భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మ ప్రతీపం గమః
భూయిష్ఠం భవ దక్షిణా పరిజనే భాగ్యేష్వనుత్సేకినీ
యాంత్యేవం గృహిణీపదం యువతయో వామాః కులస్యాధయః॥

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. శాకుంతలాధారంగా ఆనాటి పారివారిక, సామాజిక, ధార్మిక, రాజనైతిక జీవనముల గూర్చి పరిశీలిస్తాము. బ్రాహ్మణులు అధ్యయన, అధ్యాపన, యజన, యాజన, దాన, ప్రతిగ్రహ షట్కర్మ నిరతులు. యజ్ఞాన్ని అనుష్ఠించు యజమాని శివరూపునిగా గౌరవించబడేవారు. క్షత్రియులు ప్రజాహితము కాంక్షించెడివారు. దుష్టుల శిక్షించుటయందు నిమగ్నులు. వైశ్యులు వ్యాపారార్థమై దూర-దూర దేశములకు సముద్ర ప్రయాణములుచేస్తూ దేశ ధన సంపదను వృద్ధిపరచెడివారలు. శూద్రులు తమ కర్మలద్వారా దేశ సర్వాంగీణ సమృద్ధిలో తమపాలు పంచుకొనెడివారలు. చతుర్వర్ణ వ్యవస్థను ఉదాత్తంగా పాలించెడివారలు. కులవిద్యలు గర్హితములైనప్పటికి విడచిపెట్టెడివారలు కారు. పతితులుకూడా దుష్టమార్గాన్ననుసరించెడివారలుకారు. బ్రహ్మచర్యాశ్రమమున

జ్ఞానమును సంపాదించుకొని, గృహస్థాశ్రమమున కర్తవ్యముల చక్కగా పాలించెడివారు. తక్కిన మూడు ఆశ్రమములవారికి సేవ, సహాయముల నాచరించెడివారు. వార్ధక్యమున రాజులుకూడా రాజ్యమును పుత్రులకప్పగించి, స్త్రీ సహితులై, తపోవనములకేగి వానప్రస్థాశ్రమమును స్వీకరించెడివారలు. తాపసులు, ఋషులు రాజ క్షేమాన్ని కోరి, వారి దైవిక అనుష్ఠానములను నిర్విఘ్నంగా అనుష్ఠించెడివారలు. ప్రజారక్షణము రాజకర్తవ్యము. ఇందుకై వారి ఆదాయమునుండి ఆరవ వంతును శుల్కముగా తీసుకొనెడివారు. న్యాయము నిష్పక్షపాతంగా ఉండెడిది. ఎవరైనా సంతానము లేకుండ మరణించినచో, వారి సంపద రాజుకే చెందెడిది. సంరక్షకోద్యోగులు లంచాలు తీసుకొనెడివారలు. మద్యపానం చేసెడివారలు, తప్పుచేసినవాడియొక్క కాళ్ళు-చేతులు బంధించి కొట్టెడివారలు, వసంతమురాగా మామిడికొమ్మల తెంపి మన్మథపూజ చేసెడివారలు. రాజులు శబ్దభేదీ విద్యయందు ప్రవీణులు ఆకాశమునందును సంచరించెడివారలు. పారివారిక, సామాజిక జీవనమును కాళిదాసుచే చక్కగా సజీవంగా చిత్రింపబడినది. రాజులలో ధనవంతులలో బహువివాహ ప్రథ ఉండెడిది పుత్రహీనుడు దుర్భాగ్యుడన్న భావముండెడిది పుత్రసంతతికై తాపత్రయముండెడిది. స్త్రీలతో పురుషులు సభ్యంగా, మర్యాదగా వ్యవహరించెడివారు సమాజమున, పరివారమున వారికి ఉన్నత స్థానముండెడిది. ఉచ్చకుల స్త్రీలు బయటకు వెళ్ళునపుడు ముసుగు ధరించెడివారలు. దుశ్యంతుని దర్బారున శకుంతల ముసుగుతోనే ప్రవేశిస్తుంది. గురుజనుల సమక్షమున పతితో వెళ్ళవలసివస్తే స్త్రీలు సిగ్గుపడెడివారు. స్త్రీలు ఉన్నత శిక్షను పొందెడివారు. భార్యపై భర్తకు సర్వాధికారముండెడిది. పూర్ణవయస్కులైన స్త్రీలకే వివాహము చేయబడెడిది. శకుంతల చెలులైన అనసూయా-ప్రియంవదలు సుశిక్షితులు, చిత్రకళా ప్రవీణులుకూడా స్త్రీలు గృహకార్య సంబంధి కళలు, చిత్రకళ, సంగీతము, కావ్యకళ మొదలగువాటియందు నిపుణులు కొద్దిగా వైద్యమును (ప్రథమచికిత్సను)కూడా తెలుసుకొని యుండెడివారలు. లేడిపిల్లకు దర్భాంకురములచే క్షతికాగా, ఇంగుదీతైలముతో చికిత్స చేస్తుంది శకుంతల అస్వస్థురాలైన శకుంతలకు ప్రియంవద - అనసూయలు ఉశీర-లేపము, కమల పత్రావరణాదుల నాచరిస్తారు. గౌతమి శకుంతలకు స్వాస్థ్య లాభమునకై శాంత్యుదకాన్నందిస్తుంది. ఆధ్యాత్మిక, ధార్మిక దృష్టిననుసరించియు కొన్ని ఆదర్శములు ఉండెడివి. ఖగోళజ్ఞానము బహుళప్రచారము నొందినది. దుష్టగ్రహములనుండి శకుంతలకు శాంతికలుగుటకై కణ్వుడు తీర్థ

యాత్రకు వెళ్లుట, గ్రహశాంతికై మంగళానుష్ఠానమున్నటుల బోధించుచున్నది. ఆశ్రమములకు ప్రాధాన్యత ఉండెడిది. వీటిని రక్షించుట రాజుయొక్క పరమ కర్తవ్యము. ఈ ప్రశాంతాశ్రమ వాతావరణములందే బాల-బాలికలు శిక్షను పొందెడివారలు. ఆశ్రమములు అహింస, తపస్సు, త్యాగనిరతులకు నిలయములు. 'స్వర్గాదధికతరం నిర్వృతిస్థానం' 'అమృత హ్రదమివ అవగాఢోఽస్మి' ఆశ్రమములు స్వర్గములకంటె మిన్నయైన అమృత సరస్సులవలె ఆనందాన్ని కలిగింపజేసెడివి. సమాజముయొక్క సర్వతోముఖమైన అభివృద్ధితోబాటు ఆధ్యాత్మికాభివృద్ధి ఉండడమే సుసంస్కృతి అవుతుంది కావున నవే సామాజిక, ఆధ్యాత్మికాభివృద్ధులపైననే దేశ గౌరవమని ఉద్ఘోషిస్తూ భరత వాక్యాన్ని పలికినాడు కాళిదాసు.

ప్రవర్తతాం ప్రకృతిహితాయ పార్థివః సరస్వతీ శ్రుతి మహతీ మహీయతాం।
మమాపిచ క్షపయతు నీలలోహితః పునర్భవం పరిగత శక్తిరాత్మభూః॥

**అశ్వఘోషుడు :** కుషాణ వంశజుడైన కనిష్క చక్రవర్తి ఆస్థాన పండితుడైన అశ్వఘోషుడు (క్రీ॥శ॥ ప్రథమ శతాబ్ది)రెండు కావ్యములనే కాక, మూడు నాటకములనుకూడా వ్రాసినాడు క్రీ॥శ॥ 1910 న డా. ల్యూడర్స్ మధ్య ఆసియాలోని తుర్ఫాన్ ప్రాంతమందు మూడుతాళపత్ర గ్రంథములను కనుగొన్నారు. ఇవి లభ్యమయ్యే తాళపత్రములలో అత్యంత ప్రాచీనములు. కవిచే స్వయంగా వ్రాయబడినవని విమర్శకుల అభిప్రాయము. వీటిలో శారిపుత్ర ప్రకరణము మొదటిది. ఇందు 9 అంకములున్నవి. ఇందు బుద్ధుని ఉపదేశముచే శారిపుత్రుడు, మౌద్గల్యాయనుడు బౌద్ధమతమును స్వీకరించుట వర్ణింపబడినది. బౌద్ధమత సిద్ధాంతములు కూడా అక్కడక్కడ బోధింపబడినవి. ఇందు అన్ని నాటకములవలె నాందీ, ప్రస్తావనా, సూత్రధారుడు వివిన్న ప్రాకృతముల ప్రయోగము ఇత్యాదులు కనబడుచున్నవి, కాని భరత వాక్యము మాత్రం లేదు. ఈ నాటకముతోపాటు ఇంకొక రెండు నాటకముల ఖండితాంశములు లభించినవి. మొదటిది ప్రబోధచంద్రోదయము వలె ప్రతీకాత్మకమైనది (Allegorical Drama). ఇందు బుద్ధి, ధృతి, కీర్తి మొదలగునవి పాత్రలు. రెండవది మృచ్ఛకటికమువలె వేశ్యానాయికగా గల నాటకము. ఇందు మాగధవతి యను వేశ్య కౌముదగండుడను విదూషకుడు మొదలగు పాత్రలు కలవు ఈ రెండు నాటకములు ఖండితములుగా లభించుచున్నందున, నాటకముల పేర్లు, విషయములేమియును తెలియవు.

**విశాఖదత్తుడు :** సామంత వటేశ్వరదత్తుని పౌత్రుడు, మహా రాజని ఉపాధినొందిన పృథువని నామాంతరము కలిగిన భాస్కరదత్తునియొక్క పుత్రుడు, 7 అంకములు కల్గిన ముద్రారాక్షసమును రచించినాడు. ఈ నాటకమున రసమునకు ప్రాధాన్యము లేక సంఘటనలకు ప్రాధాన్యమున్నది. కూట రాజనీతి, షడ్యంత్ర రచనలతో కూడుకొన్నది ఇందలి కథకు కేంద్రబిందువు నందుని ప్రధానమంత్రి రాక్షసుడు రాజనీతికోవిదుడు, స్వామిభక్తి కలవాడు. దక్షుడైన రాక్షసుణ్ణి చంద్రగుప్తునికి ప్రధానమంత్రిని చేయాలని చాణక్యుడు నిశ్చయిస్తాడు. ఇక రాక్షసుడు, చాణక్య చంద్రగుప్తుల జయించి, దివంగతుడైన నందుని ఆత్మ శాంతికై, నందవంశజుణ్ణి రాజును చేయాలని నిశ్చయిస్తాడు. ఈ లక్ష్యములను నెరవేర్చుటకై చాణక్యుడు, రాక్షసుడును అనేక రకములైన వన్నాగములను పన్నుతారు. ఈ నాటకములో వీరరసము ప్రధానరసము - ఆదినుండి అంతము వరకు యుద్ధముచే సంబంధించినది ఎక్కడచూసినను యుద్ధచర్యయే. ఈ యుద్ధము శారీరకముకాదు, బౌద్ధికము బుద్ధిబలములచే ఒకర్నొకరు ఓడించాలని ఎత్తులపై ఎత్తులు వేస్తుంటారు తాము వేస్తున్న ఎత్తులు ఔచిత్యములా కావా అన్న ప్రశ్నే లేదు కాని, ఏ విధంగానైనా లక్ష్యాన్ని పొందాలన్నదే వీరి ఉద్దేశ్యము. స్త్రీ పాత్రలు లేకపోవడము దీని ప్రత్యేకత. ఇందులో నాయిక లేదు, శృంగార రసపరమైన వాతావరణములేదు. ప్రతీహారులని మినహాయించి,చందనదాసు భార్య ఒక్కతే స్త్రీపాత్ర. ఈ పాత్ర ప్రేక్షకులకు శృంగారభావమును కలిగింపజేయా లని కాదు, కేవలము ప్రేక్షకుల గుండెలలో కరుణరసము ప్రవహింపజేయాలని ఉంచబడినది. పతిగూర్చి ఆమెకు ఉన్న కర్తవ్యనిష్ఠ, త్యాగపరాకాష్ఠలను తెలి పిడిజేయడానికే. విదూషకుడి పాత్రను పెట్టి నాటకాన్ని చులకన చేయదలచు కోలేదు పరంపరగ వస్తున్న నాటకములను అంధానుకరణము చేయలేదు తన దంటూ ఒక కొత్త బాణీని ఏర్పాటుచేసినాడు. తన నాటకము ఔచిత్యముపై ఆధారపడిందే, తప్ప వేరేవారు చూపించు తోవలపైన కాదని నిరూపిస్తూ, స్వతంత్ర చరిత్ర చిత్రణశైలిని. శిల్పమును జోడించి నాటకంలో గత్యాత్మ కతను సృష్టించినాడు. అందువలననే నాటకములో ఎక్కడ చూసినను కవి యొక్క మౌలికత కనిపిస్తుంది. ప్రతిజ్ఞా యౌగంధరాయణముయొక్క ఆదర్శ భావనలచే ప్రేరితుడై, మృచ్ఛకటికాన్ని చక్కగా అధ్యయనంచేసి,విశాఖదత్తుడు అపురూపమైన, అనన్యతుల్యమైన ఈ నాటకాన్ని సృజించాడు. సంఘటనల ఐక్య

తకు ఈ నాటకమొక విలక్షణమైన ఉదాహరణము. అత్యంతమున భిన్నభిన్నములుగా కానిల్లు సంఘటనలు, ముందుకువెళ్ళి అన్ని ఒకే లక్ష్యానికై ఉద్భవించినవిగా కలిసిపోతాయి. కూటలేఖ, చందనదాస బంధనము, శకటదాసుని పలాయనము, ఆభరణముల క్రయవిక్రయములు, చాణక్యుని కృత్రిమ కలహము, మొదలగు సంఘటనలన్నియు రాక్షసుని నిగ్రహించుటయందు తోడ్పడుతుంటాయి. నాయక ప్రతినాయకులైన చాణక్య రాక్షసులు ఇద్దరును తుల్యులే కాక, వారికి తోడ్పడువారును సములుగా చిత్రింపబడినారు చాణక్యుడు ఆత్మ విశ్వాసము కలవాడు, అప్రమత్తుడు అయితే, రాక్షసుడు భావుకుడు, కోమల ప్రకృతికలవాడు. చాణక్యుడు బుద్ధివాది అయితే రాక్షసుడు హృదయపక్షానికి ప్రాధాన్యాన్నిచ్చేవాడు. గంభీరుడు, కఠోర ప్రవృత్తి కలిగిన చాణక్యుడు అతని అనుచరులకు, మిత్రులకు భయాన్ని కలిగిస్తుంటే, రాక్షసుని అనుచరులు, మిత్రులు రాక్షసునితో స్నేహంగా ఉంటారు. ఈ విధంగా చారిత్రక చిత్రణమున సమానతలు, భిన్నతలు చాణక్య రాక్షసానుచరులందు (చంద్రగుప్తుడు-మలయకేతువు, సిద్ధార్థకుడు - భాగురాయణుడు, కరభకుడు - నిపుణకుడు గాంచవచ్చును).

విశాఖదత్తుని గద్యము పద్యముకంటె శక్తివంతమైనది పాత్రల పరస్పర వార్తాలాపములు సహజములు, స్వాభావికములు. శక్తివంతములైన పదములు అర్థగౌరవాన్ని (Brievety) కలిగియున్నవి. ఉదా : అయమపరో గండస్యోపరి స్ఫోటః, నహి సర్వః సర్వం జానాతి, సర్వజ్ఞతాముపాధ్యాయస్య చోరయితుమిచ్ఛసి, నను వక్తవ్యం రాక్షస ఏవాస్మదంగుళి ప్రణయీ సంవృత్త ఇతి విశాఖదత్తుని శ్లేష ప్రయోగములును కడురమ్యములు - పతాకా స్థాన ప్రయోగములు కూడా శ్లేషగర్భితములైనవి మొదట కవి చెప్పదలచినది గద్యముద్వారా తెలిపి, పద్యముద్వారా విశదీకరిస్తాడు ఈ భంగ్యంతర కథనమునందు కవి సఫలత నొందినాడు. ఈతని పద్యములు సౌందర్యమయ ప్రవాహముచే నిండియున్నవి ఉదాహరణకు-

అస్వాదిత ద్విరద శోణిత శోణశోభాం
సంధ్యారుణామివ కళాం శశిలాంఛనస్య।
జృంభా విదారితముఖస్య ముఖాత్స్ఫురంతీం
కో హర్తు మిచ్ఛతి హరేః పరిభూయ దంష్ట్రామ్॥

ఈ నాటకమున శౌరసేనీ, మహారాష్ట్రి, మాగధీ మూడు ప్రాకృతములును ప్రయోగింపబడినవి. ప్రాకృత వ్యాకరణ నియమబద్ధములు కూడా. స్రగ్ధరా, శార్దూలవిక్రీడిత ఛందస్సులధికంగా ప్రయోగింపబడినవి.

నాటకముయొక్క చివరి శ్లోకమునకు పార్థివశ్చంద్ర గుప్తః, పార్థివో దంతివర్మా పార్థివో ఽవంతివర్మా మొదలగు పాఠాంతరములు లభించుచున్నవి. మొదటి పాఠాన్ననుసరించి గుప్తసమ్రాట్టు, రెండవ చంద్రగుప్తుని (క్రీ శ॥ 4వ శతాబ్ది) స్వీకరించవచ్చును తన రాజు పేరు కలిగిన మౌర్య చంద్రగుప్తుని కథ నాధారముగా తీసుకొని, నాటకమును వ్రాసి, ఆశ్రయదాతయందలి భక్తిని వెల్లడి చేసి యుండవచ్చును ఈ నాటకమున పాటలీపుత్రము సమృద్ధవంతమైన రాజధానిగా చిత్రింపబడినది పాహియాన్ మగధను రాజధానిగా ప్రశంసించినాడు' కాని హుయత్సాంగ్ సందర్శించినపుడు మగధ భగ్నావశేషమైనది నాటకమున లభించు బౌద్ధ ధర్మ సంకేతముల (1.5) బట్టి, మగధలో బౌద్ధ మున్నతస్థితిలో ఉన్నట్లుగ కనిపిస్తుంది. పాహియాన్ భారతదేశమును సందర్శించినప్పుడు అలాగే ఉండెడిది, కావున ముద్రారాక్షసము 5వ శతాబ్ది ఆరంభమున రచింపబడినదిగా నిర్ధారించవచ్చును దక్షిణమున హూణులవలన భయములేదు కావున దంతివర్మ (క్రీ॥శ॥ 779-830) పాఠము సరికాదు. 'పార్థివో ఽవంతివర్మ' అను మూడవ పాఠాన్ననుసరించి హర్షవర్ధనుని (క్రీ॥శ॥ 606-648) బావ, గ్రహవర్మ యొక్క తండ్రి, మౌఖరి వంశజుడైన అవంతివర్మను కొందరు స్వీకరించుచున్నారు. యాకోబీ కాశ్మీరరాజైన అవంతివర్మను (క్రీ॥శ॥ 856-883) పేర్కొన్నారు. చంద్రగుప్తుని స్వీకరించుటయే యుక్తియుక్తము. విశాఖ దేవ (దత్త) కృతంగా దేవీ చంద్రగుప్తము కొద్దిభాగము మాత్రమే లభించుచున్నది. ఇందు రెండవ చంద్రగుప్తుడు శకాధిపతినుండి తన వదినయయిన ధ్రువాదేవిని విడిపించుట వర్ణించబడినది. అగ్రజుడైన రామగుప్తుడు రాణి ధ్రువాదేవిని శకరాజున కివ్వటమునకై సంధిచేసుకోగా, ధ్రువాదేవివేషమున చంద్రగుప్తుడు వెళ్ళి శకరాజును హతమార్చి, అన్నను కూడా చంపి, ఆ దేవిని ధ్రువవివాహము చేసుకొని, రాజ్యముచేయుట వర్ణింపబడినది. విశాఖదత్తునిచే 'రాఘవానందము' రచింపబడి నట్లుగా సుభాషిత గ్రంథములవలన తెలియుచున్నది. నాటకము లభించుటలేదు.

**కౌముదీ మహోత్సవము :** 5 అంకములు కల్గిన ఐతిహాసిక నాటకము క్రీ॥శ॥ 340 న వ్రాయబడినది. విజ్జికయను కవయిత్రి రచించినటుల విమర్శకుల అభిప్రాయము కావ్యరచయిత్రి విజ్జిక, దండికంటె తరువాతది, కావున నామసామ్యముదే అమెను గ్రహించరాదు. ఈ నాటకమునందలి చండ సేనుడు వాస్తవానికి రెండవ చంద్రగుప్తుడే వింటరనిట్స్ మొదలగు విద్వాంసులు దీనిపై ముద్రా రాక్షస ప్రభావము ఉన్నదని పేర్కొన్నారు. ఇందు ప్రేమ కథతోబాటు రాజకీయ సంఘటన కూడా జోడించబడినది మగధరాజైన సుందర వర్మ యొక్క సేనాపతి చండసేనుడు, మగధరాజుయొక్క శత్రువుల సహాయముచే, పాటలీపుత్రాన్ని ఆక్రమించి, సుందరవర్మ రాజును చంపి, సింహాసనాన్నధిష్ఠిస్తాడు.సుందరవర్మ రాజుయొక్క ప్రధానమంత్రి మంత్రగుప్తుడు రాజ పుత్రుడైన కళ్యాణవర్మను రాజుగా ఉద్ఘోషిస్తాడు.కౌముదీ మహోత్సవము (కార్తీక పౌర్ణమి)నకళ్యాణవర్మకు రాజ్యాభిషేకమౌతుంది కీర్తిసేనుడను వక్కదేశపురాజు ఇదేసమయమున తన కుమార్తెయైనకీర్తిమతితో కళ్యాణవర్మకు వివాహంచేస్తాడు. ఈ సమయమునసే కౌముదీ మహోత్సవ నాటకము ప్రదర్శించబడుతుంది. మృచ్ఛకటికము, కౌముదీ మహోత్సవము ఇవి రెండు ఐతిహాసిక నాటకములు. మృచ్ఛకటికము ఆర్యక- పాలకుల సంఘర్షణను ఆధారంగా చేసుకొన్నటుల, ఇది చండసేన, కళ్యాణవర్మల సంఘర్షణ ఆధారంగా వ్రాయబడినది.

**హర్షవర్ధనుడు :** క్రీ॥శ॥ 606 నుండి 648 వరకు ఏకచ్ఛత్రాధిపత్యముగా భారతదేశాన్ని పరిపాలించిన హర్షవర్ధనుడు కవుల కాశ్రయదాతయే కాక, స్వయముగా కవి. మహాకవిబాణుడితని చరితమును వ్రాస్తూ శ్రీహర్షుని కవి విద్వాంసుడు - శాస్త్రజ్ఞుడు - కావ్యామృతవర్షియని వర్ణించినాడు. చైనా యాత్రికుడు ఇత్సింగ్ 7వ శతాబ్దమున భారతమున సంచరిస్తూ, శ్రీ హర్షకవి రచించిన జీమూతవాహన నాటకము ప్రదర్శించబడుచున్నదని వ్రాసినాడు - ఈ మూడు నాటకములందును శ్రీహర్షుని పేరు పేర్కొనబడి యున్నది. కావున మమ్మటాదులు చెప్పినటుల ఇవి ధావక కర్తృకములనుట సత్యదూరము.

**ప్రియదర్శిక :** ఇందు 4 అంకములున్నవి (1) కళింగరాజు దృఢవర్మను బంధించగా, అతని కుమార్తె ప్రియదర్శిక నిరాశ్రయురాలై, ఉదయనుని రాణిరతనాన్ని చేరుకొని, వాసవదత్తవద్ద ఆరణ్యక అను మారుపేరుతో

దాసిగా ఉంటూంది (2) క్రీడావనమున తుమ్మెద అరణ్యకను బాధపెట్టుండగా రాజు రక్షిస్తాడు. మొదటి చూపులోనే ఇద్దరిలో ప్రేమ ఉదయిస్తుంది. (3)వాసవదత్త చెలి సాంకృత్యాయని, రాణి సంతోషమునకై ఉదయన వాసవదత్తల ప్రణయగాథ రూపమైన నాటకమును ప్రదర్శిస్తుంది అందు అరణ్యక వాసవదత్త పాత్రను ధరిస్తుంది. ఉదయన పాత్రధారిణి మనోరమ రానందున, రాజే తన పాత్రను తానే ధరిస్తాడు. అంత అది నాటకముకాక, వాస్తవికమౌతుంది.' ఇది చూసి కోపించిన వాసవదత్త అరణ్యకకు కారాగార శిక్ష విధిస్తుంది. (4) అరణ్యక జీవనముపై నిరాశచెందినదై, విషపానం చేస్తుంది. విషాన్ని నిరోధించు మంత్రము తెలిసిన రాజువద్దకు అరణ్యక తీసుకరాబడుతోంది. ఇంతలో దృఢవర్మయొక్క కంచుకి వచ్చి అరణ్యకను తమ రాజకుమార్తెగా గుర్తిస్తాడు. అప్పుడు వాసవదత్త ప్రియదర్శిక తన సోదరి అని గుర్తించి రాజుతో వివాహం జరిపిస్తుంది.

**రత్నావళి** : 4 అంకములు కల నాటకము. సముద్ర దుర్ఘటనచే సింహళ రాజకుమారి రత్నావళి, వాసవదత్తను చేరి, సాగరిక అను మారుపేరుతో దాసిగా ఉంటుంది. సాగరిక రాజు కన్నులలో బడకుండా వాసవదత్త జాగ్రత్తపడుతుంది. కాని మదన మహోత్సవమున ఇద్దరు కలుసుకుంటారు' ప్రేమాయణం మొదలౌతుంది. 2 సాగరిక తన చెలియగు సుసంగతకు ప్రణయ వృత్తాంతాన్ని తెలుపుతుంది. పంజరములోని రామచిలుక ఇదంతా వింటూంది. కోతి వచ్చి పంజరాన్ని తెరువగా, చిలుక ఎగిరి కదళీవనముననున్న రాజుకు సాగరికా ప్రణయ వృత్తాంతాన్ని నివేదిస్తుంది. సుసంగతయొక్క సహాయముచే రాజు సాగరికను కలుసుకొంటాడు. వాసవదత్త ఇది చూసి కోపించగా రాజు ప్రతిమాలుతాడు, 3. సుసంగతా విదూషకులు, ఉదయన వాసవదత్తలు మాధవీలతా మండపమునందు కలిసేటట్లు ఏర్పాటుచేస్తారు. ఇది తెలుసుకొన్న వాసవదత్త లతామండపమునకు రాగా, రాజు సాగరిక అనుకొంటాడు. రాణి కోపించి మరలిపోతుంది. ఇదంతా చూస్తున్న సాగరిక సిగ్గుబడగా రాజు ప్రేమాలాపములతో అనునయిస్తాడు. వాసవదత్త ఇది చూసి సాగరికను జైల్లోవేస్తుంది. 4. ఒక ఐంద్రజాలికుడు ఇంద్రజాలమును ప్రదర్శిస్తాడు. సాగరిక ఉన్న భవనము కాలిపోతున్నట్లుగా కనిపిస్తుంది అంత వాసవదత్త సాగరికను రక్షింపుమని రాజును ప్రార్థిస్తుంది. రాజు రక్షిస్తాడు. అప్పుడా సింహళదేశ మంత్రి వచ్చి

సాగరికను రత్నావళిగా గుర్తిస్తాడు. వాసవదత్త రత్నావళిని తన సోదరిగా తెలుసుకొని, రాజుతో పెళ్ళిచేస్తుంది ఈ నాటకముపై కాళిదాసు మాళవికాగ్ని మిత్ర ప్రభావమెంతేని ఉన్నది

ప్రియదర్శిక రత్నావళి నాటకముల సాదృశ్యములు- 1. ఉదయన వాసవదత్తా కథాశ్రితములు, 2 ప్రణయ వ్యాపార ప్రధానములు, 3 కథా సామ్యము ... నాయికలు రాజకుమార్తెలు. విపద్గ్రస్తులై వాసవదత్త నాశ్రయించుకొరు.దాసులుగా మారు పేర్లతోనుంటారు.నాటకాంతమున వాస్తవికత తెలుస్తుంది వాసవదత్త పశ్చాత్తాపపడుతుంది- ఈర్ష్యాళువైన వాసవదత్తయందు సోదరి అనురాగము ఉదయిస్తుంది వాసవదత్త స్వయముగా తన భర్తతో వారికి పెళ్ళిచేస్తుంది, 4 శృంగార రస ప్రాధాన్యములు, 5 ధీరలలిత నాయక యుక్తములు, 6. ప్రేమికుల కలయికకు విదూషకుడు సహాయంచేస్తాడు నాయికలకు కారాగారశిక్ష, 7. శృంగార రసోపయుక్త వాతావరణ కల్పనము- ఇలాంటివెన్నో సాదృశ్యములు కనిపించుచున్నవి. ఆలంకారికులు ఈ రెండు నాటకములను 'నాటికా క్లుప్త వృత్తాస్యాత్ స్త్రీప్రాయా చతురంకికా। ప్రఖ్యాతో ధీరలలిత స్తత్రస్యాన్నాయకో నృపః' అని లక్షించిన నాటికల కుదాహరణములుగా పేర్కొన్నారు.

**నాగానందము :** 5 అంకముల నాటకము 1. జీమూతవాహనుడు మిత్రావసువుయొక్క సోదరియగు మలయవతిని ప్రేమిస్తాడు, 2. మిత్రావసువుయొక్క అనుమతిచే ఇద్దరికి వివాహము నిశ్చయమౌతుంది, 3. నాయికా నాయకుల వివాహ, విహారములు, 4, సముద్ర తటమున ఎముకల పర్వతముల చూసి, గరుడునిచే తినబడిన పాములయొక్క ఎముకల రాశులని తెలుసుకొని, జీమూతవాహనుడు బాధపడుతాడు. గరుడునకు ఆహారముగా శంఖచూడుడను పాముకు వంతురాగా, పాముకు బదులుగా జీముతవాహనుడే వధ్య శిలయందు ఉండగా. గరుత్మంతుడు ఎత్తుకొనిపోతాడు, 5.జీమూతవాహనుని శౌర్యమునకు। ఆత్మవిశ్వాసమునకు గరుడుడు ఆశ్చర్యపోతాడు- గౌరీదేవి కృపచే బ్రతుకుతాడు- అమృతవర్షముచే చనిపోయిన పాములన్ని బ్రతుకుతాయి- ఇకపైన సర్పములను భక్షించనని గరుత్మంతుని ప్రతిజ్ఞతో నాటకము ముగుస్తుంది.

బేతాళ పంచవింశతి బృహత్కథలందు కనిపించు బౌద్ధ కథ దీనికాధారము. ఈ నాటకముపై బౌద్ధధర్మ ప్రభావమెంతేని ఉన్నది ఇందు అహింస, ఆత్మబలిదానము - దయ - పరోపకారములు వర్ణింపబడినవి ఈ నాటకమున పూర్వార్ధమున శృంగారము ఉత్తరార్ధమున కరుణరసము వర్ణింపబడినవి, కావున శ్రీహర్షుని అంతిమ కృతి కావచ్చును ఇందలి నాయకుడు దయావీరుడు, శిబిసదృశుడు - గౌడీరీతి రచనము నవోఢ ప్రథమ సంగమమును వర్ణిస్తూ-

'దృష్టా దృష్టిమధో దదాతి కురుతే నాలాప మాభాషితా
శయ్యాయాం పరివృత్య తిష్ఠతి బలాదాలింగితా వేపతే।

ప్రియురాలు చూడ్కులు క్రిందికి మరలిస్తుంది పలుకగా సరిగా పలుకటంలేదు. శయ్యయందు ముడుచుకొని కూర్చుంటుంది కౌగిలించుకుంటే కంపించిపోతుంది. చెలులందరు వెళ్ళిపోగా తానుకూడా వెళ్ళాలనుకుంటుంది అలాగున ప్రవర్తించి నప్పటికిని ఆ నూత్న వివాహిత ప్రియునకు ఆనందాన్నే కలుగచేస్తుంది అను శ్లోకము స్వాభావిక సుందర వర్ణనకు ఉదాహరణము. స్వాభావిక సౌందర్యమే ఉండగా ఆభరణములేల అని బోధిస్తున్న... ఖేదాయ స్తనభార ఏవ కుచ భారమే భారాన్ని కలిగించగా హారములెందుకు? నితంబ భారముచేతనే తొడలు బాధనొందగా వడ్డాణమెందుకు? ఊరుయుగాన్ని భరించలేక పాదద్వంద్వము వ్యథనొందుతుండగా నూపురములెందుకు? నీ అంగములచేతనే నీవు అలంకరింప బడగా, ఇక అలంకారములెందుకు? అన్న పద్యము కడురమ్యము. శృంగార మునకంటే దయావీర రసాన్ని రమ్యముగావర్ణించినాడు జీమూతవాహనుడు శంఖ చూడుని రక్షించటానికై పాముకు బదులుగా గరుడునికి ఆహారముగా వెళ్ళి వధ్యశిల నధిష్ఠించి 'శయితేన మాతురంకే .. చిన్నప్పుడు తల్లి ఒడిలో పడు కొన్నప్పుడు పొందిన సుఖముకంటే అధికముగా ఈ వధ్యశిలపై నాకు సుఖము కలుగుతూంది అన్న శ్లోకము కవి హృదయ భావనకు నిదర్శనము. కవి దీనిని దయవీరరస ప్రధానముగా తీర్చిదిద్దినాడు

**భట్టనారాయణుడు :** కన్నౌజు నివాసి భట్ట మృగరాజ పది లాంఛితుడు బెంగాలీ ఆది సూరిరాజుచే ఆహ్వానించబడిన ఐదుగురు బ్రాహ్మణులలో ఇతడు ఒకడు. ఆ విధంగా బెంగాలులో స్థిరపడినవాడు.

వ్యాప్తం పదత్రయేణాపి యః శక్తో భువనత్రయం,
తస్య కావ్యత్రయ వ్యాప్తౌ చిత్రం నారాయణస్యకిం॥

అని దండి కావ్యాదర్శ వచనానుసారం ఈ కవి మూడు కృతులను రచించి యుండవచ్చును. వేణీసంహారము మాత్రమే లభించుచున్నది. ఈతనిచే రచింప బడిన కృత్యారావణ నాటకము పేరు వినబడుచున్నది. ధనంజయుడు (క్రీ॥శ॥ 1000), ఆనందవర్ధనుడు (క్రీ॥శ॥ 850) వామనుడు (క్రీ॥శ॥800) వేణీసంహార మును ఉదాహరించినారు, కావున క్రీ॥శ॥ 725 ఈతని కాలమని చెప్పవచ్చును. వేణీసంహారము మహాభారతాధారము ఇందు 6 అంకములున్నవి. కథను పరిశీ లిస్తాము. 1) నిండు కొలువులో పాంచాలికి కలిగిన పరాభవానికి ప్రతీకారంగా భీముడు దుశ్శాసనుని వక్షోరుధిరమును త్రాగుదుననియు, దుర్యోధనుని తొడలు విరుగ్గొట్టి, తద్రక్తముచే ద్రౌపది కేశముల ముడివేయుదుననియు ప్రతిజ్ఞ చేస్తాడు. శ్రీకృష్ణుడు రాయబారిగా దుర్యోధనుని కొలువుకూటము చేరి సంధి గావింప ప్రయత్నించి విఫలుడై, వారు బంధింపరాగా, విశ్వరూపమును ప్రద ర్శిస్తాడు. 2) యుద్ధమున అభిమన్యుడు మరణిస్తాడు. భానుమతికి కలపడ్తుంది. ఆ కలలో ఒక నకులము (ముంగిస) రెండు పాములను సంహరింపగా, నకుల పరాక్రమమున కాకర్షితకాగా, దుర్యోధనుడు తన అర్ధాంగి నకులునిపై (పాండ వునిపై) ఆకర్షితయని తలంచి, సంహరింప ఉద్యుక్తుడౌతాడు. కలతనొందిన భానుమతి మేల్కొని ఇది కల అని ఊరడిల్లుతుంది దుర్యోధనుడు రాగా ఆనంద ముతో విహరిస్తుంది. 3) కర్ణుడు ఘటోత్కచుని వధిస్తాడు. దృష్టద్యుమ్నుడు ద్రోణుని వధిస్తాడు. ద్రోణవధానంతరము సేనానాయకునిగా అశ్వత్థామను కృపాచార్యులు సూచించ, దుర్యోధనుడు కర్ణుని నియమిస్తాడు. అంత కర్ణాశ్వ త్థాములకు వాగ్యుద్ధము జరుగుతుంది. అశ్వత్థామ శస్త్రసన్యాసముచేసి వెళ్ళి పోతాడు. భీముడు దుశ్శాసనుని వక్షోరుధిరమును త్రాగుచున్నాడని తెలుస్తుంది. 4) దుశ్శాసనుని రక్షింప వెడలిన దుర్యోధనుడు క్షతగాత్రుడౌతాడు. అర్జునుడు కర్ణపుత్రుడైన వృషసేనుని సంహరిస్తాడు. 5) అర్జునుడు కర్ణుని వధిస్తాడు. భీమార్జునులు పినతండ్రియగు ధృతరాష్ట్రునికి నమస్కరింపరాగా, అక్కడనే భీమదుర్యోధనులకు వాగ్యుద్ధమారంభమౌతుంది అశ్వత్థామ కర్ణునియొక్క వీరస్వర్గ వార్తను విని యుద్ధసన్నద్ధుడై దుర్యోధనుని వ్యవహారముచే అసం తుష్టుడై మరలిపోతాడు. 6) శల్యుడు మరణిస్తాడు. భీమునకు భయపడి

దుర్యోధనుడు మడుగులో దాక్కుంటాడు సహదేవుడు తెలుపగా భీముడు దుర్యోధనుని పిరికితనమును నిందించగా, మడుగునుండి బయటకు వచ్చిన దుర్యోధనుడు భీమునితో యుద్ధముచేస్తాడు గదాయుద్ధమున దుర్యోధనునిచే భీముడు మరణించినాడని దుర్యోధనుని మిత్రుడగు చార్వాక రాక్షసుడు బ్రాహ్మణరూపమున వచ్చి ధర్మరాజునకు తెల్పగా, ధర్మరాజు, ద్రౌపది అగ్నిలోదూకి ప్రాణత్యాగమునకై సంసిద్ధులౌతారు అంతలో దుర్యోధనుని హతమార్చిన భీముడు సంతోషమున వచ్చి ద్రౌవదీదేవియొక్క వేణులను సంస్కరిస్తాడు భారతమునుండి ఇతివృత్తము గైకొన్నను కవి ఎన్నియో రమణీయ కల్పనలను జోడించినాడు. మూలమున ఊరు భంగ ప్రతిజ్ఞ ఒక్కటేయుండగా, దుర్యోధన రక్తరంజిత కరములతో విడువడిన ద్రౌపది కేశపాశములను సంస్కరించెదనని భీమ ప్రతిజ్ఞ ఇందు ఉన్నది. బదూళ్ళిచ్చిన చాలు అను ప్రస్తావన సంజయ రాయబారమున మూలమున యుండగా, ఇందు శ్రీకృష్ణ రాయబారమున ఉన్నది ప్రభావాతిశయ ప్రదర్శనార్థమై శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని ప్రదర్శింప, ఇందు దుర్యోధనాదుల బంధముల నిరోధింప విశ్వరూపాన్ని ప్రదర్శించుట సహేతుకము. 3వ అంకమునందలి భానుమతీ, ద్రౌపదీ వార్తాలాప ప్రసంగము మూలమున లేదు ద్రోణ వధకు పూర్వమే కర్ణ, అశ్వత్థామల వాగ్యుద్ధము మూలమున వర్ణింపగా ఇందు ద్రోణ వధానంతరము ఉన్నది దుర్యోధన మిత్రుడగు చార్వాక రాక్షసుడు బ్రాహ్మణ రూపమున వచ్చి, యుద్ధానంతరము ధర్మరాజును నిందించినటుల మూలమున యుండగా, యుద్ధమధ్యమున ధర్మరాజుని మోసగించినటుల ఇందు ఉన్నది రాక్షస రాక్షసీసంవాదము, ద్రోణవధము, కర్ణ, అశ్వత్థామల వాగ్యుద్ధము-భీముడు దుశ్శాసనుని వక్షోరుధిరము నాస్వాదించుట అను విషయములు కలిగిన మూడవ అంకము కడురమ్యమైనది ఈ నాటకమున ఫలభోక్తయగు ధర్మరాజు నాయకుడనుటకంటే,భీమ ప్రతిజ్ఞతతో ఆరంభమైభీమప్రతిజ్ఞాపూర్తిచే ఈనాటకము అంతమొందుతుంది, బీజ, ఆరంభ, కార్య ఫలాగమ, నిర్వహణాదులందు భీముడే ముఖ్యుడు నాటక నామకరణము భీముని ప్రతిజ్ఞ ననుసరించియే చేయబడినది, వీరరస ప్రధానమైన ఈ నాటకమున మూర్తీభవించిన వీరరస స్వరూపుడు భీముడు అన్ని అంకములందు ప్రత్యక్షముగా, అప్రత్యక్షముగా కనిపించువాడు భీముడే, కాపున భీముడే నాయకుడనుట సమంజసము. కొందరు దుర్యోధనుని నాయకునిగా అంగీకరిస్తారు దుర్యోధనుడు కపటిగా, ఈర్ష్యాసూయలు కల

వాడిగా చిత్రింపబడినాడు. మరియు ప్రథమాంకమున కాని చివరి అంకమునకాని కనిపించడు. దుర్యోధనుడు నాయకుడైతే నాటకము దుఃఖాంతమౌతూంది. ఇది భారతీయ నాట్య పరంపరకు విరుద్ధము కావున దుర్యోధనుడు ప్రతి నాయకుడనుటయే సమంజసము ఇక నాటక విషయానికొస్తే- ఇందులో అనేక సంఘటనలున్నవి. వీటిని నాటకీయంగా చిత్రించుటలో కవి అంతగా సాఫల్యమొందలేదు. శ్లోకములు వర్ణనలు కూడా ఎక్కువగా ఉండడముచే నాటకీయ గతి కుంటుబడినది. చిన్నని నాటకములో అనేక విషయాలను చెప్పాలనుకోవడంచేత నాటకము జటిలమైనది. 4వ అంకమునందలి సుందరుడు చేసిన యుద్ధవర్ణనము, అందమైన కవిత కుదాహరణము కావచ్చును కాని, చాలా పెద్దదై, అనావశ్యకమై, నాటకీయ దృష్టిననుసరించి ఇది కొంత విసుగును కలిగింపజేస్తుంది ఇందలి కొన్ని దృశ్యములు ముఖ్య కథకు సంబంధించనివిగా కనిపిస్తాయి. ప్రధాన పాత్రల చరిత్ర చిత్రణముకూడా విశదంగా లేదు. 6వ అంకమునందలి చార్వాకుని సందేశము విన్న ధర్మరాజు ప్రాణత్యాగము చేయబూనుట పరిహాసాస్పదంగా కనిపిస్తూంది. ధర్మజుని ధీరోదాత్తతకు భంగము కలిగిస్తుంది కవి ఇక్కడ కరుణరసాన్ని పోషించాలనుకొన్నాడు. కాని సాఫల్యతనొందలేదు ఇందు అస్వాభావికత, కృత్రిమత, కాంతిహీనతలు కనిపిస్తున్నాయి. కరుణ, రౌద్ర, వీర, భయానక రసములు అవసరం కంటే ఎక్కువగా చిత్రించబడినవి కరుణ చిత్రణాధిక్యము అసహ్యముకాగా, భయానకము బీభత్సమైనది సంస్కృతమునందు కాని ప్రాకృతమునందుకాని ప్రయోగింపబడిన దీర్ఘ సమాసములు, జటిలములైన వాక్య విన్యాసములు సంఘటనా ప్రధానమైన ఈ నాటకంలో అడ్డంకులుగా కనిపిస్తాయి. ఏది ఏమైనప్పటికి వీరరస ప్రధానములైన నాటకములలో ఇది అద్వితీయమైనది. నాటక లక్షణములు పూర్తిగాఅనుసరించబడినవి కావుననే దశరూపకమున ఇందలి శ్లోకములే అధికంగా ఉదాహరించబడినవి. భీముని భయంకరత్వము, దుర్యోధనుని స్వార్థపరత్వ, విలాస ప్రియత్వములు, అశ్వత్థామయొక్క రోష-దయార్ద్ర భావములు, కర్ణుని అహంకారము విశదంగా వర్ణించబడినవి. అవమానముచే రగులుతూన్న ద్రౌపది గుండెను, భీముడు వీరోచితంగా సాంత్వనపరచుట మనోహరంగా వర్ణించబడినది అశ్వత్థామ వాక్యాల్లో బ్రాహ్మణోచితమైన తేజస్సు కర్ణుని ఉక్తులలో కటుత, వ్యంగ్యమును చక్కగా నిరూపించబడినవి. ఇందలి భాష ఓజో గుణయుక్తమైనది, ప్రవాహశాలియైనది భీముడి ప్రతిజ్ఞను వర్ణిస్తూన్న ఈ శ్లోకము వీరరస స్ఫోరకము-

చంచద్భుజ భ్రమిత చండ గదాభిఘాత
సంచూర్ణితోరుయుగళస్య సుయోధనస్య।
స్త్యానావ నద్ధఘన శోణిత శోణపాణిః
ఉ త్తంసయిష్యతి కచాం స్తవ దేవి భీమః॥
ఈ విధంగానే కర్ణుకు పౌరుషంగా పలికిన శ్లోకము
సూతోవా సూతపుత్రోవా యో వా కోవా భవామ్యహం।
దైవాయ త్తం కులేజన్మ మదాయ త్తంతు పౌరుషం॥

భాసుని నాటకముల ప్రభావము వేణీసంహారముపై ఉంది ఉదాహరణకు దూత ఘటోత్కచంలోని ఈ పంక్తులను పేర్కొనవచ్చును.

ధృతరాష్ట్రః : భోః కష్టం, బహూనాం సమవేతానాం ఏకస్మిన్నిర్ఘృణాత్మనాం
బాలం పుత్రం ప్రహరతాం కథం న పతితా భుజాః॥
దుర్యోధనః : తాత, వృద్ధం భీష్మం చత్రైర్హ త్వా తేషాం నపతితా భుజాః।
హత్వాస్మాకం పతిష్యంతి తమబాల పరాక్రమం

వేణీ సంహారంలో ఈ సన్నివేశము ఆ వాక్యాలతోనే పేర్కొనబడింది .. ....

కంచుకి : ఏకో బహుభి ర్బాలః యాన శరాసనశ్చ నిహత ఇత్యత్ర కా శ్లాఘా కురుపుంగవానాం?

దుర్యోధనః : తదత్ర నకశ్చిద్దోషః హతేజరతి గాంగేయే పురస్కృత్య శిఖండినం
యాశ్లాఘా పాండుపుత్రాణాం సైవాస్మాకం భవిష్యతి॥

**చతుర్భాణి :** 4 ఏకాంకికలైన భాణముల సంగ్రహము. ఇవి నాలుగు ఒక దానితో ఇంకొకటి సంబంధము గలవి, సదృశములైనవి, సమానములైనవి. మృచ్ఛకటికమునకు చాలా దగ్గరగా ఉన్నవి. ఇందలి ఉభయాభిసారికము వరరుచిచేతను, పద్మప్రాభృతికము శూద్రకుని చేతను, ధూర్తవిట సంవాదము ఈశ్వరదత్తుని చేతను, పాదతాడితము శ్యామిలకుని చేతను రచింపబడినట్లుగా చెప్పబడుచున్నవి. కాల విషయమున అనేక వాదములున్నవి. క్రీ॥శ॥ 600 కంటే పూర్వము రచింపబడినవనుట నిర్వివాదము.

**భవభూతి :** నాటక వాఙ్మయమున కాళిదాసుతో సమానుడైన వాడు, కృష్ణ యజుర్వేద తైత్తిరీయ శాఖాధ్యాయి, కాశ్యప సగోత్రుడు, భట్ట గోపాలుని పౌత్రుడు, జతుకర్ణి నీలకంఠుల తనయుడు, విదర్భలోని పద్మపుర

వా స్తవ్యుడు. గ్వాలియర్ ప్రాంతంలోని పదమపవాయ్ పద్మపురమని విమర్శకుల అభిప్రాయము తన నాటకములు కాల్ప్రియనాథుని సమక్షంలో ప్రదర్శించబడి నట్లు కూడా చెప్పుకున్నాడు. కాల్ప్రియ అను క్షేత్రంలో వెలసిన దేవుడు కాల ప్రియనాథుడు ఈ కాల్ప్రియమే ఇప్పుడు కాల్పి అని పిలువబడుచున్నది. ఇక్కడ యమునానదీ తీరమున కాల్ప్రియుడైన సూర్యుని దేవాలయమున్నది. ఝూన్సీ-బాందా మార్గములో ఈ కాల్పి ఉన్నది 'శ్రీకంఠ పదలాంఛనః భవ భూతిర్నామ' అను కవి వాక్యాన్ననుసరించి, ఈతనిది శ్రీకంఠుడనునది అసలు పేరని, భవభూతి అను నామము తపస్వీ కాంగతో ఒవస్థా మితిన్నేరాననావివః గిరిజాయా స్తనౌ వందే భవభూతిసితాననౌ॥ అన్న శ్లోకంలో భవభూతిపదాన్ని అందంగా వాడడముచే భవభూతి పేరు వచ్చిందని విమర్శకుల అభిప్రాయము 'భవభూతి రుమ్వేకః' అన్న చిత్సుకాచార్యుని తత్వప్రదీపికకు నయన ప్రసాదిని వ్యాఖ్యానం వ్రాసిన ప్రత్యగ్రూప భగవానుని వాక్యానుసారము 'ఇతిశ్రీభట్ట కుమారిల శిష్యకృతే..'అను మాలతీ మాధవము ఒకప్రతియందలి పుష్పిక ననుస రించియు శంకర పాండురంగ పండిత్ మొదలగు విమర్శకులు శ్లోక వార్తిక వ్యాఖ్యాన కర్తయైన ఉమ్వేకుడు భవభూతి ఒక్కరే అని అభిప్రాయపడినారు. భవభూతి తన గురువు జ్ఞాననిధి అని పేర్కొన్నాడే తప్ప కుమారిలుడని పేర్కొననందున, కుమారిలుని శిష్యుడైన ఉమ్వేకుడు నాటకకర్త భవభూతి భిన్న వ్యక్తులనుటయే సమంజసము ఈ కవి కన్యాకుబ్జాన్ని పరిపాలించిన యశోవర్మ ప్రభువుయొక్క ఆస్థానమున ఆస్థానకవిగా ఉన్నాడు. యశోవర్మ కాశ్మీర ప్రభువైన లలితాదిత్యునిచే (క్రీ॥శ॥ 724-761) ఓడింపబడినాడు. యశో వర్మ క్రీ॥శ॥ 725 నుండి 753 వరకు రాజుగానున్నాడు ఈ కాలములోనే భవ భూతి ఆస్థాన కవిగానున్నాడు ఆ ఆస్థానంలో ఉన్న వాక్పతి రాజుకు సాహిత్య విద్యా గురువుగా ప్రశంసలనందుకొన్నాడు. కావున క్రీ॥శ॥ 680-750 కాలము వాడిగా భవభూతిని పేర్కొనవచ్చును. ఈ కవి మహావీరచరిత నాటకమును, మాలతీ మాధవ ప్రకరణమును, ఉత్తర రామచరిత నాటకమును రచించినాడు.

మహావీర చరితమునందు ఏడు అంకములతో. శ్రీరామ వివాహముతో ఆరంభించి పట్టాభిషేక పర్యంత కథను వర్ణించినాడు. 1) శ్రీరాముడు శివధను స్సును విరచి సీతను పెళ్ళాడగా, రావణుడు కుపితుడౌతాడు. 2) రావణుని మంత్రి మాల్యవంతుడు పరశురామునిచేరి రామునిపై యుద్ధానికి ఉసిగొల్పుతాడు,

3) రామ పరశురాముల యుద్ధము, పరశురామ పరాజయము. 4) శూర్పణఖ మంధర రూపాన్ని ధరిస్తుంది. శ్రీరాముడు 14 సంవత్సరములు అరణ్యము వెళ్ళాలని దశరథుని వరాన్ని, కైకేయి ఉత్తరం వ్రాసినటుల మంథర రామునకు ఉత్తరాన్నిస్తుంది. 5) సీతాపహరణము - జటాయు రావణయుద్ధము - వాలి వధ, సుగ్రీవమైత్రి - విభీషణస్నేహము 6) రామరావణ యుద్ధము, రావణ వధ 7) సీత అగ్నిపరీక్ష - అయోధ్యాగమనము - శ్రీ సీతారామ పట్టాభిషేక ముతో నాటకము ముగుస్తుంది. ఇందులో రామాయణ కథకంటె కొన్ని భిన్న సన్నివేశములు కనిపిస్తాయి. ఇవి కవి కల్పనాశక్తిని ద్యోతింపచేస్తున్నాయి. ఈ నాటకమున కొన్ని సుందరమైన ఘటనలున్నప్పటికీ, నాటక కళానైపుణ్యము కాని, భాషా ప్రౌఢిమకాని, భావాభివ్యక్తి గరిమకాని కనిపించవు. బహుశః ఇది కవియొక్క మొదటి రచన కావచ్చును.

## మాలతీమాధవము ప్రకరణమను రూపకభేదము :

ఇందు పది అంకములతో మాలతీ మాధవుల, మరియు మదయంతికా మకరందుల ప్రణయ పరిణయములు చిత్రింపబడినవి 1) విదర్భరాజుయొక్క మంత్రియైన దేవదత్తుని పుత్రుడు మాధవుడు పద్మావతీ దేశాధీశ్వరుని మంత్రి యగు భూరివసువుయొక్క పుత్రిక మాలతి. ఈ మంత్రులిద్దరు వియ్యమొందు టకు మొదటనే నిశ్చయించుకొంటారు పద్మావతీ దేశాధీశ్వరుని బావమరిది నందనుడు మాలతిని వివాహమాడుటకు రాజసాహాయ్యాన్ని కూడా పొందుతాడు. ఈ నందనుని సోదరి మదయంతిక మాలతికి మిత్రురాలు - ఆమెను మాధవుని మిత్రుడగు మకరందుడు ప్రేమిస్తాడు 2) రాజు మాలతిని నందనునకిమ్మని బలవంతపెట్టుటచే భూరివసు పంగీకరిస్తాడు, కామందకి రహస్యముగా మాలతీ మాధవులకు గాంధర్వ వివాహాన్ని జరిపింప నిశ్చయిస్తుంది. 3) కామందకి ప్రయత్నమువలన మాలతీ మాధవులు శివాలయ లతాకుంజమున కలుసు కొంటారు అక్కడ మదయంతికను సింహము పట్టుకోగా, మకరందుడు సింహాన్ని సంహరించి ఆమెను రక్షిస్తాడు మకరందుని ధైర్య సాహసముల చూసి మద యంతిక అతన్ని ప్రేమిస్తుంది గాంధర్వవిధిగా మాలతీ మాధవులు భార్యాభర్త లౌతారు. 4) మాలతికి నందనునితో వివాహము నిశ్చయముకాగా మాధవుడు నిరాశుడై స్మశానస్థలి చేరుకొంటాడు. 5) అఘోరఘంటుని శిష్యురాలు కపాల కుండల. ఆమె నరబలికై మాలతి నెత్తుకొనిపోయి గురువుకిస్తుంది. ఈ విష

యము తెలుసుకొన్న మాధవుడు అఘోరఘంటుని చంపి మాలతిని రక్షిస్తాడు. 6) గురువధచే కోపగించిన కపాలకుండలవారిని విడదీయుటకు ప్రతిజ్ఞచేస్తుంది మాలతీనందనుల వివాహమునందు మకరందుడు మాలతీవేషాన్ని ధరించి, నంద నుణ్ణి వివాహమాడుతాడు. 7) శోభనపు రాత్రి మాలతీవేషాన్ని ధరించిన మక రందుడు నందనుణ్ణి నిరాకరిస్తాడు - అంత అతని సోదరి, వదినను బ్రతిమి లాడరాగా, ఆ మదయంతికతో తన నిజతత్వాన్ని చెప్పి మాలతీ మాధవుల వద్దకు వెళ్లుతాడు. 8) మాలతి వెళ్ళిపోయిందని రాజభటులు మకరందుని బంధించగా మాధవుడు వచ్చి రాజభటులను పరాజితులచేస్తాడు. మాధవ, మక రందుల శౌర్య బలపరాక్రమములకు రాజు ఆశ్చర్యపడి అభయాన్నొసగుతాడు - ఇంతలో కపాలకుండల మాలతినపహరిస్తుంది 9) సౌదామిని మాలతిని రక్షించి, మాధవునితో కలుపుతూంది. 10) మాలతి శోకముచే తండ్రియగు భూరిమిత్ర, కామందకి, మదయంతికాదలు ప్రాణముల విడువ సన్నద్ధులౌతారు అంత సౌదామిని వారికి మాలతీ వృత్తాంతమును తెలుపుతుంది రాజుయొక్క అనుగ్రహముచే మకరందుడు మదయంతికను, మాధవుడు మాలతిని వివాహ మాడుతారు

'ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే' అని వైశిష్ట్యమునొందిన ఉత్తర రామచరితమీతని మూడవ కృతి. ఏడు అంకములతో కూడుకొన్నది 1) రాజ్యాభిషిక్తుడైన శ్రీరాముడు ఒకనాడు సీతకు సీతావివాహోదారభ్య అగ్ని పరీక్ష వరకు కల చిత్రపటముల చూపించగా, సీత తిరిగి అరణ్యముల చూడా లన్న తన ఉత్సుకతను వెల్లడిచేస్తూంది. లోకాపవాదముచే సీతను అరణ్యములకు పంపిస్తాడు 2) అక్కడ సీత లవకుశులను ప్రసవిస్తూంది. వారిని పెంచి పెద్ద వారినిచేసి విద్యాభ్యాసమునకై వాల్మీకివద్ద ఉంచుతుంది. శ్రీరాముడు అశ్వమేధ యాగాన్ని చేయతలంచి, అశ్వరక్షణకై లక్ష్మణపుత్రుడగు చంద్రకేతువును నియ మిస్తాడు. శంబూకుడను శూద్రుడు తపమాచరించ, రాముడు అతనిని సంహ రించుటకై పంచవటిని చేరుకొంటాడు. 3) అక్కడ సీతతో విహరించిన ప్రదేశ ముల దర్శిస్తూ, పూర్వపు సంఘటనల స్మరిస్తూ మూర్ఛిల్లుతాడు సీతాదేవి అదృశ్యరూమున వచ్చి సాంత్వనపరుస్తూంది. వాల్మీకి ఆశ్రమమునకు కౌసల్య, జనకచక్రవర్తి, అరుంధతీ - వశిష్ఠులు చేరుకొంటారు. అక్కడ లవుని చూసి శ్రీరాముని బాల్యావస్థను స్మరించుకొంటారు. అశ్వమేధ యాగాశ్వము ఆశ్రమ

సమీపమునకు వచ్చినదని విన్న లవుడు అశ్వాన్ని బంధింప బయల్వెడలుతాడు. 5) లవుడు జృంభణాస్త్రాన్ని ప్రయోగించి అశ్వాన్ని బంధిస్తాడు. 6) అశ్వాన్ని విడిపింప లక్ష్మణుని కుమారుడు చంద్రకేతువు వివిధాస్త్రములను ప్రయోగించగా, లవుడు చంద్రకేతువుని బంధిస్తాడు శ్రీరాముని రాకచే లవుడు శాంతుడౌతాడు. లవకుశులు సీతాపుత్రులు కావచ్చునని శ్రీరాముడు తలంచుతాడు. 7) వాల్మీకి ఆశ్రమమున సీతయొక్క పవిత్రతను తెలుపు నాటకము ప్రదర్శింపబడుతుంది. సీత నిర్దోషియని తేలుతుంది శ్రీరాముడు సీతాలవకుశులతో అయోధ్యకు బయలు దేరుతాడు.

వాల్మీకి రామాయణమున ఉత్తరకాండయందు 42 సర్గలనుండి 67 సర్గల వరకు వర్ణింపబడిన, శ్రీరామ పట్టాభిషేక సీతాంతర్ధాన కథలను, పద్మపురాణాను సారముగా సుఖాంతముగా తీర్చిదిద్దినాడు రామాయణ కథలో శ్రీరాముని శీలానికి వెరగని మచ్చ అనదగిన సీతా పరిత్యాగమును చక్కగా మలచిన కీర్తి భవభూతికి దక్కుతుంది ఇందులకై ఎన్నో రమణీయ కల్పనల గావించినాడు 1) చిత్రపట ప్రదర్శనము 2) అదృశ్యగూపమున సీత ఓదార్చుట 3) కౌసల్యా అరుంధతీ వశిష్ఠాది ప్రముఖులు వాల్మీకి ఆశ్రమమును చేరుకొనుట 4) నాటక ప్రదర్శనము. 5) శ్రీరాముడు సీతను స్వీకరించుట మొదలగునవెన్నో ఈతని రమణీయ కల్పనలు పతాకా సన్నివేశములు రమ్యముగా నిరూపించబడినవి

స్నేహం దయాంచ సౌఖ్యంచ యదివాజానకీమపిచ ।
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తిమే వ్యథా॥

అని శ్రీరాముడు వలుకగా 'ప్రాప్తః' అని కంచుకి సీతావియోగాన్ని సూచిస్తాడు. సీతయందు వనవాస కౌతూహలాన్ని కల్పించి భావి అరణ్యవాసాన్ని సూచిస్తాడు.

అద్వైతం సుఖదుఃఖయోరనుగతం సర్వాస్వవస్థాసుయత్
విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్నహార్యోరసః।
కాలేనావరణాత్యయా త్పరిణతే యత్స్నేహసారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకం హి తత్ప్రార్థ్యతే॥

అని దాంపత్య జీవితాన్ని రమ్యంగా వర్ణించినాడు అలాగే

ఇయంగేహే లక్ష్మీ రమృతవర్తి ర్నయనయోః
అసా వస్యాః స్పర్శో వపుషి బహుళ శ్చందనరసః॥
అయంబాహుః కంఠే శిశిరమసృణో మౌక్తికసరః
కిమస్యా న ప్రేయో యదిపరమసహ్యస్తు విరహః॥ అని గృహలక్ష్మిని

చిత్రించినాడు. సీతయొక్క స్నేహితురాలు వాసంతి రాముణ్ణి ఆక్షేపిస్తూ

త్వంజీవితం త్వమసి మే హృదయం ద్వితీయం
త్వం కౌముదీ నయనయోరమృతం త్వమంగే
ఇత్యాదిభిః ప్రియశతై రనురుధ్య ముగ్ధాం
తామేవ శాంతమథవా కిమిహో త్తరేణ॥

'శాంతమథవా' అను వాక్యములోని భావాభివ్యక్తిని సహృదయ జనరంజకముగా చిత్రించినాడు. ఈ నాటకమున కరుణ ప్రధానరసము.

ఏకోరసః కరుణఏవ నిమిత్త భేదాద్భిన్నః పృథగ్ పృథగివాశ్రయతే వివర్తాన్।
ఆవర్త బుద్బుద తరంగ మయాన్వికారానంభో యథా సలిలమేవహితత్సమస్తం॥

అని, 'పుటపాక ప్రతీకాశో రామస్య కరుణోరసః' అనియు వాచ్యముగానే కరుణ రసాన్ని పేర్కొన్నాడు. ఇందులో మళ్ళీ కలుస్తారన్న ఆశ అసలేలేదు కావున, విప్రలంభ శృంగారాని కుదాహరణంగా సీతాత్యాగాన్ని పేర్కొనరాదు.

**మహేంద్ర విక్రమవర్మ :** (క్రీ॥శ॥ 620) పల్లవరాజు, కంచి నగరాధీశుడు ఏకాంకికమైన మత్తవిలాస ప్రహసనమును రచించినాడు ఒక త్రాగిన కాపాలికుడు సంచరిస్తూ, బౌద్ధ భిక్షువుని చూసి, తన భిక్షాపాత్రను దొంగిలించినాడని పంచాయతీ పెడతాడు. ఒక పాశుపతుడు రాగా బౌద్ధభిక్షువు నుండి భిక్షాపాత్ర నిప్పించమంటాడు. చివరకు ఒక పిచ్చివాడి చేతిలో భిక్షాపాత్ర లభిస్తుంది. హాస్యరస ప్రధానమైనది.

**చంద్రుడు :** [(క్రీ॥శ॥ 650) లోకానందమను నాటకమును రచించినాడు.

**మురారి :** అనర్ఘరాఘవమును రచించినాడు తంతుమతీ - వర్ధమానకట్టు లితని జననీజనకులు. గురుకులమున ఉండి శిక్షనభ్యసించినటుల

దేవీం వాచముపాసతే హి బహవఃసారంతు సారస్వతం
జానీతే నితరామసౌ గురుకులక్లిష్టో మురారిః కవిః॥
అబ్ధిర్లంఘిత ఏవవానరభటైః కింత్వస్య గంభీరతా
మాపాతాళ నిమగ్న పీవర తను ర్జానాతి మంథాచలః॥

అని పేర్కొన్నాడు. రత్నాకరుడు (క్రీ॥శ॥ 850) హరవిజయమున (క్రీ॥శ॥ మురారిని నాటక కర్తగా స్మరించినాడు. శ్రీకంఠచరిత కర్తయైన మంఖుకుడు

(క్రీ॥శ॥ 1135) మురారిని రాజశేఖర పూర్వవర్తిగా పేర్కొన్నాడు. ఉత్తర రామచరితము నందలి రెండు శ్లోకములు అనర్ఘరాఘవమున (6.30, 31) ఉద్ధరించబడినవి. కావున మురారి క్రీ॥శ॥ 800 వాడిగా చెప్పవచ్చును. మాహిష్మతీ (మాంధాతా) నగరమీతని నివాస స్థానమని విమర్శకుల అభిప్రాయము ఈతని అనర్ఘరాఘముపై భవభూతి మహావీరచరిత ప్రభావమెంతేని ఉన్నది. ఇందు 7 అంకములున్నవి తాటకవధ మొదలుకొని శ్రీ రామ పట్టాభిషేకము వరకు వర్ణించబడినది, రామాయణకథ నాధారంగా తీసుకొని కొన్ని అందమైన మార్పులను చేసినాడు కబంధరాక్షసుడు పంచవటిపై దండెత్తిరాగా, లక్ష్మణుడు చంపినాడు ఈ సందర్భముననే దుందుభి కళేబరము వ్రేలాడుచున్న వట వృక్షముకూడా పడగొట్టబడినది. దీనిచే ఉత్తేజితుడైన వాలి శ్రీరామునిపై దండెత్తిరాగా, యుద్ధమున వాలి చంపబడినాడు. 7వ అంకమున పుష్పకవిమాన యాత్ర అందంగా వర్ణించబడినది. శ్రీరాముడు సుమేరు పర్వతము, చంద్ర లోకాదుల సంచరించి, మలయ, ప్రస్రవణ పర్వతములమీదుగా కంచి, కుండిన పురము, ఉజ్జయిని. మాహిష్మతి, యమున, గంగ, వారాణసీ, మిథిల, చంప, ప్రయాగ మొదలగు తీర్థ క్షేత్రముల దర్శించి, అయోధ్యను చేరుకొంటాడు. భయానక, భీభత్స రసవంతములైన నాటకముల చూసుటచే జుగుప్సనొందిన ప్రేక్షకులను రంజింపచేయడానికై అద్భుత, వీరరస ప్రధానమైనదానిగా దీనిని రచించినటుల పేర్కొన్నాడు శ్రీరాముని చరిత్రమును వర్ణించు కృతిలో స్వయంగానే సౌష్ఠవము, ఉదాత్తత వస్తాయి, కావున ప్రసిద్ధమైన రాముని చరిత్రను ఉపయోగించుకోకపోవడము తప్పు అవుతుందని పేర్కొన్నాడు. ఏది ఏమైనప్పటికి ఈతని అవసరంలేని కొన్ని వర్ణనలు విస్తారములైనవి. నాటకము లోని పాత్రలు పౌరాణిక జ్ఞాన ప్రబోధకములై, పాతరూపాన్ని అలాగే ధరించి యున్నవి. ఈతని వ్యాకరణ పాండిత్యము నాటకమున, నాటకీయతకంటే ఎక్కువగా ప్రదర్శించబడినది ఈ కవియొక్క అతిశయోక్తులు చమత్కార జనకములు. ఉదాహరణ శ్లోకము.

అనేనరంభోరు భవన్ముఖేన తుషారభానోస్తులయా ధృతస్య।
ఊనస్య నూనం ప్రతిపూరణార్థం తారాస్ఫురంతి ప్రతిమానఖండాః॥

మురారి తనను బాలవాల్మీకి అని పేర్కొన్నాడు. కొందరు భవభూతికంటె మురారిని గొప్పవాడిగా పేర్కొన్నారు.

మురారి పద చింతాయాం భవభూతేస్తు కాకథా।
భవభూతిం పరిత్యజ్య మురారిమురరీ కురు॥

మురారి పదముల అర్థము తెలవాలంటే మాఘము చదువవలయునని, విష్ణుపాద ములచింతనము కావాలంటే పాపబుద్ధిని వదలిపెట్టుమని శ్లేషతో బోధిస్తున్న శ్లోకమిది.

మురారి పద చింతాచేత్ తదా మాఘేమతింకురు।
మురారి పద చింతాచేత్ తదామాఽఘే మతింకురు॥

**అనంగహర్ష మాతృరాజు :** (క్రీ॥శ॥ 800) ఆరు అంక ములు కల్గిన తాపస వత్సరాజమును రచించినాడు. వాసవదత్త మరణవార్తను విని ఉదయనుడు, జీవితముపై విరక్తిచెంది, తాపసుడౌతాడు. చివరకు నదిలో దూకి ప్రాణత్యాగము చేయబోగా, వాసవదత్త కూడా జీవితంలో విసిగి, నదిలో దూకి ప్రాణత్యాగం చేయడానికిరాగా, ఇద్దరు కలుసుకుంటారు. ఆనందవర్ధనుడు ఈ కవిని పేర్కొన్నాడు, కావున క్రీ॥శ॥ 800 వాడని చెప్పవచ్చును. చేది దేశ మును, మాహిష్మతీ రాజధానిగా చేసుకొని పాలించిన కలచూరి వంశజుడైన నర్సింహవర్ధన రాజపుత్రుడైన, **మాయురాజు** (క్రీ॥శ॥ 800) రామాయణా శ్రితమైన ఉదాత్త రాఘవమును రచించినాడు ఇది లభించుటలేదు. కాని ధని కుడు దీనిని పేర్కొన్నాడు కలింజరాధిపతి, చందేలవంశ **భీమటరాజు** (భీమదేవుడు) (క్రీ॥శ॥ 800) 5 నాటకములను వ్రాసినాడు. ఇవి లభించుట లేవు కాని స్వప్నదశాననం, ప్రతిజ్ఞా చాణక్యములు అభినవగుప్తునిచే పేర్కొన బడినవి. మూడవది మనోరమావత్సరాజము, ఇంకా రెండింటి పేర్లు కూడా తెలి యడంలేదు ఈతని పుత్రుడు వసునాగుడు ప్రతిమానిరుద్ధమును వ్రాసినాడు. అభినవగుప్తునిచే ఇదియును పేర్కొనబడినది. కాశ్మీరరాజైన అవంతివర్మ (క్రీ॥శ॥ 855-883) ఆస్థానకవి అయిన **శివస్వామి** అనేక నాటకములను, నాటికలను రచించినట్లుగా రాజతరంగిణి తెలుపుచున్నది.

**శక్తిభద్రుడు :** శంకరాచార్యుల (క్రీ॥శ॥ 788-820) శిష్యుడు, కేరళీయుడైన శక్తిభద్రుడు (9వ శతాబ్ది) ఆశ్చర్య చూడామణిని రచించినాడు భాసుని నాటకములవలె 'నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః' అని నాట కము ప్రారంభించబడినది. ఇది శూర్పణఖ వృత్తాంతముతో ఆరంభమై, రావణ

వధ, సీత అగ్ని పరీక్షతో ముగుస్తుంది. పంచవటిలో సీత ఒంటరిగా ఉండగా రావణుడు రాముడి వేషాన్ని ధరించి ప్రవేశిస్తాడు. రావణుని సారథి లక్ష్మణుని రూపమున వచ్చి 'అయోధ్యలో భరతుడు శత్రువుల చేతిలో చిక్కినాడు' అని తాపసులవలన విన్నాననియు, సీతారాములు త్వరలో అయోధ్యకు వెళ్ళవలయు నని బోధిస్తాడు. అంత సీత నిజమని నమ్మి రామునివేషం ధరించిన రావణునితో వెళ్ళుతుంది. శూర్పణఖ సీతరూపమున పంచవటిలో ప్రవేశిస్తుంది మాయ లేడి రూపంలో వున్న మారీచుని తరిమి గాయపరుస్తాడు గాయపడిన మారీచుడు రాముని రూపమున పంచవటికి వస్తాడు. నిజమైన రాముడు తప్పగా రాముని వేషంలో వున్న మారీచుడు మరణిస్తాడు శూర్పణఖ కూడా నిజరూపంతో నిలుస్తుంది. రాముడు క్షమించి ఆమెతో రావణునకు ఈ సందేశాన్ని పంపిస్తాడు.

త్వరితగతినా సద్యః సీతాత్వయా నతు వంచితా।

నియత విధవాధారా దారాశ్చిరం తవ వంచితాః (२.40)

ఈ నాటకంలో అద్భుతమహిమలు కల్గిన చూడామణి ప్రధానపాత్ర వహిస్తుంది, కావున ఈ పేరు. ఇందు అద్భుతరసము ప్రధానమైనది అంకావతారము, విష్కంభకములను యథేష్టంగా ప్రయోగించి, నాటకమున మంచి నడుక తేబడి నది. ఇందలి భాష సహజమై, అర్థగర్భితమై, ప్రసాద గుణయుక్తమైనది. ఇందు ఉదాహరణంగా 'ఆర్య కింస్నేహస్తులయతి గుణదోషాన్ కథ మౌష్ఠ్యమగ్నే ర్భాద్యతే' ఇత్యాదులను పేర్కొనవచ్చును. ఈతని శ్లోకములు ప్రసాద. మాధుర్య గుణముల మిశ్రమ రూపమైన వైదర్భీరీతిన రచింపబడినవి ఉదాహరణకు దండకారణ్యమున లక్ష్మణుడు శూర్పణఖను చూసి పలికిన ఈ శ్లోకము.

క్వేదం వనం వనచరై రపి దుర్విగాహం క్వేయం వధూః కువలయచ్ఛవి చోరనేత్రా।

హైమారవింద మకరంద రసోపయోగాం కః శ్రద్దధీత జలధౌ కలహంసకన్యాం॥ (3.15)

ఉన్మాద వాసవదత్తమను ఉదయన- వాసవదత్త కథాశ్రితమైన నాటకముకూడా ఈతనిచే రచింపబడినది. కాని ఇది లభించుటలేదు.

కొందరు అజ్ఞాత కర్తృకంగా, అసమగ్రంగా, లభిస్తున్న వీణావాసవదత్త నాటకాన్ని, శక్తిభద్రుని ఉన్మాద వాసవదత్తంగా భావిస్తారు. ఇందు భాసనాటక లక్షణములు ఎక్కువగా కనిపిస్తాయి ఇది ప్రతిజ్ఞా యౌగంధరాయణముయొక్క రూపాంతరంగా భాసిస్తుంది.

**కులశేఖరవర్మ :** (క్రీ॥ శ॥ 800) కేరళరాజు 5 అంకములు కల్గిన, అద్భుత రసప్రధానమైన, సుభద్రాధనంజయ నాటకమును రచించినాడు. ఇందు అర్జునుడు సన్యాసిరూపమున వచ్చి, సుభద్రను తీసుకొనిపోయి, పెళ్ళిచేసుకొనుట వర్ణింపబడినది. 6 అంకములతో, అద్భుత రసప్రధానమైన తపతీ సంవరణమును కూడా రచించినాడు. తపతీ సంవరణుల కథ ఇందు వర్ణింపబడినది.

**దామోదరమిశ్రుడు :** హనుమన్నాటకమును కూర్చినాడు. ధ్వన్యాలోకమున ఆనందవర్ధనునిచే (క్రీ॥శ॥ 850) ఇది పేర్కొనబడినది, కావున క్రీ॥శ॥ 850 కి పూర్వమే నాటకం రచింపబడినట్లుగా చెప్పవచ్చును. ఇది రెండు శాఖలలో లభించుచున్నది. మొదటిది పశ్చిమ భారతానికి సంబంధించిన దామోదరమిశ్రుడు కూర్చిన 14 అంకముల ప్రాచీన నాటకము. ఇందులో మొదట ప్రస్తావనలేదు. కథ రామాయణాధారమైనది. ఇందులో శ్లోకములెక్కువ ఉన్నవి. గద్యములు తక్కువగాఉన్నవి. ప్రాకృతభాష అసలే వాడబడలేదు. పాత్రలెక్కువగా ఉన్నప్పటికి విదూషకుడులేడు. రెండవది బెంగాల్ ప్రాంతానికి చెందిన మధుసూదనుడు కూర్చిన 9 అంకముల నాటకము. హనుమంతుడు 14 అంకములతో, ఖండితములైన కథాంశములతో, హనుమన్నాటకమును రచించినాడట. అసలు ప్రతి దొరకగపోగా, ఖండితాంశముల పూరించి దామోదరమిశ్రుడు ఈ నాటకమును కూర్చినటుల పేర్కొన్నారు.

రచిత మనిలపుత్రేణాథ వాల్మీకి నాబ్ధౌ<br>
నిహితమమృతబుద్ధ్యాప్రాఙ్మహానాటకంయత్।<br>
సుమతి నృపతి భోజేనోద్ధృతం తత్క్రమేణ<br>
గ్రథిత మవతు విశ్వం మిశ్ర దామోదరేణ॥

అందువలనేమో నాటకమక్కడక్కడ అసంపూర్ణంగా కనిపిస్తుంది. కవియొక్క కల్పనాచాతుర్యం ఈ నాటకమున చక్కగా ప్రతిబింబించినది ఉదాహరణకు జటాయు యుద్ధాన్ని వర్ణించు ఈ శ్లోకాన్ని చూస్తాము.

అక్షం విక్షిపతి ధ్వజందలయతే మృద్నాతి నద్ధం యుగం<br>
చక్రం చూర్ణయతి క్షిణోతి తురగాన్ రక్షః పతేః పక్షిరాట్।<br>
రుంధన్ గర్జతి తర్జయత్యము మపత్యాలంబతే తార్క్ష్య-<br>
త్యాకర్ష త్యవలుంపతి ప్రచలతి న్యంచత్యు దంచత్యపి॥

**రాజశేఖరుడు :** మహారాష్ట్ర యాయావరజాతికి చెందిన క్షత్రియుడు. శీలవతి దుదకులీతని జననీ జనకులు. అవంతి సుందరియను సుశిక్షితురాలైన చాహమానజాతి విదుషి ఈతని అర్ధాంగి. కీర్తి సంపదల నార్జించుటకై కన్నౌజ రాజ్యమునకు వెళ్ళినాడు తన అంతిమ కాలాన్ని కాశీలో గడిపినట్లు తెలుపుతూంది శ్లోకము.

> కర్ణాటీ దశనాంకితః శ్రితమహారాష్ట్రీ కటాక్ష క్షతః
> ప్రౌఢాంధ్రీ స్తనపీడితః ప్రణయినీ భ్రూభంగ విత్రాసితః।
> లాటీ బాహువివేష్టితశ్చ మలయస్త్రీ తర్జనీ తర్జితః
> సోఽయం సంప్రతి రాజశేఖరకవిః వారాణసీం వాంఛతి॥

బాలకవి, కవిరాజు ఈతని బిరుదులని కర్పూరమంజరి ద్వారా తెలుస్తున్నది. మహేంద్రపాలుని, అథవా నిర్భయరాజుకు గురువుగా నాటకములందు పేర్కొన్నాడు. క్రీ॥శ॥ 903 నందు క్రీ॥శ॥ 908 నందును మహేంద్రపాలుడు దాన మొసంగినటుల సియదోనీ శాసనములు పేర్కొనుచున్నవి, ఈ కవి ఉద్భటుని (క్రీ॥శ॥ 800), ఆనందవర్ధనుని (క్రీ॥శ॥ 885) పేర్కొన్నాడు. యశస్తిలక చంపూనందు (క్రీ॥శ॥ 959), తిలకమంజరియందు (క్రీ॥శ॥ 1000), వ్యక్తి వివేకమునందును (క్రీ॥శ॥ 1150) ఈ కవి పేర్కొనబడినాడు. కావున 10వ శతాబ్ది ఈతని సమయమని నిర్ధారించవచ్చును ఈ కవి కర్పూర మంజరి, విద్ధ శాల భంజిక, బాలరామాయణము, బాలభారతము నాల్గు నాటకములను రచించినాడు. అలంకార శాస్త్రమునందు కావ్యమీమాంస, హరవిలాసము కృతికూడా ఈతనిచే రచింపబడినవి. హరవిలాసము లభించుటలేదు కాని ఉణాది సూత్ర వృత్తికారుడు, ఉజ్వలదత్తుడు దీనిని పేర్కొన్నారు.

కర్పూరమంజరి ప్రాకృతభాషలో వ్రాయబడిన 4 అంకముల సట్టకము, నృత్యప్రధాన నాటకము దీనిలోని కథ రత్నావళితో సదృశమైనది. చండపాల రాజు, కుంతలదేశ రాజకుమారి కర్పూరమంజరి, వీరి ప్రేమకథ చిత్రింపబడినది. ఇందలి కథ చిన్ననైనది చరిత్ర చిత్రణముకూడా సాధారణమైనది. అయినప్పటికిని అనేక దృష్టికోణములచే ఈ నాటకము గొప్పనైనది. ప్రాకృత భాషయందు ఆసాంతం వ్రాయబడిన ఒకేఒక నాటకము. (2) ఇందు నాంది తరువాత సూత్రధారుని స్థానమున, స్థాపకుడు శ్లోకాన్ని చదువుతాడు (3) ఈ నాటక ప్రస్తావనచే, ఆ కాలమున స్త్రీలే స్త్రీ పాత్రలు ధరిస్తున్నారని తెలుస్తుంది.

(4)ఇందులో ప్రవేశకముయొక్క ప్రయోగము లేదు అంకముయొక్క పేరు జవని కాంతరమని పేర్కొనబడినది. రంగమంచమునందలి పర్దాకు జవనికాపదము ప్రప్రథమంగా ఇచ్చటనే ప్రయోగించబడినది. హావభావములకు ప్రాధాన్యముకల చర్చరీ నృత్య ప్రయోగమిందు ఉన్నది పురాతత్వ, భాషావిజ్ఞాన, గ్రామగీతాది విషయాన్వేషణమునకై చాలా సామగ్రి ఉన్నది. స్త్రీ పురుషులలో ఉన్నంత సుకుమార తారతమ్యము ప్రాకృత సంస్కృత భాషలలో ఉన్నదని రాజశేఖరుని అభిప్రాయము ఈతడు ప్రయోగించిన ప్రాకృతము స్వాభావికంగానే మాధుర్య గుణ సంయుక్తము. పదలాలిత్యదృష్ట్యా కర్పూరమంజరి ఒక విశిష్ట స్థానా న్నలంకరించినది ప్రాకృత పదలాలిత్యమును అనుప్రాసయొక్క అందమును, గీతిమాధుర్యమును ద్యోతింపజేయు ఈ ఉదాహరణాన్ని పరిశీలిస్తాము.

రణంత మణి ణేఉరం ఝణఝణంత హారచ్ఛడం
కణక్కణి అకింకిణీ ముహల మేహ లాడంబరం।
విలోలవల అవలీ జణి అమంజు సింజారవం
ణ కస్స మణమోహణం ససిముహీమ హిందోలణం॥

కర్పూరమంజరి 3వ అంకమున విదూషకుని స్వప్నవర్ణనము అత్యంత వినోద భరితము, రసవంతము. రాజుయొక్క విరహబాధ, విదూషకుని వినోద ప్రియ త్వము ఈ రెండు ఒకదానితో ఇంకొకటి కలసి, రోచకమైనవి, పరిహాసపూర్ణము లైనవి నాటకమునందలి సంవాదములు సజీవములు. ఈ నాటకంలోని ప్రాకృత భాషలో దేశీ శబ్దములు కొన్ని ప్రవేశించినవి, శ్లోకములలో మహారాష్ట్రి ప్రాకృ తము, గద్యములలో శౌరసేనీ ప్రాకృతము వాడబడినవి.విద్ధశాల భంజిక నాల్గు అంకములు కల్గిన నాటిక. ఇందలి కథ కూడా కర్పూర మంజరివలె మనో హరము, రోచకమైనది. అంకానుసారంగా కథను పరిశీలిస్తాము. 1) లాటదేశపు రాజు చంద్రవర్మ,తన కూతురైన మృగాంకవతిని మృగాంకవర్మ అనే పేరుతో కొడుకు అని ప్రకటించి, విద్యాధరమల్లుని రాణి దగ్గరకు పంపుతాడు. ఆ రాజు మంత్రి భాగురాయణుడు మృగాంకవర్మ ఆడపిల్ల అని, ఆమెను పెళ్ళిచేసుకొన్న వాడు చక్రవర్తి అవుతాడని తెలుసుకొంటాడు. అందుకే మంత్రి మృగాంక వర్మను రాజుదగ్గర ఉండేటట్లు చేస్తాడు. ఒక సుందరి కనిపించి, అతడు పట్టు కొనబోయేసరికి ముక్తాహారాన్ని విసరివేసి మాయమైనట్లుగావిద్యాధరమల్లునికి కలవస్తుంది. ఆ కలలో చూసిన సుందరి (విద్ధశాల భంజిక) బొమ్మను చిత్ర

కాలలో ప్రతిష్ఠిస్తాడు. 2) మహారాణి, కుంతల రాజకుమారి కువలయమాలతో మృగాంకవర్మ పెళ్ళిచేయాలని అనుకుంటుంది. మృగాంకవర్మ నిజ (స్త్రీ) రూపంలో ఉద్యానవనంలో ఆడుతుండగా రాజు చూస్తాడు. తాను కలలో చూసిన విద్ధశాల భంజికయే అని ప్రేమిస్తాడు. 3) విదూషకుని సహాయముచే రాజు మృగాంకవతిని కలుసుకొంటాడు. 4) లాటదేశాధిపతి చంద్రవర్మకు కొడుకు పుడుతాడు. ఇక చంద్రవర్మ పుత్రవేషధారి మృగాంకవతిని విద్యాధరమల్లుని కిచ్చి పెళ్ళిచేయాలనుకొంటాడు ఏమీచేసేదిలేక రాణికూడా మృగాంకవతితో పాటు కువలయమాలను కూడా రాజుకిచ్చి పెళ్ళిచేస్తుంది. బాలరామాయణము 10 అంకములు కల్గిన మహానాటకము సీతాస్వయంవరమున శివధనుస్సునెత్త లేక రావణుడు, సీతను పెళ్ళియాడినవాణ్ణి సహించేదిలేదని భయపెట్తాడు. రామునికి విరుద్ధంగా పరశురాముణ్ణి ప్రేరేపిస్తాడు రావణుడు సీతావిరహ పీడి తుడై, సీతాప్రతిమను పొందుతాడు సీతకొరకు సరస్సులను, పక్షులను యాచి స్తాడు ముక్కుచెవులు కోయబడిన శూర్పణఖను చూసి క్రోధావేశ మానసు డౌతాడు. సీతనపహరిస్తాడు. లంకకు వస్తున్న సేనాసహితుడైన రాముణ్ణి చూసి, మాయాసీత తలను నరికి ఎన్నో మాయల ప్రదర్శిస్తాడు చివరగా రామునిచే చంపబడుతాడు. సీతాగ్నిప్రవేశము, సీతారాముల అయోధ్యా గమనంతో నాట కము ముగుస్తుంది ఇందలి 10 అంకములు క్రమముగా ప్రతిజ్ఞాపౌలస్త్యం,రామ రామణీయం, విలక్ష లంకేశ్వరం, భార్గవభంగం, ఉన్మత్త దశాననం, నిర్దోశ దశరథం, అసమపరాక్రమం, వీరవిలాసం, రావణవధ, సానందరాఘవం అని పేర్లని కలిగియున్నవి. ఈ నాటక రచనచే కవి, తనను వాల్మీకి అవతారముగా భావించాడు.

బభూవ వల్మీక భవః కవిః పురాతతః ప్రపేదే భువి భర్తృ మేంఠతాం।
స్థితః పునర్యో భవభూతిరేఖయా సవర్తతే సంప్రతిరాజశేఖరః॥

ప్రచండ పాండవమని నామాంతరం కలిగిన బాలభారత నాటకములోని 2 అంక ములు మాత్రమే లభించుచున్నవి. ఇందు ద్రౌపదీ స్వయంవరం, ద్యూతక్రీడ, ద్రౌపదీ వస్త్రాపహరణము, పాండవ వనవాస గమనము చిత్రించబడినవి.

**క్షేమీశ్వరుడు :** రాజశేఖరుని సమకాలికుడు, కన్నౌజు మహీ పాల రాజు నాశ్రయించిన క్షేమీశ్వరుడు, (క్రీ॥శ॥ 10వ శతాబ్ది) హరిశ్చంద్రుని సత్యవ్రత మహిమను తెలుపుతూ, చండకౌశిక నాటకమును వ్రాసినాడు. ఇది

ఋగ్వేద ఐతరేయ బ్రాహ్మణమునందలి హరిశ్చంద్ర శునశ్శేపో పాఖ్యానముపై, మరియు మార్కండేయ పురాణ హరిశ్చంద్రకథపైనను ఆధారపడినది. ఈతని భాష సరళము గతిశీలము. 7 అంకములు కలిగిన నైషధానందమును ఈతనిచే రచింపబడినవి. ఇందు నలదమయంతుల కథ వర్ణింపబడినది. దశరూపకముపై టీకను వ్రాసిన **ధనికుడు** (11వ శతాబ్ది) 10వ శతాబ్దంవరకు లభించుచున్న నాటకములను పేర్కొంటూ పాండవానందము, తరంగదత్తము, పుష్పదూషిత కము, ఛలితరామము నాలుగు నాటకములను పేర్కొన్నాడు, మూడు నాట కములు లభ్యంకావడంలేదు చివరికి నాటకకర్తల పేర్లుకూడా తెలియడంలేదు.

ఛలితరామాయణంలో 6 అంకములున్నవి. రామాయణ ఉత్తరకాండ కథాసంబంధమైనది లవణాసురుని గూఢచారులు చితాముఖ సుమాయులు, కైకేయి మంథరలుగా వచ్చి, సీత శీలాన్నిగూర్చి చెడ్డగా రామునికి చెప్తారు రాముడు నమ్మి సీతను అడవులకు పంపిస్తాడు చివరకు లవణాసురుణి జయించ డముచే కథ ముగుస్తుంది ఇందులవుడు బందీగా అయోధ్యకు తీసుకపోబడు తాడు. అక్కడ బంగారు సీతను చూసి, తన తల్లిబొమ్మ ఇక్కడ ఎందుకున్న దని ప్రశ్నిస్తాడు. ఇంతవరకే నాటకం లభిస్తుంది.

**దిగ్నాగుడు** : కుందమాలను రచించినాడు. ఈతడు ఐదవ శతాబ్ది బౌద్ధ తార్కిక దిగ్నాగుడికంటే భిన్నుడు ధీరనాగుడు వీరనాగుడనియు ఈతనిని అందురు. 11వశతాబ్దపు రామచంద్ర గుణచంద్రుడు ఈతనిని స్మరించు టచే తత్పూర్వవర్తియని,పదవ శతాబ్దపువాడని చెప్పవచ్చును. సీతా పరిత్యాగము నుండి ఆరంభమై సీతారాముల కలయికతో ఈ నాటకము శుభాంతమౌతుంది. ఈ నాటకమున 6 అంకములు ఉన్నవి. గోమతీనదీ తీరమున సంచరిస్తున్న రామ లక్ష్మణులు నదీతీరమున కొట్టుకొని వస్తూన్న గిరిమల్లికా (కుంద) పూలదండను చూసి, సీతను కలుసుకొంటారు, కావున 'కుందమాల' అని పేరుపెట్టబడినది. అంకానుసారి కథను పరిశీలిస్తాము. (1) శ్రీరాముని ఆజ్ఞపై లక్ష్మణుడు గర్భ వతియైన సీతను గంగాతీరమున వదలిపెడ్తాడు. వాల్మీకి మహర్షి తన ఆశ్ర మమునకు తీసుకొనిపోతాడు. (2) జన్మించిన లవకుశులకు వాల్మీకి రామాయ ణాన్ని బోధిస్తాడు. నైమిషారణ్యమున రాముడు అశ్వమేధయాగాన్ని చేస్తున్నా డని తెలుసుకొని, సీతతోసహా వెళ్ళాలనుకుంటాడు. (3) పుత్రులతోసహా సీత

నైమిషారణ్యాన్ని చేరుకుంటుంది గోమతీ నదిలో కుంద పూలమాలను చూసి, సీతచేతనే నిర్మింపబడినదని తలంచుతూ, సీతను స్మరిస్తూ విహ్వాలుడౌతాడు. దగ్గరలో లతాకుంజమునుండి సీత ఈ కరుణదృశ్యాన్ని చూస్తుంది. (4) తిలోత్తమ అను అప్సరస, సీతవేషము వేసుకొని రామునివద్దకు వచ్చి, రాముని కలవరపరుస్తూంది (5) శ్రీరామునిముందు లవకుశులు రామాయణాన్ని పాడుతారు. (6) భూమాత ప్రత్యక్షమై. అందరి సమక్షంలో, సీత పవిత్రురాలని నిరూపిస్తుంది. సీతారాముల కలయికచే నాటకం ముగుస్తూంది. కుందమాల, ఉత్తర రామచరితము ఈ రెండు చాలా పోలికలు కలిగియున్నవి. ఈ రెండును రామాయణ ఉత్తరకాండపై ఆధారపడినవి. ఈ రెండును సుఖాంతములు, రెంటియందును అదృశ్యంగా సీత రావడము హృదయంగముగా కల్పించబడినది దిగ్నాగుని కంటె భవభూతి ఉత్తమ నాటకకర్తగా సాఫల్యత నొందినాడు. కుందమాల ఉత్తర రామచరిత్రను అనుకరించినట్లుగా కనిపిస్తుంది. భావుకత, మౌళికత, సరసతలలో భవభూతి దిగ్నాగునికంటే శ్రేష్ఠుడు. రచనాత్మకదృష్ట్యా ఉత్తర రామచరితము శ్రేష్ఠమైనను, క్రియాశీలత్వదృష్ట్యా కుందమాల శ్రేష్ఠమైనది. కుందమాలలో కొన్ని త్రుటిత వాక్యములున్నను, ప్రాకృత ప్రయోగములు సంస్కృతానువాదములవలె కనిపించినను, ఈతని భాష సరళము, సుబోధము. ఈతని శైలి ప్రసాద గుణయుక్తము, గత్యాత్మకము, సరసము. కరుణరస వర్ణనలో కవి అందెవేసినవాడు. రామునిచే వదిలిపెట్టబడిన సీతను చూసి పశు-పక్ష్యాదులు కూడా బాధపడినాయని వర్ణిస్తూన్న శ్లోకమిది.

ఏతే రుదంతి హరిణా హరితం విముచ్య హంసాశ్చ శోకవిధురాః కరుణంరుదంతి।
నృత్తం త్యజంతి శిఖినోపి విలోక్యదేవీం తిర్యగ్గతావరమమీ నపరం మనుష్యాః॥

**హస్తిమల్లుడు :** (9వ శతాబ్ది) గోవిందుని పుత్రుడు, అర్జున రాజ భరతరాజ, మేఘేశ్వర, మైథిలీపరిణయ, సుభద్రాహరణ, అంజనాపవనంజయ, విక్రాంత కౌరవాది నాటకములను రచించినాడు.

**క్షేమేంద్రుడు :** (క్రీ॥శ॥ 1050) చిత్రభారతం, కనక జానకి రెండు నాటకములను రచించినట్లు అలంకార శాస్త్ర గ్రంథాలవల్ల తెలుస్తుంది.

**బిల్హణుడు :** (క్రీ॥శ॥ 1080) నాలుగు అంకములు కలిగిన, కర్ణసుందరి నాటికను రచించినాడు. ఇది రత్నావళి. విద్ధశాల భంజికల పోలి

యన్నది. అనిహిలపాడ ప్రభువైన చౌళుక్య త్రైలోక్యమల్ల కర్ణదేవుడు, కర్ణాటక సుందరి మియనల్ల దేవిని పెళ్ళాడుట ఇందు చిత్రింపబడినది. శృంగార రసప్రధానమైనది.

**కృష్ణమిశ్రుడు :** (క్రీ॥శ॥ 1050-1116) జేజాకముక్తి చందేల రాజైన కీర్తిరాజైన కీర్తివర్మ (క్రీ॥శ॥ 1100) ఆస్థానకవి. గోపాలుని ఆజ్ఞచే కీర్తివర్మ సాన్నిధ్యమున ప్రబోధ చంద్రోదయ నాటకము ప్రదర్శించబడినట్లు ప్రస్తావన వలన తెలియుచున్నది. ప్రబోధ చంద్రోదయము శాంత రసప్రధానమైన, ప్రతీకాత్మకమైన (Allegorical) నాటకము. అద్వైత వేదాంత ప్రబోధము చక్కనైన శైలిలో నిర్వహించబడినది బాసుని బాలచరితంలోని, అశ్వఘోషుని నాటకంలోను ఈ ప్రతీకాత్మకత ఆరంభింపబడి, ఈ నాటకంలో పరిణతినొందినది. ఇందు యోగము, జ్ఞానము, వివేకము, విద్య, బుద్ధి, శ్రద్ధ, భక్తి, దంభము మొదలగు అమూర్తములైన భావములు స్త్రీ-పురుష రూపులుగా భావించబడి, అధ్యాత్మ విద్య చక్కగా నిరూపించబడినది భక్తి జ్ఞాన సమన్వయము చక్కగా చూపబడినది బ్రహ్మము, సంసారము ఈ రెంటిని పోలుస్తూ చెప్పిన శ్లోకమిది.

శాంతేఽనంత మహిమ్ని నిర్మల చిదానందే తరంగావళీ
నిర్ముక్తేఽమృతసాగరాంభసి మనాఙ్మగ్నోపి నాచామతి।
నిస్సారే మృగ తృష్ణికార్ణవజలే శ్రాంతోఽపి మూఢః పిబ
త్యా చామ త్యవగాహతేఽభిరమతే మజ్జ త్యథోన్మజ్జతి॥

'ద్వాసుపర్ణా ..' అను మంత్రముయొక్క అభిప్రాయము ఈ క్రింది శ్లోకములో చక్కగా వివరించబడినది.

ఏకః పశ్యతి చేష్టితాని జగతామన్యస్తు మోహాంధధీః
ఏకః కర్మఫలాని వాంఛతి దదాత్యన్యస్తు తాన్యర్థినే।
ఏకః కర్మసు లిప్యతే తనుభృతాం శాస్త్రైవదేవోఽపరో
నిస్సంగః పురుషః క్రియాసు స కథం క ర్తేతి సంభావ్యతే॥

దాంభిక తాపసుల స్వరూపమును వర్ణించు శ్లోకమిది.

వేశ్యా వేశ్మసు సేధుగంధి లలనా వక్త్రాసవామోదితైః
నీత్వానిర్భర మన్మథోత్సవ రసైః రున్నిద్ర చంద్రాః క్షపాః।

సర్వజ్ఞా ఇతి దీక్షితా ఇతి చిరాత్ ప్రాప్తాగ్నిహోత్రా ఇతి
బ్రహ్మజ్ఞా ఇతి తాపసా ఇతి దివారాత్రైర్జగద్వంద్యతే॥

నాటకీయ శరాదృష్టి ననుసరించి, ఈ నాటకము సాఫల్యము నొందకున్నను, ఇతని ఉద్దేశ్యము అత్యుత్తమము కావున ప్రశంసనీయము.

**జయదేవుడు :** (క్రీ॥శ॥ 12వ శతాబ్ది) రామాయణమునుండి ఇతి వృత్తమును గ్రహించి ప్రసన్న రాఘవమును రచించినాడు. సుమిత్రా మహాదేవు లితని జననీ జనకులు. కుండిన నగరమితని జన్మస్థానము ఇతని చంద్రాలోకము సంస్కృతాలంకారిక వాఙ్మయమున మిక్కిలి ప్రసిద్ధము. గీత గోవింద కర్తయగు జయదేవు డితనికంటె భిన్నుడు. ఈ నాటకమున 7 అంకము లున్నవి. సీతా స్వయంవరము మొదలుకొని రావణవధ, అయోధ్యా పునరాగమనము, శ్రీరామ పట్టాభిషేక పర్యంత కథ ప్రసన్నముగా వర్ణింపబడినది. ఇతని శైలి సరళమైనది, ప్రసాద మాధుర్య గుణ గుంఫితములై ఇతని శ్లోకములు అమృత నిష్యందములు, కావుననే పీయూషవర్షుడని ప్రసిద్ధినొందినాడు ఇతని కవితచే తులసీదాసు ప్రభావితుడై రామచరిత మానసమును హిందీలో రచించినాడని ప్రతీతి జయదేవుని సమకాలికుడైన మిథిలదేశస్థుడైన ఉమాపతి ఉపాధ్యాయ పారిజాతా హరణమును గీతినాటికను వ్రాసినాడు. శ్రీకృష్ణుడు ఇంద్రుని జయించి, పారిజాత వృక్షమును తీసుకొనిపోయి, సత్యభామకిచ్చుట వర్ణింపబడినది. మైథిలీ భాషలో వ్రాయబడిన కొన్ని గీతములు కూడా దీనియందు కనిపించుచున్నవి

**విగ్రహరాజదేవుడు IV :** వీసలదేవుడని నామాంతరం కలిగిన శాకంబరి దేశాధీశ్వరుడు, చాహమాన వంశజుడు, అర్ణో రాజయొక్క పుత్రుడు హరకేళి నాటకమును రచించి, క్రీ॥శ॥ 1153 న అజ్మీరునందు శిలా ఫలకములపై చెక్కించినాడు. ఇందు కిరాతార్జునీయమునందలి కథ, శివార్జునుల యుద్ధము అర్జునునకు పాశుపతాస్త్ర ప్రాప్తి వర్ణింపబడినది. సుభాషితావళిలో ఇతని శ్లోకము కూడా ఉద్ధరింపబడినది. అజ్మీరునందే, ఈ నాటకముతోపాటు సోమదేవునియొక్క లలిత విగ్రహరాజ నాటకముకూడా శిలాఫలకములపై చెక్కబడినది. ఈ సోమదేవుడు విగ్రహరాజదేవుని ఆస్థానకవి. ఇందు ఇంద్రపుర ప్రభువైన వసంతపాలునియొక్క కూతురైన దేసలదేవి- విగ్రహరాజదేవుల

ప్రణయ వివాహము వర్ణించబడినది. తన ఆశ్రయదాతను పొగడుతూ వ్రాసిన నాటకము కావున, అతిశయోక్తిమయము. ఉదాహరణకు విగ్రహ రాజదేవ హమ్మీరుల యుద్ధవర్ణనము. విగ్రహ రాజదేవుడు హమ్మీరునితో యుద్ధమసలే చేయలేదు.

**శంఖధరుడు :** (క్రీ॥ శ॥ 12వ శతాబ్ది) కన్యాకుబ్జ రాజైన గోవిందచంద్రుని ఆస్థానకవి, లటకమేళకమను హాస్యరస ప్రధానమైన ప్రహసనాన్ని రచించినాడు. ఇందులో ధూర్తుల సమ్మేళనం చిత్రించబడినది.

**యశశ్చంద్రుడు :** (క్రీ॥ శ॥ 12 వ శతాబ్ది) 5 అంకములు కలిగిన ముదిత కుముద చంద్రమను ప్రకరణమును రచించినాడు. ఇందు శ్వేతాంబర జైనాచార్యుడు దేవసూరి (క్రీ॥శ॥ 1124) దిగంబర జైనాచార్యుడైన కుముద చంద్రుని శాస్త్ర వాదమున ఓడించి నోరు కట్టివేస్తాడు.

**కాంచనాచార్యులు :** (క్రీ॥శ॥ 12వ శతాబ్ది) భారత గోగ్రహణ కథ నాధారంగా తీసుకొని, ధనంజయ విజయమను వ్యాయోగమును వ్రాసినాడు.

**రామకృష్ణుడు :** (క్రీ॥శ॥ 12వ శతాబ్ది) గుజరాత్ దేశస్థుడు. గోపాలకేళీ చంద్రికమను సంగీత రూపకాన్ని వ్రాసినాడు. ఇందలి శ్లోకములు గీతములవలె నున్నవి.

**శంకరకవి :** (క్రీ॥శ॥ 12వ శతాబ్ది) కాశీవాసి. శారదాతిలకమను భాణమును రచించినాడు. ఇందు రసిక శేఖరుడని సార్థకనాముడైన విటుడు కోలాహలపుర వీధుల్లో సంచరిస్తూ, తాను చూసిన దృశ్యాలను వర్ణిస్తాడు. సామాజిక జీవనమిందు ప్రతిబింబించినది.

**రామభద్రముని :** (క్రీ॥ శ॥ 12 వ శతాబ్ది) జయప్రభసూరి శిష్యుడు, ప్రబుద్ధ రౌహిణేయమను ప్రకరణాన్ని వ్రాసినాడు..

**జినమండనుడు :** (12వ శతాబ్ది) క్రీ॥శ॥ 1159 నందు జరిగిన కృపాసుందరి కుమారపాలుర (గుజరాత్ రాజు) వివాహమును చిత్రిస్తూ, కుమారపాల ప్రబంధ నాటకమును వ్రాసినాడు.

**వత్సరాజు :** కాలింజర రాజైన పరమర్ది దేవుని (క్రీ॥శ॥1163-1203) మంత్రి మరియు సామంతుడు. ఈ వత్సరాజు ఆరు నాటకములను వ్రాసినాడు. 1) కర్పూరచరితము.ఏకాంకికమైన భాణము ఇందు కర్పూరుడను ద్యూతగాడియొక్క అనుభవములు రమ్యంగా వర్ణింపబడినవి. 2) హాస్యచూడామణి - హాస్యరస ప్రధానమైన ఏకాంకిక ప్రహసనము 3) కిరాతార్జునీయ వ్యాయోగము - భారవి కావ్యాధారంగా వ్రాయబడిన ఏకాంకిక వ్యాయోగము. 4) రుక్మిణీహరణము - నాలుగు అంకములు కలిగిన ఈహామృగ రూపక భేదమిది. ఇందు శ్రీకృష్ణుడు రుక్మిణిని రాక్షసవిధిగా పెళ్ళిచేసుకొనుట వర్ణించబడినది. 5) త్రిపురదాహము - నాలుగు అంకములు కలిగిన ఈడిమమునందు శివుడు త్రిపురాసురుని నగరములను ధ్వంసంచేయుట, రౌద్రరసప్రధానంగా చిత్రించబడినది 6)సముద్రమంథనము - మూడు అంకములు కలిగిన సమవకారమిది. ఇందు దేవతలు, రాక్షసులు సముద్రమును మథించుట, అందునుండి 14రత్నములు ఉదయించుట' లక్ష్మీనారాయణుల వివాహాదులు చిత్రింపబడినవి. భాసునివలె అనేక ప్రకారములైన రూకముల రచించిన ఖ్యాతినొందినవాడీకవి. ఈతని శైలి ప్రసాద గుణయుక్తమైనది. దీర్ఘ సమాసములులేవు. వాక్యవిన్యాసము సరళంగా ఉంది.ఈతని నాటకములలో ఘటనా - ఘటనము, రోచకత్వము, నాటకీయ క్రియాశీలతలున్నవి. ఉదాహరణకొక శ్లోకము-

సిధ్యంతి కామాః బలినాంబలేన లోకస్థితిః కింతు నలంఘనీయా ।
దృష్ట్వైవ సంహర్తు మలం గిరీశః శత్రుచ్ఛిదే సజ్జయతి త్రిశూలం॥

**మహటుడు :** (12వ శతాబ్ది) దూతాంగదమును రచించినాడు. కుమారపాలదేవునిచే (క్రీ॥శ॥ 1147-1172) సోమనాథ దేవాలయము పునరుద్ధరించబడినది. ఆ సంఘటన స్మృతిచిహ్నంగా క్రీ శ. 1242న ఉత్సవం జరుపబడగా, అనిహిలవాడ్ ప్రభువైన త్రిభువనపాల దేవుని రాజ్యమునందు, ఈ నాటకము ప్రదర్శించబడినది రావణుని దర్బారుకు అంగదుడు రామ రాయబారిగా వెళతాడు. సంధి విఫలంకాగా యుద్ధమారంభమౌతుంది. సుభటుకూడా దూతాంగదమును రచించినాడు. ఇందలి ఒక మనోహర శ్లోకము.

భోభోరావణ రావణాఃకతి బహవోనేతాన్వయం శ్రుమః
ప్రాగేకం కిల కా ర్తవీర్య నృపతేర్దోర్దండ పిండీకృతం।

ఏకం న స్తన దాపితాన్న కబళం దైత్యేంద్ర దాసీజనైః
ఏకం వక్తుమపి త్రపామహే ఇతి త్వం తేమకో౽న్యో౽ధవా॥

**మదనుడు :** (క్రీ॥శ॥ 13వ శతాబ్ది) పరమార రాజైన అర్జున వర్మయొక్క గురువు. పారిజాత మంజరిని రచించి, క్రీ శ. 1213న ధారా నగరమున భోజుని సరస్వతీ భవనమునందు శిలాఫలకములపై చెక్కించినాడు: 2 అంకములు మాత్రమే లభించుచున్నవి. అర్జునవర్మ గుజరాత్ ప్రభువైన చాళుక్యరాజును జయించగా, ఆ యుద్ధమున అతని కుమార్తె పారిజాతమంజరి ప్రాచాళ్యాగంధేని పారిజాత పుష్పముల గుత్తిగా పుడుతుంది. తరువాత అందమైన యువతిగా మార్పుచెంది అర్జునవర్మచే ప్రేమింపబడి పెళ్ళిచేసుకొనబడుతుంది.

**యశఃపాలుడు :** గుజరాత్ చాళుక్యరాజగు అజయపాలుని (క్రీ శ. 1229-1232) మంత్రి, 5 అంకములు కలిగిన మోహరాజపరాజయమను ప్రతీకాత్మకమగు నాటకమును వ్రాసినాడు. ఇందు అమూర్తములైన పాత్రలతోపాటు కొన్ని మానవపాత్రలు కూడా ఉన్నవి. జైన మతగురువైన హేమచంద్రసూరి ప్రభావముచే గుజరాత్ చాళుక్య రాజు కుమారపాలుడు జైన మతమును స్వీకరించుట ఇందు వర్ణించబడినది. అజయపాలుని ఆస్థానమునవేఉన్న

**రామచంద్రుడు :** (క్రీ.శ. 13వ శతాబ్ది) ప్రబంధ శతకర్తగా పేర్కొనబడినాడు. ప్రబంధ శతమనునది కృతినామమని కొందరు, 100 ప్రబంధముల కర్తయని మరికొందరి అభిప్రాయము. నలవిలాసము, నిర్భయభీమ వ్యాయోగము, సత్యహరిశ్చంద్ర, కౌముదీ మిత్రానందము, రాఘవానందము, యాదవాభ్యుదయము మొదలైనవి ప్రసిద్ధ నాటకములు. నాట్యదర్పణముకూడా ఇతనిచేతనే వ్రాయబడినది.

**జయసింహసూరి :** (క్రీ.శ.1230) హమ్మీర మదమర్దనమను 5 అంకములు కలిగిన నాటకమును రచించినాడు. గుజరాత్ దేశంపై దండెత్తి వచ్చిన హమ్మీరుడు మొదలగు మహమ్మదీయులను వీరధవళుడనురాజు, అతని మంత్రి వస్తుపాలుడు జయించుట ఇందు వర్ణింపబడినది. వస్తుపాలప్రశస్తి కావ్యముకూడా ఇతనిచే రచింపబడినది.

**వేదాంతదేశికులు :** (క్రీ శ. 1268.1369) సంకల్ప సూర్యోదయమను ప్రతీకాత్మక నాటకమును వ్రాసినారు. మోహపరాజయము, వివేక జయము, శాంతిరస ప్రధానంగా నిరూపింపబడినవి

సంగ్రామధీరుడని ఖ్యాతినొందినవాడు, యాదవవంశీయులైన ఉమాదేవి జయసింహవీర కేరళుల తనయుడైన **రవివర్మరాజు :** (క్రీ శ 13వ శతాబ్ది) 5 అంకములు కలిగిన ప్రద్యుమ్నాభ్యుదయమును రచించినాడు

శ్రీకృష్ణుని పుత్రుడైన ప్రద్యుమ్నుడు వజ్రపుర రాజైన వజ్రనాభుని జయించి, అతని కుమార్తెయైన ప్రభావతిని పెళ్ళియాడుట ఇందు వర్ణించబడినది ఇందలి రంభాభినరణమను అంతర్నాటకము అందంగా చిత్రించబడినది శృంగారరసము చక్కగా పోషించబడినది

చంద్రావతీ పరమార యువరాజు, యశోధవళుని తనయుడు, ధారాధవళుని సోదరుడగు **ప్రహ్లాదనుడు** (క్రీ శ 1291 . 1322) పార్థపరాక్రమమను వ్యాయోగమును రచించినాడు భారత, విరాట పర్వమునందలి గోగ్రహణకథ ఇందు చిత్రింపబడినది మోక్షాదిత్యుడు భీమవిక్రమ వ్యాయోగమును రచించినాడు

కాకతీయరాజులు వరంగల్లును రాజధానిగా చేసుకొని పాలించినారు వీరు శివభక్తులు. సంస్కృతాభిమానులు రాణి రుద్రమదేవి మనుమడైన రెండవ **ప్రతాపరుద్రుడు** (క్రీ శ. 2296.1323) కవిపోషకుడేకాక, స్వయంగా కవి. ఏడు అంకములు కలిగిన యయాతి చరిత్ర నాటకమును రచించినాడు అప్పయ్య దీక్షితుడు దీనిలోని శ్లోకములను ఉదాహరించినాడు ఇందు వృషపర్వ రాజు తన భార్యయైన దేవయానివద్ద దాసిగా ఉంటున్న శర్మిష్ఠ అను రాజకుమార్తెను పెళ్ళాడుట రమ్యంగా వర్ణింపబడినది, మాళవికాగ్నిమిత్రమునందు అగ్నిమిత్రుడు మాళవికను, రత్నావళియందు ఉదయనుడు సాగరికను పెళ్ళాడినటుల కథాసామ్యమేకాక, అన్నిటియందును ఆ నాటకములను పోలియున్నది

ఈ రాజుయొక్క ఆస్థానకవి విద్యానాథుడు ప్రతాపరుద్రీయములో నాటకప్రకరణమునందు,నాటక లక్షణముల కుదాహరణంగా ప్రతాపరుద్రకళ్యాణమను నాట

కమును వ్రాసినాడు. ఈ కాకతీయ రాజుల ఆశ్రయమునుపొందిన, అగస్త్యపండితుని మేనల్లుడైన, **విశ్వనాథుడు** : (క్రీ శ. 1315) సౌగంధికాపహరణమను వ్యాయోగాన్ని రచించినాడు సిద్దోద్వాహ కావ్యకర్తయైన **నరసింహకవి** (క్రీ శ. 1350) 8 అంకములు కలిగిన కాదంబరీ కళ్యాణమను నాటకమును రచించినాడు. బాణుని కాదంబరి కథయే నాటకరూపమున ప్రస్తుతించబడినది.

అప్రాప్త సఖా స్తంబోద్భవిపన్న హిరణ్యకశిపురపి।
అవికృతముఖోఽపి దశసు ప్రకల్పతే రూపకేషు నరసింహః॥

దశవిధములైన రూపకములలో చతురుడుగా చెప్పుకొన్నాడు. మహాకవి చంద్రశేఖరుని తనయుడు, సాహిత్య దర్పణకర్తయైన విశ్వనాథుడు (క్రీ.శ 14వ శతాబ్ది) సౌగంధికాహరణ వ్యాయోగమును రచించినాడు. తిరుమలదేవుని పుత్రుడైన విశ్వనాథదేవుడు మృంగాంక లేఖానాటికను వ్రాసినాడు ఇందు 4 అంకములున్నవి. కళింగదేశాధీశ్వరుడైన కర్పూరతిలకరాజు, కామరూప రాజకుమార్తెయైన మృగాంకలేఖను వివాహము చేసుకొనుట ఇందు వర్ణించబడినది. విశ్వనాథ కవిరాజు చంద్రకళా నాటికను రచించినాడు

**జ్యోతిరీశ్వరుడు** (క్రీ శ. 14వ శతాబ్ది) సిమ్‌రాన్ నగరాధీశ్వరుడైన హరిసింహుని (క్రీ శ 1324) మిత్రుడు, ధీరేశ్వరుని తనయుడు, కవిశేఖరాచార్యుడని ఖ్యాతినొందిన జ్యోతిరీశ్వరుడు ధూర్త సమాగమమను ప్రహసనమును రచించినాడు. అనంగసేనయను వేశ్యకై విశ్వనగురు అను జంగమ గురువు అతని శిష్యులు పోట్లాడుకొంటారు అసజ్జతిమిశ్రవద్దకు తీర్పుకై వెళతారు. ఆ బ్రాహ్మణుడు న్యాయనిర్ణయ మయ్యేంతవరకువేశ్యతనదగ్గరఉంటుందని చెప్తాడు. హాస్యరసం చక్కగా పోషించబడినది. ముండిత ప్రహసనమును ఈతనిచే రచింపబడి యుండవచ్చును. దీనిలో గ్రంథకర్త పేరు శివజ్యోతిరీశ్వరుడని పేర్కొనబడి యున్నది శివజ్యోతిరీశ్వరుడనియు ఈతని పేరు కావచ్చును. పంచసాయకమను ఖండకావ్యము కూడా ఈతనిచే రచింపబడినది.

**శాస్కరభట్టు** ; (క్రీ శ. 1350) ఉన్మత్త రాఘవమను ఏకాంకిక నాటికను రచించినాడు. సీత ఉద్యానవనమున పూలను కోసినదై, దుర్వాస మహర్షి శాపముచే లేడిగా మారుతుంది. సీతావియోగాన్ని భరించలేని రాముడు ఉన్మత్తుడౌతాడు. అగస్త్యుడు శాపవిమోచనం కావించి సీతను రామునితో కలుపు

తాడు విక్రమోర్వశీయం చతుర్థాంకమును అనుకరిస్తూ వ్రాయబడినది. ఇది హేమచంద్రునిచే కావ్యానుశాసనమున పేర్కొనబడిన ఉన్మత్త రాఘవమునకంటే భిన్నమైనది రాచకొండరాజైన అనపోతనాయకుడు (క్రీ శ 1367) అభిరామ రాఘవమను నాటకాన్ని వ్రాసినాడు ఈతని తనయుడు రాచకొండ సింగభూపాలుడు శ్రీకృష్ణుడు కువలయావళిని పెళ్ళాడినట్లు వర్ణిస్తూ, 4 అంకములు కలిగిన కువళయావళిని రచించినాడు. అనపోతనాయకుని ఆస్థానకవి నాగనాథుడు మదన విలాసభాణాన్ని రచించినాడు

**విరూపాక్షరాయలు** (క్రీ శ 1384) విజయనగర సంస్థాపకులలో ముఖ్యుడైన బుక్కరాయల మనుమడు, ద్వితీయ హరిహరరాయల ముత్తదేవిల పుత్రుడు, మరకతపుర దుర్గపాలకుడైన ఉదయగిరి విరూపన్న 5 అంకములు కలిగిన నారాయణీ విలాసమును, ఏకాంకికయైన ఉన్మత్త రాఘవ నాటికను రచించినాడు క్షీరసాగర మథనముచే అమృతం రాగా, రాక్షసులు ఎత్తుకొనిపోగా, విష్ణువు జగన్మోహిని రూపమునెత్తి దేవతలకు అమృతము నొసంగుట నారాయణీ విలాసమున వర్ణించబడినది రావణుడు సీతనపహించుకొనిపోగా. శ్రీరాముడు ఉన్మత్తుడౌతాడు లక్ష్మణుడు రావణుని సంహరించి, సీతను శ్రీరామునితో కలుపుట ఉన్మత్త రాఘవమున నిరూపించబడినది దీనిపై విక్రమోర్వశీయ చతుర్థాంక ప్రభావము కడుస్పష్టము విశ్వేశ్వరుడు వీరభద్ర విజయమను డిమాన్ని రచించినాడు

**సింగభూపాలుడు** (క్రీ శ 1386) రాచకొండరాజు, రత్న పాంచాలిక అని నామాంతరం కలిగిన కువలయావళి నాటకాన్ని రచించినాడు. శ్రీకృష్ణ- కువలయావళుల వివాహాన్ని వర్ణిస్తుంది ఇందలి నాయిక ఉంగరాన్ని ధరిస్తే రత్నపాంచాలికలాగా కనిపిస్తుంది. రాజవర్ధనుని తనయుడు, నటేశ్వరుణి శిష్యుడైన **మణికుడు** (క్రీ శ 14వ శతాబ్ది) భైరవానందమును రచించినాడు. మదనవతి - భైరవులు నాయికానాయకులు. మదనవతి వస్తుతః అప్సరస, ఋషియొక్క శాపముచే భూలోకానికి వస్తుంది.

**ఉద్దండుడు :** రంగమాంబా రంగనాథుల పుత్రుడు, కంచి సమీపముకోని లాటపురమీతని జన్మస్థలము కేరళ మానవిక్రమ రాజువద్దఆశ్రయాన్ని

పొందినాడు. మాలతీ మాధవమును అనుసరిస్తూ,మల్లికా మారుతమను 10 అంకములు కలిగిన ప్రకరణమును రచించినాడు మల్లికా-మారుతులు, రమయంతికా. కలకంఠులు ఇందలి ప్రేమజంటలు. మందాకిని మాలతీ మాధవములోని కామందకి పాత్రను నిర్వహించగా, కాళింది అవలోకిత పాత్రను నిర్వహిస్తుంది. అందమైన భాష, రమణీయములైన శ్లోకములు ఉన్నవి. కాశీపతి కవిరాజ ముకుందానంద భాణమును రచించినాడు.

**మోక్షాదిత్యుడు :** (క్రీ శ 1328) భీమ విక్రమ వ్యాయోగమును రచించినాడు.

**వామనభట్టబాణుడు** . విజయనగర వంశీయుడైన మొదటి దేవరాయలయొక్క ఆస్థానమున ఉంటూ, మంత్రి లక్ష్మీశునియొక్క ఆజ్ఞచే కనక లేఖాపరిణయమును, కొండవీటి ప్రభువైన పెదకోమటి వేమారెడ్డి (క్రీ.శ.1403-1420) ఆస్థానకవిగా ఉంటూ, శృంగార భూషణభాణాన్ని, పార్వతీపరిణయము, బాణాసుర విజయమనే నాటకములను రచించినాడు 4 అంకములు కలిగిన కనక లేఖాపరిణయ నాటికలో, ఋషి శాపంచే భూలోకంలో జన్మించిన, వీరవర్మ కూతురైన కనకలేఖ అను విద్యాధర యువతితో, వ్యాసవర్మ అను విద్యాధరుని వివాహము వర్ణించబడినది ఏకాంకిక భాణమైన శృంగార భూషణమునందు విలాసశేఖరుడను విటుడు అనంగమంజరియను వేశ్య ఇంటికిపోతూ, చూసిన వింతలను రమ్యంగా వర్ణిస్తాడు. 5 అంకములు కలిగిన పార్వతీ పరిణయమునందు శివపార్వతుల వివాహము వర్ణించబడినది కవిత్వము ప్రౌఢము కాదు వస్తు,పాత్ర,రసౌచిత్యములు సరిగా పాటించబడలేవు ఇందలి ఒక శ్లోకము.

> అవలోకనాయ లోలా దృష్టిరియం మృగదృశో నివృత్తిమతీ।
> గత్వాప్రతి ప్రవాహం రాజతి శఫరీ నివ రత్నానేవ॥

5 అంకములు కలిగిన బాణాసుర విజయం (ఉషాకళ్యాణము) నందు ఉషానిరుద్ధుల వివాహము వర్ణించబడినది.

**వ్యాసరామదేవుడు** : క్రీ.శ.1402-1415 కాలమున రామాభ్యుదయము, పాండవాభ్యుదయము, సుభద్రా పరిణయము అను మూడు ఛాయా నాటకములను వ్రాసినాడు. రాయపూర్ కలచూరి రాజుల ఆశ్రయాన్ని పొందినాడీకవి. గంగాధరుడు (క్రీ శ. 1450), అహమ్మదాబాద్ రాజు సుల్తాన్ అహ

హ్మద్ (1443-1451) కాలమున, 5 అంకములలో, గుజరాత్ చంపకపురాన్ని పాలిస్తున్న గంగాధర భూవల్లభ ప్రతాపదేవుని వర్ణిస్తూ, గంగాధర ప్రతాప విలాస నాటకమును రచించినాడు.

**శివరామయాజ్ఞికుడు** : క్రీ శ. 1485 నందు, భాగవత దశమ స్కంధ పూర్వార్ధ కథనాధారముగా తీసుకొని, 5 అంకములు కలిగిన మురారి విజయ నాటకమును రచించినాడు నృసింహుని తనయుడైన విశ్వరూప కృష్ణ భట్టు కూడా మురారి విజయమును రచించినాడు.

**రూపగోస్వామి** : (క్రీ. శ. 1490-1563) దానకేళి కౌముది, విదగ్ధమాధవము, లలితమాధవముల రచించినాడు ఏకాంకిక భాణికమైన దాన కేళి కౌముదినందు వసుదేవుడు యజ్ఞముచేస్తుండగా, రాధ గోపికలతోసహ నెయ్యి తీసుకొనిపోతుంది. అప్పుడు కృష్ణుడు గోప బాలకులతోసహ వచ్చి, తన అడవి మార్గమున వెళ్తున్నందున, సుంకం చెల్లించాలని గోపికలను అడ్డగిస్తాడు. గోపి కలు రాధను సుంకముగా ఇస్తారు 7 అంకములు కలిగిన విదగ్ధ మాధవము నందు రాధాకృష్ణుల బృందవన లీలలు చిత్రింపబడినవి. 10 అంకములు కలిగిన లలిత మాధవ ప్రకరణమునందు శ్రీకృష్ణుని బృందావన లీలలు, మధురావాసము, ద్వారకావాసములు నిరూపించబడినవి.

**హరిహరోపాధ్యాయ** : (క్రీ॥శ॥ 15వ శతాబ్ది) 5 అంకములు కలిగిన, భర్తృహరి నిర్వేద నాటకమును రచించినాడు శాంతరస ప్రధానమైనది. భర్తృహరియొక్క వైరాగ్యాన్ని బోధిస్తూ, గోరఖ్‌నాథుని హఠయోగము మోక్ష కారణముగా నిరూపించబడినది శ్రీకృష్ణదేవరాయలు (క్రీ॥శ॥ 1509-1529) విజయనగర రాజు, 5 అంకములు కలిగిన జాంబవతీ కళ్యాణమును రచించి నాడు. మదాలస చరిత్ర, సత్యవధూ ప్రీణనము, సకల కథాసార సంగ్రహము, జ్ఞానచింతామణి రసమంజరి ఈతని ఇతర రచనలు.

**కాలకవి** : భారద్వాజ గోత్రీయుడైన కాళహస్తి పుత్రుడు. తన ఆశ్రయదాత, కొచ్చిన్ రాజైన రామవర్మ క్రీ॥శ॥ 1537 వ, గోదావర్మకై (క్రీ.శ. 1537-1561) రాజ్యమును త్యజించి, కాశికి వెళ్ళిపోగా, ఆ సంఘటన లను చిత్రిస్తూ, రామవర్మ విలాస నాటకమును, రామవర్మయొక్క పరాక్రమ మును వర్ణిస్తూ,రత్నకేతూదయ నాటకమును రచించినాడు. ప్రసిద్ధఆలంకారికుడు

**అప్పయ్యదీక్షితుడు:** (క్రీ శ 1520-1593) వసుమతీ చిత్రసేన విలాసాన్ని వ్రాసినాడు.

**రత్నఖేట శ్రీనివాసదీక్షితుడు :** (క్రీ శ. 1530 1600) జింజిల ప్రభువైన సూరప్ప నాయకుని ఆస్థానకవి, నలదమయంతుల కథను తెల్పుతూ భైమీ పరిణయ నాటకమును, భావనా పురుషోత్తమమను ప్రతీకాత్మక నాటకమును కూడా రచించినాడు.

**శేష శ్రీకృష్ణుడు :** (క్రీ శ 1600) కంసవధమను 7 అంకముల నాటకమును వ్రాసినాడు తంజావూరు ప్రభువైన రఘునాథనాయకుని ఆస్థానకవి, గోవిందుని పుత్రుడు **యజ్ఞనారాయణదీక్షితుడు** తన ఆశ్రయదాత రఘునాథనాయకుని వర్ణిస్తూ, 5 అంకములు కలిగిన రఘునాథ విలాసమును రచించినాడు. రఘునాథనాయకుల ఆస్థానమున ఉన్న ప్రసిద్ధ పండితుడు, రత్నఖేట శ్రీనివాసాచార్యుల పుత్రుడు **రాజచూడామణిదీక్షితుడు** శృంగార సర్వస్వ భాణమును, రామాయణాధారమైన, 5 అంకములు కలిగిన, ఆనంద రాఘవ నాటకమును, కమలినీ-కలహంసుల వివాహమును వర్ణిస్తూ, 4 అంకములు కలిగిన, కమలినీ కలహంస నాటికను రచించినాడు మొగల్ సామ్రాట్టు అక్బర్ (క్రీ శ 1556-1605) రాజ్యము నేలుచుండగా నొఖాలి రాజ్యమును పరిపాలించిన లక్ష్మణమాణిక్యదేవుడు, మదాలస కువలయాశ్వుల ప్రేమను వర్ణిస్తూ కువలయాశ్వ చరితమును, 6 అంకములతో నకుల-కౌరవుల యుద్ధమును వర్ణిస్తూ విఖ్యాత విజయమును రచించినాడు

**విలినాథుడు :** యజ్ఞనారాయణ పౌత్రుడు, కనకసభాపతిపుత్రుడు, తంజావూర్ జిల్లానందలి విష్ణుపుర గ్రామవాసి, మదనమంజరీ మహోత్సవ నాటకమును వ్రాసి, అచ్యుతరాజు (క్రీ శ. 1571.1614) ఆస్థానమున ప్రవర్తిల్లినాడు. ఇందు రుద్రుడు, మనుష్యరూపమున వచ్చి, తన భక్తుడైన పాంచాల రాజైన పరాక్రమ భాస్కరునికి సహాయం చేయుటకై, పాటలీపుత్రం రాజైన చంద్రవర్మను సంహరించుట వర్ణించబడినది.

**వేంకటాధ్వరి :** (క్రీ శ 1550) కాంచీపురవాసి, సీతారామ రఘునాథుల తనయుడు, (శంబరాసురుని తనయగా జన్మించిన) రతీదేవీ ప్రద్యుమ్నుల

వివాహమును వర్ణిస్తూ, 6 అంకములు కలిగిన ప్రద్యుమ్నానంద నాటకమును, శృంగార రసదీపికా భాణమును. సుభద్రా ధనంజయుల వివాహమును వర్ణిస్తూ, సుభద్రా పరిణయమును రచించినాడు. చివరి నాటకముయొక్క రెండు అంకములు మాత్రమే లభించుచున్నవి

**రామచంద్రుడు :** నిర్భయభీమమును రచించినాడు.

**కర్ణపూరుడు :** (క్రీ శ. 16వ శతాబ్ది) శివానందుని పుత్రుడు, చైతన్యదేవశాఖనుండి కర్ణపూరుడను బిరుదునొందిన పరమానందసేనుడు ప్రబోధ చంద్రోదయాన్ననుకరిస్తూ, 10 అంకములతో చైతన్య మహాప్రభువు యొక్క జీవితగాథను భక్తి, వైరాగ్య, కలి, అధర్మం మొదలగు అమూర్తములైన పాత్రలుకూడా ఉన్నట్టి చైతన్య చంద్రోదయ నాటకాన్ని రచించినాడు.

**సుందరమిశ్రుడు :** (క్రీ శ. 16వ శతాబ్ది) 7 అంకములతో, రామకథను వర్ణిస్తూ, అభిరామమణి నాటకాన్ని వ్రాసినాడు.

**గోకులనాథుడు :** (క్రీ॥శ॥ 16వ శతాబ్ది) శ్రీనగర ఫతేషాహ ఆస్థానకవి, మిథిల దేశ వాస్తవ్యులైన ఉమాదేవీ-పీతాంబరుల పుత్రుడు, ముదిత. మదాలస, అమృతోదయముల రచించినాడు ఏడు అంకములు కలిగిన ముదిత మదాలసమునందు విశ్వావసుతనయయైన మదాలస కువలయాశ్వుణ్ణి పెళ్ళిచేసుకొనుట వర్ణించబడినది. ప్రతీకాత్మకనాటకమైన అమృతోదయమున సంసారము యొక్క దుర్గుణములు నిరూపించబడినవి.

## కుమార తాతాచార్య (శతక్రతువు) :

(క్రీ శ. 1600) వేంకటాచార్యుల పుత్రుడు తిరుపతి క్షేత్రనివాసి, తంజావూర్ రఘునాథనాయకుల, విజయరాఘవ నాయకుల (క్రీ శ 1614) మత గురువు, పారిజాతా హరణాధారమైన,5అంకములుకలిగిన, పారిజాత నాటకమును రచించినాడు

**కవితార్కికుడు :** (క్రీ శ. 160) వాణీనాథుని పుత్రుడు. బెంగాల్, భులుయ శాఖైన మాణిక్యదేవుని ఆస్థాన హాస్యకవి, కౌతుక రత్నాకరమను ప్రహసనమును రచించినాడు.

**గోపీనాథ చక్రవర్తి :** కౌతుక సర్వస్వమను ప్రహసనమును రచించినాడు.

**దామోదరాశ్రముడు :** క్రీ శ. 1626 నందు, 3 అంకములు కలిగిన పాఖండ ధర్మ ఖండనమును రచించినాడు. ఇందు పుష్టిమార్గ వైష్ణవాచార్యులయొక్క దుర్వ్యవహారములు నిరూపించబడినవి.

**గురురాముడు :** (క్రీ. శ. 1630) స్వయంభుతనయుడు, సుభద్రా-అర్జునుల కళ్యాణమును వర్ణిస్తూ, 5 అంకములు కలిగిన, సుభద్రా ధనంజయమును, కాశీ రత్నేశ్వరదేవుని దయతో జరిగిన, (వసుభూతి అను గంధర్వుని కూతురైన) రత్నావతీ రత్నచూడుల వివాహమును వర్ణిస్తూ, 5 అంకములు కలిగిన రత్నేశ్వర ప్రసాదన నాటకమును, రాధాకృష్ణుల ప్రేమను వర్ణిస్తూ, మదనగోపాల విలాస భాణమును రచించినాడు.

**రామభద్ర దీక్షితుడు :** (క్రీ శ. 1638) 7అంకములు కలిగిన జానకీ పరిణయ నాటకమును, శృంగార తిలకమను భాణమును వ్రాసినాడు. ఇతని తమ్ముడు **భూమనాధుడు** (నల్లాదీక్షితుడు) సుభద్రా పరిణయమును, శృంగార సర్వస్వ భాణమును, చిత్తవృత్తి కళ్యాణ జీవన్ముక్తి కళ్యాణములను ప్రతీకాత్మక నాటకములను రచించినాడు. రామభద్ర దీక్షితుని సమకాలికుడైన **వరదాచార్యుడు**, ఘటికాశత సుదర్శనుని పుత్రుడు, రామానుజాచార్యుల జీవిత గాథను చిత్రీకరిస్తూ, 6 అంకములు కలిగిన యతిరాజ విజయమును (వేదాంత విలాసమును), వసంతతిలక భాణమును రచించినాడు. దీక్షితుని శృంగార తిలకము అయ్యభాణమనియు, వరదాచార్యుని వసంత తిలకము అమ్మ భాణమనియు ప్రసిద్ధినొందినవి.

**నీలకంఠ దీక్షితుడు :** (క్రీ.శ. 1650) అప్పయ దీక్షితుని సోదరుడైన అచ్చాదీక్షితుని మనుమడు, భూమిదేవి- నారాయణుల పుత్రుడు, నల దమయంతుల కథను వర్ణిస్తూ, 7 అంకములు కలిగిన నలచరిత నాటకమును రచించినాడు. నీలకంఠదీక్షితుని తమ్ముడు, అతిరాత్రయజ్వ కుశకుముద్వతీయ నాటకమును వ్రాసినాడు. ఇందు శ్రీరాముని పుత్రుడైన కుశుడు నాయకుడు, నాగకన్యయైన కుముద్వతి నాయిక. నీలకంఠదీక్షితుని పుత్రుడు గీర్వాణేంద్రుడు శృంగారకోశ భాణమును రచించినాడు.

**రుద్రదాసుడు** : (క్రీ శ.1650) మలబార్ శ్రీకంఠుని శిష్యుడు, కర్పూరమంజరిలాంటి, చంద్ర లేఖయను సట్టకమును రచించినాడు. ఇది చంద్ర లేఖా-మానవేదరాజుల వివాహమును, 4 అంకములతో వర్ణించుచున్నది.

**మహాదేవుడు** : (క్రీ శ. 1650) బాలకృష్ణుని శిష్యుడు, 10అంక ములు కలిగిన అద్భుత దర్పణమును రచించినాడు. ఇందు లంకలో జరిగిన సంఘటనలు అద్దంలో దర్శింపబడినవి. విఠలుడు బీజాపూర్ ఆదిల్ షాహి రాజ వంశమును (క్రీ శ. 1489-1660) చిత్రీకరిస్తూ ఆదిల్ వంశకథ అను చారిత్రక ఛాయా నాటకమును రచించినాడు

**సామరాజ దీక్షితుడు** . (క్రీ శ 1681) నరహరిబందు పురం దరుని తనయుడు, బుందేల్ ఖండ్ ప్రభువైన ఆనందరావు ఆశ్రయాన్ని పొందిన వాడు, మధురానివాసి, 5 అంకములతో కుచేలుని కథను వర్ణిస్తూ శ్రీదామ చరి తమును, ధూర్త నర్తకమను ప్రహసనమును రచించినాడు

**శఠకోపయతి** : (క్రీ శ 17వ శతాబ్ది) ఏలంకాడు (బాలవన) గ్రామ వాస్తవ్యుడైన శ్రీనివాసాచార్యుల పుత్రుడు, తిరుమలాచార్య నామధేయుడు, కవితార్కిక కంఠీరవ బిరుదాంకితుడు, అహోబిల మఠ 6వ ఆచార్యుడు, విజయ నగరాధీశ అళియరామరాయల సమకాలికుడు, అహోబిల నరసింహస్వామి వసంతిక అను అరణ్య దేవతను పెళ్ళాడే విషయాన్ని వర్ణిస్తూ, 5 అంకములు కలిగిన వాసంతికా పరిణయమును రచించినాడు

**జగన్నాథ శ్రీఘకవి** . (క్రీ శ 17వ శతాబ్ది) కథియావాడ్ నివాసి, సౌభాగ్య మహోదయ నాటకమును రచించినాడు

**జగజ్జ్యోతిర్మల్లుడు** : (క్రీ శ. 17వ శతాబ్ది) శివపార్వతుల వివాహాన్ని వర్ణిస్తూ, హరగౌరీ వివాహమను సంగీత రూపకమును రచించినాడు.

**మధురాదాసు** : (క్రీ.శ. 17వ శతాబ్ది) యమునా తీరస్థమైన సువర్ణశేఖర గ్రామవాసి, కృష్ణదాస శిష్యుడు, వృషభాను నందినిరాధ. రాధా-కృష్ణుల ప్రేమను వర్ణిస్తూ వృషభానుజమును రచించినాడు.

**చొక్కనాథుడు** : (క్రీ శ. 17వ శతాబ్ది), 5 అంకములు కలిగిన, సేమంతికా పరిణయ నాటకమును రచించినాడు.

**సుమతిజితామిత్రమల్లుడు** : (క్రీ శ 17వ శతాబ్ది) అశ్వమేధ నాటికను రచించినాడు.

**శాలిగ్రాముడు** · అభిమన్యు నాటకమును వ్రాసినాడు. శీతలచంద్రుడు ఘోషయాత్రను రచించినాడు

**నీలకంఠుడు** : కళ్యాణ సౌగంధికా వ్యాయోగమును రచించినాడు·

**రామానుజుడు** : (క్రీ శ 17వ శతాబ్ది) శరణమ్మాచార్యుల పుత్రుడు, తిరువెళ్లూర్, చెంగల్పట్టు జిల్లా) గ్రామవాసి, (ఉదయార్ నాచ్చియారని ప్రసిద్ధినొందిన) వసులక్ష్మి-రంగనాథస్వామి కళ్యాణమును వర్ణిస్తూ, వసులక్ష్మి కళ్యాణమును రచించినాడు

**భూదేవశుక్ల** : (క్రీ శ. 17వ శతాబ్ది) శుకదేవుని పుత్రుడు, శ్రీకంఠ దీక్షితుల శిష్యుడు, జంబూసరస్ కాశ్మీరవాసి, 5 అంకములు కలిగిన ధర్మవిజయమనే ప్రతీకాత్మక నాటకమును రచించినాడు ఇందు నియమబద్ధమైన, ఆధ్యాత్మికపరమైన జీవనముయొక్క మాహాత్యము ప్రస్తుతింపబడినది.

**రామేశ్వరుడు** : (క్రీ శ 18వ శతాబ్ది) రామదేవ తర్కవాగీశుని పుత్రుడు, మానరాజైన చిత్రసేనుని ఆస్థానకవి, 7 అంకములు కలిగిన చంద్రాభిషేకమును రచించినాడు చాణక్యుడు నందుల సంహరించి, చంద్రగుప్తుని రాజ్యాభిషిక్తుని చేయుట ఇందు వర్ణింపబడినది ముద్రా రాక్షసానుసరణము స్పష్టము జగన్నాథుడు : క్రీ శ. 18వ శతాబ్ది)లక్ష్మీబాలకృష్ణులపుత్రుడు, తంజావూర్ రాజైన శరభోజి (క్రీ శ. 1711.1728) ఆస్థానకవి. రతిమన్మథ, వసుమతీ పరిణయ నాటకములను రచించినాడు మల్లారి ఆరాధ్యుడు, చాగంటి శరభారాధ్యుని పుత్రుడు, వీరశైవమత మహత్త్వమును స్థాపించు ఉద్దేశ్యముతో, 5 అంకములు కలిగిన శివలింగ సూర్యోదయమును రచించినాడు.

**దేవరాజు** . (క్రీ శ. 18వ శతాబ్ది) శేషాద్రి పుత్రుడు, తిరుణల్వేలి జిల్లా పట్టదమల్లై గ్రామమునుండి, ట్రావంకోర్ రాజ్యమునందలి శుచీంద్రముజిల్లా

ఆ శమ గ్రామమునకు తరలివచ్చినవాడు, ట్రావంకోర్ ప్రభువైన మార్తాండవర్మ (క్రీ శ 1729 1758) ఆస్థానకవి తన ఆశ్రయదాతయొక్క విజయయాత్రలను, సంప్రాప్తిని, తిరువనంతపుర అనంత పద్మనాభస్వామి దేవాలయజీర్ణోద్ధరణను వర్ణిస్తూ,5 అంకములుకలిగిన బాలమార్తాండ విజయమునురచించినాడు

**ఘనశ్యాముడు :** కమలా . కాశీ మహాదేవుల పుత్రుడు, తంజావూర్ తుక్కోజీ రాజుయొక్క (క్రీ.శ. 1728-1735) మంత్రి, ప్రసిద్ధ నాటక వ్యాఖ్యానకారుడు. మదనసంజీవన భాణమును, డమరకమను ప్రహసనమును, గణేశ చరితమును. కుమార విజయమును, అనుభవ చింతామణిని, ఆనంద సుందరీ నవగ్రహచరిత ప్రాకృత సట్టకములను రచించినాడు ఈతనికి విదుషీమణులైన సుందరి, కమలలను ఇద్దరు భార్యలున్నారు చంద్రశేఖరుడు, గోవర్ధనులను ఇద్దరు విద్వాంసులైన పుత్రులున్నారు

తనురుచి యో నశ్యామః కవీనాం స యది ఘనశ్యామః।
కవనే కమన శ్యామః కి మసూయా భి ర్మధైవ ఘనశ్యామః॥

**రామదేవుడు :** రామవేంద్ర భట్టాచార్యుని పుత్రుడు, రాధాపుర (బెంగాల్) నివాసి ఢాకా నవాబ్ దివానైన యశవంతుని (క్రీ శ 1731) ఆశ్రయాన్ని పొందినవాడు విద్వన్మోద తరంగిణిని రచించినాడు హాస్యరస ప్రధానమైన, దీనియందు వివిధ మతస్థుల కలయికతో, మత సిద్ధాంతములు చర్చించబడినవి అనంతదేవుడు, ఆపదేవుని పుత్రుడు, మహారాష్ట్ర సంత్ ఏకనాథుని వంశజుడు 5 అంకములతో, భక్తి రసభరితమైన, మనోరంజన నాటకమును రచించినాడు. ఇందు గోవర్ధనపూజనుండి రాసలీలవరకు గల కృష్ణకథ వర్ణించబడినది.

**ఆనందరాయమఖి :** (క్రీ.శ. 18వ శతాబ్ది) తంజావూర్ రాజులైన శరభోజి I, తుక్కోజీలయొక్క మంత్రి. 7 అంకములు కలిగి, ఆయుర్వేదమును బోధిస్తున్న, జీవానందనమును ప్రతీకాత్మక నాటకమును వ్రాసినాడు. వేదకవి శివభక్తిని మోక్షసాధనంగా నిరూపిస్తూ, 7 అంకములు కలిగిన విద్యాపరిణయమను, ప్రతీకాత్మక నాటకమును, తన ఆశ్రయదాతయైన ఆనందరాయమఖి పేర వ్రాసినాడు శరభోజి. తుక్కోజీల ఆస్థానకవి, శ్రీధర పేరుభట్టు : (క్రీ శ. 1714 1735) 5 అంకములు కలిగిన వసుమంగళ నాటకమును వ్రాసినాడు. ఉపరిచరవసువు గిరికను పెళ్ళాడు భారతకథ, తెలుగులోని రామరాజభూషణుని వసుచరిత్రాధారంగా వర్ణించబడినది.

**విశ్వనాథదేవుడు :** (క్రీ శ. 18వ శతాబ్ది) గోదావరి తీరమున జన్మించి కాశీ నివాసమేర్పరచుకొన్నవాడు, 4 అంకములు కలిగిన మృగాంక

లేఖా నాటికను రచించినాడు. కర్పూర తిలకుడను కళింగరాజు, మృగాంకలేఖ అను అస్సాం రాజకుమార్తెను పెళ్ళియాడుట ఇందలి విషయము రత్నావళిని చాలాచోట్ల అనుసరించినాడు.

**విశ్వేశ్వరపాండేయ** . (క్రీశ 1780) ఉత్తర్‌ప్రదేశ్ అల్మొరా లోని గ్రామవాసి, రుక్మిణీపరిణయ నాటకమును, నవమాలిక నాటికను, శృంగార మంజరి (ప్రాకృత) సట్టకమును రచించినాడు. నవమాలిక రత్నావళిని, శృంగార మంజరి కర్పూర మంజరిని అనుకరించుచున్నవి

**శంకరదీక్షితుడు** : (క్రీ॥శ॥18వ శతాబ్ది) బాలకృష్ణుని పుత్రుడు, ధుండి రాజుయొక్క మనుమడు, ప్రద్యుమ్న విజయమును వ్రాసి, పన్నారాజైన సభాసుందరుని పట్టాభిషేక సమయమున ప్రదర్శించినాడు

**రామవర్మ** : (క్రీ॥శ॥ 1756-1798) ట్రావన్‌కోర్ యువరాజు 5 అంకములు కలిగిన రుక్మిణీ పరిణయ నాటకమును, శృంగార సుధాకర భాణమును రచించినాడు

**కృష్ణదత్తుడు** · (18వ శతాబ్ది) ఆనందదేవీ-సదారాముల పుత్రుడు, మిథిలలోని వజ్జదజిల్లా ఉత్తమతీయ గ్రామవాసి, భాగవత పురంజనోపాఖ్యాన ధారంగా, 5 అంకములు కలిగిన పురంజన చరిత నాటకమును, ఎదాల వైదిక విద్వాంసుల ప్రేమను చిత్రిస్తూ 7 అంకములు కలిగిన కువలయాశ్వీయమును, సాంద్రకుతూహలమను ప్రహసనమును రచించినాడు.

**వేంకటసుబ్రహ్మణ్యం** : వేంకటేశ్వరమఖి పుత్రుడు, తన ఆశ్రయదాతయైన ట్రావంకోర్ రాజైన రామవర్మ సింధు రాజకుమార్తెయైన వసులక్ష్మిని పెళ్ళాడిన విషయమును వర్ణిస్తూ వసులక్ష్మీ కళ్యాణమును రచించినాడు నీలకంఠుడు కళ్యాణ సౌగంధికమును రచించినాడు నరసింహమిశ్రుడు శివనారాయణ మహోదయమను, ఆధ్యాత్మిక విషయబోధకమైన నాటకమును రచించినాడు. కాంచీ వాస్తవ్యుడైన లోకనాథభట్టు కృష్ణాభ్యుదయమును రచించినాడు కృష్ణావధూత ఘటికాశతుడు సర్వవినోదమును రచించినాడు శంకరుడు శారదా తిలక భాణమును రచించినాడు. రామకృష్ణుడు గోపాలకేళి క్రీడను రచించినాడు మాధవభట్టు సుభద్రాహరణమును రచించినాడు.

**వేంకటభూపతి** : (క్రీ॥శ॥1778)మైసూర్ రాజుయొక్క మంత్రి, కామకళాకేలాన భాణమును, కుక్షింభర భైక్షవ ప్రహసనమును, వీరరాఘవ విజయ వ్యాయోగమును, విబుధదానవ సమవకారమును, సీతాకళ్యాణ వీథిని,

రుక్మిణీ స్వయంవరాంకమును, ఊర్వశీ సార్వభౌమేహామృగమును, ఉధృత వృకోదర ప్రేక్షణకమును రచించినాడు

**రామకవి :** (క్రీశ 1820) మన్మథోన్మథన డిమమును వ్రాసినాడు కోటిలింగపుర రాజకుమారుడు (క్రీశ 1850) రససదన భాణమును రచించినాడు

**వల్లి సహాయకవి** . (క్రీశ 1850), నారాయణుని శిష్యుడు, విరించిపుర (ఉత్తర ఆర్కాట్ జిల్లా, తమిళనాడు) నివాసి, యయాతి-శర్మిష్ఠ కథను పుత్రుడైన పూరువుకు వార్ధక్యాన్నిచ్చి యయాతి యౌవ్వనాన్ని పొందిన కథను వర్ణిస్తూ, 5 అంకములు కలిగిన, యయాతి తరుణానందమును, ప్రద్యుమ్నుని పుత్రుడైన అనిరుద్ధుకు, రుక్మవర్మ పుత్రికయైన రోచనను పెళ్ళాడుటను వర్ణిస్తూ 5 అంకములు కలిగిన రోచనానందమును రచించినాడు

**పద్మనాభుడు** (క్రీశ 1850) కామశాస్త్రి కొడుకు, గోదావరి, కోటిపల్లి వాస్తవ్యుడు, త్రిపుర విజయ వ్యాయోగమును, లీలాదర్పణ భాణమును రచించినాడు వీరరాఘవుడు, కామాక్షి-ఈశ్వరుల తనయుడు, శాహజీమహారాజపుర (తిరువాసి ట్లూర్) గ్రామవాసి తంజావూర్ రాజైన శివాజి (1835-1865) ఆశ్రయాన్నొందినాడు, రామాయణాధారమైన, 7 అంకములు కలిగిన రామరాజ్యాభిషేకమును, వల్లి-కుమారస్వాముల వివాహాన్ని వర్ణిస్తూ, 5 అంకములు కలిగిన వల్లీపరిణయమును రచించినాడు సుందర వీరరాఘవుడు, కస్తూరి రంగనాథుని పుత్రుడు శాలకింగృహపుర (సిరుక్లూర్) వాస్తవ్యుడు మూడు నాటకములను వ్రాసినాడు 1) భోజరాజాసకము ఏకాంకిక నాటిక ఇందు ముంజరాజు భోజరాజుని సంహరింప పన్నిన వ్యూహగములు వర్ణించబడినవి 2) రంభారావణీయము-రావణుడు రంభను బలాత్కరించుట, నలకూబరుని శాపమిందు వర్ణింపబడినవి 3) రామాయణాధారమైన అభినవరాఘవము ఈతని తండ్రి రఘువీర విజయమను 3 అంకములు కలిగిన సమవకారమును రచించినాడు సీతారామ కళ్యాణమిందు వర్ణితము- శ్రీరామజనన, కళ్యాణ వనగమన, పట్టాభిషేక విపులీవిధముగా పేర్కొనబడినవి-

జాతో వర్షే విలంబిన్యజ జాషి మిహిరే జాగ్రతిందౌ నవమ్యాం
సౌమ్యేఒబ్దేమాసి మీనే జనకనృపసుతాం పూర్ణిమాయా ముదూహ్య।
దుందుభ్యబ్దేచ చైత్రే విపినమధిగతో మాసి మీనే యువాబ్దే
హత్వా శత్రూన్ప్రధాతౌ ఖలు మధుసమయే రాఘవో రాజ్యమాప॥

**రామచంద్రుడు :** (క్రీ॥శ॥ 1816) కోరాడ సుబ్బమ్మ - లక్ష్మణ దంపతుల తనయుడు, మచిలీపట్టణం, నోబుల్ కళాశాలా విశ్రాంత పండితుడు,

శృంగార సుధార్ణవ భాణమును రచించినాడు కవిత సరసమైనది ఉదాహరణకి శ్లోకము శృంగార సుధార్ణవములోనిది.

భుజంగః- అహోమయ్యుదితరాగేవైషా ప్రతిభాతి తథాహి-
స్తనాభోగ స్రంస త్సితమణి మనోజ్ఞాంచల పటీ
రదా లిశ్రీ గౌరోచ్చల దధర బింబా సపులకా।
విలోల భ్రూవల్లీ సకలసరసాపాంగ రసనై ః
లసంతీవ వ్యాఖ్యాం కలయతి సుమాస్త్రోపనిషదః॥

కథాకల్పనము మనోహరము వర్ణనలు దీర్ఘములుగా కనిపిస్తాయి భాష కఠినంగా కనిపిస్తుంది. ఈతనిచే త్రిపురాసుర విజయడిమము, శృంగార రసమంజరి కమలానంద భాణములును రచింపబడినవి మహాకవి శంకరలాల్ అమర మార్కండేయ నాటకమును రచించినాడు

## శంకరలాల్ మహామహోపాధ్యాయ

(క్రీ శ. 1844-1916) మాంఛీబాయి - మహేశ్వరుల పుత్రుడు, కథియావాడ్ ప్రష్మోరనగర బ్రాహ్మణుడు, మోర్వి, సంస్కృత కళాశాలా విశ్రాంత ప్రాచార్యుడు, సావిత్రీ చరితము ధ్రువాభ్యుదయము, భద్రాయుర్విజయము, గోపాలచింతామణి, కృష్ణచంద్రాభ్యుదయము, వామనవిజయము, పార్వతీ పరిణయ నాటకములను రచించినాడు ఈచంబాడి శ్రీనివాసాచార్యుడు (క్రీ॥శ॥ 1848-1914), దక్షిణ ఆర్కాటు తిరువహీంద్రపుర గ్రామ వాస్తవ్యుడైన వేదాంతాచార్యుల పుత్రుడు, కుంభకోణం, గవర్నమెంటు కాలేజీ విశ్రాంత సంస్కృతోపాధ్యాసకుడు, శృంగార తరంగిణీ భాణమును, ఉషాపరిణయ నాటకమును రచించినాడు. వరవస్తు వేంకట రంగనాథాచార్యులు (క్రీ॥శ॥ 1822-1900), 7 అంకములు కలిగిన, మంజుల నైషధమును రచించినాడు ముదుంబై వేంకట రామ నరసింహాచార్యులు (1842-1920) గజేంద్ర వ్యాయోగమును, వాసవీ పరాశరీయ, రాజహంసీయ, చిత్రాపర్యా లోకాది నాటకములను రచించినాడు

**నారాయణశాస్త్రి :** (1860 - 1911), 92 నాటకములను రచించినాడు. 10 ముద్రించబడినవి నాటకముల పేర్లు : మైథిలీయం (10 అంకములు), శర్మిష్ఠావిజయం (4 అంకములు), ప్రాజ్ఞసామంతం (5), సామంత సౌవిదల్లం (7), సుదతీ సమితింజయం (7), ముష్టిపాథేయం (5), ముగ్ధబోధనం (9), కామాభిషంగం (7), చిత్రనిగ్రహం (7), త్రిలదరం (5), చిత్రదీపం(10), త్రిపురవిజయం (12), శరభవిజయం (1), భట్టభాసీయం (5), బాలచంద్రికా

(9), గూఢకౌశికం (7), మందారికా విలాసం (7), మహిళావిలాసం (7), రత్నమాలా (7), భీమరథీ (5) ముగ్ధమంథరం (6), ప్రసన్నపార్థం (5), వరగుణోదయం (7), తరంగిణీ (3), స్వైరచారః (3), రాజీవినీ (6), కాంతిమతీ (5), హరహైమవతం (7), ముక్తమందారం (10), కలివిజయం (7), కృతకయౌవతం (10), ముక్తాప్రవాళం (7), మధుమాధవీయం (10), శశిశారదీయం (6), దూతధ్వజం (5), భగ్నాశోకం (7), రక్తసారసం (8), మంజుళమందిరం 6), అయశ్చణకం (7) దృష్టరోహితం, అవకీర్ణకౌశికం (10), కామమంజరీ (6), కనకాంగి (7), భట్టరాజీయం (5), కాంచనమాలా (7), ముకుంద మకరందం (10), మణిమేఖలా 1), శోభావతీ 2), అమృతమథనం (8, మహిషాసురవధం (1), మృకండుమోదం (9), సుభద్రాహరణం (6), ముక్తకేశీ (1), ప్రౌఢవరంతపం (7), మందారమాల (6), మూఢకౌశికం (5), మారుతిమైరావణం (7) మైథిలీవిజయం (8), పుష్కరరాఘవం (6), లవణలక్ష్మణం (7), సీతాహరణం (5), క్రూరసాపత్న్యం (6), స్తబ్ధపాండవం (5), క్లాంతకౌంతేయం (7), క్లిష్టకీచకం (5), పుష్టదౌరేయం (5), శిశువినిమయం (6), నిరుద్ధానిరుద్ధం (6) వ్యత్యస్తవక్త్రం (7), శ్యేనదూతం (5), శివదూతం (6), విశ్వవీరవ్రతం (8), విద్ధవేధనం (5), విజయయాదవం (7), వీరవైశ్వానరం (8), విష్టబ్ధబావలం (5), విద్రాణమాధవం (6), ద్రుతవీరం [5], ముక్తావళీ [4], మనోరమా [5], మధువిధూనం [3], బద్ధబాడవం [5], బహుళబాలిశం (3), బాలప్రామాణికం (6) బ్రహ్మవిద్యా (10) ముక్తమందారం [5].

**సుందరరాజ ఆచార్య** · (క్రీ॥శ॥ 1841-1904) వరదరాజ తనయుడు. ట్రావంకోర్, ఎళత్తూర్ అగ్రహారవాసి పద్మినీపరిణయము, వైదర్భ వాసుదేవము స్నుషావిజయము, హనుమద్విజయము, రసికరంజనము మొదలగు నాటకములను రచించినాడు

**ముడుంబై నరసింహాచార్యులు:** (క్రీ శ 1841-1921) విజయనగర సంస్థానాధీశుల ఆస్థానకవి, 60 స్తోత్రములను, 14 కావ్యములను. 2 నీతి గ్రంథములను, వాసవీ పరశరీయ నాటకమును వ్రాసినాడు తర్కరత్న భట్టాచార్యుడు (క్రీ శ 1846-1940), 8 అంకములతో, మేవార్ ప్రభువైన రాణా అమరసింహుని వీరకృత్యములను వర్ణిస్తూ, అమరమంగళ చారిత్రక నాటకమును వ్రాసినాడు. రామానందరాయ్ 5 అంకములు కలిగిన రాధాకృష్ణభక్తి భరితమైన, జగన్నాథ వల్లభ నాటకమును రచించినాడు ఈ నాటకమును అనుకరిస్తూ, ద్వారకానాథఠాకూర్, 10 అంకములు కల్గిన, గోవిందవల్లభ సంగీత

నాటకమును రచించినాడు రాజవిజయుడు రాజవిజయ నాటకమును రచించినాడు. ఇందు బెంగాల్, రాజరాజవల్లభుని స్థానమైన రాజనగరము (విక్రమపురము) నందు. పండితులందరు సప్తసంస్థ యజ్ఞము నాచరించుట వర్ణించబడినది గుండు రామస్వామి శాస్త్రి. 7 అంకములు కలిగిన ఉషాపరిణయ నాటకమును రచించినాడు పేరిశాస్త్రి నాథశాస్త్రి (క్రీ.శ 1853-1920) విజయనగర సంస్థానాధీశుల ఆస్థానకవి. వేంకటశాస్త్రి పుత్రుడు, విజయనగరం, విక్రాంత మహారాజ సంస్కృత కాలేజి అధ్యాపకుడు. పాంచాలికా రక్షణము, యామినీ పూర్ణతిలక నాటకములను రచించినాడు శాంతి భద్రాది రామశాస్త్రి (క్రీ॥శ॥ 1856-1915). గంగారామయ్య పుత్రుడు, గోదావరి, పిఠాపుర గ్రామవాసి,ముక్తావళి నాటకమును రచించినాడు అంబికాదత్తవ్యాస్ (క్రీ॥శ॥ 1859-1928) ఢిల్లీ సామ్రాజ్యము, ఘోషయాత్ర, పౌలస్త్యవధ నాటకములను రచించినాడు శ్రీశైల తాతాచార్య: (క్రీ॥శ॥ 1862-1925) వేంకటవరదుని పుత్రుడు, కాంచీనగరవాసి, విశిష్టాద్వైతముయొక్క గొప్పతనాన్ని చాటిస్తూ, సంకల్ప సూర్యోదయమునను కరిస్తూ, వేదాంతదేశిక చరిత నాటకమును, యుగళాంగుళీయ నాటికను రచించినాడు. శ్రీనివాసాచార్య . (క్రీ॥శ॥ 1863 1932) కృష్ణమాచార్య పుత్రుడు, తిరువడి, తంజావూర్ జిల్లావాసి. ధ్రువ, క్షీరాబ్ధిశయన రెండు నాటకములను వ్రాసినాడు. బెల్లంకొండ రామరాయకవి (1875-1913) కందర్ప దర్ప భాణమును రచించినాడు హరిదాస సిద్ధాంత వాగీశ భట్టాచార్య (క్రీ॥శ॥ 1876) విరజా సరోజినీ నాటికను, కంసవధ. జానకీవిక్రమ, మేవాడ్ప్రతాప, వంగీయప్రతాప నాటకములను రచించినాడు దుష్టుడైన నవాబ్ దుష్కృత్యములనుంచి బెంగాల్‌కు ముక్తి కలిగించాలని బోధిస్తూ వంగీయ ప్రతాపమునురచించినాడు ఇందుప్రతాపాదిత్యుని శౌర్య పరాక్రమములు. నవాబుయొక్క కపట వ్యూహగములు చక్కగా వర్ణించబడినవి. మానసింహునితో ప్రతాపాదిత్యునకు యుద్ధము,కపటంగా ప్రతాపాదిత్యుని బందీచేయుట కరుణరసపూర్ణంగా చిత్రించినాడు అందమైన శైలికొక ఉదాహరణము దుర్జనస్యకిల సాహచర్యతః సజ్జనోఽపిసను దుర్జనాయతే సంగతం స్ఫటిక రత్నముల్కకే నిర్మలం మలినమేవ దృశ్యతే॥ వైద్యనాథ వాచస్పతి భట్టాచార్య (19వ శతాబ్ది), దక్షయజ్ఞ కథను, 5 అంకములతో, చిత్రయజ్ఞ నాటకముగా వ్రాసినాడు ఆర్ కృష్ణమాచార్యులు క్రీ॥శ॥1882 నందు షేక్స్పియర్ యొక్క 'మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్స్'ను వాసంతికా స్వప్నమను పేర అనువదించినాడు మూలశంకర మాణికలాల్ యాజ్ఞిక్ (క్రీ శ 1886) బరోడా విక్రాంత సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్, 10 అంకములు కలిగిన ఛత్రపతి

సామ్రాజ్యమును. 9 అంకములు కలిగి మేవార్ రాణాప్రతాపసింహుని చరితను బోధించు ప్రతాప విజయమును పృథ్వీరాజ చౌహాణుని వివాహమును తెలుపు సంయోగితా స్వయంవరమును రచించినాడు ధూర్జటి ప్రసాద భట్టాచార్య (క్రీ॥శ॥ 1886) ప్రహ్లాదుని చరితమును బోధిస్తూ, 6 అంకములు కలిగిన భక్తి విజయమును రచించినాడు చంద్రకాంత తర్కాలంకారుడు క్రీ॥శ॥ 1887 నందు, కౌముదీ సుధాకరమను ప్రకరణమును రచించినాడు కాళీపాద తర్కాచార్యుడు: (19వ శతాబి) శ్యమంతకోద్ధార, నలదమయంతీయ నాటకములను రచించినాడు దేవీప్రసాదశుక్ల నలచరిత నాటకమును వ్రాసినాడు నారాయణశాస్త్రి, తంజావూర్ జిలా తిరువడి, సంస్కృత కళాశాలా సేవానివృత్త ఉపాధ్యాయుడు, మహేశ్వరోల్లాస, ఉదారరాఘవ, ముకుంద మనోరథాది నాటకములు రచించినాడు వేంకటరమణార్యుడు, టెన్నిసన్‌యొక్క 'దికప్' నాటకాన్నాధారంగా చేసుకొని 5 అంకములతో కమలావిజయ నాటకమును. జీవ సంజీవనీ నాటకమును రచించినాడు టి ఎస్ సుందరేశశర్మ (క్రీ॥శ॥ 1890), ఆస్థానకవి పుత్రుడు రాజకుమారుని వలచి జయించినటుల వర్ణిస్తూ, 7 అంకములు కలిగిన ప్రేమ సామ్రాజ్య నాటకమును శృంగారశేఖర భాణమును రచించినాడు

## 20వ శతాబ్ది నాటకములు

| | |
|---|---|
| విశ్వనాథ సత్యనారాయణ | అమృతశర్మిష్ఠం, గుప్తపాశుపతం |
| వి రాఘవన్ | కామశుద్ధి, రాసలీలానామప్రేక్షణము అనార్కలీ |
| వై మహాలింగశాస్త్రి | కలిప్రాదుర్భావము, కలియుగపర్వము |
| నోర్పాజెబీమభట్టు | కాశ్మీర సంధాన సముద్యమము కాశ్మీరసమస్య |
| మథురాప్రసాదదీక్షిత్ | ప్రతాపవిజయం పృథ్వీరాజం గాంధీవిజయం, భారతవిజయం, శంకరవిజయం భక్తసుదర్శనం |
| ఎస్ ఎన్ తాడపత్రీకర్ | విశ్వమోహనము |
| సదాశివదీక్షిత్ | సరస్వతీ, పాణిని, కుసంగతి ఏకాంకికలు |
| యతీంద్రవిమల్‌చౌదరి | నిష్కించన యశోధరం భారతభాస్కరం, మహిమామయం భారతం భారత హృదయారవిందం, శక్తిశారదం, ముక్తిశారదం |
| జీవనలాల్ పారీఖ్ | ఛాయా శాకుంతలము శకుంతలకథ |
| కె.ఎస్ రామస్వామి | రతివిజయము |

| | |
|---|---|
| వేళంకర్ | యాంచింతయామి, తమసోమజ్యోతిర్గమయ, ప్రాణాహుతి |
| వీరేంద్రకుమార్ భట్టాచార్య | కవికాళిదాసం, సిద్ధార్థచరితం, గీతగౌరాంగం |
| వి ఆర్. శాస్త్రి | సత్యాగ్రహోదయః, విక్రాంతభారతం |
| శ్రీధరభాస్కరవర్ణేకర్ | వివేకానంద-శివాజీలపై 2 నాటకాలు |
| వి. కృష్ణన్‌తంపి | ద్రౌపదీవిజయః, అజ్ఞాతవాసః, ధ్రువచరితం ప్రతిక్రియా, వనజ్యోత్స్నా, ధర్మస్య సూక్ష్మా గతిః, పేటికా, సన్యాసీ, లలితా |
| జగ్గువకుళభూషణార్యః | అద్భుతాంశుకము |
| ప్రా.శ్రీదేవధర్ | యయాతిచరితము |
| భూపతి లక్ష్మీనారాయణ | ధర్మరక్షణము |
| పుల్లెల శ్రీరామచంద్రుడు | సుసంహతభారతం |
| ఓగేటి పరీక్షిత్‌శర్మ | పరీక్షిన్నాటకచక్రం,గురుదక్షిణాది27నాటకములు |
| విష్ణుదత్త త్రిపాఠి | అనసూయాచరితము |
| గోకులనాథోపాధ్యాయ | అమృతోదయము |
| భాగీరథప్రసాదత్రిపాఠి | కృష్ణగాణాం నాగపాశః, సంస్కృతసమ్మేళనం |
| రమాకాంతశుక్ల | జవహరలాల్ నెహ్రూ విజయం |
| గోపాలశాస్త్రి | నారీజాగరణమ్, వాణినీయమ్ |
| రేవాప్రసాదద్వివేది | యూథికా, 'రోమియోజూలియట్' అనువాదం |
| సుధాకరమాళవీయ | యశఃఫలమ్ |
| విష్ణుదత్తత్రిపాఠి | విద్యోత్తమా |
| శివప్రసాద్ ద్వివేది | సత్యహరిశ్చంద్రోదయ సోపానం |
| కృష్ణమిశ్రత్రిపాఠి | సావిత్రీ |
| రాజనారాయణశుక్ల | సావిత్రీ సత్యవంతం |
| సుదర్శన త్రిపాఠిశర్మ | సింహళవిజయం ఐతిహాసికము |
| అనంత త్రిపాఠిశర్మ | ద్వాదశీరాత్రి 'టు వెల్తు నైట్' యథాతేరేచతే 'ఆజ్ యూ లైక్ ఇట్' |
| కపిల దేవద్వివేది | పరివర్తనమ్ (సామాజిక మార్పు) |
| వి కె. వల్పులే | భాసోఽహాసః |
| రాజేంద్రమి[illegible] | [illegible]స్మృతీ మొదలగు నాటకలు |

CENTRAL LIBRARY

# రచయిత ఇతర గ్రంథములు

**SRAUTA PRAYASCHITTA VIDHI Rs. 18-00**
**(Edited with English Translation)**

Apastamba and Asvalayana have described expiation for various errors and omssions that occur in vedic sacrifices, in the course of their Srauta-Sutra. SPV has brought together such procedure from these two Srauta works, in author's own words. In a systamatic way.

**A STUDY OF DIFFERENCES BETWEEN BHATTA AND PRABHAKARA SCHOOLS OF MIMAMSA PHILOSOPHY Rs. 52-00**

Deals with the problems regarding differences between Bhatta and Prabhakara Schools of Mimamsa, in the context of epistemology and ontology In the course of discussions an attempt is made to co-ordinate and evaluate the explanations regarding the differences provided by the schools them selves

**సర్వదేవతా ప్రతిష్ఠామందారము రూ. 40-00**

అన్ని దేవతలయొక్క ప్రతిష్ఠా విధానమును, నిర్దుష్టంగా, సమగ్రంగా, అంగకలాపములతోసహ బోధించునది సస్వరంగా, మంత్రములు (ఉట్టంకులు లేకుండా) మొత్తం ఇవ్వబడినవి ప్రతిష్ఠలు చేయించు పురోహితులకు అత్యంతావశ్యకమైన ప్రామాణిక గ్రంథము. ఇది ఉంటే చాలు, ఏ దేవాలయ ప్రతిష్ఠ అయినా సులభంగా చేయించవచ్చును

**A SURVEY OF SANSKRIT LITERATURE (in Print)**
**MALAVIKAGNI MITRAM, WITH ENGLISH Tr (in Print)**